వి. పనోవ

పెద్ద ప్రపంచంలో చిన్న పిల్లడు

DJ Sundara Rao
2·9·93

వి. పనోవ

పెద్ద ప్రపంచంలో చిన్న పిల్లడు

"రాదుగ"
ప్రచురణాలయం

Rs 5P 00

అనువాదం: వుప్పల లక్ష్మణరావు

కవర్ డిజైన్: ఎమ్. అఫనాస్యెవా

మొదటి ముద్రణ 1968

రెండవ ముద్రణ 1987

Вера Панова

СЕРЕЖА

на языке телугу

Vera Panova

SERYOZHA

In Telugu

సోవియట్ యూనియన్‌లో ముద్రింపబడింది

П $\frac{4803010102-057}{031(01)-87}$ 323—87

ISBN 5-05-001448-4

అనిల్

విషయసూచిక

సెర్యోష ఎవడు, ఎక్కడ వుంటున్నాడు? 7
వాడి జీవితంలో కష్టాలు 10
ఇంట్లో మార్పులు 14
కొరొవొస్తెల్యోవ్‌తో తొలి ఉదయం – బంధువుల ఇంటికి . . . 29
సైకిలు కొన్నారు 40
కొరొవొస్తెల్యోవ్‌కూ ఇతరులకూ తేడా ఏమిటి? 52
జేన్య 60
ముత్తవ్వ అంత్యక్రియలు 75
కొరొవొస్తెల్యోవ్ ప్రాభవం 88
ఆకాశంలోనూ భూమిమీదా 94
వాస్య, వాడి మామయ్య 108
ఈ పరిచయ ఫలితాలు 128
అవగాహనకు అందని విషయాలు 140
ఉబుసు పోకకి 152
హోల్మొగోరి 160
బయలుదేరడానికి ముందు రోజు 170
బయలుదేరే రోజు 177

మా పిల్లలు —

నతాల్యా, బొరీస్, యూరియ్‌లకు

సెర్యోష ఎవడు,

ఎక్కడ వుంటున్నాడు?

తను, సెర్యోష, ఆడపిల్లలా వున్నాడని కొందరు అబద్ధాలు కల్పించారు. ఇది ఎంతేనా నవ్వులాటగా వుంది కదూ! ఆడపిల్లలు గౌను తొడుక్కుంటారు, కాని తను ఏనాడో గౌను తొడుక్కోవడం మానేశాడు. ఆడపిల్లలు ఒడిసెలతో ఆడుకోరే! మరి తనకి, సెర్యోషకి, ఒడిసెల వుంది. తను ఒడిసెలతో చిన్న రాళ్ళు కూడా విసరగలడు. ఆ ఒడిసెలను తనకి షూర చేసి ఇచ్చాడు. దానిని చేసి తనకు ఇచ్చినందుకు, తను ఎన్నాళ్ళనుండో కూడబెట్టుకున్న దారపుబళ్ళను సెర్యోష షూరకి ఇచ్చాడు.

మరి, తన జుట్టు పొడుగ్గా వుందన్న సంగతా? అమ్మ ఎన్నో సార్లు పొట్టిగా కత్తెర వేయించింది. వెంట్రుకలు ఒంటిమీద పడకుండా వుండేందుకని, తన ఒంటిపైన దుప్పటి కప్పి వుండేదేమో, కత్తిరింపు పొంతం అయిపోయేవరకూ తను బుద్ధిగా కూచునేవాడు. కాని మళ్లీ నాల్గు రోజులకే ఆ జుట్టు పెరిగిపోయేది.

అయితేనేం – తను తెలివైనవాడని అందరూ అంటారు. ఓ బొత్తికి బొత్తి పుస్తకాలు కంఠతా అప్పజెప్పేస్తాడు. పుస్తకాన్ని మొదటినుండి చివరకు రెండు మూడు సార్లు తనకి చదివి వినిపించేసరికల్లా, తనకి పుస్తకం అంతా కంఠస్థమైపోతుంది. తనకి అక్షరాలన్నీ వచ్చినా, తనంతట తను పుస్తకాలు చదవాలంటే ఎంతో సేపు పడుతుంది. వాడి పుస్తకాలన్నీ రంగులు పులిమేసి వుండేవి. ఎందుచేతనంటే పుస్తకాల్లో వున్న బొమ్మలకి రంగులు వేయడమంటే సెర్యోషకి ఎంతో సరదా. పుస్తకంలో వున్నవి రంగుల బొమ్మలే అయివుంటే, తనకెలా అందంగా వుంటుందని తోచేదో అలా

వాటికి మళ్లీ రంగులు వేసేవాడు. నాల్గు రోజులకే పుస్తకాలు మాసిపోయి చిత్తుకాగితాల్లా తయారయేవి. పాష అత్తయ్య వాటిని తీసి, చిరిగిపోయిన పేజీలు అంటించి, పుస్తకాన్ని మళ్లీ కుట్టేది.

తన పుస్తకంలో ఏదైనా పేజీ పోయినట్టాయెనా, ఆ పేజీ దొరికే వరకూ సెర్యోష వొళ్లెరగకుండా వెతుకుతూనే వుండేవాడు. దొరికిన తరువాత ఇకప్పుడు స్తిమితపడేవాడు. పుస్తకాల్లో కథలు నిజంకావని తనకు నమ్మకంగా తెలిసినప్పటికీ కూడా పుస్తకాలంటే మాత్రం వాడికి ప్రాణమే. జంతువులెక్కడేనా మాట్లాడతాయా? మాట్లాడవే! తివాచీ ఆకాశంలోకి ఎగిరిపోగలదా? దానికి మోటారుంటేకద! ఆ సంగతి ఎంతటి జడ్డినాగమ్మ కేనా తెలుసును.

మరి, కథలో మంత్రకత్తి గురించి తనకు చదివి వినిపిస్తూ వుండగా: ''సెర్యోష, మంత్రకత్తి నిజంగా వుండదు సుమా!'' అని ఆ చదివేవాళ్లు చెబుతూ వుంటే కథలో సరదా అంతా పోనే పోతుంది.

అయితే – కట్టలుకొట్టేవాడూ వాడి పెళ్లామూ వాళ్ల పిల్లల్ని అడవిలోకి తీసుకెళ్లి, ఆ పిల్లలు దారి తప్పిపోయి ఇంటికి ఇక రాకుండా వుండాలని వాళ్లతో ఈ కబుర్లూ ఆ కబుర్లూ చెప్పి మాయచేసి వాళ్లను నట్టడవిలో వదిలేశారని చదివి వినిపించేసరికి సెర్యోషకి ఆ కథ నచ్చనే లేదు. ఆ కట్టలుకొట్టేవాడి పిల్లలందరిలోనూ లొడితెడే కడమపిల్లలిని రక్షించినప్పటికీ – అబ్బే, ఇది ఎన్నటికీ సాధ్యంకాదనిపించి, ఇక ఆ పుస్తకాన్ని చదివి వినిపించొద్దనేశాడు సెర్యోష.

సెర్యోష వాళ్లమ్మ దగ్గర పెరుగుతున్నాడు. పాష అత్తయ్య, లుక్యానిచ్ మామయ్య కూడా ఆ యింట్లోనే వుంటున్నారు. వాళ్ల ఇంట్లో మూడు గదులున్నాయి. ఒక గదిలో సెర్యోష, వాళ్లమ్మా పడుకుంటారు, రెండో గదిలో పాష అత్తయ్యా లుక్యానిచ్ మామయ్యా పడుకుంటారు. మూడో గది భోజనాలగది. అతిథులెవరైనా వచ్చినప్పుడు భోజ

నాలగదిలో భోజనంచేస్తారు. మామూలుగా వంట ఇంట్లో భోజనం చేస్తారు. ఇంటికి వరండా వుంది, ముంగిలి కూడా వుంది. ముంగిట్లో కోళ్లు తిరుగుతూ వుంటాయి. సన్నగా పొడుగ్గా వున్న కూరగాయ మళ్లు రెండింటిలోనూ నీరుల్లీ, ముల్లంగీ మొలుస్తున్నాయి. మళ్లల్లోకి కోళ్లు వెళ్లి కెలికేయకుండా వుండేందుకని మళ్లచుట్టూ ముళ్లకంచె వుంది. ముల్లంగి దుంపలు పెరికి తెచ్చుకుందామని సెర్యోష మడిలోకి వెళ్లేసరికల్లా వాడి కాళ్లకి ముళ్లు గీసుకుపోయేవి.

ఆ వూరు చిన్న వూరు అనే అంటారు. కాని సెర్యోషకీ, వాడి నేస్తులకూ ఇది నిజంకాదనిపించేది. వాళ్ల కంటికి ఆ వూరు పట్నమే. వూళ్లో పెద్ద షాపులున్నాయి, పంపింగ్ స్టేషన్లూ, కుళాయిలూ వున్నాయి, శిలా విగ్రహం ఒకటి వుంది. సినీమాహాలుంది. సెర్యోషను తల్లి అప్పుడప్పుడు సినీమాకి తీసుకువెళ్తూంటుంది. సినీమాహాలులో కూచునుండగా, దీపాలు ఆరిపోయి చీకటికాగానే, సెర్యోష తల్లితో: ''అమ్మా, అమ్మా, కథ నీకు ఏదేనా అర్థమైతే కొంత నాకు చెబుతూండవే!'' అంటాడు.

వీధుల్లో మోటార్లు తిరుగుతూవుంటాయి. డ్రైవరు తిమోహిన్ తన లారీలో పిల్లల్ని ఎక్కించుకుని తిప్పతూ వుంటాడు. ఎప్పుడూ కాదు సుమండీ — ఎప్పుడో అరుదుగానే, తిమోహిన్ వోద్కా తాగకుండా వున్నప్పుడు. వోద్కా తాగనప్పుడు మనిషి ధుమధుమలాడుతూ వుంటాడు, మాటా మంతీ వుండదు, సిగరెట్టు కాలుస్తూ వుంటాడు, తుప్పతుప్పమని ఉమ్ముతూ వుంటాడు — అప్పుడు అందరినీ తన లారీలో ఎక్కించుకుని తిప్పతాడు. కాని నిషామీద వుండి మంచి హుషారుగా వున్నప్పుడు మాత్రం — ఎంత బతిమాలినా ఏమీ లాభం వుండదు; కారులోనుండి చెయ్యి వూపుతూ: ''ఏయ్, కుర్రాళ్లు! మిమ్మల్ని ఎక్కించుకోకూడదర్రా! నేను చుక్క వేసుకున్నాను!'' అంటాడు.

సెర్యోష వున్న వీథిని "దాల్నయ"* వీథి అంటారు. దాన్ని వూరికే అలా అంటారు — అది అన్నిటికీ దగ్గరగానే వుంది. అక్కడనుంచి చౌకు రెండు కిలోమీటర్లే అంటాడు వాస్య. "యాస్ని బేరెగ్"** ప్రభుత్వ వ్యవసాయక్షేత్రం ఇంకా దగ్గరే అంటాడు వాస్య.

"యాస్ని బేరెగ్" క్షేత్రానికంటే ముఖ్యమైనది మరొకటి లేదు. లుక్యానిచ్ మామయ్యకి అక్కడే పని. పాష అత్తయ్య అక్కడున్న షాపులోనే హెరింగ్ చేపలూ చీటీగుడ్డలూ కొంటుంది. అమ్మ పనిచేసే స్కూలు కూడా ఆ ప్రభుత్వ వ్యవసాయక్షేత్రంలోనే వుంది. శెలవుల్లో స్కూల్లో ఏవైనా ఉత్సవాలు జరిగినప్పుడు తల్లితో కూడా సెర్యోష స్కూల్లోకి వెళ్తాడు. సెర్యోషకు ఎర్రజుట్టు ఫీమతో అక్కడే పరిచయమైంది. ఫీమ పెద్దది — ఎనిమిదేళ్లమ్మాయి. ఆ అమ్మాయి జడలు అల్లుకుని, వాటిని చెవులచుట్టూ గుండ్రంగా చుట్టి, జడకొసలను రిబ్బనుతో చెంపలదగ్గర పువ్వుముడి వేసుకుంటుంది. నలుపు రిబ్బనూ, పచ్చ రిబ్బనూ, నీలి రిబ్బనూ, ఎరుపు రిబ్బనూ — ఫీమకి ఎన్నో ఎన్నో రిబ్బన్లు వున్నాయి. ఎన్ని రిబ్బన్లు వున్నాయో సెర్యోష పట్టించుకొని వుండడు. కాని ఫీమ తనంతట తనే అడిగింది సెర్యోషను:

"నాకెన్ని రిబ్బన్లు వున్నాయో నువ్వు గమనించావా?"

వాడి జీవితంలో కష్టాలు

ఆ అమ్మాయి అడగడం మంచిదే అయింది. ఎందుకంటే గమనించవలసినవి ఎన్నో వున్నాయి. అన్నిటినీ గమనించగలమా? సెర్యోషకి అన్నీ శ్రద్ధగా గమనించాలనే వుంది, కాని తనకువున్న శ్రద్ధ అన్నిటినీ గమనించ

---

* రష్యన్ భాషలో దాల్నయ అంటే దూరపు. — సం.

** "యాస్ని బేరెగ్" అంటే "వెలుగు తీరం". — సం.

డానికి చాలదేమో అనిపించింది. చుట్టుపక్కల ఎన్నో వస్తువులున్నాయి. ప్రపంచం నిండా వస్తువులు కిక్కిరిసి వున్నాయి. వాటినన్నిటినీ గమనించ గలమా?

ఇంచుమించు అన్నీ పెద్ద వస్తువులే: తలుపులు ఎంతో ఎత్తుగా వున్నాయి, మనుషులు కూడా (పిల్లలు మినహా) తలుపులంత పొడుగ్గానూ వున్నారు. ఇహ లారీలమాటా, కంబైన్లమాటా, రైలు ఇంజనుమాటా చెప్పనే అక్కర్లేదుకదా. అది కూత పెట్టిందంటే, దాని కూత తప్ప మరేదీ వినిపించనే వినిపించదు.

మొత్తంమీద అంత ప్రమాదమేమీ లేదు: మనుషులు అంత పెద్ద వాళ్ళైనా సెర్యోష అంటే అందరికీ అభిమానమే. వాళ్లతో తను ఎప్పుడు మాట్లాడవలసివున్నా, వాళ్లందరూ తనకేసి వంగి మాట్లాడుతారు, వాళ్ల పాదాలు బ్రహ్మాండమైనవే అయినప్పటికీ, వాళ్ళు తనను మట్టేయరు. లారీలూ కంబైన్లూ కూడా — వాటికి మనం అడ్డంగా పరుగెత్తకపోతే అవి మన జోలికే రావు. రైలు ఇంజన్లా? — అవి ఎక్కడో దూరంగా వున్న స్టేషన్లలో వుంటాయి. అక్కడికి తనను తిమోహిన్ తన లారీలో కూచో బెట్టుకుని రెండుసార్లు తీసికెళ్లాడు. అయితే అదుగో ముంగిట్లో తిరుగు తూంది ఒక జంతువు. గుండ్రంగా వుండి గురిపెడుతున్నట్టు చూస్తూన్న కళ్ళు; లావుపాటి మెడ, విశాలమైన ఛాతి, ఇనుప ముక్కు. నడుస్తూన్నదల్లా అది ఆగిపోయి, కాయలు కాసిన కాలితో నేలను పెళ్లగించేస్తూంది. ఇక మెడ సాగదీసిందంటే సెర్యోషను అందుకుని పట్టేసుకుంటుంది. వెనుక ఓసారి పక్కయింటి కోడిపుంజు ఈ ముంగిటిలోకి తెలివితక్కువగా చుట్టంచూపు కింద వచ్చేసరికి ఈ ఇంటి పుంజు దానిమీద పడి, దానిని ముక్కుతో పొడి చేసింది. అలాగ్గానే ఇది కూడా సెర్యోషను ముక్కుతో పొడిచేయవచ్చు. రక్తదాహంతో వున్న ఈ మృగం పక్కనుండే వెళ్ళాడు సెర్యోష. వెళ్లి, దానినేమీ చీకాకు పెట్టకుండా వుండేందుకని, దానిని ఒక పక్కనుండే

చూశాడు – ఆ జంతువు ఎర్రని కోడిజుట్టును పక్కకు తిప్పుకుని, గొంతుక నుండి ఏదో భయంకరంగా శబ్దంచేస్తూ, ఆ శబ్దానికి తగినట్టుగానే నిదానంగా కోరచూపులు సారిస్తూంది....

కోడిపుంజులు ముక్కుతో పొడుస్తాయి, పిల్లులు గోళ్లతో బరుకుతాయి, దూలగొండె దురదపెట్టి వాతపెట్టేస్తుంది, కుర్రాళ్లు దెబ్బలాడుకుని రక్కుతారు, నేలమీద పడ్డామంటే మోకాళ్లను చెక్కేస్తుంది నేల – ఇక సెర్యోష వొంటి నిండా రక్కులూ, బరుకులూ, గాయాలూనూ. ఇంచుమించు ప్రతీ రోజూ సెర్యోషకి ఎలాగో ఒకలాగు ఒంటిమీద ఏదో ఒక చోటనుండి రక్తం చిందుతూనే వుంటుంది. ఇక నిత్యమూ ఏదో ఒకటి జరుగుతూనే వుంటుంది కదా. వాస్య కంచెగోడ ఎక్కిపోతాడు. వాడు ఎక్కాడు కదా అని చెప్పి, సెర్యోష కూడా ఎక్కుతాడు – ఎక్కుతూ పడిపోతాడు, దెబ్బలు తగిలించుకుంటాడు. లీద తోటలో గొయ్యి తీశారు; కుర్రాళ్లందరూ గోతి మీదనుండి దుమికేశారు. ఎవళ్లకీ ఏమీ కాలేదు. సెర్యోష మాత్రం దభేలుమని గోతిలో పడ్డాడు. కాలు నొప్పిచేసి, వాచిపోయింది. సెర్యోష మంచం పట్టాడు. నాల్గు రోజులు పడుకుని, లేచాడో లేనేలేదో – వెళ్లి ముంగిట్లో బంతి ఆడాడు. బంతి ఇంటి కప్పుమీదికి వెళ్లిపోయి, చిమ్నీ గొట్టానికీ ఇంటి కప్పుకీ మధ్య దూరిపోయి, అక్కడే అలా ఇరుక్కుపోయింది. తరువాత వాస్య వచ్చి, ఇంటికప్పుమీదకి ఎక్కి, దాన్ని తీశాడు. ఒకనాడు సెర్యోష ఏట్లో మునిగిపోయినంత పనైంది – తలవెంట్రుక వాసిలో తప్పిపోయిందికాని. లుక్యానిచ్ వీళ్లను – సెర్యోష, వాస్య, ఫీమ, లుక్యానిచ్‌కి తెలిసిన ఇంకా మరొక అమ్మాయి నాద్యనూ – నదిలో నావమీద షికారు తీసుకెళ్లాడు. లుక్యానిచ్ తెచ్చిన నావ పనికిమాలినదైంది: పిల్లలందరూ దానిలో ఎక్కి, దానిని ఇటూ అటూ కదిలించేసరికి అది ఊగిఊగి తూగిపోయింది. దానితో, లుక్యానిచ్ తప్ప, పిల్లలందరూ నీట్లో పడిపోయారు. నీళ్లు చల్లగా మంచులా వున్నాయి. సెర్యోష ముక్కు, నోరు, చెవులు –

అన్నీ నీటితో నిండిపోయాయి, కేక వేద్దామంటే కేక వేయలేకపోయాడు. పొట్ట కూడా నీటితో నిండిపోయింది. వొళ్లంతా తడిముద్దై పోయి బరు వెక్కిపోయి, తననెవరో పట్టుకుని అట్టడుగుకి బలంగా లాగేస్తూన్నట్టు నిపించింది. ఎంతో ఘోరమనిపించిపోయింది — ఇంత ఘోరమనిపించలేదు తన కిదివరకెన్నడూ. చీకటిగా వుంది. అలా ఎంతసేపు వున్నాడో ఏమిటో మరి — ఎంతోసేపు అనిపించింది. అలా వుండగా — తటాలున ఎవరో తనను పైకి లాగేశారు. కళ్లు తెరిచాడు — తన చుట్టూ నీరు, ఎటుచూసినా ఏరు పారు తూనే వుంది. ఒడ్డు కనబడుతూంది, సూర్యకిరణాలతో అంతా తళతళ మెరసిపోతూంది. సెర్యోష పొట్టలో వున్న నీళ్లు పైకి వచ్చేస్తున్నాయి, ఊపిరి తీయగల్గుతున్నాడు, ఒడ్డు అంతకంతకు మరింత మరింత దగ్గర కొస్తూంది. మరోనిమిషానికల్లా తను ఒడ్డున వున్న గట్టి ఇసుకమీద మోకాళ్లూ చేతులూ ఆనుకుని పడి వున్నాడు — చలితోనూ భయంతోనూ గజ గజ వణకిపోతున్నాడు. సెర్యోషను జుట్టుపట్టుకుని నీట్లోనుంచి బయ టికి ఈడ్చుకుని రావాలని వాస్యకి తట్టింది. సెర్యోష జుట్టు నిజంగా పొడుగ్గా వుండబట్టి కాని — లేకపోతే అప్పుడు సెర్యోష పని ఏమయేది?

ఫీమ తనంతట తానే వొడ్డు చేరుకుంది. ఆ అమ్మాయికి ఈత వచ్చును. నాద్య మునిగిపోవలసిందే — లుక్యానిచ్ చప్పున రక్షించబట్టిగాని. నాద్యను వొడ్డుకు తీసుకొస్తుండే లోపల, నావ ఎటో కొట్టుకుపోయింది. అది సమిష్టి క్షేత్రం వాళ్లకి దొరికింది. వాళ్లు లుక్యానిచ్‌ని రమ్మనమని అతని ఆఫీసుకి ఫోనుచేశారు. లుక్యానిచ్ మామయ్య వెళ్లి దాన్ని తీసుకొచ్చాడు. ఆనాటినుండి లుక్యానిచ్ మామయ్య ఇక పిల్లల్ని నావ షికారు తీసుకెళ్లడం మానేశాడు. ''మిమ్మల్ని నావమీద తీసుకెళ్తే నా ఖర్మం కాలినట్టే!'' అంటాడు లుక్యానిచ్ మామయ్య.

ప్రతీ రోజూ తాను చూసినదానివల్లానూ స్వయంగా అనుభవించినదాని వల్లానూ సెర్యోష బాగా అలసిపోతాడు. సాయంకాలానికి పూర్తిగా

నిస్త్రాణ చెందిపోతాడు: నాలిక కదపలేకపోతాడు, పక్షి కళ్లల్లా కళ్లు తిరిగిపోతాయి. వాడి కాళ్ళూ చేతులూ కడుగుతారు, వొంటినున్న చొక్కా తీసివేసి, మరొక చొక్కా తొడిగిస్తారు — ఈ పనులన్నీ సెర్యోష ప్రసక్తి లేకుండానే జరిగిపోతాయి, గడియారానికి 'కీ' అయిపోయినట్టు, సెర్యోషకు కూడా 'కీ' అయిపోయింది.

సెర్యోషకి నిద్రపడుతుంది. లేతరంగు జుట్టుతో వున్న అతని తల నిద్రలో వాలిపోయివుంటుంది, సన్నని చేతులు పారచాపుకుని వుంటాయి. తిరుగుడుమెట్లు ఎక్కుతూన్నట్టు ఒక మోకాలు నిలువుగా వుంటుంది, ఒక మోకాలు వంగి వుంటుంది. పలచగా తేలికగా వున్న జుట్టు రెండు కెరటాల్లా నుదుటిపైన విడిపోయి, మొండికేసిన కోడెదూడ కనుబొమ్మ ల్లాంటి కనుబొమ్మలున్న నుదురు వాటికిందనుండి కనబడుతుంది. వెడల్పాటి కనురెప్పలు కోపంగా మూసుకునుంటాయి, కనురెప్ప వెంట్రుకలు నల్లని చారల్లా వుంటాయి. నోరు కొద్దిగా తెరుచుకుంటుంది, పెదవి మూలలు నిద్రతో గట్టిగా అతుక్కుపోతాయి. పూవు ఊపిరి తీస్తూన్నట్టుగా, నిశ్శబ్దంగా వూపిరితీస్తాడు సెర్యోష.

సెర్యోష నిద్రపోతాడు, గాఢ నిద్ర — భేరీ వేసినా సరే, ఫిరంగి పేల్చినా సరే మెలుకువ రాదు — తను ఇంకా చాలాకాలం జీవించేందుకని తన సత్తువ అంతా కూడదీసుకుంటాడు.

ఇంట్లో మార్పులు

''బాబూ, సెర్యోష, మనింట్లో కూడా ఒక నాన్న వుండాలనిపించు తూందిరా నాకు.... నువ్వేమంటావు?'' అంది అమ్మ ఒకనాడు.

సెర్యోష ఆమెకేసి చూశాడు. ఈ సంగతి గురించి తను ఎన్నడూ

ఆలోచించనే లేదు. తన నేస్తులలో కొందరికి నాన్నలున్నారు, కొందరికి లేరు. సెర్యోషకీ లేదు నాన్న: నాన్న యుద్ధంలో చనిపోయాడు. నాన్నని సెర్యోష చూడనే లేదు – ఫోటోలోనే చూశాడు, అంతే. ఫోటోను అమ్మ అప్పుడప్పుడు ముద్దుపెట్టుకొంటూండేది. అమ్మ ముద్దుపెట్టుకొని, చట్రం కట్టిన ఆ ఫోటోను ముద్దుపెట్టుకొమ్మని సెర్యోషకు ఇచ్చేది. అమ్మ చెప్పిందికదా అని, అమ్మ ఊపిరితో మబ్బుపట్టిన ఫోటో అద్దాన్ని సెర్యోష వెంటనే ముద్దుపెట్టుకొనేవాడు. కాని తనలో ప్రేమ వుండేదికాదు: కేవలం ఫోటోలోనే చూసిన మనిషిని ఎలా ప్రేమించడం? – అనిపించేది తనకి.

అమ్మ మోకాళ్ళమధ్య నిలబడ్డాడేమో – సెర్యోష ఆమెకేసి ప్రశ్నార్థకంగా చూశాడు. ఆమె ముఖం కొంచెం జేవురించింది: బుగ్గలు మొదట ఎర్ర బడ్డాయి, నుదుటిమీదకీ చెవులమీదకీ లేత గులాబీరంగు పాకింది.... తల్లి తన మోకాళ్ల మధ్యను సెర్యోషను గట్టిగా పట్టుకుని, తన గుండెలకు హత్తుకుని, వెచ్చగా వున్న తన బుగ్గను సెర్యోష తలపైన వుంచింది. సెర్యోషకిప్పుడు తల్లి జబ్బును కప్పుతూన్న తెలుపు చుక్కల నీలిరంగు బ్లౌజు మాత్రమే కనబడుతూంది.

''నాన్న లేకపోతే నిజంగా ఏమీ బాగులేదు కదూ? నిజంగానే, ఏం?'' అని అమ్మ మెల్లగా అడిగింది.

''అ – వు – ను'' అని సెర్యోష కూడా – ఎందుకనో మరి – గొణిగాడు.

తను అలా జవాబు చెప్పాడే కాని, నిజానికి తనకి అలా అనిపించనే లేదు. తను ''అవును'' అని జవాబు చెప్పాలని అమ్మ మనసులో కోరుకుంది కాబట్టి తను ''అవును'' అన్నాడు. సెర్యోష మనసులో వెంటనే బేరీజు వేసుకున్నాడు: ఏది మంచిది? నాన్న వుంటేనా, నాన్న లేకపోతేనా? – అని. పిల్లలందరినీ తిమోహిన్ తన లారీలో ఎక్కించుకున్నప్పుడు, వాళ్లందరూ ట్రక్కులో కూచుంటారు, కాని షూర మాత్రం ఎప్పుడూ కూడా లారీ కేబిన్ లోపలికెక్కి పోయి, డ్రైవరు పక్కనే కూచుంటాడు, పిల్లలందరూ

షూరను చూసి అసూయపడతారు — కాని వాడితో దెబ్బలాడరు, ఎందు చేతంటే, తిమోహిన్ షూర నాన్న మరి. ఐతే — ఒకటి: తండ్రి చెప్పినట్టూ షూర వినకపోతే, వాణ్ణి తండ్రి బెల్టుతో చెమ్డాలెక్కగొడ్తాడు, షూర లబోదిబోమని గోలపెడుతూ, ధుమధుమలాడుతూ ఇంట్లోనుండి బయటి కొచ్చేస్తాడు. సెర్యోష షూరను ఓదార్చేందుకని తన బొమ్మలన్నీ తీసుకెళ్లి వాడితో ఆడుకుని వాణ్ణి ఊరడిస్తాడు.... అయితే ఏంగాక, ఏది ఏలా వున్నా — నాన్న వుండడమే మంచిది: ఎందుకంటే, మొన్న వాస్య లీదను తిట్టి, లీదకు కోపం తెప్పించేసరికి: ''మాకు నాన్నున్నాడు, నీకు లేదులే! హెహే!'' అంది లీద, వాస్యమీద అక్కసు వెళ్లబోసుకుంటూనూ. తనను అమ్మ గుండె లకు హత్తుకుని వుండగా, తన చెవికి దుబ్బు దుబ్బుమని ఆమె గుండెలు కొట్టుకొంటూన్న చప్పుడు వినబడి:

''అమ్మా! ఏమిటి అలా కొట్టుకూంటుందే?'' అని అడిగాడు సెర్యోష.

తల్లి చిరునవ్వు నవ్వి, సెర్యోషను ముద్దుపెట్టుకొని, వాణ్ణి గట్టిగా కౌగిలించుకుని:

''నా గుండెరా నాయనా, నా గుండె కొట్టుకుంటూందిరా, బాబూ!'' అంది.

''నా గుండె కూడా కొట్టుకుంటుందా?'' అని అడిగాడు సెర్యోష, తన తలకాయ కిందకు వంచి, తన గుండె చప్పుడు వినడానికి ప్రయత్నిస్తూ.

''నీ గుండె కూడా కొట్టుకుంటుంది'' అంది అమ్మ.

''అబ్బే, నా గుండె కొట్టుకోవడంలేదు.''

''కొట్టుకుంటూంది — కాని నీకు వినబడదు — అంతే. తప్పకుండా కొట్టు కొని తీరుతుంది. గుండె కొట్టుకోకపోతే మనిషి బతకడు.''

''ఎప్పుడూ కొట్టుకుంటూనే వుంటుందా?''

''ఎప్పుడూనూ.''

''నేను నిద్రపోతున్నప్పుడు కూడానా?''

''ఆహా! నువ్వు నిద్రపోతూన్నప్పుడు కూడానూ.''

''నీకు వినబడుతుందా?''

''వినబడుతుంది. నీకూ వినబడుతుంది. గుండెమీద చెయ్యి పెట్టుకుంటే నీకూ తెలుస్తుంది.''

అమ్మ సెర్యోష చేయి పట్టుకుని వాడి గుండెలమీద వుంచింది.

''తెలుస్తూందా?'' అని అడిగింది అమ్మ.

''తెలుస్తూందే! టక్ టక్ అని సరిగ్గా కొట్టుకుంటూందే! అమ్మా, గుండె పెద్దదా ఏమిటే?''

''పిడికిలిలా వుంటుంది. ఇదిగో — చూడు, ఇంచుమించు పిడికిలంత వుంటుంది.''

''నన్ను వెళ్లనీయవే'' అని సెర్యోష అమ్మ కౌగిట్లోనుంచి విడిపించుకుంటూ పరధ్యానంగా జవాబు చెప్పాడు.

''ఎక్కడికిరా వెళ్లిపోతున్నావు?'' అని అడిగింది అమ్మ.

''ఇప్పుడే వస్తా'' అని అంటూ, ఎడమ పక్కను గుండెలమీద చేయి అదుముకుని, వీధిలోకి పరుగెత్తాడు. వీధిలో వాస్య, జేన్య కనబడ్డారు. సెర్యోష వాళ్లదగ్గరకు పరుగున వెళ్లి:

''ఇదిగో, మీకు వినాలని వుంటే వినండి! నా గుండెకాయ ఎలా కొట్టుకుంటూందో! నా చేతికి తెలిసిపోతూంది! మీకు వినాలని వుంటే వినండి!'' అన్నాడు.

''పెద్ద పని! అందరికీ వుంది గుండెకాయ'' అన్నాడు వాస్య.

''కాని, ఏదీ చూదాం!'' అన్నాడు జేన్య.

అలా అని జేన్య, సెర్యోష గుండెమీద చేయి పెట్టాడు.

''ఏం? తెలుస్తూందా?'' అని అడిగాడు సెర్యోష.

''ఆహా!'' అన్నాడు జేన్య.

''అది ఇంచుమించు నా పిడికిలంత వుంటుంది'' అన్నాడు సెర్యోష.

''ఆ సంగతి నీ కెలా తెలిసిందిరా?'' అని అడిగాడు వాస్య.

''అమ్మ చెప్పింది'' అని సెర్యోష జవాబుచెప్పి, ఇంకా జ్ఞాపకం తెచ్చుకుని, ''నాకు నాన్న వస్తున్నాడు!'' అన్నాడు.

కాని, వాస్య, జేన్య ఆ మాటలు వినిపించుకోలేదు. వాళ్లు ఒక్కొక్కరూ ఎవరిమటుకు వాళ్లు ఓషధులు ఏరి వాటిని సంగ్రాహక కేంద్రానికి తీసుకెళ్లి ఇచ్చే యత్నంలో వున్నారు. ఏయే ఓషధులు ఏరి తీసుకురావలసి వుంటుందో వాటి జాబితాలు కంచెగోడలకి అంటించి వున్నాయి. ఓషధులను పోగుచేసి, తాము కూడా కొంత డబ్బు సంపాదించుకోవచ్చుకదా అని కుర్రాళ్లు ఆశపడ్డారు. రెండు రోజులు ఏరి పోగుచేశారు మూలికలను. తను ఏరి పోగుచేసిన మొక్కలను వాస్య తన తల్లికి ఇచ్చాడు. ఆమె వాటిని రకాలవారీగా ఏర్చి, గడ్డీ గాదమూ దుమ్మూ ధూళీ లేకుండా దులిపి, శుభ్రమైన గుడ్డలో కట్టలు కట్టి వాస్యకి ఇచ్చింది. ఫలితంగా నీటుగా సిద్ధంచేసిన ఒక పెద్ద ఓషధుల కట్ట తీసుకొని కేంద్రానికి తీసుకెళ్లి ఇచ్చేందుకని అక్కడకొచ్చాడు వాస్య. పాపం జేన్యకి తల్లిలేదు. జేన్యకి అక్క వుంది. ఇద్దరూ పెత్తల్లి దగ్గిర వుంటున్నారు; ఆడవాళ్లిద్దరూ పన్లు చేసుకుంటున్నారు. అందుచేత ఈ పనికి జేన్య తనంతట తానే తంటాలు పడలేకపోయాడు. తను ఏరి తెచ్చిన ఓషధులను, వాటి వేళ్లతో పాటుగానే వాటికి అంటుకున్న మట్టితో సహా, చిల్లులున్న ఒక సంచిలో పెట్టి తీసుకొచ్చాడు. జేన్య చాలా ఓషధులనే ఏరి తీసుకొచ్చాడు – వాడు తీసుకొచ్చిన కట్ట వాస్య తీసుకొచ్చిన దానికంటె బాగా పెద్దది. వీపుమీద మోసుకుని అక్కడ తీసుకొచ్చాడేమో, ఆ మోపు బరువుగా వుండడంచేత వాడి వీపు రెండు ముక్కలై విరిగిపోయినట్టుగా బాగా వంగి పోయింది.

''నేను కూడా వస్తాను మీతో'' అన్నాడు సెర్యోష వాళ్లదగ్గరకు గబగబా వెళ్లి.

‘‘వొద్దు, మాతో రావొద్దు. నువ్వింటికెళ్ళిపో. మేం పనిమీద వెళ్తున్నాం’’ అనేశాడు వాస్య.

‘‘పోనీ, అంతవరకూ వస్తా మీతో, అంతవరకే’’ అన్నాడు సెర్యోష.

‘‘వొద్దని చెబుతూంటే ఏమిటది? వెళ్ళిపో నువ్వింటికి!’’ అని గద్దించాడు వాస్య. ‘‘ఇదేమీ ఆట కాదు. అక్కడికి చిన్నపిల్లలు రాకూడదు!’’

సెర్యోష వుండిపోయాడు. వాడి పెదవులు వణికిపోయాయి, కాని మూతి నొక్కేసుకున్నాడు. ఏమంటే – లీద రావడం చూశాడు. లీద ఎదుట తను ఏడవకూడదు. తను ఏడుస్తూండగా లీద చూసిందంటే: ‘‘ఏడుప్పీతి! ఏడుప్పీతి!’’ అని ఉడికిస్తుంది.

‘‘నిన్ను తీసుకెళ్లలేదా వాళ్లు? మంచి పనైంది నీకు!’’ అని లేవిడి కొట్టింది.

‘‘నేను పోగుచేయలేదు కాని – నేను పోగుచేసి వుంటేనా – యెన్ని రకాల మూలికలున్నాయో అన్ని రకాలనీ పోగుచేసి వుండేవాణ్ణి! నేను గనక పోగు చేశానంటే ఆ కుప్ప ఆకాశాన్ని అందుకుంటుంది!’’ అన్నాడు సెర్యోష.

‘‘వొట్టి అబద్ధం! అది ఎంత పెద్ద కుప్ప అయినా సరే – ఆకాశాన్ని అందుకోనే అందుకోదు!’’ అంది లీద.

‘‘నాకు నాన్న వస్తున్నాడు, ఆ నాన్న పోగుచేస్తాడు’’ అన్నాడు సెర్యోష.

‘‘అన్నీ అబద్ధాలే! నీకు నాన్న అంటూ రానేరాడు. వచ్చినా ఆకాశాన్ని అందుకునేటంత పెద్ద కుప్ప పోగుచేయనేలేడు – ఎవరూ పోగుచేయలేరు!’’ అనేసింది లీద.

సెర్యోష తలెత్తి ఆకాశంకేసి చూస్తూ: ఆకాశం అందుకునేటంత పెద్ద కుప్ప పోగుచేయడం సాధ్యమా కాదా? – అని ఆలోచించాడు. సెర్యోష ఇలా ఆలోచిస్తూండగా, లీద పరుగెత్తి ఇంటికి వెళ్ళి రంగురంగుల శాలువ ఒకటి తెచ్చింది – లీద తల్లి ఈ శాలువను ఒక్కొక్కప్పుడు మెడకు చుట్టుకునేది, ఒక్కొక్కప్పుడు తలమీద కప్పుకొనేది. ఈ శాలువ పట్టుకుని –

దానిని ఎగరేస్తూ, దానిని ఆడిస్తూ, లయకోసం ఏదో పాట పాడుతూ — లీద డాన్సు చెయ్యడం మొదలుపెట్టింది. సెర్యోష అక్కడ నిలబడి చూశాడు. లీద డాన్సుచేస్తూ ఒక్క క్షణం ఆగి, ''నాద్య బ్యాలే స్కూలుకి వెళ్తుందిట — దానివన్నీ అబద్ధాలు సుమా!'' అంది.

తను డాన్సుచేయడం మళ్లీ ఆరంభించి:

''మాస్కోలోనూ, లెనిన్‌గ్రాడ్‌లోనూ బ్యాలే నేర్పుతారు'' అంది లీద.

తన డాన్సును చూస్తూ మంత్రముగ్ధుడై నిల్చున్న సెర్యోషను చూసి, ఘనంగా అంది లీద:

''నీకు నేర్చుకోవాలనుందా? అయితే — నేనెలా డాన్సుచేస్తున్నానో చూసి, నువ్వు కూడా సరిగ్గా అలాగే డాన్సుచేయి!''

సెర్యోష లీదను చూస్తూ, లీదకు మల్లేనే తను కూడా డాన్సుచేయడం మొదలెట్టాడు. కాని శాలువ లేకుండా డాన్సుచేయలేకపోయాడు. పాటపాడుతూ డాన్సుచేయమంది లీద. అయినా లాభంలేకపోయింది — సెర్యోషకి చేతనైంది కాదు.

''ఆ శాలువ నాకియ్యి!'' అని అడిగాడు సెర్యోష.

''అబ్బా, నేనివ్వను!'' అనేసి, ఇచ్చిందికాదు లీద.

సరిగ్గా ఆ క్షణానికే మోటారుకారొకటి సెర్యోష ఇంటి గేటుముందు ఆగింది. కారులోనుంచి డ్రైవరమ్మాయి దిగింది. పాష అత్తయ్య ఇంట్లోనుంచి వచ్చి, గేటుదగ్గర ప్రత్యక్షమైంది.

''ఇదిగో అందుకోండి. దీమ్త్రి కొర్నేయెవిచ్ పంపించాడు'' అంది ఆ డ్రైవరమ్మాయి.

సూట్‌కేస్ ఒకటీ, తాడుతో కట్టిన కొన్ని బొత్తుల పుస్తకాలూ వున్నాయి కారులో. అదేదో మరొకటి కూడా వుంది కారులో — గొట్టంలా చుట్టిన కచికరంగు వస్తువు. విప్పి చూసేసరికి — మరేదీకాదు, మిలిటరీ ఓవర్‌కోటు. పాష అత్తయ్యా, డ్రైవరమ్మాయీ కలిసి ఆ వస్తువులను

ఇంట్లో పెట్టారు. అమ్మ కిటికీలోనుండి ఒక్క నిమిషం చూసి, మళ్లీ వెళ్లిపోయింది. డ్రైవరమ్మాయి అంది:

''క్షమించండి – సామానంతా ఇంతే!''

''పాపం, కొత్త ఓవర్‌కోటు కొనుక్కోవాల్సి వుంటుంది!'' అని పాష అత్తయ్య విచారంగా ప్రత్యుత్తరమిచ్చింది.

''కొనుక్కుంటాడు లెండి. దానికేమి, తరువాత కొనుక్కుంటాడు'' అంది డ్రైవరమ్మాయి. ''ఇదిగో ఈ వుత్తరం కూడా ఇచ్చేడండి'' అని వుత్తరం అందించి, డ్రైవరమ్మాయి కారు తోలుకుని వెళ్లిపోయింది.

''అమ్మా! అమ్మా! కొరొస్తెల్యోవ్ మనకి తన ఓవర్‌కోటు పంపించాడే!'' అని కేకవేస్తూ సెర్యోష ఇంట్లోకి పరుగెత్తాడు.

(ద్మీత్రి కొర్నేయెవిచ్ కొరొస్తెల్యోవ్ వీళ్లని చూడ్డానికని వీళ్లింటికి వస్తూండేవాడు. అతడు సెర్యోషకి ఆటవస్తువులు ఇచ్చాడు. ఒకసారి చలి కాలంలో అతడు సెర్యోషని స్లెడ్జ్‌మీద కూచోబెట్టుకుని తీసుకెళ్లాడు. యుద్ధంలో కొరొస్తెల్యోవ్ తొడుక్కున్నదే ఆ ఓవర్‌కోటు, దానికిప్పుడు బుజంమీద పట్టీలులేవు. ''ద్మీత్రి కొర్నేయెవిచ్'' అని పలకడం తనకి కష్టమైపోవడంచేత, అతణ్ణి సెర్యోష ''కొరొస్తెల్యోవ్'' అనే పిలిచేవాడు.)

ఓవర్‌కోటు అప్పుడే చిలక్కొయ్యను వేలాడుతూంది. అమ్మ వుత్తరం చదువుకుంటూంది. ఆమె సెర్యోషకు వెంటనే జవాబు చెప్పలేదు. వుత్తరం పొంతం చదువుకుని, అప్పుడు: ''అవును, నాకు తెలుసు్రనా, సెర్యోష. ఈవేళనుండి కొరొస్తెల్యోవ్ మన దగ్గరే వుంటాడు, కొరొస్తెల్యోవ్ నీకు నాన్న అవుతాడ్రా, బాబూ!'' అంది.

అమ్మ వుత్తరం మళ్లీ మరోసారి చదువుకుంది – దానిలో ఏమి రాసి వుందో ఒకసారి చదివితే బహుశా ఆమెకు అర్థమైనట్టులేదు.

''నాన్న'' అనే మాటకు పరాయివాడూ, తన అవగాహనకు అందని వ్యక్తీ అని అర్థం చెప్పుకున్నాడు సెర్యోష. కాని కొరొస్తెల్యోవ్ – బాగా పాత

పరిచితుడే, అతణ్ణి పాష అత్తయ్యా, లుక్యానిచ్ మామయ్యా ''ద్మీత్రి'' అనే పిలుస్తారు. మరి అలాంటప్పుడు – అమ్మ మనసులో ఏమిటనుకుని ఈ పనిచేసింది?

సెర్యోష తల్లిని అడిగాడు:

''ఎందుకని?''

''ఇదిగో, నన్ను వుత్తరం సొంతం చదవనిస్తావా చదవనియ్యవా?'' అంది తల్లి.

సెర్యోష ప్రశ్నకు ఆమె జవాబు చెప్పలేదు. తాను చేయాల్సిన పనులు ఎన్నో వున్నాయనిపించిందామెకు. తాడుతో కట్టిన ఆ పుస్తకాల బొత్తులను విప్పి, ప్రతీ పుస్తకాన్నీ గుడ్డతో తుడిచి, వాటిని పుస్తకాల అలమారాలో వుంచింది. ఆ పని అయాక, అద్దం పక్కనున్న సొరుగుల బీరువా మీది వస్తువులు సర్దింది. అది అయాక, ముంగిట తోటలోకి వెళ్ళి, పువ్వులు కోసుకొచ్చి, వాటిని వాజులో పెట్టింది. తరువాత, మరెవరికోసమనో యేమిటో, గదిలో నేల శుభ్రంగా అద్దంలా మెరుస్తూన్నా, దాన్ని మళ్ళీ మరొకసారి కడిగేసి శుభ్రం చేసింది. ఇదంతా అయాక, ''పిరోగ్'' బజ్జీ బేక్ చెయ్యడం ఆరంభించింది. పిరోగ్‌కు పిండి ఎలా కలపడమో అమ్మకి పాష అత్తయ్య నేర్పింది. సెర్యోష కూడా తన వంతు పిండి తనే పిసికి, దానిలో జామ్ పెట్టి, చిట్టి పిరోగ్ చేసి, దానిని బేక్ చేశాడు.

కొరొస్తెల్యోవ్ వచ్చాడు. కొరొస్తెల్యోవ్ వచ్చేసరికల్లా, సెర్యోష తానిదివరకు తికమకపడుతూన్న విషయం గురించి మరచిపోయి ''కొరొస్తెల్యోవ్! చూడు, నేను పిరోగ్ బేక్ చేశాను!'' అని చెప్పాడు.

కొరొస్తెల్యోవ్ సెర్యోషకేసి వంగి, సెర్యోషను నాలుగైదు సార్లు ముద్దు పెట్టుకున్నాడు. అప్పుడు సెర్యోష తన మనసులో అనుకున్నాడు: ''కొరొస్తెల్యోవ్ నన్నింతసేపు ఎందుకు ముద్దుపెట్టుకున్నాడంటే – మరి అతను నాకు నాన్న అవుతాడు కదూ – అందుకని.''

కొరొొస్తెల్యోవ్ తన సూట్‌కేసు తీశాడు. దానిలోనుంచి అమ్మ ఫోటో తీసి, వంటింట్లోనుంచి సుత్తి మేకులూ తెచ్చి, ఆ ఫోటోను అతడు సెర్యోష గదిలో గోడకు తగిలించాడు.

''ఫోటో ఎందుకు? బతికున్నదాన్ని నేనే నీ దగ్గిర వుంటూండగా!'' అంది అమ్మ.

కొరొొస్తెల్యోవ్ అమ్మ చేతిని తన చేతిలోకి తీసుకున్నాడు; ఇద్దరూ ఒకరి చెంతకు ఒకరు వచ్చారు. కాని సెర్యోష అక్కడ వుండడం చూసి, చేతులు వదిలేసుకున్నారు. అమ్మ అక్కడనుండి వెళ్లిపోయింది. కొరొొస్తెల్యోవ్ అక్కడున్న కుర్చీలో కూచుని, ఏదో ఆలోచిస్తూ అన్నాడు:

''ఓయ్, ఇదీ సంగతి, ఓయ్ సెర్యోష! అంటే – దీని అర్థం, ఈ రోజునుండీ మీదగ్గరే వుంటానన్నమాట. నీకేమీ అభ్యంతరం లేదుకద?''

''ఎప్పటికీ మా దగ్గిర వుండేందుకే వచ్చేశావా?'' అని అడిగాడు సెర్యోష.

''ఆహా, ఎప్పటికీని'' అన్నాడు కొరొొస్తెల్యోవ్.

''మరి – నన్ను బెల్టుతో చెమ్డాలెక్కగొడ్తావా?'' అని అడిగాడు సెర్యోష.

కొరొొస్తెల్యోవ్ ఆశ్చర్యపడ్డాడు.

''నేనెందుకు నిన్ను బెల్టుతో చెమ్డాలెక్కగొట్టాలి?''

''నువ్వు చెప్పినట్టు నేను వినకపోతే'' అని సెర్యోష వివరించి చెప్పాడు.

''ఛా! ఛా!'' అన్నాడు కొరొొస్తెల్యోవ్. ''నా ఉద్దేశంలో – బెల్టుతో కొట్టడం వొట్ఠి తెలివితక్కువతనం, ఏం?''

''తెలివితక్కువతనమే'' అని సెర్యోష కొరొొస్తెల్యోవ్ ఉద్దేశాన్ని ధ్రువ పరచాడు. ''పాపం, పిల్లలు ఏడుస్తారు'' అన్నాడు సెర్యోష.

''నువ్వూ నేనూ ఒక ఒప్పందానికి వద్దాం – మనం ఇద్దరం మొగాళ్లం – బెల్టు వ్యవహారం మనకెన్నడూ వద్దు!'' అన్నాడు కొరొొస్తెల్యోవ్.

''మరి – నువ్వు ఏ గదిలో పడుకుంటావు?'' అని అడిగాడు సెర్యోష.

''ఈ గదిలోనే'' అన్నాడు కొరొొస్తెల్యోవ్. ''ఈ గదిలోనే నోయ్. మరిగంటే — మనం ఇద్దరం ఆదివారం కలిసి వెళ్దాం, ఎక్కడికో తెలుసా? ఆటవస్తువులమ్ముతారే — ఆ షాపుకెళ్దాం. నీకేది కావాలో నువ్వే ఎంచుకో — అదే కొందాం, ఏం, అలాగేనా?''

''ఓ, అలాగే!'' అన్నాడు సెర్యోష. ''నాకు సైకిలు కావాలి. మరి — ఆదివారం ఎప్పుడొస్తుంది? త్వరగా వస్తుందా?''

''త్వరగా వస్తుంది.''

''ఎన్నాళ్లలో వస్తుంది?''

''రేపు శుక్రవారం, తరువాత శనివారం, ఆ తరువాత ఆదివారమే!''

''అబ్బా, ఇంత ఆలస్యమా!'' అన్నాడు సెర్యోష.

తల్లి, సెర్యోష, కొరొొస్తెల్యోవ్ — ముగ్గురూ కలిసి టీ తాగారు. (పాష అత్తయ్య, లుక్యానిచ్ మామయ్య ఇంట్లో లేరు, ఎక్కడికో వెళ్లారు.) సెర్యోషకి నిద్దరొచ్చింది. కచికవన్నె చిమ్మటపురుగులు దీపంచుట్టూ నాట్యం చేస్తూ, దీపాన్ని ఢీకొని, టేబిలుగుడ్డమీద పడుతున్నాయి, వాటి రెక్కలు తళుక్కుమని మెరుస్తున్నాయి — వీటిని చూస్తూన్నకొద్దీ సెర్యోషకి మరింతగా నిద్రపోవాలనిపించింది. తటాలున చూశాడు సెర్యోష — తన మంచాన్ని కొరొొస్తెల్యోవ్ ఆ గదిలోనుంచి మరెక్కడికో తీసుకువెళ్తూండడం.

''నా మంచం తీసుకెళ్లిపోతూన్నా వెందుకూ?'' అని అడిగాడు సెర్యోష.

''నీకు నిద్దర వచ్చేస్తూందిరా, నాయనా'' అని అంది అమ్మ. ''రా, పడుకునేముందు కాళ్లు కడుక్కోవాలిగా మరి!''

పొద్దున్న మెలకువ వచ్చి చూసుకునే సరికి తను ఎక్కడున్నదీ సెర్యోషకి మొదట అర్థంకాలేదు. గదికి రెండు కిటికీలుండాల్సింది పోయి, మూడు కిటికీలున్నాయి; అదిన్నీ తన మంచం దగ్గర కాకుండా ఎక్కడో దూరంగా వున్నాయి. మరి — కిటికీ తెరలు కూడా వేరుగా వున్నాయి. తరువాత

అర్థమైంది – అది పాష అత్తయ్య గది అని. గది ఎంతో అందంగా వుంది: కిటికీ గుమ్మాల్లో పువ్వులచెట్ల గోలేలున్నాయి, అద్దంవెనుక నెమలి పించెం వుంది. పాష అత్తయ్య, లుక్యానిచ్ మామయ్య అప్పుడే లేచిపోయి, వెళ్లి పోయారు – వాళ్ల పక్కలప్పుడే సర్దేసి వున్నాయి – తలగడలు కొండల్లా అమర్చి వున్నాయి. కిటికీ తలుపులు తెరిచివున్నాయి. కిటికీలకావల చెట్లపొదల్లో బాలసూర్యుడి కిరణాలు దోబూచులాడుతున్నాయి. సెర్యోష మంచంమీద నుంచి దిగిపోయి, తన పడకలాల్చీ తీసేసుకుని, నిక్కరు తొడుక్కుని, భోజ నాలగదిలోకి వెళ్లాడు. తన గది తలుపు మూసేసి వుంది. తలుపు పిడి పట్టుకుని లాగాడు: తలుపు రాదు. తను గదిలోకి వెళ్లితీరాలి: తన ఆట వస్తువులన్నీ ఆ గదిలోనే వున్నాయి మరి. వాటిలో తన కొత్త పార వుంది. ఏమైనా సరే, దానితో ఇప్పుడు తవ్వాలని తనకెంతో వుంది.

''అమ్మా!'' అని పిలిచాడు.

''అమ్మా!'' అని మళ్లీ మరోసారి పిలిచాడు.

తలుపు తెరుచుకోలేదు, అంతా నిశ్శబ్దంగా వుంది.

''అమ్మా!'' అని బిగ్గరగా – తను ఎంత బిగ్గరగా పిలవగలడో అంత బిగ్గరగానూ – పిలిచాడు.

ఇంతట్లో పాష అత్తయ్య పరుగెత్తుకొచ్చి, సెర్యోషను రెక్కపట్టుకుని, వంటింట్లోకి తీసుకుపోయింది.

''ఏమిటొచ్చిందిరా నీకు?'' అని చెవిలో అడిగింది, ''అలా కేకయ్యొచ్చా? తప్పు, అలా కేకెయ్యకూడదు! ఆరె భగవంతుడా! నువ్వు చిన్నపిల్లాడివటా? కావే! అమ్మ నిద్రపోతూంది, నిద్రపోనీ.''

''నా పార కావాలి నాకు'' అన్నాడు సెర్యోష గాబరాపడిపోతూ.

''నీ పార ఎక్కడకీ పారిపోదురా, బాబూ! అమ్మ లేచాక తీసుకుందు గాని'' అంది పాష అత్తయ్య. ''ఇదిగో, నీ ఒడిసెల, దీన్ని తీసుకుని పోయి ఆడుకో. నీక్కావలిస్తే, కేరట్ దుంప కడిగిస్తాను, తిను! మరి, బుద్ధి

మంతులందరూ లేవగానే – మొదట మొహమూ వొళ్ళూ కడుక్కొని, తరువాత ఏ పనైనా చేస్తారు, తెలిసింది కదూ!''

సెర్యోష ఎంత హడావిడిలో వున్నా, మంచిమాట్లాడితే, వెంటనే స్తిమిత పడిపోతాడు – అది సహజమే మరి. తన మటుకు తనే మొహమూ వొళ్ళూ కడిగేసుకుని, తన కోసం జాడిలో వుంచిన పాలు తాగేసి, తన ఒడిసెల తీసుకుని ఆడుకుందుకని వీధిలోకి వెళ్ళిపోయాడు. ఎదురుగా వున్న కంచెగోడమీద పిచ్చుక కూచుంది. సెర్యోష గురిచూడకుండానే ఒడిసెలతో రాయి విసిరాడు. సహజంగానే పిచ్చుకకు తగల్నే తగల్లేదు. సెర్యోష ఇష్ట పూర్వకంగానే గురిచూడలేదు – ఎందుకంటే, తను గురిచూసి కొట్టినా, తప్పకుండా గురి తప్పిపోతుంది, మరెందుచేతనో ఎవ్వరికీ తెలీదు. తను గురిచూసి కొట్టేమాటుంటే – తను గురితప్పిపోవడమూ నిశ్చయం, తనను చూసి లీద వెక్కిరించడమూ నిశ్చయం. గురిచూడకుండా కొట్టితే – ఎవ్వరూ నవ్వరు, ఎందుకంటే – అందరికీ తెలుసు, తను గురిచూడడం లేదనీ, తను గురితప్పిపోతాడనీ.

షూర తన ఇంటి గుమ్మంలో నిలబడి కేకేశాడు:

''సెర్యోష! చిట్టడవిలోకెళ్దామా?''

''నేనురాను!'' అన్నాడు సెర్యోష.

వీధిలోకి వెళ్ళి, గేటుపక్క వున్న బెంచీమీద కూచున్నాడు సెర్యోష. కూచుని, కాలు వూపుకొంటున్నాడు. తన కేమిటో అసలే గాబరాగా వుంది మనసులో. ఆ గాబరా మరీ హెచ్చయింది. ముంగిట్లోనుంచి వెళ్ళుతూ ఇంటికేసి చూచేసరికి, తవ గది కిటికీ కటకటాల తలుపులు మూసి వున్నాయి. దీనిగురించి మొదట తనేమీ పట్టించుకోలేదు. ఇప్పుడు తనకి తట్టింది: ఎండకాలంలో కిటికీ తలుపులు ఎన్నడూ మూయరు, శీతకాలంలో బాగా చలివేస్తూన్నప్పుడు మూస్తారు; దీని పర్యవసానం ఏమిటంటే: తన ఆటవస్తువులన్నీ ఆ గదిలో వుండిపోయాయి, నాలుగు వైపులనుండీ గది

బిడాయించేసి వుంది. ఆటవస్తువులను తను తెచ్చుకోలేదన్నమాట. ఇది తెలుసుకున్న తరువాత, తనకి నేలమీద పడి గట్టిగా అరవాలనిపించింది. అనిపించిందే గాని, తను అలా నేలమీద పడి అరుస్తాడా? అబ్బే, అరవడే – తను చంటిపిల్లాడా ఏమిటి! ఇలాగ అనుకున్నప్పటికీ – తన మనసు స్తిమితపడలేదు. ఈ పాళంగా – ఈ క్షణమే తన పార తనకు అవసర మాయె, కాని అమ్మా కొరొస్తెల్యోవూ ఈ విషయమ్మై ఏమీ పట్టించుకో వడమేలేదాయె.

''వాళ్లు లేవగానే నా బొమ్మలన్నిటినీ – అన్నిటినీ – పాష అత్తయ్య గది లోకి తీసుకెళ్లిపోయి అక్కడే వుంచేస్తాను. అన్నట్లు – బిల్డింగ్ క్యూబ్ కూడా తీసుకెళ్లడం మర్చిపోకూడదు: అది సొరుగుల బీరువా వెనక ఏ మూలో పడి వుండాలి'' అనుకున్నాడు సెర్యోష.

వాస్య, జేన్యలు ఇద్దరూ అక్కడకు వచ్చి సెర్యోష ఎదుట నిలబడ్డారు. లీద కూడా అక్కడకే వచ్చింది, తన చిట్టి తమ్ముడు వీక్తొర్‌ని పట్టుకుని నడిపించుతూ. వాళ్లందరూ అక్కడ నుంచుని సెర్యోషకేసి నిదానంగా చూస్తున్నారు. సెర్యోష కాలు వూపుకొంటూ కూచున్నాడే గాని ఏమీ అనలేదు.

''ఈవేళ అలా వున్నావేమిరా?'' అని జేన్య అడిగాడు సెర్యోషని.

''వాళ్లమ్మ పెళ్లిచేసుకుందిరా'' అని వాస్య జవాబు చెప్పాడు.

సెర్యోష ఏమీ మాట్లాడలేదు.

''ఎవర్ని చేసుకుందిరా?'' అని అడిగాడు జేన్య.

'''యాస్ని బేరెగ్' డైరెక్టరు కొరొస్తెల్యోవ్‌ని'' అని వాస్య భోగట్టా ఇచ్చాడు. ''మొన్న అతణ్ణి పట్టుకుని అందరూ ఏకేశారు.''

''ఎందుకు?''

''ఎందుకేమిటి? – గొప్పపని చేశాడని'' అన్నాడు వాస్య. అలా అని, తన జేబులోకి చెయ్యిపోనిచ్చి, అందులోనుంచి నలిగిపోయిన సిగరెట్లు పెట్టె తీశాడు.

''నాకోటియ్యరా!'' అన్నాడు జేన్య.

''ఇదే ఆఖరిదిరా, బాబూ, ఇక లేవురా!'' అన్నాడు వాస్య. అయినా ఒక సిగరెట్టు వాడికిచ్చి, అగ్గిపుల్ల వెలిగించి తన సిగరెట్టు ముట్టించుకుని చేయి చాచి, మండుతూన్న అగ్గిపుల్లని జేన్యకి యిచ్చాడు. అగ్గిపుల్ల చివర వున్న మంట ఆ ఎండలో వెలవెలబోయి అగపడనే లేదు. అది అగపడకపోవడంవల్ల అగ్గిపుల్ల ఎందుకు నల్లబడి బొగ్గయిపోయి, చుట్టుకుపోయిందో, సిగరెట్లనుండి ఎందుకు పొగ వస్తూందో కనబడ్డంలేదు. వీధిలో కుర్రాళ్లు కూర్చున్నవైపు ఎండ కాస్తూంది; ఎదుటివైపు ఇంకా నీడగానే వుంది. కంచెగోడవెంట మొలుస్తూన్న దూలగొండి చెట్ల ఆకులు మంచులో తడిసి, శుభ్రపడి, చెమ్మగా వున్నాయి. వీధి మధ్య మాత్రం దుమ్ము వొత్తుగా వుంది; అటువైపు చల్లగా వుంది, ఇటువైపు వెచ్చగా వుంది. ఇటువైపు దుమ్ములో రెండు ట్రాక్టరు చక్రాల జాడలు వున్నాయి.

''ఎందుకోగాని సెర్యోష మనసులో బాధపడుతున్నాడు'' అంది లీద. ''వాడికి కొత్త నాన్న వచ్చాడు.''

''సెర్యోష! నువ్వేమీ బాధపడకు!'' అన్నాడు వాస్య. ''మీ కొత్త నాన్న చెడ్డవాడు కాడు, మొహం చూస్తేనే తెలిసిపోతూంది. ఇన్నాళ్లూ నీకెలా జరిగిందో, ఇహ ముందు కూడా నీకలాగే జరుగుతుంది. నీ పని నీది, వాళ్ల పని వాళ్లది.''

''నా కతను సైకిలు కొని ఇస్తానన్నాడు'' అని అన్నాడు సెర్యోష, నిన్న సాయంకాలం తనకీ కొరొస్తెల్యోవ్‌కీ జరిగిన సంభాషణ జ్ఞాపకం వచ్చి.

''కొంటానని ఖరారుచేశాడా, లేకపోతే నువ్వు వూరికేనే అలా ఆశపడుతున్నావా?'' అని అడిగాడు వాస్య.

''ఖరారుచేశాడే! మేమిద్దరం షాపుకెళ్తాం, ఆదివారంనాడు — రేపేమో శుక్రవారం, తరువాత శనివారం, ఆ తరువాత ఆదివారమే!''

''రెండు చక్రాల సైకిలే?'' అని అడిగాడు జేన్య.

''బ్రైసికిలు కొని ఇస్తే మాత్రం పుచ్చుకోకు, ఒరేయ్!'' అని సలహా చెప్పాడు వాస్య. ''బ్రైసికిలు ఎందుకేమిటి నీకు? ఏముంది, నువ్విట్టే పెద్దవాడవై పోతావు, నీకు సైకిలే వుండాలి.''

''వీడివన్నీ అబద్ధాలే, వీడికి ఎవ్వడూ సైకిలు కొని ఇవ్వడు!'' అంది లీద.

షూర డాబుకొట్టాడు:

''మా నాన్న కూడా నాకు సైకిలు కొంటానన్నాడు. జీతం అందగానే కొంటానన్నాడు.''

కొరొాస్తెల్యోవ్‌తో తొలి ఉదయం — బంధువుల ఇంటికి

ముంగిట కణేలుమని చప్పుడైంది. ఏమిటా చప్పుడని సెర్యోష గేటు లోపలికి చూశాడు: కొరొాస్తెల్యోవ్ కటకటాల కిటికీ గడియలు తీస్తున్నాడు. అతడు చారల షర్టు తొడుక్కొని, లేతనీలిరంగు బ్రై వేసుకున్నాడు, చెమ్మగా వున్న జుట్టు నున్నగా దువ్వివుంది. కిటికీ తలుపులను అమ్మ లోపలినుండి బయటికి తోసింది. అవి ఇటూ అటూ విడిపోయాయి. కొరొా స్తెల్యోవ్‌తో అమ్మ ఏమిటో చెప్పింది. అతడు కిటికీ గుమ్మాన్ని ఆనుకుని అమ్మకి జవాబుచెప్పాడు. అమ్మ చేతులు చాచి, అతని చెక్కిళ్ళు నిమిరింది. వీధిలో కుర్రకారులున్న సంగతి వాళ్ళు చూసుకోలేదు.

సెర్యోష గేటు దగ్గరకెళ్లి:

''కొరొాస్తెల్యోవ్! నా పార కావాలి నాకు'' అన్నాడు.

''ఏం పార?'' అన్నాడు కొరొొస్తెల్యోవ్.

''పార ఒక్కటే కాదు, నా ఆటవస్తువులన్నీ కావాలి నాకు'' అన్నాడు సెర్యోష.

''ఇలా వచ్చి, నీకేం కావాలో తీసుకో'' అంది అమ్మ.

సెర్యోష తల్లిగదిలోకి వెళ్లాడు. వెళ్లేసరికి, గదిలో కొత్త కొత్త వాస నలు వేస్తున్నాయి — పొగాకు వాసనా, కొత్త మనిషి వాసనానూ. తనకిది వరకు పరిచయంలేని కొత్త వస్తువులు ఇక్కడా అక్కడా వున్నాయి: బట్టలు, బ్రష్షు, టేబిలుమీద సిగరెట్టు పెట్టెలు.... అమ్మ జడ విప్పుకుంటూంది. పొడుగ్గావున్న జడ విడుతూన్నప్పుడు, ఏన్నో లెక్కలేనన్ని తొగరువన్నె పాములు ఆమె సన్నని నడుమును కప్పివేస్తూ వుంటాయి. జడ విప్పుకున్న తరువాత, అమ్మ తల దువ్వుకుంటుంది — తల దువ్వుకుంటూన్నప్పుడు తలవెంద్రుకలు ఎండకాలపు వానలా తిన్నగా అవుతాయి.... తొగరువన్నె పాముల వెనుకనుండి అమ్మ ''ఏం, నాయనా, సెర్యోష?'' అని వాణ్ణి పలకరించింది.

బల్లమీద వున్న సిగరెట్టు పెట్టెలు చూస్తూ, సెర్యోష జవాబుచెప్ప లేదు. ఆ పెట్టెలు కొత్తగా, అన్నీ అచ్చంగా ఒక్క మోస్తరుగా ఎంతో చోద్యంగానూ ఆకర్షణీయంగానూ అగపడ్డాయి. సెర్యోష ఒక పెట్టె తీసి, దానిని తెరవబోయాడు, కాని దాని మూత అంటించి వుండడంచేత తెరవ లేకపోయాడు.

''దాన్ని మళ్లీ అక్కడే వుంచేయి'' అంది అమ్మ అద్దంలో అంతా చూస్తూనూ. ''నీ బొమ్మలు తీసుకుందుకు వచ్చావుగా?''

సొరుగుల బీరువా వెనుక పడిపోయి వుంది ఒక బిల్డింగ్ క్యూబు. సెర్యోష గొంతుకూర్చుని చూచేసరికి అది అగపడింది, కాని దాన్ని తీద్దామని చేయి చాచేసరికి, అది చేతికి అందలేదు.

''ఏమిటలా గాభరా పడిపోతున్నావు?'' అని అడిగింది తల్లి.

''నా చేతికి అందడంలేదే!'' అన్నాడు సెర్యోష.

ఆ సమయానికి కొరొస్తెల్యోవ్ గదిలోకి వచ్చాడు.

"వుత్త సిగరెట్టు పెట్టెలు నాకు తరువాత ఇస్తావా?" అని సెర్యోష అడిగాడు అతణ్ణి.

(సిగరెట్లు కాల్చేసిన తరువాతమా, చాకలేట్లు తినివేసిన తరువాతనూ పెద్దవాళ్లు ఖాళీ పెట్టెలను పిల్లలకి ఇస్తారని సెర్యోషకు తెలుసును.)

"ఇదిగో, ఈ పెట్టె తీసుకో, నీకు ముందుగానే ఇచ్చేస్తున్నా!" అన్నాడు కొరొస్తెల్యోవ్.

అలా అని, కొరొస్తెల్యోవ్ సిగరెట్టు పెట్టెలో వున్న సిగరెట్లను తీసి వేసి ఖాళీ పెట్టె సెర్యోషకి ఇచ్చాడు.

"వాడికి సాయంచేద్దూ, వాడిదేదో బీరువా వెనకాల పడిపోయిందిట" అంది అమ్మ కొరొస్తెల్యోవ్‌తో.

కొరొస్తెల్యోవ్ తన పొడుగాటి చేతులతో బీరువాను పట్టుకుని ముందుకు జరిపాడు. ఏనాటిదో ఆ పాత బీరువా, కిర్రుకిర్రుమంటూ కదిలింది. దాని వెనకాల వున్న క్యూబును సెర్యోష సులువుగా తీసుకోగల్గాడు.

"భలే!" అన్నాడు సెర్యోష, కొరొస్తెల్యోవ్‌కేసి తలెత్తి చూసి, అతనిని మెచ్చుకుంటూ.

బిల్డింగ్ క్యూబునూ, ఖాళీ సిగరెట్టు పెట్టెనూ, ఇంకా తను పట్టుకొని వెళ్లగల్గిన బొమ్మలన్నిటినీ గుండెలకు హత్తుకుని, సెర్యోష ఆ గదిలోనుండి వెళ్లిపోయాడు. వాటన్నిటినీ పాష అత్తయ్య గదిలోకి తీసుకెళ్లి, అక్కడ తన మంచానికీ బీరువాకీ మధ్యవున్న జాగాలో నేలమీద కుప్పపోశాడు.

"పార తీసుకెళ్లడం మర్చిపోయావురా!" అంది అమ్మ. "పార కావాలంటూ కిందా మీదా నిలవనిచ్చావుకావు, తీరా ఆ పారే మర్చిపోయావు!"

సెర్యోష ఏమీ మాట్లాడకుండా తన పార తీసుకుని ముంగిట్లోకి వెళ్ళిపోయాడు. పారతో తవ్వడానికి తనకిప్పుడు ఇష్టంలేకపోయింది. తను పోగు చేసుకున్న వస్తువుల్ని — చాకలేట్లకు చుట్టుబెట్టిన ముచ్చికాగితాల్ని — సిగరెట్టు

పెట్టెలో పెట్టుకోవడం అవసరమని తనకిప్పుడు తోచింది. కాని అమ్మ అలా అన్న తరువాత, కొంత సేపైనా పార పుచ్చుకొని తవ్వడం అవసరమనీ, లేకపోతే బాగుండదనీ తనకప్పుడనిపించింది.

ఆపిల్‌చెట్టు కింద మన్ను గుల్లగా వుంటుంది, తవ్వడం సులువు. సెర్యోష కొంతసేపు తవ్వాడు, ఇంకా లోతుగా తవ్వాలనిపించింది – ప్రతీ సారీ పారతో పారెడు మన్ను తవ్వి తీసేందుకు ప్రయత్నించాడు. తన శక్తి అంతటితోనూ ఈ పని చేస్తున్నాడు సెర్యోష. వొంటిమీద జుబ్బా లేక పోవడంచేత ఎండకి ఎరుపెక్కిన వీపు కండరాలూ, చేతుల కండరాలూ బిగుసుకుంటూ, సడలుతూ కదులుతున్నాయి. ఈ శ్రమవల్ల సెర్యోష రొజుకున్నాడు. కొరొస్తెల్యోవ్ వరండాలో నిలబడి సిగరెట్టు కాలుస్తూ, సెర్యోషకేసి చూస్తున్నాడు.

లీద వీక్తొరును ఎత్తుకుని అక్కడకు వచ్చి, సెర్యోషతో,

''పువ్వులు ఇక్కడ పాతుదాం, మంచి అందంగా వుంటుంది!'' అంది.

లీద తన తమ్ముణ్ణి నేలమీద కూచోబెట్టింది. వాడు పడిపోకుండా వుండాలని, వాణ్ణి ఆపిల్‌చెట్టుకు జేరబెట్టింది. అయినప్పటికీ వాడు వెంటనే పక్కకు పడిపోయాడు.

''అబ్బ! సరిగ్గా కూచోమంటేను!'' అని లీద విసుక్కుని, వాణ్ణి కుదిపి, కుదేసి చతికిలబెట్టి, ''బండ పిల్లడు! ఈ వయస్సుకి అందరు పిల్లలూ ఎంతో బాగా కూచుంటారు!'' అంది.

లీద కావాల్సికి ఈ మాటలను బిగ్గరగా అంది – తన మాటలు వరండాలో నిల్చున్న కొరొస్తెల్యోవ్‌కి వినబడాలనీ, తను ఎంత పెద్దదో, ఎంత తెలివైనదో అతనికి తెలియాలనీ. అతనివైపు లీద ఓరగా చూసి, బంతిపువ్వులు తెచ్చి, తవ్విన మట్టిలో నిలబెట్టి, సెర్యోషతో ''ఇలా చూడు, ఎంతో బాగుందికదూ!'' అంది.

తరువాత లీద పక్కకాలువలోనుంచి తెల్లరాళ్ళూ ఎరుపు రాళ్ళూ ఏరి

తీసుకొచ్చి, బంతిపువ్వుల చుట్టూ పాతింది. చుట్టూ వున్న నేలను తన వేళ్లతో నలిపి గుండచేసి, నేలను అరచేతులతో చరిచింది. లీద చేతులు నల్లగా అయిపోయాయి.

''ఇప్పుడంతా ఎంతో అందంగా వుంది కదూ, ఏం? చెప్పు, మరి, అబద్ధమాడకుండా!'' అంది లీద సెర్యోషతో.

''అవును'' అని ఒప్పుకున్నాడు సెర్యోష.

''హొత్తి చేతకానివాడివి! నేను లేకుంటే నువ్వేమీ చేయలేవు!'' అంది లీద.

వీక్తొర్ మళ్లీ పడిపోయాడు — ఈ సారి వెల్లకిలా పడిపోయాడు. లీద తమ్ముడికేసి చూసి ''మళ్లీ పడిపోయావూ? ఐతే, అలాగే పడుండు!'' అంది.

వీక్తొర్ ఏడవలేదు. ఎగువ అల్లల్లాడుతూన్న ఆకులవైపు ఆశ్చర్యంతో చూస్తూ, పిడికిటిని చప్పరిస్తున్నాడు. లీద తన నడుముకు పటకా బదులు కట్టుకున్న స్కిప్పింగ్ తాడు విప్పుకుని, ఆ తాడు పట్టుకుని వరండా ఎదుటకు వెళ్లి: ''ఒకటి, రెండు, మూడు....'' అని గట్టిగా లెక్కపెడుతూ ఆ తాడుతో స్కిప్‌చేయడం మొదలెట్టింది. కొరొొస్తెల్యోవ్ చిరునవ్వు నవ్వి, వరండాలోనుంచి ఇంట్లోకి వెళ్లిపోయాడు.

''చూడు! మీ తమ్ముడిమీద చీమలెక్కుతున్నాయి'' అన్నాడు సెర్యోష లీదతో.

''ఓరి, బండా!'' అని లీద తమ్ముడిమీద చిరాకుపడి, వాడి దగ్గరకెళ్లి, వాడిని లేవదీసి, చీమల్ని దులిపేసింది. లీద చేతులు మట్టితో నల్లగా వున్నాయేమో, ఆ దులపడంతో వీక్తొర్ గుడ్డలూ, వాడి వుత్త కాళ్లూ మట్టితో నల్లగా అయిపోయాయి.

''వీణ్ణి అలా తుడుస్తూనే వుంటారు. ఎంత తుడిచినా, వొళ్లంతా మళ్లీ కుళ్లు చేసుకుంటూనే వుంటాడు'' అంది లీద.

అమ్మ వరండాలోకి వచ్చి ''సెర్యోష! ఇలా వచ్చి బట్టలేసుకో, మనం ఎవరింటికో వెళ్ళాలి'' అని పిలిచింది.

పిలుపు విని, సెర్యోష సరదాగా ఇంట్లోకి పరుగెత్తాడు – పై వాళ్ళింటికి వెళ్ళడం రోజూ వుండదుగా మరి. పరిచయస్థుల ఇంట్లో ఎంతో సరదాగా వుంటుంది. వాళ్ళు చాకలెట్లూ పెప్పరమెంట్లూ ఇస్తారు. ఆటవస్తువులన్నీ చూపిస్తారు.

''నాస్త్య అవ్వని చూడ్డానికెళ్దాం మనం'' అని చెప్పింది తల్లి, సెర్యోష అడగకపోయినప్పటికీనీ. పై వాళ్ళెవరింటికి వెళ్ళడమన్నా సెర్యోషకి సంతోషమే కాబట్టి, ఎవరింటికి వెళ్తున్నామా అనేది సెర్యోషకి అంత ముఖ్యమైన విషయం కానేకాదు.

నాస్త్య అవ్వ గంభీరంగా వుంటుంది. ముఖాన నవ్వే వుండదు. కఠిన మైన మనిషి. తలకు చుక్కల రుమాలు కట్టుకుని, గడ్డం కింద ముడి వేసుకుంటుంది. ఆమెకు బహుమాన పతకం వుంది – ఆ పతకం మీద లెనిన్ బొమ్మ వుంది. ఆమె చేతిలో ఎప్పుడూ నల్లని జిప్‌సంచి వుంటుంది. సంచి తెరచి, సెర్యోషకి ఏదో ఒకటి నోట్లోకి ఇస్తూ వుంటుంది ఆమె. కాని ఆమె ఇంటికి సెర్యోష ఇంతవరకూ ఎన్నడూ వెళ్ళలేదు.

అమ్మ, కొరొస్తెల్యోవ్, తనూ – ముగ్గురూ బట్టలేసుకుని బయల్దేరారు. ఇటు అమ్మ, అటు కొరొస్తెల్యోవ్ – ఇద్దరూ తనను చెరి ఒక చేయి పట్టుకుని వుంటే, వాళ్ళిద్దరి మధ్యనూ తను నడిచాడు. కాని కాస్సేపటి కల్లా తను వాళ్ళ చేతులు విడిపించేసుకున్నాడు: ఇక తన చిత్తంవచ్చినట్లూ తను హాయిగా స్వతంత్రంగా నడచివెళ్ళొచ్చు. అక్కడక్కడ ఆగి, పరాయివాళ్ళ కంచెగోడల సందుల్లోనుంచి తొంగిచూడొచ్చు, అక్కడ భయంకరమైన కుక్క ఒకటి గొలుసుకు కట్టి వుంటుంది, బాతులు నడచివెళ్తూంటాయి – వీటినీ చూడొచ్చు. పరుగెత్తి కొంత దూరం ముందుకు వెళ్ళిపోయి, వెనక్కి తిరిగి, అమ్మ దగ్గరకు మళ్ళీ పరుగెత్తి రావచ్చు. రైలు ఇంజనులా కుంయ్‌మని

కూతపెట్టొచ్చు, రైలు ఇంజను నడుస్తూన్నట్టు బుస్ బుస్‌మని చప్పుడు చెయ్యొచ్చు. చెట్ల పొదల్లో బొట్టలతో వున్న రెమ్మల్ని విరిచి, బొట్టతో వుంయ్‌మని వూదొచ్చు. బంగారంలా తళతళ మెరుస్తూ రోడ్డుమీద పడి వున్న కోపెక్కు కాసును, దారంట వెళ్తూండినవాళ్లెవరో పారేసుకున్నదాన్ని, ఏరుకోవచ్చు. మరి, పెద్దవాళ్లు నీ చేతులు పట్టుకుని నడిపించారంటే, చేతులు చెమటపట్టడమూ, ఇక ఏ సరదా కూడా వుండకపోవడమూ.

ఒక చిన్న ఇంటికి వెళ్లారు — ఆ యింటికి రెండు చిన్న కిటికీలు: కిటికీలు రెండూ రోడ్డుమీదకే వున్నాయి. చిన్న ముంగిలీ, చిన్న గదులూ. గదుల్లోకి వెళ్లాలంటే, బ్రహ్మాండమైన రష్యన్ పొయ్యి వున్న వంటింట్లో నుంచి వెళ్లాలి. నాస్త్య అవ్వ గుమ్మంలోకి వచ్చి:

''మీకు నా అభినందనలు!'' అంది.

ఓహో, ఈవేళ ఏదో పండుగే అయివుండాలి. అందుకని — మామూలు పండుగరోజు సంప్రదాయం ప్రకారం, సెర్యోష ''మీకున్నూ!'' అన్నాడు.

సెర్యోష నాల్గుదిక్కులూ పరికించాడు: ఆటవస్తువులూ బొమ్మలూ ఎక్కడా కనబడలేదు, ఇంట్లో ఏ అలంకరణలూ అవుపించలేదు — తినేందుకు భక్ష్యాలూ, పడుకునేందుకు మంచమూ పడకా, ఇలాంటి విసుగెత్తించే వస్తువులేతప్ప మరేవీ లేవక్కడ.

''మీ దగ్గర ఆటవస్తువులున్నాయా?'' అని అడిగాడు సెర్యోష.

(ఉండే వుంటాయి, కాని బహుశ దాచేసి వుంటారు.)

''పిల్లలూ జెల్లలూ ఎవ్వరూ లేరిక్కడ కనుక. అలాంటి వస్తువులూ గిస్తువులూ ఏవీ లేవిక్కడ. చాకలెట్లూ వున్నాయి — తిను!'' అంది నాస్త్య అవ్వ.

బల్లమీద కేక్‌ల పళ్లేలమధ్య చాకలెట్లతో నిండివున్న నీలిరంగు గాజు వాజు వుంది. అందరూ బల్లదగ్గర కూచున్నారు. కొరొస్తెల్యోవ్ ఒక సీసా మూత తీశాడు. కారు ఎరుపు ద్రాక్షసారాయిని గ్లాసుల్లో పోశాడు.

''సెర్యోషకి వద్దు'' అంది అమ్మ.

ఎప్పుడూ ఇలాగే: అందరూ తాగుతారు, తనకు మాత్రం వద్దంటారు. మంచివి ఏవీ తనకివ్వరు.

కాని, కొరొస్తెల్యోవ్ అన్నాడు:

''కొంచెమే పోస్తాను, మనతో కూడా సరదాగా పుచ్చుకుంటాడు, మరేమీ ఫర్వాలేదు.''

అలా అని కొరొస్తెల్యోవ్ సెర్యోష గ్లాసులో ద్రాక్షసారాయి పోశాడు. దీన్నిబట్టి అనుకున్నాడు సెర్యోష – కొరొస్తెల్యోవ్ మంచివాడనీ, అతనితో తనకి మరే ఇబ్బందీ వుండదనీ.

ఒకరి వైన్‌గ్లాసులతో ఒకరి వైన్‌గ్లాసులను టాకించారు. సెర్యోష కూడా తన వైన్‌గ్లాసును టాకించాడు.

అక్కడ మరొక అవ్వకూడా వుంది. ఆమె కేవలం అవ్వే కాకుండా ముత్తవ్వ కూడా అని సెర్యోషతో చెప్పారు. అందుచేత సెర్యోష ఆమెను అలాగే పిలచాడు. కొరొస్తెల్యోవ్ మాత్రం ఆమెను పిలవడంలో ''ముత్త'' అనే మాట వదిలేసి, ''అవ్వ'' అనే పిలిచాడు. సెర్యోషకు మాత్రం ఆమె ఏమీ నచ్చలేదు. సరికదా, ఆమె అంటే ఏకంగా అసహ్యమే వేసింది.

''టేబిలుగుడ్డ అంతా మరకలు చేసేస్తాడు'' అంది ఆమె సెర్యోష కేసి చూసి.

తన వైన్‌గ్లాసును టాకించినప్పుడు, సెర్యోష గ్లాసునుండి రవంత ద్రాక్ష సారాయం టేబిలుగుడ్డమీద ఒలకడం నిజమే.

''అవును, వొలకపోశావు మరి!'' అంది ఆమె.

అలా అని, టేబిలుగుడ్డమీద పడిన తడి మరకపైన ఉప్పు జాడీలోనుంచి ఉప్పును చిన్న పోగులా చిలకరించిందామె ముఖం గంటుపెట్టుకుని రోజు కుంటూనూ. ఇక ఆ క్షణంనుండి ఆమె సెర్యోష ఏమి చేస్తూన్నదీ ఏమి చెందు తూన్నదీ ఎంతో శ్రద్ధగా కనిపెట్టుతూనే వుంది. ఆమె కళ్లద్దాలు పెట్టు

కుంది. ముసలి పండు. చేతుల చర్మం ముడుతలుపడిపోయి గోధుమరంగు వచ్చేసింది, వేళ్ల కీళ్లన్నీ వుండలు కట్టిపోయాయి, పెద్దదిగా వున్న ముక్కు కిందకు వంగిపోయింది. శల్యావశిష్టంగా వున్న గడ్డం పైకి వంగింది.

ద్రాక్షసారాయం తియ్యగా రుచిగా వుంది. తన గ్లాసులో వున్నదంతా వెంటనే తాగేశాడు సెర్యోష. సెర్యోషకు కేక్ ముక్క ఇచ్చారు తినమని. దానిని తింటూండేసరికి, అది కొద్దిగా చితికి పెచ్చులు వొంటిమీద రాలాయి.

"ఏమిటా తిండి – ఒంటినిండా పోసుకుంటూను!" అంది ముత్తవ్వ.

సెర్యోషకు తను కూచున్న కుర్చీ ఏమీ సదుపాయంగా లేకపోయింది. అందుచేత సెర్యోష కుర్చీలో ఇటూ అటూ కదిలాడు.

"ఏమిటా కుర్చీలో కూచోవడం – ముళ్లమీద కూచున్నట్టు!" అంది ముత్తవ్వ.

సెర్యోషకి అదేమిటోగాని మంచి హుషారు అనిపించి, పాట పాడాలని బుద్ధిపుట్టింది. ఆపాళంగా పాట పాడేశాడు.

"ఏమిటిది? తిన్నగా వుండలేవూ?" అంది ముత్తవ్వ.

కొరొస్తెల్యోవ్ సెర్యోషని వెనకేసుకొస్తూ:

"కోప్పడకండి వాణ్ణి, బుద్ధిగా వున్నాడు, పాపం!" అన్నాడు.

ముత్తవ్వ మళ్లీ అంది:

"ఒక్క గడియ వుండండి, ఆ బుద్ధి యేమిటో వాడే చూపిస్తాడు!"

ఆమె కూడా ద్రాక్షసారాయం పుచ్చుకుంది. సులోచనాల వెనుక ఆమె కళ్లు తళతళ మెరిశాయి. కాని సెర్యోష మంచి ధైర్యంగా అన్నాడు:

"ఫో, ఇక్కడనుండి! నువ్వంటే నాకు భయమనుకున్నావు కాబోలు!"

"ఏమిట్రా ఈ ఘోరం! నీ కేమేనా మతి వుందా, లేదా?" అంది అమ్మ.

"చిన్నపిల్లడి మాటలకేమిటి? రుచిచూసిన రెండు చుక్కలూ తల కెక్కాయి. మరో నిమిషానికల్లా ఆ నిషా అదే పోతుంది" అన్నాడు కొరొస్తెల్యోవ్.

''నా కింకా కావాలి!'' అని అరచాడు సెర్యోష, వైన్‌గ్లాసు పట్టుకుని చేయి చాస్తూ. చేయి చాచడంలో ఖాళీ సీసా చేయికి తగిలింది. సీసా ఖంగ్ మని తిరగబడింది. అమ్మ భారంగా నిట్టూర్చింది. ముత్తవ్వ తన పిడికిలితో గట్టిగా టేబిలు గుద్ది:

''చూశారా, ఏం చేశాడో!'' అంది బిగ్గరగా.

సెర్యోషకి ఇటూ అటూ ఊగాలనిపించింది. ఆ పక్కనుండి ఈ పక్కకూ, ఈ పక్కనుండి ఆ పక్కకూ అదే వూగడం వూగాడు. బల్లా, బల్లమీద వున్న కేక్, అమ్మా, కొరొొస్తెల్యోవూ, నాస్త్య అవ్వా — సర్వమూ తన ఎదుట వుయ్యాల వూగుతూన్నట్టే కనబడింది సెర్యోషకి. సెర్యోష పకాలున నవ్వాడు. సెర్యోషకు తటాలున పాట వినబడింది. ముత్తవ్వ పాడుతూందనుకున్నాడు సెర్యోష. వుండలుకట్టిన చేతితో సులోచనాలు పట్టుకుని, వాటిని ఝళిపించుతూ పాటపాడింది — కత్యూష ఏటిగట్టుకు ఎలా వచ్చిందో పాట వర్ణించింది. పాట వింటూ సెర్యోష, కేక్ ముక్కమీద తల ఆనించి నిద్రపోయాడు.

...మెలకువ వచ్చింది — ముత్తవ్వ లేదక్కడ, కడమవాళ్లందరూ టీ తాగు తున్నారు. వాళ్లు సెర్యోషను చూసి చిరునవ్వు నవ్వారు.

''బుద్ధి వచ్చిందా? రౌడీ పనులు చెయ్యవు కద?'' అని అమ్మ అడిగింది.

''నేను రౌడీ పనులు చేశానా?'' అని సెర్యోష తనలో తను అను కున్నాడు ఆశ్చర్యపడుతూ.

చేతిసంచీలోనుండి అమ్మ దువ్వెన తీసి సెర్యోష తల దువ్వింది.

''చాకలెట్లు తిను'' అంది నాస్త్య అవ్వ.

పొరుగు గదికి తలుపు లేదు. తలుపు బదులు వెలిసిపోయిన రంగురంగుల తెర వుంది. తెరవెనుకనుండి ఏదో చప్పుడు వినబడుతూంది — ''క్ర్ర్, క్ర్ర్''మని గుర్రు. సెర్యోష తెర జాగ్రత్తగా పక్కకు లాగి, గదిలోకి

మెల్లగా తొంగిచూశాడు: ముత్తవ్వ మంచంమీద పడుకుని నిద్రపోతూంది. సెర్యోష తెర దగ్గర నుండి నెమ్మదిగా వచ్చేసి ''ఇంటికెళ్లిపోదాం, నాకిక్కడ విసుగేస్తూంది!'' అన్నాడు.

వెళ్లిపోయే ముందు సెలవు పుచ్చుకునేటప్పుడు, కొరొస్తెల్యోవ్ నాస్త్య అవ్వను ''అమ్మ'' అని పిలవడం విన్నాడు సెర్యోష. అంతవరకూ సెర్యోషకి తెలియనే తెలియదు, కొరొస్తెల్యోవ్‌కి తల్లి వున్నట్టు — వాళ్లిద్దరూ కేవలం పరిచయస్థులే అనుకున్నాడు సెర్యోష.

ఇంటికి తిరిగి నడచివెళ్లడంలో, సెర్యోషకి ఈసారి దారి ఎంతో దూర మనిపించింది, ఏమీ సరదా వేయలేదు కూడానూ. ''నన్ను కొరొస్తెల్యోవ్ తన బుజంమీద ఎక్కించుకుంటే బాగుండును, నాకు నాన్న అవుతాడు కదా మరి!'' అనుకున్నాడు సెర్యోష. సెర్యోష చాలా సార్లు చూశాడు — తండ్రులు కొడుకులను బుజాలమీద ఎక్కించుకుని నడవడం. కొడుకులు ఠీవిగా, డాబుగా కూచుంటారు తండ్రుల బుజాలమీద. ఎంతో దూరంలో వున్నవన్నీ వాళ్లకి కనబడుతూ వుంటాయి.

''కాళ్లు పీకుతున్నాయి'' అన్నాడు సెర్యోష.

''ఇంకేం వుంది, దగ్గరకొచ్చేశాం. ఒక్కక్షణం ఓపిక పట్టు'' అంది అమ్మ.

కాని సెర్యోష రెండడుగులు ముందుకు పరుగెత్తి కొరొస్తెల్యోవ్ మోకాళ్లు రెండూ పట్టుకున్నాడు.

''పెద్దవాడవయ్యావు, ఎత్తుకొమ్మని బతిమాలుకుందుకు సిగ్గులేదూ నీకు?'' అని కోప్పడింది అమ్మ. కొరొస్తెల్యోవ్ మాత్రం సెర్యోషను బుజంమీద ఎక్కించుకుని నడిచాడు.

సెర్యోషకి కొండమీద కూర్చునట్టే వుంది. తనకి ఒక్కపిసరైనా భయం వేయలేదు: ఇంట్లో వున్న సొరుగుల బీరువానే ఇట్టే సునాయాసంగా కదలించిన మహామనిషి తన్ను ఎంత మాత్రం కింద పడవేయడు. అంత

ఎత్తున కూర్చుంటే ఎంతో దూరంవరకూ అగపడుతుంది, ఎవరి ముంగిట్లో ఎవరేమి చేస్తున్నారో, ఇంటి కప్పులమీద ఏమేమి వుంటున్నాయో – అన్నీ కనబడతాయి: దృశ్యం ఎంతో బాగుంది! సెర్యోష పరవశుడై దారి పొడుగునా ఈ వింతలను చూస్తున్నాడు. తను అలా ఎత్తుగా కూచుని వుండగా – తమంతట తామే స్వయంగా నడుస్తూ తనకు ఎదురుపడిన పిల్లలను తనెంతో గర్వంగా చూశాడు. తనకు కొత్తగా గొప్ప మేలు చేకూరిందనే నిండు మనస్సుతో ఇల్లు చేరుకున్నాడు సెర్యోష.

సైకిలు కొన్నారు

ఈ బుజం మీదనే కూచుని వెళ్లాడు సెర్యోష ఆదివారం – సైకిలు కొనుక్కోడానికని.

ఆదివారం చప్పునే వచ్చేసింది – తను యెదురు చూసినదానికంటె త్వరగానే. ఆదివారం వచ్చిందని తెలిసి సెర్యోష ఇహ జోరుగా ఉద్రేకపడిపోయాడు.

''నువ్వు మర్చిపోలేదు కద?'' అని అడిగాడు సెర్యోష కొరొస్తెల్యోవ్‌ని.

''అబ్బే, నయం ఇంకా! నేనెక్కడేనా మరచిపోతానా!'' అన్నాడు కొరొస్తెల్యోవ్. ''తప్పకుండా వెళ్దాం. చిన్న పని ఒకటుంది – అది చేసుకుని, బయల్దేరుదాం!''

చిన్న పని వుందనడంలో కొరొస్తెల్యోవ్ అబద్ధమాడాడు. అతని కేపనీ లేదు – అమ్మదగ్గర కూచుని, అమ్మతో మాట్లాడ్డమే. ఆ సంభాషణ ఏమిటో తనకేమీ అర్థంకాలేదు, ఏమీ సరదాగా లేదు. కాని వాళ్లిద్దరూ అలా అదేపనిగా మాట్లాడుతూ వుండడం చూస్తే – వాళ్లకి మాత్రం సరదాగానే వున్నట్టు కనబడింది. అందునా అమ్మే చాలాసేపు మాట్లాడింది: ఆ మాట్లాడ్డంలోనూ, అదేదో ఒక్క పదమే – మరెందుకనో నూరు సార్లేనా అని వుంటుంది. ఒకే పదం పదిసార్లు అనడమనే అలవాటును

కొరొాస్తైల్యోవ్ అమ్మదగ్గరనుండి నేర్చుకుంటూన్నట్టుంది. ఈ మాటల పనితో వాళ్లకు ఎప్పుడు విసుగెత్తుతో కదా అనే ఒక్క విషయం గురించే ఏకధ్యానంచేస్తూ, తన లోలోపలనుండి పొంగిపొరలుతూన్న ఉద్రేకాన్ని అణచుకుంటూ సెర్యోష వాళ్ల చుట్టూ తిరుగుతున్నాడు.

''నీకు అన్నీ తెలుసు'' అంది అమ్మ కొరొాస్తైల్యోవ్‌తో, ''నీకు అంతా తెలిసిందని నాకెంతో సంతోషంగా వుంది.''

''మనసు విప్పి చెప్పాలంటే, నిన్ను కలుసుకునే ముందు, దీని గురించి నాకు ఏమంతగా తెలియనే తెలీదు. అంతకుముందు ఎన్నో విషయాలు నాకు తెలిసేవే కావు. అవి నాకెప్పుడు తెలిశాయో – నీకు తెలుసుగా!'' అన్నాడు కొరొాస్తైల్యోవ్.

వాళ్లిద్దరూ ఒకరి చేతులు ఒకరు పట్టుకున్నారు – ఉప్పుల కుప్ప ఆడుకుందుకు సిద్ధంగా వున్నట్టు.

''నేను అప్పట్లో చిన్నదాన్ని'' అంది అమ్మ. ''నాకెంతో ఆనందం అనిపించింది, వెర్రి ఆనందమే. తరువాత – దుఃఖంతో ఇహ చచ్చిపోతాననే అనిపించింది. ఇహ ఇప్పుడనిపిస్తూంది – అదంతా ఒక కల అని....''

చేటల్లాంటి కొరొాస్తైల్యోవ్ చేతుల్లో అమ్మ తన ముఖం పెట్టుకుని, ఆ కొత్త మాటను పాటపాడుతూన్నట్టు పదేపదే అంది.

''కల సుమా, తెలిసింది కదూ? కలగన్నట్టు. కలే అయింది. నిద్రలో కలగన్నాను. ఇహ ఇప్పుడు మేల్కొనేసరికి – నువ్వు....''

ఆమె మాటలకు కొరొాస్తైల్యోవ్ అడ్డొచ్చి:

''నువ్వంటే నా కెంతో ప్రేమ!'' అన్నాడు.

అతని మాట నమ్మకుండా అమ్మ:

''నిజంగానే?'' అని అడిగింది.

''నిజంగా ప్రేమిస్తున్నా'' అని నొక్కిచెప్పాడు కొరొాస్తైల్యోవ్.

అమ్మ ఇంకా నమ్మకుండా, మళ్లీ అడిగింది:

''నిజంగానే ప్రేమిస్తున్నావా?''

''పియొనీర్ మాటంటే నమ్ము'' అనో, లేకపోతే ''తల్లితోడు'' అనో కొరొస్తెల్యోవ్ అనివుండాల్సింది, అలా అనివుంటే అమ్మ తప్పకుండా నమ్మి వుండేది — అని సెర్యోష తన మనసులో అనుకున్నాడు.

జవాబు చెప్పేందుకు కొరొస్తెల్యోవ్‌కి విసుగెత్తింది కాబోలు, జవాబు చెప్పకుండా అమ్మకేసి చూశాడు. మరేమో — అమ్మ అతనికేసి చూసింది. గంటసేపు ఇద్దరూ ఒకరికేసి ఒకరు అలా చూస్తూ కూచున్నారు. తరువాత అమ్మ అంది:

''నువ్వంటే నా కెంతో ప్రేమ.'' (ఆటల్లో అందరూ వరుసగా నిల బడి ఒకే మాట ఒకరి తరువాత ఒకరు చెబుతూంటారే — అలాగ.)

''ఈ సంభాషణ ఎప్పుడు పూర్తి అవుతుందో కదా?'' అనుకున్నాడు సెర్యోష.

పెద్దవాళ్లు మాట్లాడుకుంటూ వున్నప్పుడు తను కలుగజేసుకోవడం తగని పని అనీ, అది వాళ్లు సహించరనీ, వాళ్లకి కోపం వస్తుందనీ, అందువల్ల ఎట్టి ఫలితం అనుభవించాల్సి వస్తుందో చెప్పలేమనీ తనకున్న అనుభవం బట్టి సెర్యోష గ్రహించి వున్నాడు. తను అక్కడ వున్నట్టు వాళ్లకు తెలిసేందుకని, తను అక్కడే వుండి భారంగా ఊపిరితీశాడు.

ఆ యాతన అనుభవించుతూ ఎలాగైతేనేమి కొసవరకూ అక్కడే నిల బడ్డాడు. కొరొస్తెల్యోవ్ అమ్మతో అన్నాడు:

''మర్యాష! నేనిప్పుడే వెళ్లి ఒక గంట, రెండు గంటల్లో వచ్చేస్తాను. సెర్యోష నేనూ ఇదివరకే అనుకున్నాం — ఒక పనిమీద అలా వెళ్దామని.''

కొరొస్తెల్యోవ్ కాళ్లు పొడుగ్గా వుంటాయి. అతని బుజాలమీద కూచుని వెళ్తూంటే — ఆ షాపు ఎక్కడుందో, అది ఎప్పుడొచ్చిందో సెర్యోషకి తెలియేలేదు. సెర్యోషను కొరొస్తెల్యోవ్ ఆటవస్తువుల షాపు దగ్గర దింపేశాడు. ఇద్దరూ కలిసి ఆ షాపు దగ్గరకు వెళ్లారు.

షాపు కిటికీలో బూరె బుగ్గలతో, చిరునవ్వా నవ్వుతూ, అచ్చమైన తోలు జోళ్లు తొడుక్కుని, కాళ్లు ఎడంగా నిగడదన్ని నిలబడి వుంది 'బేబీ' బొమ్మ. నీలిరంగు ఎలుగుబంట్లు ఎర్రని బాజామీద కూచునున్నాయి; పియొనీర్ బాకాలు బంగారంలా మెరుస్తున్నాయి. తనకు త్వరలో కలుగబోయే సంతోషాన్ని తల్చుకునేసరికి సెర్యోషకి ఊపిరి ఆడిందికాదు.... షాపులోనుండి సంగీతం వినబడుతూంది. ఇద్దరూ షాపులోకి వెళ్లారు. ఎవరో ముసలాడు ఒకడు కుర్చీలో కూచున్నాడు. అతడి చేతిలో ఎకార్డియాన్ వుంది, కాని అతడు ఎకార్డియాన్ వాయించడంలేదు. అప్పుడప్పుడు ఎకార్డియాన్ని సాగ దీసి, మళ్లీ కూడదీస్తున్నాడు. అంతే. ఎకార్డియాన్‌లోనుండి తటాలున గుండె బేజారెత్తిపోయేటట్టు పెద్ద మూలుగులాంటి శబ్దం వచ్చి, మళ్లీ వూరుకుంది. షాపు కౌంటరుకు పక్కగా మరొక చోటనుండి మంచి హుషారైన సంగీతం వినబడింది. పండుగరోజు దుస్తులు వేసుకుని నెక్‌టైలు కట్టుకున్న పెద్దవాళ్లు కొందరు కౌంటరు దగ్గర నిలబడి సంగీతం వింటు న్నారు. ముసలి సేల్స్‌మన్ ఒకడు కౌంటరు వెనుక అగపడ్డాడు. ఇతడు కొరొస్తెల్యోవ్‌ని:

''ఏమిటి కావాలండీ మీకు?'' అని అడిగాడు.

''చిన్నపిల్లల సైకిలు'' అని కొరొస్తెల్యోవ్ అతనితో చెప్పాడు.

ముసలి సేల్స్‌మన్ కౌంటరుమీదనుండి వంగి, సెర్యోషకేసి చూసి, ''ట్రైసికిలా?'' అని అడిగాడు.

''ట్రైసికిలొద్దు నాకు....'' అని సెర్యోష భయపడుతూ భయపడుతూ చెప్పాడు.

''వార్య!'' అని కేకేశాడు ఆ ముసలి సేల్స్‌మన్.

అతడి కేక వినిపించుకుని అక్కడకెవ్వరూ రాలేదు. ముసలి సేల్స్‌మన్ సెర్యోష మాట మర్చిపోయాడు — అందరూ నిలబడి వున్న చోటకు వెళ్లి, ఏమిటో చేశాడు. అదేమిటో చేసేసరికి, హుషారు సంగీతం ఆగిపోయి మెల్ల

గానూ విచారంగానూ వున్న సంగీతం వినబడింది. తనూ కొరొొస్తెల్యోవూ ఆ షాపుకి ఎందుకు వచ్చినదీ కొరొొస్తెల్యోవ్ మరచిపోయాడేమో అని సెర్యోషకు గొప్పగా భయం వేసింది; అక్కడున్నవారందరితోనూ కలిసి కొరొొస్తెల్యోవ్ కూడా కదలకుండా మెదలకుండా చూస్తూ అలా నిలబడిపోయి సంగీతం వింటున్నాడు – సెర్యోష ఎంత ఓపికతో అక్కడ కాచుకున్నాడో ఆలోచించనైనా ఆలోచించకుండానూ... సెర్యోష ఓపిక పోయి కొరొొస్తెల్యోవ్ కోటు పట్టుకుని అతణ్ణి గట్టిగా వెనక్కి గుంజాడు. కొరొొస్తెల్యోవ్ అప్పుడు జ్ఞప్తితెచ్చుకుని, నిట్టూర్పుతూ:

''ఎంత దివ్యమైన గ్రామఫోను ప్లేటు!'' అన్నాడు.

''మనకి సైకిలు ఇస్తాడా అతడు?'' అని సెర్యోష బిగ్గరగా అడిగాడు, స్పష్టంగా వినబడేటట్టు.

''వార్య!'' అని ఆ ముసలి సేల్స్‌మన్ కేకేశాడు.

చూడగా – తనకు సైకిలు ముట్టేదీ ముట్టనిదీ వార్యపై ఆధారపడినట్టే అగపడింది సెర్యోషకి. ఎలాగైతేనేం, చిట్టచివరకు అలమారాల మధ్య పొట్టిగా వున్న ద్వారంనుండి వార్య ప్రత్యక్షమైంది – చేగోడీలా గుండ్రంగా వున్న బ్రెడ్డు పట్టుకుని, నోటిలో ఓ బ్రెడ్డు ముక్క నములుతూనూ. రెండుచక్రాల సైకిలు ఒకటి తెమ్మని ముసలి సేల్స్‌మన్ ఆమెను స్టోరుకు పంపించాడు. ''కుర్రవాడి కోసం!'' అని ఆమెతో చెప్పాడు ముసలి సేల్స్‌మన్. ఆ మాట విని, తనను ''కుర్రవాడు'' అన్నాడు కదా అని ఎంతో సంతోషించాడు సెర్యోష.

ఆ స్టోరు ఎక్కడో ప్రపంచం అవతలి కొసను, సప్తసముద్రాలు దాటిన తరువాత ఏ మారుమూల రాజ్యంలోనో వుండివుండాలి నిస్సందేహంగా – ఎందుచేతంటే వార్య ఇప్పటికీ రాలేదు, అప్పటికీ రాలేదు, ఇక ఎప్పటికీ రాదేమో అనిపించింది కూడా. ఆమె మాయమైన తరువాత ఒకాయన ఎకార్డియాన్ ఒకటి కొన్నాడు, కొరొొస్తెల్యోవ్ ఒక గ్రామఫోను కొన్నాడు.

ఇదొక పెట్టె, ఈ పెట్టెలో నల్లగా గుండ్రంగా వున్న పళ్లెం పెడితే, పళ్లెం గిర్రున తిరిగి, మీ కెలాంటి పాట కావలిస్తే అలాంటి పాట — సరదాగా వున్న పాటో, లేకపోతే విచారంగా వున్న పాటో — పాడుతుంది ఆ పెట్టె; ఇలాంటి పెట్టె ఒకటి ఆ కౌంటరుమీద పాడుతూంది. ఆ పెట్టెనీ పెట్టెతో పాటు కాగితపు సంచులలో వున్న పళ్లేలను ఎన్నిటినో, అవేవో సూదుల పెట్టెలు రెండింటినీ కొరొస్తెల్యోవ్ కొన్నాడు.

''ఇవి అమ్మకోసం. వీటిని మనం అమ్మకి కానుకగా ఇద్దాం'' అన్నాడు కొరొస్తెల్యోవ్.

ముసలి సేల్స్‌మన్ అమ్మకాలను ఎలా అజమాయిషీ చేస్తున్నాడో అక్కడున్న వారందరూ దీక్షగా చూస్తున్నారు. అప్పుడు — ప్రపంచం అవతలి కొసనుంచి, సప్త సముద్రాలు దాటిన తరువాత ఏ మారుమూల రాజ్యం నుండో ఓ సైకిలు పట్టుకుని ప్రత్యక్షమైంది వార్య. స్పోక్సు, గంట, హేండిల్‌బార్, పెడల్సు, తోలు శాడిలు, చిన్న ఎర్రని దీపం అన్నీ వున్నాయి ఆ సైకిలుకి. బొమ్మ సైకిలు కాదు, నిజమైన సైకిలు! ఆ సైకిలుకి అప్పుడే వెనుక వున్న మడ్‌గార్డ్‌మీద ఇనుప నంబరు ప్లేటు వుంది — పసుప్పచ్చని ప్లేటుమీద నల్లని అంకెలు కూడా వున్నాయి!

''మీరు మంచి వస్తువు కొన్నారు'' అన్నాడు ముసలి సేల్స్‌మన్. ''హేండిల్‌బార్ తిప్పి చూసుకోండి. గంట వాయించండి. పెడల్సును గిర్రని తిప్పండి — తిప్పండి, మరేం ఫర్వాలేదు. అన్నీ చూసుకోండి! ఏం? ఇది అసలైన సరుకు — ఆషామాషీది ఏమీ కాదు. దీన్ని ఉపయోగించేప్పుడు రోజూ నన్ను తల్చుకుని నాకు ధన్యవాదాలు చెబుతూ వుంటారు మీరు!''

కొరొస్తెల్యోవ్ యథావిధిగా అన్నీ చూసుకున్నాడు — హేండిల్‌బారు ఇటూ అటూ తిప్పాడు, గంట వాయించాడు, పెడల్స్ గిర్రున తిప్పాడు. సెర్యోష మాత్రం ఈ నిక్షేపం అచ్చంగా తనదే కాబోతుందనే సంగతిని నిజంగా

నమ్మలేక, ఇంచుమించు హడిలిపోతూ నోరు సగం వెళ్లబెట్టుకుని, గబగబ ఊపిరితీస్తూ నిలబడ్డాడు.

ఇంటికి చేరుకునీ చేరుకోవడంతో సెర్యోష సైకిలుమీద ఎక్కిపోయాడు, అనగా – చక్కగా మెత్తగా కిందకీమీదకీ ఊపుతూన్న తోలు శాడిలుమీద కూచుని, ఇటూ అటూ కదిలిపోతూన్న హేండిల్‌బారును చేతులతో పట్టుకుని, తను చెప్పినట్టు వినకుండా వాటి చిత్తంవచ్చినట్టూ తన కాలికింద జారిపోతూన్న పెడల్సును దృఢంగా వుంచుకుందుకు ప్రయత్నించాడు. సైకిలు మీద ఎక్కి కూచున్న సెర్యోషను సైకిలుమీదనుండి పడిపోకుండా కొరొస్తెల్యోవ్ వంగి సైకిలు పట్టుకుని పరుగెత్తాడు. ముఖం ఎఱ్ఱబడిపోయి, రొజుకుంటూ పరుగెత్తుతూ ఈ విధంగా అతడు సెర్యోషను గేటువరకూ తీసుకెళ్ళి, అక్కడున్న బెంచిని ఆనుకొని నిలబడిపోయాడు.

''ఇక నీ అంతట నువ్వే నేర్చుకో!'' అన్నాడు కొరొస్తెల్యోవ్ సెర్యోషతో. ''నిన్ను తిప్పి తిప్పి అలసిపోయాను, బాబూ! – చిత్తుగా అలసిపోయాను!''

కొరొస్తెల్యోవ్ ఇంట్లోకి వెళ్లిపోయాడు. జేన్య, లీద, షూర – ముగ్గురూ సెర్యోష దగ్గరకు వచ్చారు.

''కొంతవరకూ నేర్చుకున్నాను నేనప్పుడే!'' అన్నాడు సెర్యోష. ''తప్పుకోండి, లేకపోతే మిమ్మల్ని సైకిలు మట్టేస్తుంది సుమండీ, జాగ్రత్త!''

బెంచి ఆనుకొని, సైకిలుమీద కూర్చున్నవాడల్లా, అక్కడనుంచి సైకిలు తొక్కుకుంటూ వెళ్లిపోవడానికి సెర్యోష ప్రయత్నించాడు, కాని పడిపోయాడు.

''వెధవది పడిపోయింది!'' అన్నాడు సెర్యోష – పెద్ద విశేషమేదీ జరగనట్టు వాళ్లు అనుకోవాలని – సైకిలుకింద పడిపోయినవాడల్లా లేస్తూనూ. ''హేండిలుబారు అటుపక్క తిరిగిందికాదు సరిగ్గానూ. పెడల్సును కాలికింద స్థిరంగా వుంచుకోవడం మహా కష్టం!''

''జోళ్లు విప్పేసుకోరా!'' అని సలహా ఇచ్చాడు జేన్య. ''వుత్తకాళ్లతోనే

నయం, కాలివేళ్లకి పట్టుదొరుకుతుంది. నా కియ్యిరా సైకిలు – నేనెక్కి చూపిస్తాను. ఓ నిమిషం పట్టుకోండ్రా!'' అంటూ జేన్య శాడిలుమీద కూర్చున్నాడు. ''ఒరేయ్! గట్టిగా పట్టుకున్నారా?''

వాణ్ణి ముగ్గురు పట్టుకున్నప్పటికీ, వాడు పడిపోయాడు. వాడితో సహా సైకిలును గట్టిగా పట్టుకున్న సెర్యోష కూడా కింద పడ్డాడు.

''ఇహ, నేను!'' అంది లీద.

''నువ్వు కాదు, నేను!'' అన్నాడు షూర.

''వెధవ దుమ్ము!'' అన్నాడు జేన్య. ''ఈ దుమ్ములో నేర్చుకోలేం. వాస్య సందులోకి వెళ్దాం రండి!''

వాస్య తోట వెనుక వున్న గుడ్డి సందును వీళ్లు వాస్య సందు అంటారు. దీనిలోనుంచి బళ్లు ఏవీ వెళ్లకుండా అడ్డుగా రాళ్లు పాతేసి వున్నాయి. సందుకు ఇటువైపు ఎత్తుగా కంచెగోడ వుంది. కంచెగోడ అవతల కర్రల డిపో వుంది. ప్రశాంతంగా వున్న ఈ సందునిండా పొట్టిగా చుట్టలు తిరిగి వున్న మెత్తని గడ్డి మొలుస్తోంది. పెద్దవాళ్లెవరూ అక్కడకు రారు. అందుచేత అక్కడ హాయిగా ఆడుకోవచ్చు. ఆ గుడ్డిసందు తిమోహిన్‌గారి పెరటి తోటను ఆనుకునే వున్నప్పటికీ, ఇటువైపు వున్న కంచె వెనుకనుండి వాస్య తల్లి, అటువైపునుండి షూర తల్లి – ఇద్దరు ఆడంగులూ సమాన హక్కుతో తమ కుళ్లనీటి బాల్చీలను ఆ సందులో వొంపుతూన్నప్పటికీ – ఆ సందులో ఆడుకుందుకు మొట్టమొదట అడుగుపెట్టినవాడు నిస్సందేహంగా వాస్య అవడంచేత, ఆ సందుకు వాస్య సందు అనేపేరు వచ్చేసింది.

అక్కడకు తీసుకుపోయాడు సైకిలుని జేన్య. లీద, షూరలు ఇద్దరూ సైకిలును నడిపించడంలో సాయంచేస్తూ, సైకిలు తొక్కడం నేర్చుకోవడంలో తొలి వంతు నాది అంటే నాది అని వాళ్లిద్దరూ దారిపొడుగునా తగవులాడుకుంటూనే వున్నారు. వాళ్లిద్దరి వెనుకనూ పరుగెత్తాడు సెర్యోష, సైకిలును అప్పుడప్పుడు మడ్‌గార్డుతో పట్టుకుని.

జేన్య అందరికంటె పెద్దవాడవడంచేత, తొలి వంతు తనదని వాళ్లకి బోధపరిచాడు. వాడి తరువాత లీద నేర్చుకుంది, లీద తరువాత షూర నేర్చుకున్నాడు. ఆఖరుకి సెర్యోష వంతు వచ్చింది. కాని వాడు ఎక్కిన కాస్సేపటికే జేన్య:

''చాలా! దిగు! ఇక నా వంతు!'' అన్నాడు.

సెర్యోషకి ఏమైనా సరే దిగాలనిపించలేదు. సైకిలునుండి దిగకుండా దానిని చేతులతోనూ కాళ్లతోనూ గట్టిగా పట్టుకుని, ''నా కింకా తొక్కాలని వుంది! ఇది నా సైకిలు!'' అన్నాడు.

సెర్యోష అలా అనీ అనడంతో, షూర ''ఒంటెత్తు నాగమ్మా!'' అని సెర్యోషని తిట్టాడు.

లీద ఊరుకోకుండా ''ఒంటెత్తు నాగమ్మా! ఒంటిపిల్లి రాకాసీ!'' అని మరొక మాట కూడా జోడించి, అందరికీ వినబడాలని పెద్దగొంతుక పెట్టు కొని గట్టిగా అరచింది.

ఒంటెత్తు గుణాలుంటే నిజంగా సిగ్గుపడాల్సి వుంటుందనే సంగతి సెర్యోషకి తెలుసు; సెర్యోష మారుమాటాడకుండా సైకిలు దిగిపోయి, తిమోహిన్ గారి కంచెదగ్గరకెళ్లి, కంచెవైపు తిరిగి, ఏడుస్తూ అక్కడ నిలబడిపోయాడు. ఆ తిట్లు విని తనకెంతో అవమానమనిపించి, ఏడుపొచ్చేసింది; తన హక్కును తను నిలబెట్టుకోలేకపోయాడు, అందుకని కూడా ఏడుపొచ్చింది. అంతేకాదు — ఆ నిమిషంలో ప్రపంచంలో వున్న వస్తువులన్నిటికంటె సైకిలే తనకు అత్యవసరమనిపించింది — ఈ విషయాన్ని వాళ్లు ఏమీ అర్థంచేసుకున్నారుకారు, మీదుమిక్కిలి వాళ్లు మోటుమనుషులూ, బలమైనవాళ్లూనూ!

సెర్యోష కంచెవైపు తిరిగిపోయి ఏడుస్తూన్నప్పటికీ, వాళ్లు ముగ్గురూ వాడికేసి చూడనైనా చూడలేదు. వాళ్లు గట్టిగా దెబ్బలాడుకోవడమూ, గంట వాగడమూ, సైకిలు కిందపడిపోయినట్టు కణేలుమని చప్పుడవడమూ సెర్యోషకి వినబడ్డాయి. ''ఇహ నువ్వెక్కరా!'' అని వాడినెవ్వరూ పిలవలేదు,

వాడితో ఎవ్వరూ మాట్లాడలేదు. వాళ్లు ముగ్గురూ అప్పుడే మూడుసార్లు ఎక్కారు! మరి తనేమో అక్కడ నిలబడి ఏడుస్తున్నాడు! సరిగా ఆ సమయానికి వాస్య కంచెదగ్గర ప్రత్యక్షమయాడు.

ఒంటిమీద షర్టులేకుండా, తనకు పొడుగైపోయిన పంట్లాం తొడుక్కొని, నడుముకు తోలుపటకా బిగించుకుని, టోపీ చూరు మెడవైపు తిప్పి పెట్టుకుని నిలబడ్డాడు వాస్య – ఇతరులపైన బలమైన ప్రభావం కలిగించే వ్యక్తి! కంచెమీదనుంచి ఒక్క నిమిషమే చూశాడు – పరిస్థితి అంతా చప్పున గ్రహించేశాడు వాస్య.

''ఏయ్!'' అని కేకేశాడు. ''ఏమిట్రా ఆ పని? సైకిలు ఎవరిది – మీదా, వాడిదా? వెళ్లి, నీ సైకిలు తీసుకోరా, సెర్యోష!''

వాస్య కంచె గెంతేసి వచ్చి, తన బలమైన చేతులతో సైకిలు హేండిల్ బారు పట్టుకున్నాడు. జేన్య, లీద, షూర అక్కడనుండి మెల్లగా జారుకున్నారు. తన మోచేతులతో కన్నీళ్లు తుడుచుకుంటూ సెర్యోష అక్కడకు వచ్చాడు. లీద కీచుగా అరచింది:

''ఇద్దరు ఒంటిపిల్లి రాకాసులు!''

''నువ్వేమో రాక్షసివి!'' అని జవాబుచెప్పాడు వాస్య. ఇంకా మరో తిట్టుమాట కూడా అన్నాడు వాస్య. ''చిన్నపిల్లడు నేర్చుకునే వరకూ ఉండలేకపోయారు మీరు!'' అన్నాడు. అలా అని, వాస్య సెర్యోషకేసి తిరిగి, ''సైకిలుమీద కూచో!'' అన్నాడు.

సెర్యోష సైకిలుమీద కూచున్నాడు. సైకిలు తొక్కడం చాలాసేపు నేర్చుకున్నాడు. కడమవాళ్లందరూ వాడికి సాయంచేశారు కూడా, ఒక్క లీద తప్ప. లీద గడ్డిలో కూర్చుని, డాండిలయన్ పువ్వులతో దండ అల్లుతూంది, సైకిలు తొక్కడంకంటె ఆ పనిమీదనే తనకి హెచ్చు సరదా వున్నట్టు నటిస్తూ. వాస్య తరువాత సెర్యోషతో ''ఇహ, నేను'' అన్నాడు. సెర్యోష ఒక్క నిమిషమైనా వెనుకతీయకుండా సంతోషంతో సైకిలు దిగి

పోయి, దానిని వెంటనే వాస్యకి ఇచ్చేశాడు. వాస్య తొక్కిన తరువాత మళ్ళీ సెర్యోష ఎక్కి, మరొకరి సహాయం లేకుండానే తనంతట తనే, ఇంచు మించు పడిపోకుండానే, తొక్కేడు. కాని సైకిలు ఇటూ అటూ వూగి పోయింది, సెర్యోష అదాటుగా పడిపోయాడు: కాలు చక్రంలో పడిపోయింది, వాల్చు వూచలు విరిగిపోయాయి. కాని మరేమీ ఫర్వాలేకుండానే సైకిలు నడిచింది. కాస్సేపయాక, కడమవాళ్లను చూసి, సెర్యోష జాలిపడి, ''వాళ్లని కూడా తొక్కమందాం. ఒక్కొక్కరం ఒక్కొక్కమాటు తొక్కుదాం'' అన్నాడు.

చివరకు పాష అత్తయ్యకి సెర్యోష వీధిలో ఏడుస్తూండడం వినబడింది. ఆమె ముంగిట్లోకి వెళ్లింది – గేటు తలుపు తెరిచి పిల్లలందరూ గుంపుగా లోపలికొచ్చారు. అందరికంటె ముందు సెర్యోష వచ్చాడు, వాడి చేతిలో సైకిలు హేండిల్‌బారు వుంది; వాడివెంట వచ్చాడు వాస్య, సైకిలు ఫ్రేము పట్టుకుని; జేన్య రెండు చక్రాలు పట్టుకున్నాడు. తరువాత లీద గంట పట్టుకుని వచ్చింది; ఇక చిట్టచివరకు ఒక కట్ట వూచలు పట్టుకుని సగం సగం అడుగులు వేసుకుంటూ షూర వచ్చాడు.

''అరె భగవంతుడా!'' అంది పాష అత్తయ్య.

షూర మంద్రస్వరంతో అన్నాడు:

''ఇది వాడి పనే. వాడి కాలు చక్రంలో పడిపోయింది.''

ఇంతట్లో కొరొస్తెల్యోవ్ అక్కడకు వచ్చి, అదంతా చూసి ఆశ్చర్య పడ్డాడు.

''గొప్పపని చేశార్లెండి మీరందరూ కలిసి!'' అన్నాడు కొరొస్తెల్యోవ్.

సెర్యోష గట్టిగా ఏడ్చాడు.

''ఏడవకు, మరేం ఫర్వాలేదులే. నేను మరమ్మతు చేయిస్తానుగా'' అని కొరొస్తెల్యోవ్ ఖరారుచేశాడు. ''వర్కుషాపులో ఇద్దాం – మళ్లీ కొత్తగా చేసి ఇచ్చేస్తారు.''

సెర్యోష ఏమీ అనకుండా చెయ్యి దులిపేసి, పాష అత్తయ్య గదిలోకి

వెళ్ళిపోయాడు: తనను ఓదార్చడానికని అంటాడు కొరొాస్తెల్యోవ్ పూరికేనూ, అంతేగాని ఈ ముక్కల్ని మళ్ళీ వెనుకటి అందమైన సైకిలు మోస్తరుగా చెయ్యడం ఎవడి తరం? ట్రింగ్ ట్రింగ్‌మని గంట వాగుతూ, తళతళ పూచలు మెరుస్తూ, రంయ్ రంయ్‌మని పరుగెత్తిన సైకిలు మోస్తరుగా? ఎంత మాత్రం, ఎంత మాత్రం వీలుండదు! అంతా గోవిందా అయిపోయింది, అంతా! — అని అనుకున్నాడు. ఆ రోజంతా అలా మనోవ్యాధి పెట్టుకుని నీరసపడిపోయాడు సెర్యోష. కొరొాస్తెల్యోవ్ సెర్యోష కోసమని ప్రత్యేకమూ గ్రామఫోను పెట్టేవాడు — ఆ గ్రామఫోను వినడానికైనా బుద్ధిపుట్టలేదు సెర్యోషకి.

"తీగెలు ఝుంకరించాయీ; పాడాయీ
ఇట్టి వేడుకెన్నడు చూడలేదోయీ"

అని గ్రామఫోను రికార్డు మోత వీధి అంతా వినబడుతూంది. సెర్యోష మాత్రం గ్రామఫోను విన్నాడే గాని, పట్టించుకోలేదు, తన సైకిలు గురించే ఆలోచిస్తూ విచారంతో తలకాయ వూపాడు.

...మీరు ఏమనుకున్నారో గాని — సైకిలు నిజంగానే మరమ్మతయి, అచ్చంగా కొత్తదానిలా అయిపోయి వచ్చేసింది. కొరొాస్తెల్యోవ్ వూరికనే ఖరారు చేయలేదు, తన మాట నిలుపుకొన్నాడు! "యాస్ని బేరెగ్" వ్యవసాయ క్షేత్రంలో మెకానిక్కులు దాన్ని మరమ్మతుచేశారు. వాళ్ళు మాత్రం ఒకటన్నారు: పెద్ద కుర్రాళ్ళు ఆ సైకిలుమీద ఎక్కకూడదు, ఎక్కితే మాత్రం మళ్ళీ విరిగి వూరుకుంటుందన్నారు. ఆ మాట విని, వాస్య, జేన్య మరి ఆ సైకిలు ఎక్కలేదు. సెర్యోష ఒక్కడే అప్పట్నుంచి ఎక్కేవాడు, షూర కూడా ఎక్కేవాడు. అవును, లీద కూడా ఎక్కేది, పెద్దవాళ్ళకి తెలియకుండా. ఐతే, లీద సన్నంగా వుంటుంది, ఏమంత బరువే వుండదు — పోనీ లీదని కూడా ఎక్కనివ్వొచ్చు.

సైకిలు తొక్కడం భేషుగ్గా నేర్చేసుకున్నాడు సెర్యోష — దిబ్బమీదనుంచి దిగుతూన్నప్పుడు హేండిల్‌బారు వదిలేసి, చేతులు రెండూ గుండెలమీద కట్టేసుకుంటాడు — గొప్ప సైక్లిస్టు ఒకడు ఆ ఫీటు చెయ్యడం తను చూశాడు, ఇప్పుడు తను కూడా అలా తొక్కేస్తున్నాడు. ఐనప్పటికీ — అదే మిటోగాని — సైకిలు కొన్న తరువాత, ఆ తొలి గంటల్లో తను అనుభవించిన అంతులేని ఉత్సాహం మరిప్పుడు లేదు తనకి.

మరి నాలుగు రోజులయే సరికి సైకిలంటే విసుగెత్తిపోయింది సెర్యోషకి. ఎర్రని దీపమూ, వెండిలాంటి గంటా, వీటితో అందంగా కొత్త దానిలా వున్న ఆ సైకిల్ని — కడమ తన అన్ని ఆటవస్తువులతోపాటూ కొట్టు గదిలో పడేశాడు. ఎక్కడకు వెళ్లినా నడచే వెళ్లేవాడు — అంత అందంగా వున్న ఆ సైకిలువైపు చూడనైనా చూసేవాడు కాదు: విసుగెత్తిపోయింది. ఇక చేసేదేమీ లేదు, అంతే మరి.

కొరొస్తెల్యోవ్‌కూ ఇతరులకూ తేడా ఏమిటి?

పెద్దవాళ్లు మాట్లాడుతూన్నప్పుడు ఎన్నో అనవసరపు మాటలు మాట్లాడుతూ వుంటారు! ఉదాహరణకు, సెర్యోష టీ తాగుతూ టీ ఒలుకపోశాడు; పాష అత్తయ్య అంది, ''ఏమిటా అజాగ్రత్త! రోజుకొక కొత్త టేబిలుగుడ్డ ఎక్కణ్ణుంచి తీసుకొచ్చేదిరా నీకోసమని? మరీ చంటిపిల్లాడవైపోతున్నావు, చూడగా!''

సెర్యోష అభిప్రాయంలో ఆ మాటలన్నీ అనవసరమే. ఎందుకంటే, మొదటి విషయం: అచ్చంగా ఈ మాటలే నూరు సార్లు విన్నాడిదివరకు సెర్యోష. రెండోది: ఆమె ఆ మాటలు అనకముందే తనది పొరపాటని తనకి తెలుసును.

ఒలికిపోయిన వెంటనే తను గ్రహించుకున్నాడు, గ్రహించుకుని తనే చీకాకు పడ్డాడు. ఎవ్వరూ చూడకముందే ఆ టేబిలుగుడ్డను అక్కడ్నుంచి తీసి వెయ్యాలని తనకు ఎంతో అనిపించింది. అలాంటిది – ఆమె వూరకే పదేపదే అంటుంది "నువ్వు ఒక్కసారైనా ఆలోచించవు కదా – అయ్యో ఈ టేబిలు గుడ్డను ఎవరో ఉతికారే గంజిపెట్టారే, ఇస్త్రి చేశారే, ఇంత శ్రమ పడ్డారే అని...."

"నేను ఒలకపొయ్యాలని ఒలకపోయలేదు. టీ కప్పు చేతులోనుంచి జారి పోయింది" అన్నాడు సెర్యోష.

"టేబిలుగుడ్డ పాతదైపోయింది" అని చెప్పకుపోయింది పాష అత్తయ్య వూరుకోకుండానూ. "సాయంకాలమంతా కూచుని దానికెలాగో రప్పతీసి కుట్టాను, ఎంతో కష్టపడ్డాను."

టేబిలుగుడ్డ గనుక కొత్తదే అయివుంటే, దానిమీద టీ ఒలుకబోసినా ఫర్వాలేదన్నట్లు!

పాష అత్తయ్య చివరకి కోపంగా అంది:

"పైపెచ్చు ఒలకపొయ్యాలని ఎవరేనా ఒలకపోస్తారా ఏమిటి? ఎవ్వరూ ఒలకపొయ్యరు!"

ఏ వస్తువునైనా తను పొరపాటున కింద పడవేసినప్పుడు, సెర్యోషను అందరూ ఇలాగే అంటారు. మరి వాళ్లే గనుక ఏ గ్లాసునో ఏ పళ్లెన్నో పడవేస్తారా – ఏమీ అనరు, దానిని పడవేయడమే అవసరమైనట్టు.

ఇటువంటిదే మరొకటి: తను ఏది అడిగినా ఏది చేసినా, "దయచేసి" అనే మాట తను అంటూండాలని అమ్మ తనకు నూరి పోస్తూ ఉంటుంది – ఇంతకీ ఈ మాటకి అర్థంలేదాయె!

"దాని అర్థం: 'నా కోరిక మన్నించండి' అని. పెన్సిలు కావాలని నువ్వు నన్ను అడుగుతావు; అలా అడిగినప్పుడు మర్యాద సూచకంగా 'దయచేసి' అనే మాట కూడా చేర్చాలి" అని అమ్మ బోధపరచింది.

''మర్రైతేనూ – పెన్సిలు ఇయ్యి'' అని నిన్ను అడిగినప్పుడు, నాకు పెన్సిలు కావాలనే సంగతి నీకు అర్థంకాదా?'' అని అడిగాడు సెర్యోష.

''అర్థం అవుతుంది. కాని 'దయచేసి' అనే మాట లేకపోతే, అది అమర్యాదగా వుంటుంది, మోటుతనం అనిపించుకుంటుంది. 'పెన్సిలు ఇయ్యి!' అంటే ఎలా వుంటుంది? మోటుగా వుండదూ? 'దయచేసి పెన్సిలు ఇయ్యి' అంటే ఎంతో మర్యాదగా వుంటుంది, అప్పుడు నేను సంతోషంతో ఇస్తాను.''

''అలా అనకపోతే – సంతోషంలేకుండా ఇస్తావు, అంతేనా?''

''అసలు ఇవ్వనే ఇవ్వను!'' అంది అమ్మ.

''సరే అలాగే అంటాను'' అనుకున్నాడు సెర్యోష తన మనసులో, పెద్దవాళ్లందరితోనూ 'దయచేసి' అనే అడుగుతూంటాను. వాళ్లలో కొందరు పట్టుదల మనుషులుంటారు, వాళ్లు చిన్నపిల్లలమీద అధికారం చలాయిస్తూ వుంటారు; 'పెన్సిలు ఇవ్వండి' అని వాళ్లను అడిగినా – వాళ్ల చిత్తంవుంటే ఇస్తారు, లేకుంటే ఇవ్వనే ఇవ్వరు.''

అయితే కొరొస్తెల్యోవ్ ఇలాంటి వుత్తుత్త మాటలు గురించి పట్టించుకోనే పట్టించుకోడు – సెర్యోష అతనిని ఏదైనా అడిగినప్పుడు ''దయచేసి'' అని అన్నా, అనకపోయినా అతను లెక్క చేయడు.

మరి – సెర్యోష తన మూల కూర్చుని ఆడుకుంటూ, ఆటలోనుంచి తననెవ్వరూ పిలవకూడ దనుకుంటాడు. లుక్యానిచ్ మామయ్యలాగ పిచ్చి మాటలు చెప్పి, కొరొస్తెల్యోవ్ ఎన్నడూ తనను ఆటనుండి పిలిచి, ఆటకు భంగం కలిగించడు. లుక్యానిచ్ మామయ్య పనినుండి ఇంటికి వచ్చేసరికి, సెర్యోష ఎంతగా ఆటలో మునిగిపోయి వున్నప్పటికైనా సరే, తనను పిలిచి: ''ఒరేయ్, దా! ఇలా దా, నాదగ్గరకి, నిన్ను ముద్దుపెట్టుకుంటాను – దా!'' అని తెలివితక్కువ మాటలాడుతాడు. తనను పిలిచి ముద్దుపెట్టుకుని, చాకలేట్లో ఆపిల్ పండో ఇస్తాడు – ముద్దుపెట్టుకుంటూన్నప్పుడు, బిరుసుగా

వున్న గడ్డం తనకు గుచ్చుకుంటుంది. ఆపిల్‌పండు ఇచ్చినందుకు వందనలు, కాని ముద్దుపెట్టుకుందుకు ఏమంత పెద్ద అవసరం? ఆటలో వున్నవాణ్ణి ఆట పాడుచేసుకుని పిలవడమెందుకు? ఆటకంటె ఆపిల్‌పండు ముఖ్యమా ఏమిటి? తరువాత సెర్యోష ఎలాగూ ఆపిల్‌పండు తినసే తింటాడాయె.

కొత్తవాళ్లెవరెవరో ఇంటికి వస్తూ వుంటారు — వారిలో చాలామంది కొరొస్తెల్యోవ్ కోసమే వస్తూ వుంటారు. అందరికంటె తరుచుగా తోల్యా మామ వస్తూవుంటాడు. అతను కుర్రవాడు, అందంగా వుంటాడు, రెప్ప వెంట్రుకలు పొడుగ్గా నల్లగా వుంటాయి, తెల్లని పల్వరస, బిడియపడు తూన్న చిరునవ్వు. తోల్యా మామ పద్యాలు అల్లుతాడని అతనంటే సెర్యోషకి ఎంతో గౌరవమూ ముచ్చటానూ. తను కొత్తగా రాసిన పద్యాలు చదవమని అతణ్ణి అడిగేసరికి — మొదట సిగ్గుపడుతూ చదవనంటాడు, తరువాత తను కూచున్న చోటనుండి లేచివచ్చి, గదిలో ఒక పక్కను నిలబడి, కంఠతః చదువుతాడు. అతడు పద్యం రాయని విషయమే వుండదు — ఎన్నిటిమీదో రాశాడు: యుద్ధంమీద, శాంతిమీద, సమష్టి క్షేత్రంమీద, ఫాసిస్టులమీద, వసంతంమీద, మరింకా — అదెవరో ఒక స్త్రీమీద — నీలిరంగు కళ్లున్న స్త్రీమీద — ఆమె కోసం తను అలా ఎల్లప్పుడూ, ఎల్లప్పుడూనూ, కాసు కునే వుంటాడట, కాని ఆమెను కలుసుకోవడమంటూ ఎన్నడూ వుండదట. పద్యాలు గొప్పగా వుంటాయి! ఎంతో ఇంపుగానూ ధారాళంగానూ వుంటాయి — పుస్తకాల్లో వున్న పద్యాల్లానే. తోల్యా మామ పద్యాలు చదివేటప్పుడు, గొంతుక సవరించుకుని, పొడుగ్గా వున్న తన జుట్టును చేతితో వెనక్కి తోసుకుంటాడు; ఇకప్పుడు బిగ్గరగా చదువుతాడు, సరంబీకేసి చూస్తూనూ. అతణ్ణి అందరూ మెచ్చుకుంటారు, అమ్మ అతనికి మళ్లీ టీ ఇస్తుంది. ఇక తరువాత పశువుల రోగాలగురించి మాట్లాడుకుంటారు. తోల్యా మామ ''యాస్ని బేరెగ్'' ప్రభుత్వ క్షేత్రంలో పశువులకు మందులిస్తూంటాడు.

ఐతే — ఆ యింటికి వచ్చేవాళ్లందరూ అంత సరదా అయినవాళ్లూ

అంత ఇంపైనవాళ్లు కారు. ఉదాహరణకు పేత్య మామను సెర్యోష తప్పించుకుని తిరిగేవాడు: అతని ముఖం చూసేందుకే సెర్యోషకి గిట్టేది కాదు, వసివాడిపోయిన రోజారంగు తలకాయ, సెల్యులాయిడ్ బంతిలా నున్నని బట్టతల. అతని నవ్వు — "హి — హి — హి" అంటూ అసహ్యంగా వుంటుంది. ఒకనాడు పేత్య మామ, అమ్మ ఇద్దరూ వరండాలో కూర్చు న్నారు — కొరొాస్తెల్యోవ్ ఇంట్లో లేడు. తనను పేత్య మామ పిలిచి, చాకలేట్టు ఇచ్చాడు. అది పెద్ద చాకలేట్టు — "మిష్కా" ఎలుగ్గొడ్డు మార్కా చాకలెట్టు, అవి ఎప్పుడోకాని దొరకవు. సెర్యోష చాకలేట్టు అందుకుని, "ధన్యవాదాలు!" అని మర్యాదగా చెప్పి, దానికి చుట్టివున్న కాగితం విప్పి, చూసేసరికి అందులో ఏమీ లేదు. అతణ్ణి తను నమ్మాడనే అని తనని చూసుకునీ, మోసం తలపెట్టాడే అని పేత్య మామను చూసీ సెర్యోష సిగ్గుపడిపోయాడు. అతణ్ణి అమ్మ కూడా నమ్మిందనీ, అందుకు అమ్మ కూడా సిగ్గుపడిందనీ సెర్యోష గమనించాడు.

"హి — హి — హి — హీ!" అని నవ్వాడు పేత్య మామ.

సెర్యోష కోపమేమీ లేకుండా, విచారపడుతూ అడిగాడు:

"పేత్య మామ! నువ్వు బుద్ధిలేనివాడివా?"

అమ్మ అభిప్రాయం కూడా అంతే అని సెర్యోష పూర్తిగా నమ్మాడు. కాని ఆమె చర్రున కేకేసింది:

"ఏమిటా మాటలు? తక్షణం క్షమాపణ అడుగు!"

తను ఆశ్చర్యంతో అమ్మకేసి చూశాడు.

"నేనన్నది వినిపించిందా నీకు?" అని అడిగింది అమ్మ.

తను మాటాడకుండా వూరుకున్నాడు. అమ్మ సెర్యోషని చేయిపట్టుకుని గదిలోనుంచి తీసుకెళ్లిపోయి "నాదగ్గరకి రావద్దు: ఆ రౌడీతనం మానుకునే వరకూ నీతో నేను మాట్లాడను!" అంది.

తల్లి కొంతసేపు అలా కనిపెట్టుకుని నిలబడింది. సెర్యోష పశ్చాత్తాప

పడి క్షమాపణ వేడుకుంటాడని. సెర్యోష మూతి ముడుచుకుని కళ్ళు కిందకి దించేసుకుని, విచారంగా నిరుత్సాహంగా అలా నిలబడ్డాడు. తనలో తప్పేమీ లేదనిపించింది తనకి: అలాటప్పుడు ఎందుకని తను క్షమాపణ వేడుకోవాలి? తన మనస్సులో వున్న మాట పేత్య మామతో చెప్పాడు సెర్యోష.

తల్లి అక్కడనుండి వెళ్ళిపోయింది. సెర్యోష తన బొమ్మలు పెట్టుకుని తనమటుకు తనే ఆడుకున్నాడు. జరిగినది మరచిపోయేందుకు తన సహజ జ్ఞానంతో ప్రయత్నించాడు. తన సన్నని చిన్నివేళ్ళు గజగజ వణకాయి. అంచులవెంట కత్తిరించిన చీట్లపేక బొమ్మలతో ఆడుకుంటూ వుండగా, అనుకోకుండా నల్లని రాణీ తలకాయి మణగిపోయి వూడివచ్చేసింది.... ఆ బుద్ధిలేని పేత్య మామను అమ్మ ఎందుకు వెనకేసుకొచ్చింది? ఏమీ జరగ నట్టు అమ్మ అక్కడ కూచుని అతగాడితో నవ్వుతూ కబుర్లుచెబుతూంది; మరి — తనతో మాట్లాడేందుకేమో తనకిష్టంలేదంది....

జరిగిన కథంతా కొరొస్తెల్యోవ్‌తో సాయంకాలం అమ్మ చెప్పడం సెర్యోష విన్నాడు.

''సెర్యోష సరిగ్గానే అన్నాడు. దీనినే అంటారు న్యాయమైన విమర్శ అని'' అన్నాడు కొరొస్తెల్యోవ్.

''ఐతే కావచ్చు. కాని పెద్దవాళ్ళను చిన్నపిల్లలు విమర్శించొచ్చా?'' అని అమ్మ అభ్యంతరం చెప్పింది. ''చిన్నపిల్లలు పెద్దవాళ్లను ఏకేస్తూంటే — ఇహ వాళ్లకి మనం బుద్ధులు నేర్పగలమా? చిన్నపిల్లలు పెద్దవాళ్లను గౌరవించాలి.''

''నిజమే, కాని ఇలాంటి దద్దమ్మల్ని గౌరవించక్కర్లేదు'' అన్నాడు కొరొస్తెల్యోవ్.

''గౌరవించడం విధాయకం. పెద్దవాళ్లు కూడా దద్దమ్మలైతే కావచ్చు ననే ఆలోచన వాడి బుఱ్రలో పుట్టకూడదు. పేత్యకి వచ్చినన్నేళ్లు వీడికీ రానీ — అప్పుడు వీడు విమర్శించొచ్చు కావలిస్తే'' అంది అమ్మ.

''నా ఉద్దేశంలో – పేత్యకికంటె వీడికే హెచ్చు బుద్ధి వుంది – ఈ వేళే కాదు, ఎన్నాళ్లనుంచో! బుద్ధిలేనివాణ్ణి బుద్ధిలేనివాడని అన్నందుకు ఏ బోధనాశాస్త్రం ప్రకారం శిక్షించకూడదు.''

సెర్యోషకి 'విమర్శ', 'బోధనాశాస్త్రం' అనే మాటలు అర్థంకాలేదు, కాని 'బుద్ధిలేనివాడు' అనే మాట తనకు తెలిసి వుండడంవల్ల, ఈ మాటే కొరొొస్తెల్యోవ్ కూడా అన్నందువల్ల అతడికి సెర్యోష తన మనస్సులో ఎంతో కృతజ్ఞత చెప్పుకున్నాడు.

కొరొొస్తెల్యోవ్ ఎంతో మంచివాడనీ, అతడు ఇంతకు ముందునుండే సెర్యోష దగ్గర వుండకుండా నాస్త్య అవ్వతోనూ ముత్తవ్వతోనూ కలిసి వుండడమూ ఏదో ఆగంతుకునిలా అరుదుగా మాత్రమే అమ్మనూ తననూ చూడ్డానికి వస్తూవుండడమూ తల్చుకునే సరికి ఎంతో వింతగా వుందనీ సెర్యోషకు అనిపించింది.

అతడు సెర్యోషను తనతో ఏటికి తీసుకువెళ్లుతూ వుంటాడు. తీసుకెళ్లి ఈత నేర్పుతాడు. అమ్మకేమో భయం – సెర్యోష ఎక్కడ మునిగిపోతాడో అని. అమ్మ అలా అన్నప్పుడల్లా కొరొొస్తెల్యోవ్ నవ్వుతాడు. సెర్యోష పడుకునే చిన్న మంచానికి మంచంమీదనుండి దొర్లి పడిపోకుండా వుండేందు కని ఇటూ అటూ తీగతో అల్లిన జాలు వుంది. కొరొొస్తెల్యోవ్ ఆ జాలు తీసిపారేశాడు. సెర్యోష నిద్రలో దొర్లిపడిపోయి ఎక్కడ దెబ్బలు తగిలించు కుంటాడో అని తల్లి భయపడింది. కాని కొరొొస్తెల్యోవ్ అన్నాడు:

''ఇహ రేప్పొద్దున్న రైల్లో ప్రయాణం చెయ్యాల్సొస్తే అప్పుడు? పైనున్న తొట్టెలో పడుకుంటాడా? పెద్దాళ్లకుమల్లేనే వాణ్ణి అలవాటు చేసుకోనివ్వాలి.''

ఈ రోజునుండి రాత్రి పడుకోబోయేటప్పుడూ, పొద్దున్న లేచేటప్పుడూ తను ఇక మంచానికున్న జాలు ఎక్కక్కర్లేదు, దిగక్కర్లేదు. పెద్దవాళ్లల్లా

గానే – మంచం అంచుమీద కూర్చునే బట్టలు మార్చుకోవచ్చు, మంచం మీదకెళ్లిపోయి పడుకోవచ్చు, చప్పున మంచంమీదనుండి లేచిపోవచ్చు.

ఒకనాడు రాత్రి తను నిద్రలో మంచంమీదనుండి కిందకి దొర్లిపోయాడట; తను పడిపోవడం వినబడి, తనను మళ్లీ మంచంమీద పడుకోబెట్టారట. పొద్దున్న లేచిన తరువాత, తను రాత్రి మంచంమీదనుండి దొర్లి పడిపోయినట్టూ, తనకేమీ కానట్టూ తనతో చెప్పారు. తను పడిపోయినట్టు తనకు తెలియనే తెలియదు, తనకు దెబ్బ ఏదీ తగలనూ లేదు. అసలు తనకు ఏ దెబ్బా తగలనప్పుడూ, తనకు తెలియనప్పుడూ దానిగురించి చెప్పనే అవసరంలేదు, అది లెక్కలోకి రానేరాదు.

ఇలాగే ఒక సారి గుమ్మంలో పడిపోయాడు సెర్యోష. పడిపోవడంలో మోకాలు బాగా చెక్కుకుపోయి రక్తం కారింది. ఏడుస్తూ ఇంటికొచ్చాడు. పాష అత్తయ్య అది చూసి, గాభరాపడిపోయి, కేకపెట్టి, బ్యాండేజీ కోసం పరుగెత్తింది. కొరొస్తెల్యోవ్ అన్నాడు ''దెబ్బ తగిలిందిటోయ్? దానికేంలే, ఇప్పుడే పోతుంది! మరి – నువ్వే యుద్ధంలో వున్నావనుకో, నీకు దెబ్బ తగులుతుంది – అప్పుడేం చేస్తావు?...''

''మరి, నీకు యుద్ధంలో దెబ్బతగిలినప్పుడు – నువ్వు ఏడ్చావా?'' అని అడిగాడు సెర్యోష.

''నేను ఏడ్చాననే అనుకో – నా కామ్రేడ్లందరూ నన్ను చూసి నవ్వరూ? తప్పకుండా నవ్వుతారు. మనం – మొగాళ్లం. ఇటువంటిది మన పని.''

సెర్యోష ఏడవడం మానివేసి: ''హ – హ – హా!'' అని గట్టిగా నవ్వాడు – తన పౌరుషం చూపేందుకు. ఇంతట్లోకి పాష అత్తయ్య బ్యాండేజీ తీసుకొచ్చి, కట్టుకట్టేందుకు సిద్ధమయేసరికి, సెర్యోష ''కట్టు కట్టేయ్, భయపడకు! నాకు నొప్పి ఏమీ లేదు'' అన్నాడు ధైర్యంగా.

సెర్యోషతో కొరొస్తెల్యోవ్ యుద్ధం గురించి చెప్పాడు. అప్పటినుంచి తను బల్ల దగ్గర కొరొస్తెల్యోవ్ పక్క ఎప్పుడు కూర్చున్నా సెర్యోష

సగర్వంగా మనసులో అనుకునేవాడు: యుద్ధం గనుక వచ్చిందంటే, యుద్ధం లోకి ఎవరు వెళ్తారు? కొరొస్తెల్యోవ్వూ, నేనూ — మేమిద్దరం. ఇటువంటి దంతా మా పని. మరి — అమ్మ, పాష అత్తయ్య, లుక్యానిచ్ మామయ్య ఇంటిదగ్గర వుంటారు. మేం యుద్ధంలో గెల్చుకుని వచ్చేవరకూ మాకోసం వాళ్లు కనిపెట్టుకుని వుంటారు — అటువంటిదంతా వాళ్ల పని.

జేన్య

జేన్యకి తల్లితండ్రులు లేరు, పెత్తల్లి దగ్గరా అక్క దగ్గరా వుంటు న్నాడు. అక్క తన తోబుట్టువు కాదు పెత్తల్లి కూతురు. అక్క రోజంతా పనిచేస్తుంది, సాయంకాలం ఇస్త్రీ చేస్తుంది. తన గౌన్లు తనే ఇస్త్రీ చేసు కుంటుంది. ముంగిట పెద్ద ఇస్త్రీపెట్టె పెట్టుకుని హడావడి పడుతూ వుంటుంది. ఆ ఇస్త్రీపెట్టెలో బొగ్గులు ఎర్రగా కాల్తూవుంటాయి. ఆమె ఇస్త్రీపెట్టెను వూదుతూ వుంటుంది. అది బాగా వేడిగా వుందో లేదో చూడ్డానికని దానిమీద ఉమ్ముతుంది, దానిలో నిప్పు ఇంకా బాగా రాజు కోవాలని దానికి సమొవార్ గొట్టం తగిలించుతుంది. జుట్టు వుంగరాలు చుట్టుకోవాలని జుట్టు పాయలను చిన్నచిన్న గొట్టాల్లో చుట్టబెట్టి వుంచు తుంది.

గౌను ఇస్త్రీచేసి, దాన్ని డాబుగా తొడుక్కుని జుట్టు సింగారించుకుని, టౌన్‌హాల్‌కి వెళ్తుంది — డాన్సుచేయడానికని. మర్నాడు సాయంకాలం మళ్లీ ఇస్త్రీపెట్టె పట్టుకుని ముంగిట హడావిడి పడుతుంది.

పెత్తల్లి కూడా పనిచేస్తుంది. ఆమె తుడుపులూ ఊడుపులూ పని చేస్తూన్న ఆఫీసులో తనచేత హర్కారా పని కూడా చేయించుతున్నారనీ, పద్ధతి ప్రకారం హర్కారా పనికి వేరే మనిషిని పెట్టితీరాలనీ, తనకు జీతం మాత్రం ఒక్క తుడుపులకూ ఊడుపులకే ఇస్తున్నారనీ ఆమె ఎప్పుడూ

ఘోషపెడుతూనే వుంటుంది. ఆమె నీళ్ల తెచ్చుకుందుకని బాల్చీలు పట్టు కుని, ముంగిట మూలనున్న కుళాయి దగ్గర నిలబడి, అక్కడకొచ్చిన అమ్మలక్కలతో – తన ఆఫీసు మేనేజరుకి తను ఎలా అర్జీ పెట్టుకుందో ఆ గోడు అంతా చాలాసేపు చెప్పుకుంటూ వుంటుంది.

జేన్యకి ఆకలి లావు అనీ, హెచ్చుగా తిండి తింటాడనీ, ఇంటిపని ఏమీ చేయడనీ పెత్తల్లి వాడిమీద మండిపడుతూ వుంటుంది.

పనిచేయడమంటే వాడికి గిట్టదు. పొద్దున్న లేచి, తనకోసం వుంచినది తినేసి, కుర్రాళ్లదగ్గరకి వచ్చేస్తాడు.

రోజంతా వాడు వీధిలోనో, పొరుగిళ్లల్లోనో కాలక్షేపంచేస్తూ వుంటాడు. వాడు మా యింటికి వచ్చినప్పుడల్లా పాష అత్తయ్య వాడికి భోజనం పెడు తుంది. పెత్తల్లి పనిచేసుకుని ఇంటికి వస్తుందనగా, జేన్య ఇంటికి వెళ్లిపోయి పుస్తకాలు పెట్టుకుని కూచుంటాడు. ఎండకాలం సెలవల్లో వాడు బొత్తెడు పుస్తకాలు చదవాలి, ఎందుకంటే వాడు పరీక్షలో వుండిపోయాడు: రెండో తరగతి రెండేళ్ల చదివాడు, మూడో తరగతీ రెండేళ్ల చదివాడు, నాల్గో తరగతిలోనూ ఒక ఏడాది తిష్ఠవేసి ఇప్పుడు మళ్లీ చదువుతున్నాడు. వీడు బడిలో ప్రవేశించినప్పుడు వాస్య ఇంకా బాగా చిన్నవాడే, అటువంటిది వాస్య అప్పుడే వీణ్ణి మించిపోయాడు – వాస్య కూడా మూడో తరగతిలో ఒక ఏడాది తిష్ఠవేసినప్పటికీనీ. అటువంటిది ఎదుగులోనూ బలంలోనూ కూడా జేన్యను మించిపోయాడు వాస్య....

మొదట్లో జేన్య స్కూలుమేష్టర్లు ఎంతో బాధపడిపోయి, వాడి పెత్తల్లిని పిలిపించారు; తరువాత వాళ్లే స్వయంగా వాడి పెత్తల్లి దగ్గరకు పరుగెత్తుకొచ్చారు. కాని ఆమె చెప్పేసింది వాళ్లతో, "ఈ అదృష్టం నాకు పట్టింది! వాణ్ణి మీరేం చేసినా చేయండి – నాకు మాత్రం చేతకాదు. ఇంట్లో వున్నదంతా తినేస్తున్నాడు – ఏం చెప్పమంటారు?"

పెత్తల్లి అమ్మలక్కలతో చెప్పుకుంది, "మేష్టర్లు అన్నారు నాతో –

చదువుకుందుకు వాడికి ఇంట్లో ఒక మూల కేటాయించమని. వాడికి కావల్సింది ఇంట్లో ఒక మూల కాదు — వాడికి కావల్సింది కొరడా దెబ్బలు. కాని నాకే జాలేస్తుంది పోయిన చెల్లెల్ని తల్చుకుని!''

ఆ తరువాత మేష్టర్లు మరి రావడం మానివేశారు వాడి పెత్తల్లి దగ్గరకి. ఇక మాస్టర్లు వాణ్ణి మెచ్చుకునేవారు: మంచి కుర్రాడనీ, పాఠాలు చెబుతున్నప్పుడు కడమ కుర్రాళ్లలా వాడు గోలచేయకుండా కిక్కురుమనకుండా చాలా బుద్ధిగా వుంటాడనీ — కాని, పాపం, వాడిలో ఒక్కటే లోపమనీ, బడికి చుట్టంచూపులా వస్తాడనీ, ఒక్క ముక్కయినా రాదనీ విచారించేవారు.

మంచి ప్రవర్తన విషయంలో జేన్యకి మాస్టర్లు మొత్తం మార్కులు ఇచ్చేవారు. పాట బాగా పాడుతాడని సంగీతంలో మొత్తం ఇచ్చేవారు. కాని కడమ సబ్జెక్టుల్లో మాత్రం బొటాబొటీ మార్కులు ఇచ్చేవారు.

పెత్తల్లి మరీ తిట్టకుండా వుండాలని, ఆమె ఎదుట మాత్రం వాడు పుస్తకాలు ముందు పెట్టుకుని శ్రద్ధగా చదువుతూన్నట్టే నటిస్తాడు. ఆమె ఇంటికి వచ్చేసరికల్లా — వంటింట్లో అంట్ల గిన్నెలూ అలుగ్గుడ్డలూ వున్న బల్లదగ్గర కూచుని, ఇంటికిచ్చిన లెక్కలు చేస్తూన్నట్టు ఏవో అంకెలు బరుకుతూ వుంటాడు.

''ఏమిట్రా, బెల్లంకొట్టిన రాయిలా అలా కూచున్నావు?'' అని పెత్తల్లి మొరపెడుతుంది ''నీళ్లూ తెచ్చావుకావు, కిరసనాయిలూ తెచ్చావుకావు. నీతో ఎంతకాలం ఇలా బాధపడ్డా? నీకేం రోగమా రొష్ఠా?''

''నేను చదువుకుంటున్నాను'' అంటాడు.

పెత్తల్లి ఇంకా అరుస్తుంది. వాడు నిష్ఠురంగా నిట్టూర్చి, కలం అక్కడ పడేసి, కిరసనాయిలు పీపా పట్టుకుంటాడు.

''నాతో హాస్యాలట్రా నీకు?'' అని తెచ్చిపెట్టుకున్న గొంతుకతో ఖైంయ్‌మంటుంది. ''వెధవ వేషాలూ నువ్వూనూ — నీకు తెలీదా ఏమిటి దుకాణాలు మూసేసుంటాయని!!''

''అవును, మూసేసే వుంటాయి. మరి నన్నెందుకలా తిడతావు?'' అంటాడు జేన్య.

''వెళ్లి, పాయ్యిలోకి పుల్లలు చీరు!!!'' అని పెత్తల్లి మండిపోతూ ఎంత గట్టిగా అరుస్తుందంటే, ఇహ అక్కడకక్కడే గొంతుక పేలి పోతుందేమో అనిపిస్తుంది. ''వెళ్లు, పుల్లలు చీరకుండా వున్నావంటే చూడు ఏంచేస్తానో విన్నూ!!!''

బెంచిమీద వున్న బాల్చీలు తీసుకుని, కయ్యానికి కాలు దువ్వుతూన్నట్టుగా వాటిని ఝుళిపిస్తూ, దడదడ చప్పుడుచేస్తూ నీళ్లకోసమని ఆమె వెళ్తుంది. జేన్య మాత్రం ఏ తొందరా లేకుండా సావకాశంగా వెళ్తాడు షెడ్డులోకి, పుల్లలు చీరేందుకని.

వాడు బద్ధకస్తుడని పెత్తల్లి అంటుంది, కాని అది మాత్రం నిజం కాదు. వాడు బద్ధకస్తుడు కానేకాడు. పాష అత్తయ్య గానీ, లేకుంటే కుర్రాళ్లెవరైనా గానీ ఏదైనా పని చెబితే చాలు — వాడు సంతోషంతో చేస్తాడు. వాణ్ణి నిజంగా మెచ్చుకుంటే ఎంతో సరదాపడి, ఎంత బాగా చెయ్యాలో అంత బాగా చెయ్యడానికి ప్రయత్నిస్తాడు. వాడు వాస్యతో కలిసి బోలెడంత వంటచెరకును పేళ్లకింద చీరి, పేర్చి పేర్చాడు.

వాడికి తెలివితేటలు లేవన్నది కూడా నిజంకాదు. సెర్యోషకి కన్‌స్ట్రక్టర్* సెట్టు కానుక ఇచ్చారు ఎవరో. జేన్య, షూర కలిసి దానితో ఒక రైల్వే సిగ్నల్ని చేశారు కదా — అది ఎంత బాగుందంటే, ఇహ కలీనిన్ వీధిలో కుర్రాళ్లందరూ దాన్ని చూడడానికి వచ్చారు: దానిలో ఎర్ర దీపం పచ్చ దీపం — రెండూ వున్నాయి. దాన్ని తయారుచెయ్యడంలో షూర చాలా సాయంచేశాడు, వాడికి మెషీన్ల గురించి భేషుగ్గా తెలుసు — ఏమంటే, వాళ్ల నాన్న, డ్రైవర్ తిమోహిన్, మోటార్ డ్రైవర్ కదూ మరి అందుకని.

---

* మెకానో మోస్తరు. — అను.

ఐతేనేం, ఆ రైల్వే సిగ్నల్‌లో ఎర్ర దీపమూ పచ్చ దీపమూ ఎలా ఏర్పాటు చెయ్యడమో షూరకి తెలిసిందికాదు. సంవత్సరాది పండుగకోసం తెచ్చిన ఫర్‌చెట్టు వుందికదూ — దానిని అలంకరించేందుకు బొమ్మలూ బల్బులూ వున్నాయా మరి. ఈ బల్బులను ఆ రైల్వే సిగ్నల్‌లో అమర్చి వాటిని బేటరీతో వెలిగించవచ్చు అనే సంగతి షూరకి తోచలేదు. ఆ సంగతి జేన్యకి తోచి, ఆ దీపాలని వాడు రైల్వే సిగ్నల్‌లో ఏర్పాటుచేసి, అవి వెలిగేటట్టు చేశాడు.

సెర్యోష దగ్గర వున్న ప్లాస్టిసీన్ బంకమట్టితో జేన్య మనుషుల్నీ జంతువుల్నీ మోడల్ చేస్తాడు — అవి ఎంతో అద్భుతంగా వున్నాయి. సెర్యోష తల్లి వాటిని చూసి, ఆశ్చర్యపడి, జేన్యకి కూడా అటువంటి ప్లాస్టిసీన్ బంకమట్టి కొని ఇచ్చింది. కాని జేన్య పెత్తల్లి ఖైయ్‌మంది — జేన్య ఈ పిచ్చి పన్లు చేస్తూకూచుంటే తను ఒప్పుకునేది లేదంటూ కేక లేసి, ఆ ప్లాస్టిసీన్ ముద్దని తీసికెళ్లి పెంటకుప్పమీద పారేసింది.

జేన్య సిగరెట్టు తాగడం వాస్య దగ్గర నేర్చుకున్నాడు. సిగరెట్టు కొన డానికి జేన్య దగ్గిర డబ్బులేదే, వాస్య దగ్గిర వున్నవే వీడూ కాల్చుతాడు. మరి రోడ్డుమీద పడివున్న సిగరెట్టు పీకెలు వాడి కళ్లబడగానే వాటిని తీసి కాల్చుతాడు. జేన్యని చూసి సెర్యోష జాలిపడి, తనకు రోడ్డుమీద కనబడిన సిగరెట్టు పీకెలన్నిటినీ ఏరి, జేన్యకి ఇస్తాడు.

వాస్య చిన్నపిల్లల ఎదుట డాబుచేస్తూ, గొప్పలు చెబుతూ వుంటాడు. జేన్య అలాంటివేవీ చెయ్యడు — చిన్నపిల్లలతో కలిసి సరదాగా, వాళ్లు ఎలాంటి ఆటలు ఆడదామంటే అలాంటి ఆటలు ఆడతాడు. యుద్ధం ఆట ఆడ దామంటే యుద్ధం ఆట, పోలీసుల ఆట ఆడదామంటే పోలీసుల ఆట, లోటో ఆట ఆడదామంటే లోటో ఆట ఆడతాడు. ఐతే ఒకటి, వాడు ఏలాగూ పెద్దవాడే కాబట్టి, యుద్ధం ఆటలో వాడు జనరల్‌గా వుంటా నంటాడు, పోలీసు ఆటలో వాడు సూపరింటెండెంటుగా వుంటానంటాడు.

మరి, బొమ్మలు పాచికలుగా ఒడ్డి లోటో ఆడినప్పుడు, తను గెలిస్తే వాడు అతి సంతోషపడిపోతాడు, తను ఓడిపోయాడంటే మాత్రం కోపంతో మండిపడిపోతాడు.

వాడి ముఖంలో మంచితనం కనబడుతూ వుంటుంది, పెద్ద పెదవులు, చెవులు పెద్దవి పొడుచుకొస్తూ వుంటాయి, తల మాసిపోయి తలవెంట్రుకలు మెడమీద వొత్తుగా వుంటాయి, ఎందుకంటే వాడు ఎప్పుడోగాని తలకి కత్తెర వేయించుకోడు.

ఒకనాడు జేన్యతో కలిసి వాస్య చిట్టడవిలోకి వెళ్లాడు. సెర్యోషను కూడా వాళ్లతో తీసుకెళ్లారు. ఉర్లగడ్డలు ఉడికించుకుని తిందామని చిట్టడవిలో నెగడి వేసుకున్నారు. ఉర్లగడ్డలూ, ఉప్పూ, ఉల్లికోళ్లూ కూడా తెచ్చుకున్నారు. నెగడి బాగా రాజుకుందికాదు, ఒగరు వాసనతో పొగ లేచింది. వాస్య అన్నాడు జేన్యతో:

''నువ్వు మీదటికి ఏంచేస్తావో ఆలోచించుదాం'' అన్నాడు.

మోకాళ్ల ముణుకులమీద గడ్డం ఆన్చి మోకాళ్లచుట్టూ చేతులు చుట్టుకుని కూచున్నాడు జేన్య, బిగుతుగా వున్న పంట్లాం పొట్టిగా ఎగువకు మోకాళ్లవరకూ లేచిపోయిందేమో, సన్నంగా వున్న కాళ్లు బయటకు కనబడుతున్నాయి. జేన్య తన దృష్టిని మరెటువైపూ మళ్లించకుండా, నెగడిలోంచి నీలి పసిమి వన్నెలతో దట్టంగా పైకిలేస్తూన్న పొగకేసే దీక్షగా చూస్తున్నాడు.

''స్కూలు చదువు ఎలాగైనా పూర్తిచేయాలి'' అంటూ వాస్య, తను కేవలం ప్రథమశ్రేణి విద్యార్థి అయినట్టూ, జేన్యకంటె తను ఐదు క్లాసులు మించినట్టూ గొంతుకపెట్టుకుని మాటలు సాగించాడు. ''చదువు లేకపోతే నువ్వు ఎవరికి ఉపయోగపడతావు?''

''అవును, అది నిజమే. చదువు లేకపోతే నేనెవ్వరికీ ఉపయోగపడను'' అని ఒప్పుకున్నాడు జేన్య.

నెగడు బాగా మండేందుకని దానిలో చిదుగులు వేశాడు జేన్య. పచ్చి రెమ్మలు బుస్‌మన్నాయి, వాటిలోనుంచి పసరు కారింది, అవి మెల్లగా మండాయి. కుర్రాళ్లు కూచున్న పొదుజాగా చుట్టూ బర్చ్‌చెట్లూ, ఏస్ప్ చెట్లూ, ఆల్డర్‌చెట్లూ దివ్యంగా పొడుగ్గా లేచి ఆకాశాన్నందుకుంటున్నాయి. కుర్రాళ్లు ఇక్కడకొచ్చి ఆడుకుంటూన్నప్పుడు ఈ వృక్షాలు మహారణ్యాలని ఊహించుకుని వాటిమధ్య ఆడుకునేవారు. ఆ చిట్టడవిలో వసంతకాలంలో ఎన్నో చెంగల్వ పువ్వులు పూస్తూ వుంటాయి; కాని ఎండకాలంలో చిట్టడవి నిండా దోమలే. ఇప్పుడేమో నెగడులోనుంచి వచ్చిన పొగ బాధకి దోమలు పడిపోయాయి; కాని ఒకటి రెండు మాత్రం ధైర్యంచేసి పొగలోనుంచి ఎగిరొచ్చి కుట్టడం మొదలెట్టాయి. దానితో కుర్రాళ్లు కాళ్లమీదా చెంపలమీదా, అవి కుట్టిన చోట్లా అరచేతులతో టప్‌టప్‌మని కొట్టు కోవడం ఆరంభించారు.

"మీ దొడ్డమ్మ ఆటలు నువ్వు కట్టించాల్రా!" అని జేన్యకి సలహా చెప్పాడు వాస్య.

"చెప్పడం సులభమే!" అన్నాడు జేన్య.

"అయితే – ఆవిడ గురించి నువ్వు పట్టించుకోకు, అంతే!"

"నేను పట్టించుకోందే! అసలు ఆవిడంటే నాకు విసుగెత్తిపోతూందిరా నువ్వు చూస్తున్నావుగా – నా ప్రాణం ఎలా తీస్తూందోనూ – కాని ఏం జేసేది?"

"మరి ల్యూస్య మంచిదేనా?"

"ల్యూస్య మంచిదేన్లే. ల్యూస్య తనకోసం పెళ్లికొడుకుని చూసు కుంటూంది."

"ఎవణ్నిరోయ్?"

"అదెవణ్నో. ఎవడో మిలిటరీ ఆఫీసరుకోసం ప్లానువేస్తూంది – ఈ చుట్టు

పక్కల ఎవ్వడూ ఆఫీసరు లేడాయె. బహుశ తను ఎక్కడకో వెళ్ళిపోతుంది — ఆఫీసర్లు వున్న చోటికి.''

నెగడు బాగా మండుతూంది: రెమ్మల్లో వున్న చెమ్మంతా నిప్పు ఇగిర్చేసి, మంటలు సన్నని నాలుకలతో మంచి పెంకెతనంగా చిదుగుల పోగులమీదనుంచీ, ఆకుల కుప్పలమీదనుంచీ గంతులు వేస్తున్నాయి. ఆ కుప్పల మధ్యనుండి డామ్ అని చప్పుడైంది, పిస్టలుతో పేల్చినట్టు. పొగ ఏమంతగా రానేలేదు.

''పరుగెత్తి వెళ్లి, ఎండు చిదుగులు పట్రా!'' అని వాస్యా సెర్యోషని ఆజ్ఞాపించాడు.

ఆజ్ఞ నెరవేర్చేందుకని సెర్యోష పరుగున వెళ్లాడు. తను తిరిగివచ్చిన ప్పటికి జేన్య చెబుతున్నాడు వాస్యతో. వాస్య శ్రద్ధగానూ వ్యవహార్తలాగానూ వింటున్నాడు.

''ఒరేయ్, ఇహ జీవితం ఎంత దర్జాగా వుంటుందనుకున్నావ్!'' అన్నాడు జేన్య. ''నువ్వే ఆలోచించుకో: సాయంకాలం హాస్టలుకి వచ్చేస్తాను — నాకు మంచమూ, మంచందగ్గర నాకు ఓ నైట్ టేబిలూ. మంచంమీద పడుకుని రేడియో వింటాను, లేదంటావూ — డ్రాఫ్ట్స్ ఆడతాను. నన్ను తిడుతూ నా చెవిలో అరిచేవాడెవ్వడూ వుండడు. ఉపన్యాసకులూ కళాకారులూ వస్తారు నాదగ్గరకి. ఇహ సాయంకాలం ఏడు కొట్టేసరికల్లా రాత్రిభోజనం నాకోసం సిద్ధంగా వుంటుంది!''

''అవున్రా! మంచి నాగరికంగా వుంటుందిరా. మరైతే — నిన్ను చేర్చు కుంటారా?'' అన్నాడు వాస్య.

''నేను దరఖాస్తు పెడతాను. ఎందుకు చేర్చుకోరేమిటి? చేర్చుకుంటార్రా బహుశా'' అన్నాడు జేన్య.

''నీకెన్నేళ్ళురా ఇప్పుడు?''

''పదమూడేళ్లు నిండాయిరా. మొన్ననే పధ్నాల్గొచ్చింది.''

‘‘మీ దొడ్డమ్మ అడ్డు చెబుతుందేమో?’’

‘‘ఏ అడ్డూ చెప్పదు. ఆమెకున్న భయమల్లా ఒక్కటే – నేను గనక వెళ్లిపోతే, ఆతర్వాత నేనామెను పోషించనేమో అని ఆమెకి భయం.’’

‘‘ఏడ్సిందిలే!...’’ అంటూ ఆమెను వాస్య ఓ తిట్టు తిట్టాడు.

‘‘ఆమె ఏమనుకుంటే నాకేం గావాలి? నాకంతా ఒక్కటే. బహుశా నేను వెళ్లిపోతాన్రా’’ అన్నాడు.

‘‘ఒరేయ్, అసలు ముఖ్యమైన సంగతి ఏమిటంటే నువ్వు నిశ్చయించుకుని, ఇహ అటుతర్వాత ఏమైనా సరే, ఆ ప్రకారం చేసేయడమే, తెలిసిందా? అంతేగాని ‘బహుశ’, ‘గిహిశ’ అంటూ కూచుంటే, అక్కడ స్కూలు టర్మ్ ఆరంభించేస్తారు, నీ చాటభారతం నువ్వు మళ్లీ మొదలెడుతూ కూచోవాలి!’’ అన్నాడు వాస్య.

‘‘అవును, నిజమేరా. నేను బహుశ మనసు నిశ్చయించేసుకుంటాన్రా. నిశ్చయించేసుకుని ఆ ప్రకారం చేసేస్తాను. ఒరేయ్, వాస్య! దీన్ని గురించి ఎన్నెన్నో కలలు గన్నాననుకో. సెప్టెంబరు ఒకటో తేదీ త్వరగా వచ్చేస్తుందని జ్ఞాపకం తెచ్చుకునేసరికల్లా – అప్పుడే అదేమిటోలాగ వుంటుందిరా, నాకేమీ బాగుండదురా, ఏమీ బాగుండదురా....’’ అన్నాడు జేన్య.

‘‘అవున్రా, మరి!’’ అన్నాడు వాస్య.

ఉర్లగడ్డలు బాగా ఉడికేవరకూ వాళ్లిద్దరూ జేన్య పథకాల గురించి మాట్లాడుకుంటూనే వున్నారు. తరువాత చేతులు కాల్చుకుంటూ వలంపటి ఉల్లికోళ్లను కరకర కొరుక్కుంటూ ఉర్లగడ్డలు ఫలహారం చేశారు. ఫలహారం అయాక కాస్సేపు పడుకున్నారు. సూర్యాస్తమానం అయింది; బర్చ్‌చెట్ల బోదెలు పాటలవర్ణంగా కనబడ్డాయి; ఆ చిన్న పోదుజాగాలో ఇప్పుడు నీడ వచ్చింది. అంతవరకూ మండిన నెగడు ఇప్పుడు బుగ్గి అయిపోయింది, కాని నివురుకింద ఇంకా కొన్ని అగ్గి రవ్వలు వున్నాయి. సెర్యోష నేస్తులు నిద్రతీస్తున్నారు – వాళ్లమీద దోమలు వాలకుండా చూడమని వాళ్ల

సెర్యోషతో చెప్పారు. సెర్యోష రెమ్మ ఒకటి చేతబుచ్చుకుని వాళ్ల పక్క కూర్చుని, శ్రద్ధగా దోమలు తోలుతూ, తన మనసులో ''జేన్య పనిచేసి డబ్బు సంపాదించుకున్నప్పుడు, తనమీద కస్సుబుస్సుమని అరవడమేతప్ప ఒక్క మంచి మాటైనా ఆడని తన దొడ్డమ్మకి డబ్బు పంపిస్తాడా? — పంపించ డమంటే, అది నిజంగా అన్యాయమే!'' అనుకున్నాడు. అలా అను కుంటూ, మరి కాస్సేపటికల్లా తనకు కూడా కునుకొచ్చి, వాస్య జేన్యలు ఇద్దరి మధ్యనూ కాళ్లు చాపుకొని పడుకున్నాడు. సెర్యోష నిద్రలో కలగన్నాడు — ఆఫీసర్లు వున్నట్టూ, జేన్య అక్క ల్యూస్య ఆఫీసర్లతో వున్నట్టూ.

జేన్య ఒక పట్టాన నిర్ణయానికి వచ్చే మనిషికాదు; ఒక పని చేయడం కంటే, దాని గురించి కలలుగనటమే ఆ అబ్బాయి తత్వం. కాని — సెప్టెం బరు ఒకటో తేదీ దగ్గరకొచ్చేసింది. స్కూలు భవనం మరమ్మతులు పూర్తి అయిపోతున్నాయి, బడిపిల్లలు స్కూలుకెళ్లి, ఎక్సర్‌సైజు బుక్కులూ టెక్స్టు బుక్కులూ తెచ్చుకుంటున్నారు. లీద తన కొత్త స్కూలు యూనిఫారం గౌను తొడుక్కుని గోటుగా తిరుగుతూంది. కొత్త పాఠ్యసంవత్సరం తన చీకాకులన్నిటితోనూ ప్రత్యక్షమయేందుకు నిశ్చయించుకుని గుమ్మంలో కూర్చుంది — ఇహ అప్పుడు వచ్చాడు జేన్య ఒక నిర్ణయానికి: చేతిపనుల పాఠశాలకో, అది కాకపోతే ఫ్యాక్టరీ — వర్క్‌షాపు ట్రైనింగ్ స్కూలుకో వెళ్తానన్నాడు. ఎలాగైతేనేమి పైవూరు వెళ్లిపోవడానికే జేన్య నిశ్చయించుకు న్నాడు.

జేన్య తీసుకున్న నిర్ణయం బాగుందన్నారు చాలామంది. వాళ్లందరూ వాడికి అన్ని విధాలా సాయంచేశారు. స్కూలు కూడా వాడికి మంచి యోగ్యతా పత్రమే ఇచ్చింది. కొరొస్తెల్యోవూ అమ్మా వాడికి కొంత డబ్బు కూడా ఇచ్చారు. ప్రయాణంలో తినడానికని వాడి పెత్తల్లి అట్లు పోసింది.

వాడు బయలుదేరే నాడు ఉదయం, వాడి పెత్తల్లి ఏమాత్రమూ

చిర్రుబుర్రుమనకుండా వాడికి వీడ్కోలు ఇస్తూ, తను వాడికి చేసినదంతా మరచిపోవద్దని మరీమరీ చెప్పింది. ''నేను మరచిపోను, దొడ్డమ్మా!'' అన్నాడు జేన్య. అని: ''ధన్యవాదాలు!'' అని ఒక మాట కూడా చేర్చాడు. ఈ సంభాషణ అయ్యాక, ఆవిడ తను పనిచేసే ఆఫీసుకు వెళ్లిపోయింది, ఇక జేన్య తన సామాను సర్దుకోవడం మొదలెట్టాడు.

ప్రయాణానికని పెత్తల్లి వాడికి ఆకుపచ్చరంగు వేసిన కర్రపెట్టె ఇచ్చింది. ఆ పెట్టె ఇచ్చేముందు ఆమె ఎంతోసేపు తటపటాయించింది, దాన్ని ఇవ్వడానికి ఒకంతట ఆమె మనసొప్పిందికాదు. ఎలాగైతేనేమి, చిట్ట చివరకి ఇచ్చేస్తూ: ''దీన్ని ఇవ్వడమంటే వొళ్లు కోసుకుని ఇచ్చినట్టే వుందిరా!'' అంది. ఆ పెట్టెలో పెట్టుకున్నాడు జేన్య — తన షర్టూ జత చిరిగి పోయిన సాక్సూ, ఉతికి ఉతికి జీర్ణించిపోయిన తువాలూ, ప్రయాణంలో ఫలహారానికని ఇచ్చిన అట్లూనూ. కుర్రాళ్లందరూ నుంచుని, వాడు పెట్టె సర్దుకోవడం చూస్తున్నారు. సెర్యోష అక్కడనుంచి హఠాత్తుగా పరుగెత్తి వెళ్లిపోయాడు. పచ్చదీపమూ ఎర్రదీపమూ వున్న తన రైల్వే సిగ్నల్‌ను పట్టుకుని రొజుకుంటూ రొప్పుకుంటూ సెర్యోష అక్కడకు తిరిగివచ్చాడు. ఆ రైల్వే సిగ్నల్ అంటే తనకి ఇంతా అంతా సరదాకాదు — అందుకనే దాన్ని ముక్కచెక్కలు చేయకుండా, దాన్ని బల్లమీదే వుంచి, ఇంటికి వచ్చిన ఆగంతువులందరికీ చూబెట్టేవాడు.

''దీన్ని తీసుకో!'' అన్నాడు సెర్యోష జేన్యతో, ''నువ్వు తీసుకో నాకొద్దులే. అది ఊరకే అలా వుంది ఇంట్లో!''

''దీనితో నేనేం చేసుకుంటాన్రా అక్కడ?'' అన్నాడు జేన్య, రైల్వే సిగ్నల్ కేసి చూసి. ''పెట్టె ఇప్పటికే పదిహేను కిలోలుంది. ఇది కూడా ఎక్కడ మోయను.''

సెర్యోష మళ్లీ చప్పున ఇంటికెళ్లి, ఒక అట్టపెట్టె పట్టుకుని ఆదరా బాదరా మళ్లీ వచ్చాడు.

''పోనీ, ఇది తీసుకో!'' అన్నాడు సెర్యోష ఉద్రేకంతో. ''నువ్వక్కడ తప్పకుండా మోడలింగ్ చేస్తావు కదూ. ఇదేమీ బరువు లేదులే!''

జేన్య ఆ పెట్టె అందుకుని, దాన్ని తెరిచాడు. దానిలో ప్లాస్టిసీన్ ముద్దలు వున్నాయి. జేన్య ముఖం ఆనందంతో తొణికిసలాడింది.

''అలాగే. తీసుకుంటాన్లే'' అని దాన్ని తన పెట్టెలో పెట్టాడు జేన్య.

జేన్యని రైలుస్టేషనుకు తన లారీలో తీసుకువెళ్తానని తిమోహిన్ ఖరారు చేశాడు: వూరికీ రైలుస్టేషనుకీ ముప్పై కిలోమీటర్లుంది, అప్పటికింకా ఆ వూరికి రైలు పడలేదు.... కాని సరిగ్గా ఆ రోజే తిమోహిన్ లారీకి ఏదో వచ్చిందనీ, అది పడుకుందనీ, మరమ్మతులో వుందనీ తిమోహిన్ నిద్ర పోతున్నాడనీ షూర చెప్పాడు.

''పోనీ, దేనిమీదో ఓదానిమీద వెళ్తావులే, ఫర్వాలేదు!'' అన్నాడు వాస్య.

''బస్సుమీద వెళ్లొచ్చేమో?'' అన్నాడు సెర్యోష.

''తెలివైనవాడివిరా, నువ్వు!'' అని అడ్డుపుల్ల వేశాడు షూర. ''బస్సుకి టికెట్టు కట్టాల్రా!''

''హైరోడ్డుమీద ఏదేనా మోటారు కనబడుతుంది; మనం చెయ్యి ఎత్తితే, ఆపి ఎక్కించుకుంటారు, బహుశ'' అన్నాడు జేన్య.

వాస్య ఒక పెట్టె సిగరెట్లు బహుమతిచ్చాడు జేన్యకి. కాని వాస్య దగ్గర అగ్గిపెట్టె లేదు. దొడ్డమ్మగారి ఇంట్లో వున్న అగ్గిపెట్టె జేబులో వేసుకున్నాడు జేన్య. అందరూ కలిసి దొడ్డమ్మగారి ఇంటినుంచి బయటి కొచ్చారు. జేన్య ఇంటికి తాళంవేసి, తాళంచెవిని ఇంటి గుమ్మంముందున్న గోనెపట్టాకింద వుంచాడు. అందరూ బయల్దేరారు. వెధవ పెట్టె — బోలెడంత బరువుంది; దాన్లో ఏమున్నాయి గనుక? అసలు ఖాళీపెట్టే బరువాయె! పెట్టెను ఓ మాటు ఈ చేతితోనూ, ఓ మాటు ఆ చేతితోనూ మోసుకుని నడిచాడు జేన్య. జేన్య ఓవర్‌కోటును వాస్య పట్టుకున్నాడు, తన చిన్న తమ్ముడు వీక్తొర్‌ను లీద ఎత్తుకుంది. చేతులమీద కూచోపెట్టు

కుని, తను పొట్ట ముందుకు పెట్టుకుని వాణ్ణి మోస్తూ "నువ్వెందు కొచ్చావురా, నాగమ్మా? కూచో ఇక్కడ! నీకేం కావాలి" అని ఇక అస్తమానూ వాణ్ణి ఒక్క కుదుపు కుదుపుతూంటుంది లీద.

గాలి కొట్టేస్తూంది. వూళ్లోనుంచి వెళ్లి, హైరోడ్డు చేరుకున్నారు — ధూళి సుడితిరుగుతూ కళ్లలో పడుతూంది. రోడ్డు అంచున వున్న బూడిదె రంగు గడ్డిచెట్లూ, వాడిపోయిన కారన్‌ఫ్లవర్ మొక్కలూ గాలికి అల్లాడి పోయి నేలపై ఒరిగిపోయాయి. నిర్మలమైన నీలాకాశంలో గుండ్రని తెలుపు మేఘాలు ఎంతో ప్రశాంతంగా వున్నట్టుగా ఏ దడిపింపూ లేకుండా వున్నాయి. కాని వీటికి కాస్త కిందుగా కారుమబ్బొకటి తన పంజా విప్పుకుని సుడిగాలి విసురుతో రైంయ్ రైంయ్‌మని వచ్చింది. గాలి అంతా దీనిలోనుంచే దూసుకు వచ్చి, ఉండి ఉండి ధూళిలోనుంచీ దుమ్ములోనుంచీ బయటికి వచ్చినట్టే, అదేమిటో గాని పదునుగానూ తేటగానూ గుండెల్ని తేల్చేస్తూన్నట్టే అనిపించింది.... కుర్రాళ్లు రోడ్డుమీద ఆగి, పెట్టెను కింద వుంచి, మోటారేదైనా వస్తుందా అని చూస్తూ నిలబడ్డారు. కసితీర్చుకోవడానికా అన్నట్టు — రోడ్డంట వెళ్లిన మోటార్లన్నీ స్టేషన్నుండి వూళ్లోకే వెళ్లాయి. ఎలాగైతే నేమి చిట్టచివరకు స్టేషనువైపు వెళ్తూన్న లారీ ఒకటి అగపడింది. దాని నిండా ప్యాకేజీ పెట్టెలు ఎత్తుగా వేసి వున్నాయి, కాని లోపల డ్రైవరు పక్క సీటు ఖాళీగానే వుంది. కుర్రాళ్లు చెయ్యి వూపారు ఆపమని. డ్రైవరు వాళ్లని చూశాడే గాని ఆపకుండా వెళ్లిపోయాడు. ఆ తరువాత, రోడ్డుమీద లేచిన ధూళిమేఘాల్లోనుంచి నల్లని చిన్నకారు ఒకటి కనబడింది. అది ఇంచుమించు ఖాళీగానే వుంది — డ్రైవరు కాక, మరో మనిషి వున్నాడు, అంతే; ఐతే ఏం — కారుని ఆపాడుకాడు డ్రైవరు.

"వెధవలు!" అని తిట్టాడు షూర.

"అందరూ చెయ్యి ఎత్తకండా! చెయ్యెత్తారంటే చూసుకోండి! అందరూ చెయ్యెత్తితే లోళాకి లోళానీ ఎక్కించుకోవాలనుకుంటాడు డ్రైవరు! అలా

క్కాదు – జేన్య ఒక్కడే చెయ్యెత్తుతాడు! ఇదిగో మరో డొక్కు కారేదో వస్తూంది!'' అన్నాడు వాస్య.

కుర్రాళ్లు తాము చేసిన తప్పు ఒప్పుకున్నారు, ఇక ఈసారి ఆ డొక్కు కారు వచ్చేసరికల్లా, ఒక్క జేన్య, వాస్య తప్ప మరెవ్వరూ చేతులెత్తలేదు. తను ఇచ్చిన ఆజ్ఞను తనే అతిక్రమించాడు వాస్య. అసలు పెద్దకుర్రాళ్లె ప్పుడూ ఇంతే! చిన్నకుర్రాళ్లు ఏదైనా పని చేస్తే, దాన్ని చెయ్యొద్దనడం, మళ్లీ తామే ఆ పని చేయడం....

ఈమారు వచ్చిన డొక్కుకారు చర్రున వాళ్ల ముందునుండి దూసుకుపోయి, కాస్త దూరం వెళ్లి ఆగిపోయింది. జేన్య తన పెట్టె మోసుకుని, దానిదగ్గరకు పరుగెత్తాడు, వాడి ఓవర్‌కోటు పట్టుకుని వాస్య పరుగెత్తాడు. కారు తలుపు తెరుచుకుంది; జేన్య కారులోకి మాయమైపోయాడు, వాడివెంట వాస్య కూడా కారులోకి మాయమైపోయాడు. ఇహ తరువాత, ధూళి కళ్లముందు తెరలా లేచి, మరేమీ కనబడకుండా చేసింది. తెర తేలిపోయేసరికి రోడ్డుమీద వాస్య లేడూ, జేన్య లేడూ. ఆ కారు ఎంతో దూరాన అలా వెళ్లిపోతూండడం కనబడింది. వాస్య టక్కరితనం చేశాడు, తను జేన్యతో కూడా వెళ్లి, వాణ్ణి స్టేషను దగ్గర దిగబెట్టి వస్తానని ఎవ్వరికీ ఏమీ తెలియనివ్వాడేకాడు, పిసరంతైనా ఎవ్వరితోనూ చెప్పాడేకాడు.

వెనుక వుండిపోయిన కుర్రకారు ఇంటి దారి పట్టారు. గాలి వాళ్ల వీపున కొడుతూ వాళ్లను ముందుకు తోసేస్తూంది; సెర్యోష జుట్టు పొడుగ్గా వుందేమో, అది వెనుకనుంచి రేగిపోయి ముఖాన కొడుతూంది.

''వాడి దొడ్డమ్మ వుందే – వాడికి ఎన్నడూ ఏ బట్టలూ కుట్టించలేదు. వాడు పట్టుకెళ్లినవి చింకిపాతలే!'' అంది లీద.

''ఆవిడె పనిచేస్తూన్న ఆఫీసులో మేనేజరు వుత్త నీచుడు, ఆవిడె చేత హర్కారా పని చేయిస్తాడు, అందుకు జీతం మాత్రం ఇవ్వడు. ఆ జీతానికి ఆవిడెకి పూర్తి హక్కుంది'' అన్నాడు షూర.

గాలి తనను వెనుకనుండి తోస్తూండగా ముందుకు నడుస్తూ సెర్యోష ''జేన్య ఎంత అదృష్టవంతుడో కదా, చక్కగా రైల్లో ప్రయాణం చేస్తున్నాడు, నేను ఇంతవరకూ ఒక్కసారైనా రైల్లో ప్రయాణం చేయలేదే'' అని తనలో అనుకున్నాడు.... గబాలున చీకటైపోయింది. భీతావహంగా మెరసిన మెరుపుతో సర్వమూ తటాలున వెలిగిపోయింది, నెత్తిమీద ఫిరంగి గుండు బద్దలైనట్టు రాక్షసి ఉరుము ఉరిమింది, ఇక వెంటనే ధారాపాతంగా చినుకులు మొదలెట్టాయి. కుర్రాళ్లు పరుగు తీశారు – వర్షపు నీటి బురదలో కాలు జారుతూనూ. జడివాన వాళ్లను కోసేసినట్టు కిందకు వంచేసేది, ఉరుము వాళ్లను చెంగున ఆకాశానికి లేవనెత్తేది, ఢణేలుమంటూన్న ధ్వనుల మధ్యనుండీ, గుర్రుమంటూన్న ఉరుముల చప్పుళ్ల మధ్యనుండీ చిన్నపిల్లడు వీక్తొర్ ఏడ్పు వినబడుతూంది....

ఈ విధంగా వెళ్లిపోయాడు జేన్య. కొన్నాళ్లయాక వాడిదగ్గర నుండి రెండు వుత్తరాలు వచ్చాయి: ఒకటి వాస్యకీ, ఒకటి వాళ్ల దొడ్డమ్మకీ. తనకందిన వుత్తరంలో ఏముందో గాని – మగవాళ్లకి సంబంధించిన రహస్యం ఏదో వున్నట్టుగా ముఖం పెట్టుకుని – ఆ వుత్తరం గురించి ఎవ్వరికీ ఓ ముక్క అయినా చెప్పాడుకాడు వాస్య. జేన్య దొడ్డ దగ్గర ఏ రహస్యాలూ దాగవు, ఆమె అందరితోనూ చెప్పింది – దేవుడు దయవల్ల, జేన్యని చేతిపనుల పాఠశాలలో చేర్చుకున్నారనీ, వాడు హాస్టల్లో వుంటున్నాడనీ, వాడికి స్కూలు యూనిఫారం ఇచ్చారని రాశాడనీ చెప్పింది. ''వాడికి ఎక్కడో ఒకచోట ఇంత ఆధరువు చూపించాను కదా, ఇహ వాడి బాధ నాకొదిలిపోయింది, నావల్లకదా వాడు పైకొచ్చాడు – అదే నాక్కావలసింది!'' అంది ఆవిడె.

జేన్య కుర్రాళ్లకి నాయకుడూ కాడు, ఏ ఆటల జట్టుకీ మొనగాడూ కాడు, వాడు లేకపోయినా వాడి గురించి కుర్రాళ్లేమీ పట్టించుకోనే లేదు – జేన్య అనే మనిషి అసలు ఎన్నడూ లేనట్టుగా, వాణ్ణి గురించి ఇహ వాళ్లె

ప్పడైనా తల్చుకుంటే, వాడి రోజులు సరిగ్గా వెళ్తున్నాయనీ, వాడికి కేటాయింపుగా ఒక నైట్ టేబిలు వుందనీ, వాడి దగ్గరకి కళాకారులు వస్తూంటారనీ చెప్పకుని సంతోషించేవారు. మరి యుద్ధం ఆట ఆడుతూన్నప్పుడు, జనరల్సుకి కొదవేలేదు — షూర, సెర్యోష ఎలాగూ వరసలో వుండనే వున్నారు కదా.

ముత్తవ్వ అంత్యక్రియలు

ముత్తవ్వకి జబ్బుచేసింది, ఆమెను ఆస్పత్రిలో వేశారు. రెండు రోజులైన తరువాత ఆస్పత్రికి వెళ్లి ఆమెను చూడ్డం మంచిదన్నారు; మరి మూడో రోజున నాస్త్య అవ్వ వచ్చింది. ఇంట్లో ఒక్క పాష అత్తయ్య, సెర్యోష — ఇద్దరే వున్నారు. నాస్త్య అవ్వ మామూలుగా ఎప్పటిలాగానే నిటారుగా జవానులా వుంది, చేతిలో నల్లని జిప్‌సంచి వుంది. నాస్త్య అవ్వ ఇంట్లోకి వచ్చి పాష అత్తయ్యనీ, సెర్యోషనీ పలకరించి, కుర్చీలో కూచుని ''మా అమ్మ పోయారు'' అంది.

పాష అత్తయ్య తన ఒంటిమీద శిలువ చిహ్నం గీసుకుని ''స్వర్గస్థురాలయారు!'' అంది.

నాస్త్య అవ్వ తన సంచిలోనుంచి ప్లమ్ పండు తీసి, సెర్యోషకి ఇచ్చింది.

''అమ్మకివ్వాలని తీసుకెళ్లాను, తీరా వెళ్లేసరికి — రెండు గంటలకింద ప్రాణంపోయిందన్నారు. సెర్యోష! పండు తిను — అది కడిగినదే. పసందైన పండు. అమ్మకి ఈ పళ్లంటే ఎంతో ఇష్టం: టీనీళ్ల ఆవిరిలో ఉడకబెట్టి తినేది. వీటినన్నిటినీ మీరు తీసుకోండమ్మా'' అందామె. అలా అని ప్లమ్ పళ్ల పొట్లం బల్లమీద పెట్టింది.

''అన్నీ మాకిచ్చేస్తున్నారెందుకు? మీకోసం వుంచుకోండి!'' అంది పాష అతయ్య.

నాస్త్య అవ్వ వలవల ఏడ్చేసింది:

''నాకెందుకమ్మా? నేనేంజేసుకోను! అమ్మకోసమని కొన్నాను!''

''ఎన్నేళ్లమ్మా ఆవిడకి?'' అని అడిగింది పాష అత్తయ్య.

''ఎనభై రెండు వెళ్లాయి. ఇంతకంటె పెద్దకాలమే బతుకుతున్నారు. తొంభై ఏళ్లు వెళ్లినవాళ్లని చూస్తున్నాంకాదూ!''

''కాసిన్ని పాలు పుచ్చుకోండి'' అంది పాష అత్తయ్య. ''చల్లనివి నేల మాళిగలోనుంచి పట్టుకొస్తాను. ఏదో ఇంత పుచ్చుకోకపోతే ఎలాగు, చెప్పండీ? మన చేతిలో ఏమీ లేదుకదా!''

''ఒక్క చుక్క ఇవ్వండి!'' అంది నాస్త్య అవ్వ, ముక్కు చీదుకుంటూ. ముక్కు తుడుచుకుని, పాలు తాగడం ఆరంభించింది. పాలు తాగుతూ అంది:

''ఎదుట అలా కూచున్నట్టే వుంటుంది సుమండీ, అమ్మ! ఎంత తెలి వైన మనిషి! ఎన్ని పుస్తకాలు చదివిందో మరి, తల్చుకుంటే ఆశ్చర్యం వేస్తుంది!.. ఇహేముంది ఇల్లంతా చిన్నబోయింది – అలోమంటూంది! ఇహ ఇంట్లో ఎవరినేనా అద్దెకి వుంచుకోవాలి – అంతే!''

''హయ్యో!'' అని నిట్టూర్చింది పాష అత్తయ్య.

సెర్యోష చేతులనిండా పళ్లు తీసుకుని, చక్కగా వెచ్చగా ఎండకాస్తూన్న ముంగిట్లోకి వెళ్లిపోయాడు. వెళ్లిపోయి, తనలో తను ఆలోచించుకున్నాడు: ''నాస్త్య అవ్వ ఇల్లు చిన్న బోయిందంటే, దాని అర్థం – ముత్తవ్వ చని పోయిందన్నమాట—అంటే, ఇంతకుముందు ఇద్దరూ కలిసి వుండేవారన్నమాట. అనగా ఆవిడె నాస్త్య అవ్వకి అమ్మ అవుతుందన్నమాట.'' ఇలా అనుకుని: ''నాస్త్య అవ్వ ఇంటికి మళ్లీ ఎప్పుడైనా వెళ్లితే తనను చీవాట్లు పెట్ట డానికి ముత్తవ్వ ఇహను అక్కడ వుండనే వుండదన్న మాట'' అనుకున్నాడు.

చావును చూశాడు సెర్యోష. పెంపుడు పిల్లి చంపివేసిన చుంచును చూశాడు; ఈ చుంచు అంతకుముందు గదిలో పరుగెత్తుతూంది. పిల్లి ఆ చుంచుతో చెలగాటమాడి, తటాలున దానిమీద పడి, చప్పున పక్కకు

ఉరికింది; అంతవరకూ పరుగెత్తుతూన్న చుంచు ఆగిపోయింది, ఇక పిల్లి బద్ధకంగా సంతృప్తితో మూతి ఆడించుకుంటూ దాన్ని తినేసింది.... చచ్చిన పిల్లిని చూశాడు సెర్యోష — మురికి ఓడుతూన్న తోలుముక్కలాగే వుంది. చచ్చిన సీతాకోకచిలకల్ని చూశాడు — వెల్లకిలా పడి, రెక్కల పొడి రాలిపోయి, ఉల్లిపొరల్లాగే వున్నాయి రెక్కలు. చచ్చిన చేపల్ని చూశాడు, ఏటి ఒడ్డున కొట్టుకొచ్చి, అక్కడ చచ్చి పడున్నాయి. చచ్చిపోయిన కోడిని చూశాడు — వంటగదిలో బెంచిమీద పెట్టివుంది; బాతు మెడలా పొడుగ్గా వుంది దానిమెడ, మెడమీద నల్లని కన్నం, ఆ కన్నంలోనుండి కింద వుంచిన బేసినులోకి నెత్తురుబొట్లు కారుతూవున్నాయి. కోడిని చంపడం పాష అత్తయ్యకి చేతనైందికాదు, అమ్మకీ చేతనైందికాదు; వాళ్లిద్దరూ ఆ పని లుక్యానిచ్ మామయ్యకి ఒప్పజెప్పారు. అతడు కోడిని షెడ్డులోకి తీసుకెళ్లి, షెడ్డు తలుపు లోపలినుండి గడియపెట్టేసుకున్నాడు; కోడి ఊరకే అరిచింది. ఆ అరపులు వినలేక సెర్యోష అక్కడనుంచి పరుగెత్తి పారిపోయాడు. ఇహ తరువాత వంటగదిలోనుంచి వెళ్తూండగా, తనకి చూడాలని ఇష్టంలేక పోయినప్పటికీ, అప్రయత్నపూర్వకమైన జిజ్ఞాసతో, దాని మెడమీద వున్నకన్నంలోనుండి కింద వున్న బేసినులోకి రక్తం ఎలా కారుతూందో క్రేగంటితో చూశాడు. ఆ కోడిమీద ఇహ అట్టే జాలిపడడం అనవసరమని తనకిప్పుడు బోధపరచి చెప్పారు. పాష అత్తయ్య తన చేతితోనే మంచి నేర్పుగా ఆ కోడికి యీకలు తీసివేసి, ''దానికిప్పుడు ఏ బాధా అనిపించదూ!'' అని ప్రశాంతంగా అంది.

చచ్చిన పిచ్చిక ఒకదాన్ని సెర్యోష ముట్టుకున్నాడు. అది ఎంత చల్లగా వుందంటే, ఆ చలికి సెర్యోష భయపడిపోయి, చటుక్కున తన చేయి వెనక్కి లాగేసుకున్నాడు. మంచుగడ్డలా జిల్లుమంటూండింది పాపం ఆ పిచ్చిక, వెచ్చగా వున్న లైలాక్ పొదకింద, కాళ్లు పైకి ఎగదన్నేసి వెల్లకిలా పడి వుంది.

చలనం లేకపోవడమూ, చల్లబడిపోవడమూ — బహుశ దీనినే అంటారు చావు అని.

పిచ్చికను చూసి, లీద ''దీన్ని మనం భూస్థాపితం చేద్దాం!'' అంది.

చిన్నబుట్టను లీద పట్టుకొచ్చింది; ఆ బుట్టలో గుడ్డపేలికలు వుంచింది; మరో రకం గుడ్డ పేలికలు తెచ్చి, వాటిని తలగడలా అమర్చి, ఆ తలగడని చిన్న లేసుముక్కతో అలంకరించింది: నిజం చెప్పాలంటే లీదకు ఎన్నో తెలుసును. లీద సెర్యోషతో గొయ్యి తవ్వమని చెప్పింది. పిచ్చికను బుట్టలో పెట్టి, బుట్టను గోతిలో వుంచారు; బుట్టపైన మూతవేసి, గోతిని మట్టితో కప్పేశారు. అందుమీద లీద మన్నుపోసి, చిన్న దిబ్బచేసి, చేతులతో దాన్ని నున్నగా చేసి, దానిమీద చిన్న కొమ్మ పాతింది.

''దాన్నెంతో ఘనంగా భూస్థాపితం చేశాం!'' అని డాబుగా అంది లీద. ''తనకింత గొప్పగా జరుగుతుందని పాపం అది కలలోనైనా అనుకునుండదు!'' అంది.

తామీ ఆటలో కలవమనేశారు వాస్య జేన్యలు ఇద్దరూనూ. వాళ్లిద్దరూ అల్లంతదూరం వెళ్లిపోయి, ముఖాలు చిట్లించుకుని, సిగరెట్లు కాల్చుకుంటూ అక్కడ కూచున్నారు, కాని వాళ్లు వీళ్లని ఎగతాళి చేయలేదు.

మనుషులు కూడా చచ్చిపోతారు — అప్పుడప్పుడు. వాళ్లను పొడుగ్గా వున్న పెట్టెల్లో — శవపేటికల్లో పెట్టి, ఆ పెట్టెల్ని వీధుల్లోనుంచి మోసుకెళతారు. ఇలా మోసుకుని తీసుకెళ్లతూండడం సెర్యోష దూరంనుండి చూశాడు. కాని మనిషి శవాన్ని చూడలేదు సెర్యోష.

...పాష అత్తయ్య అన్నం వండి, తెల్లగా విడివిడి మెతుకులుగా వున్న ఆ అన్నాన్ని లోతు పళ్లెంనిండా రాశిగా పోసి, పళ్లెం అంచుచుట్టూ ఎర్రని మురబ్బా బిళ్లలు వుంచింది. అన్నపు రాశిమీద పువ్వు ఆకారంలోనో నక్షత్రం ఆకారంలోనో మార్మలేడ్ బిళ్లలు అమర్చింది.

''ఇది నక్షత్రమా?'' అని అడిగాడు సెర్యోష.

''ఇది శిలువ'' అంది పాష అత్తయ్య. ''ముత్తవ్వ భూస్థాపితానికి వెళ్దాం మనం.''

ఆమె సెర్యోష ముఖమూ చేతులూ కాళ్లూ కడిగి, తువాలుతో తుడిచేసి, వాడికి సెయ్‌లర్ సూటువేసి, మేజోళ్లూ సాండల్సూ తొడిగి, సెయ్‌లర్ టోపీ పెట్టింది – ఎన్ని బట్టలు తొడిగించింది బాబూ! ఆవిడె కూడా మంచి బట్టలు వేసుకుంది, నల్లని లేసు శాలువ కప్పుకుంది. అన్నం వుంచిన పళ్లెంపైన తెల్లని సెర్వియట్ కప్పింది. ఆవిడె పువ్వుల గుత్తి కూడా పట్టుకుంది, సెర్యోషకి కూడా ఇచ్చింది పువ్వులు పట్టుకోమని – వలంపటి కాడలున్న రెండు ఢాహ్లియాలు.

వాస్య తల్లి నీళ్లకోసం కడవలు పట్టుకుని వెళ్తూంది. ఆవిడతో అన్నాడు సెర్యోష:

''ఏమండోయ్! నమస్కారం! మేం వెళ్తున్నామండీ ముత్తవ్వను భూస్థాపితం చేసేందుకూ!''

లీద తన తమ్ముడు వీక్టొర్‌ను చేతితో ఎత్తుకుని వాళ్ల ఇంటి గుమ్మంలో నిలబడింది. లీదను చూసి, సెర్యోష ''ముత్తవ్వను భూస్థాపితం చేసేందుకు వెళ్తున్నాను!'' అని కేకేసి చెప్పాడు. లీద ఆ కేక విని, సెర్యోషకేసి అసూయతో చూసింది. లీదకు తనతో కూడా రావాలని వుందన్న సంగతి సెర్యోషకి తెలుసును; కాని వెళ్లడమా వద్దా అని లీద ఒకంతట నిశ్చయించుకోలేకపోయింది, ఎందుకంటే తను మామూలు బట్టల్లోనే వుంది, బట్టలు మాసిపోయున్నాయి, కాళ్లకి జోళ్లు లేవు; లీదను చూసి సెర్యోషకి జాలేసింది; సెర్యోష వెనక్కి తిరిగి,

''మనం కల్సి వెళ్దాం, రా! మరేం ఫర్వాలేదులే!'' అని కేకేశాడు.

కాని అమ్మో! లీదకు అభిమానం లావు; సెర్యోష వేసిన కేక విని, లీద రానూ లేదు, మారుమాట్లాడనూ లేదు – సెర్యోష ఆ వీధిమలుపు తిరిగే వరకూ వాడివెంట అలా చూస్తూనే వుండిపోయిందక్కడ.

పాష అత్తయ్యతో కలిసి సెర్యోష వీధి తరువాత వీధి – అలా నడుస్తూనే వున్నాడు. ఎండ కాస్తూంది, వేడిగా వుంది, తాపం ఎత్తిపోతూంది. బరువుగా వున్న ఆ రెండు పువ్వులూ పట్టుకోలేక సెర్యోష అలసిపోయి,

''నువ్వే పట్టుకుంటావా వీటిని!'' అన్నాడు పాష అత్తయ్యతో.

ఆమె పువ్వులు అందుకుంది. సెర్యోష తొట్రుకుంటూ నడుస్తున్నాడు, రోడ్డుమీద గతుకులు లేకుండా వున్న చోట కూడా తొట్రుకుంటున్నాడు.

''ఏమిట్రా అలా తొట్రుకుంటున్నావు?'' అని అడిగింది పాష అత్తయ్య.

''నాకు తాపమెత్తిపోతోంది'' అన్నాడు సెర్యోష. ''ఈ కోటూ అదీ తీసేద్దూ, పంట్లాంతో నడుస్తాను.''

''బాగు బాగు, నయం ఇంకాను!'' అంది పాష అత్తయ్య. ''పంట్లాం ఒక్కటే తొడుక్కుని ఎవరేనా భూస్థాపితానికి వెళ్తార్రా ఎక్కడేనా? ఇక ఏముంది, బస్సు ఆగేచోటకి రానే వచ్చేశామాయె. బస్సులో కూచోడమే!'' అంది.

సెర్యోష సంతోషపడి, అంతులేని ఆ వీధివెంట, మొదలూ కొసా లేని కంచెగోడలవెంట – ఆ కంచెగోడలమీద ఆనుకొంటూన్న చెట్లను చూస్తూ నడిచాడు.

దుమ్ము రేగ్గొట్టుతూ ఆవులు ఎదురుగా వచ్చాయి.

''నా చెయ్యి పట్టుకోరా!'' అంది పాష అత్తయ్య.

''నాకు దాహం వేస్తూంది'' అన్నాడు సెర్యోష.

''వేషాలు వెయ్యకు మరి! నీకు దాహమూ లేదు, ఏమీ లేదు!'' అంది పాష అత్తయ్య.

ఇందులో మాత్రం ఆమె పొరపడింది; సెర్యోషకి నిజంగానే దాహం వేసింది. కాని ఆమె అలా అనగానే, తనకు నిజంగానే దాహం తగ్గిపోయింది.

ఆవులు పక్కనుంచి వెళ్లాయి – ఏదో ఆలోచనలో వున్నట్టుగా మూతులు

కిందకీ మీదకీ మెల్లగా ఆడించుకుంటూ. ప్రతీ ఆవు పొదుగూ పాలతో నిండుగా వుంది.

సెర్యోష, పాష అత్తయ్యా చౌకు చేరుకుని, అక్కడ బస్సులో ఎక్కి, చిన్న పిల్లల సీటులో కూచున్నారు. బస్సులో వెళ్లే అవకాశం ఎప్పుడో గాని దొరికేది కాదు సెర్యోషకి; అందుచేత ఇప్పుడు దొరికిన ఈ వినోదావకాశం ఎంతో విలువైనదని ఎంచుకున్నాడు సెర్యోష. సీటు ఎక్కి, సీటులో మోకాళ్లమీద నిలబడి, కిటికీలోనుంచి రోడ్డుమీదకి చూశాడు. తరువాత, వెనుక సీటులో కూచున్న పిల్లడికేసి చూశాడు. ఆ పిల్లడు లావుగా వున్నాడు, సెర్యోషకంటె చిన్నవాడు. పుల్లకి తగిలించి వున్న కలకండ కోడిపుంజును చప్పరిస్తున్నాడు ఆ పిల్లడు – మూతినిండా, బుగ్గలనిండా కలకండ పులుముకున్నాడు. ఆ పిల్లడూ చూశాడు సెర్యోషకేసి; ఆ పిల్లడి చూపులు: "చూశావా, నాకు కలకండ కోడిపుంజు వుంది, నీకు లేదు, ఏహే!" అని చెప్పకనే చెబుతున్నాయి. ఇంతట్లోకి బస్‌కండక్టర్ అక్కడ కొచ్చింది.

"అబ్బాయికి టిక్కెట్టు కొనాలా?" అని అడిగింది పాష అత్తయ్య.

"కొల్చి చూడాలి, అబ్బాయిని" అంది కండక్టరు.

కండక్టరు దగ్గర నల్లని కొలతబద్ద వుంది. దానిమీద అడ్డుగా గీత గీసివుంది. దానితో ఆమె పిల్లలు ఎంత పొడుగ్గా వున్నారో కొలుస్తుంది. ఆ కొలతబద్ద మీదవున్న గీతకంటె పిల్లడు పొడుగ్గా వుంటే పిల్లడికి టిక్కెట్టు కొనాలి. ఆ గీతకంటె సెర్యోష ఒక్కరవ్వ కిందకున్నాడు – మునివేళ్లమీద నిలబడితే ఒక్కరవ్వ మీదకొచ్చాడు.

"టిక్కెట్టు కొనండి!" అంది కండక్టరు.

ఆ పిల్లడి కేసి సెర్యోష: "నా కోసం టిక్కెట్టు కొంటారు, నీకు టిక్కెట్టు కొనరే కొనరు, ఏహే!" అన్నట్టు విజయసూచకంగా చూశాడు. కాని ఎలాగైతేనేం – చిట్టచివరకి గెలుపు ఆ పిల్లడిదే అయింది: సెర్యోష

కంటె ఆ పిల్లడే దూరప్రయాణం చేస్తున్నాడు. మరికాస్సేపట్లో బస్సు ఆగితే, సెర్యోష, పాష అత్తయ్య దిగనే దిగిపోతారు.

వాళ్ల ఎదుట వెల్లవేసిన రాతి గేటు వుంది. గేటు వెనుక పొడుగ్గా వున్న ఇళ్లున్నాయి. ఇళ్ల పొడుగునా ఒత్తుగా ఎదిగిన లేత చెట్లున్నాయి, చెట్ల బోదెలు కూడా వెల్లవేసి తెల్లగా వున్నాయి. నీలం అంగరకాలు వేసుకున్న మనుషులు కొందరు అక్కడున్న బెంచీలమీద కూచున్నారు.

''అక్కడికొచ్చామా మనం?'' అని అడిగాడు సెర్యోష పాష అత్తయ్యని.

''ఇది ఆస్పత్రి'' అని చెప్పింది పాష అత్తయ్య.

అక్కడున్న ఇళ్లల్లో చిట్టచివరి ఇంటికి వెళ్లేసరికి, ఆ మలుపులో అగపడ్డారు – కొరొస్తెల్యోవ్, అమ్మ, లుక్యానిచ్ మామయ్య, నాస్త్య అవ్వ. తలుపులు తెరిచి వెడల్పుగా వున్న ద్వారంలో అందరూ నిలబడున్నారు. మరెవరో కొత్తవాళ్లు ముగ్గురు ముసలమ్మలు కూడా వున్నారక్కడ. వాళ్లు శాలువలు కప్పుకున్నారు.

''మేం బస్సుమీదొచ్చాం!'' అన్నాడు సెర్యోష.

సెర్యోషకి ఎవ్వరూ జవాబుచెప్పలేదు; పాష అత్తయ్య సెర్యోషకేసి చూసి బుస్సుమంది. దాన్నిబట్టి అర్థంచేసుకున్నాడు సెర్యోష – ఎందుచేతనో గాని ఇక్కడ మాట్లాడకూడదని. వాళ్లందరూ మాత్రం మెల్లగా మాట్లాడు కుంటున్నారు. పాష అత్తయ్యతో అమ్మ ''వీణ్ణెందుకు తీసుకొచ్చారూ? నాకేమీ అర్థంకావడంలేదు!'' అంది.

కొరొస్తెల్యోవ్ చేతితో టోపీ పట్టుకుని, చేయి కిందకు వేలేసుకుని, ఏదో ఆలోచిస్తూ నుంచున్నాడు. సెర్యోష ద్వారంకేసి చూశాడు – ద్వారం వెనుక మెట్లున్నాయి కిందకి బేసుమెంటులోకి – బేసుమెంటులో చిరు చీకటిగా, మసకమసగ్గా చెమ్మగా వున్నట్లు అగపడింది.... అందరూ తాపీగా కదిలి మెట్లు దిగారు, సెర్యోష కూడా వాళ్లతో కలిసి మెట్లు దిగాడు.

పట్టపగటి వెల్తురులోనుంచి బేసుమెంటులోకి దిగేసరికి, మొదట అంతా

చీకటిగా వున్నట్టనిపించింది. తరువాత అగపడ్డాయి – మెట్లపక్కన బెంచీ, తెల్లని సరంబి, గరుగ్గా సిమెంటుచేసిన గచ్చు, గచ్చుమీద నడిమధ్య ఎత్తుగా వున్న చెక్క శవపేటిక, శవపేటిక అంచుల మీదనుండి ఒరిగిన మస్లినుగాజ్. చలిగా వుంది, మట్టి వాసన కొడుతూంది, ఇంకా మరేదో మరొక వాసన కూడా కొడుతూంది. నాస్త్య అవ్వ పెద్ద అంగవేసి శవపేటిక దగ్గరకెళ్లి, దాని పక్కను వంగింది.

''ఇదేమిటి ఇది?'' అంది పాష అత్తయ్య మెల్లగా, ''చేతులు అలా పెట్టించారేమిటి? అటెన్‌షన్‌మీద వున్నట్టు! అరె, భగవంతుడా!''

''ఆవిడెకు మతంలో నమ్మకంలేదు'' అంది నాస్త్య అవ్వ నిటారుగా నుంచుంటూ.

''ఐతే ఏం?'' అంది పాష అత్తయ్య. ''ఆవిడె సోల్జరు కాదుకదా, భగవంతుడి ఎదుట అటెన్‌షన్‌మీద నిలబడ్డానికి.'' అలా అని పాష అత్తయ్య అక్కడ నుంచున్న ముసలమ్మలవైపు తిరిగి ''మీరేనా ఆమాత్రం చూడొద్దా?'' అంది.

ముసలమ్మలు నిట్టూర్చారు. సెర్యోషకి ఏమీ కనబడిందికాదు. దగ్గరున్న బెంచీమీదెక్కి, మెడెత్తి శవపేటికలోకి చూశాడు.

ముత్తవ్వ శవపేటికలో పడుకొని వుండాలే అనుకున్నాడు సెర్యోష. కాని అలా పడుకున్నది ఏమిటో తన ఊహకు అందలేదు. ఆ పడుకునివున్న దీనికీ ముత్తవ్వకీ ఏదో పోలికవుంది: ఇలాగే లోపల వాలిపోయిన నోరూ, శల్యావశిష్టమై ఎగువకు వంగిన గడ్డమూ. కాని ఇది ముత్తవ్వ కాదే. ఇది ఏమిటో తను ఎరుగడే. మనుషుల కళ్లు ఇలా మూసుకుని వుండవే. మనుషులు పడుకున్నప్పుడు కళ్లు మూసుకుని వున్నప్పటికీ – ఇలా మూతపడి వుండవే, మరోలా మూసుకుని వుంటాయి....

ఇది బాగా పొడుగ్గా వుంది. మరి – ముత్తవ్వ పొట్టిది. శవపేటిక చుట్టూతా దట్టమైన చీకటి, చలి, నిశ్శబ్దం అలుముకున్నట్టున్నాయి.

ఆ నిశ్శబ్దానికి భంగం కలిగిస్తామేమోనిని భయపడుతున్నట్టు అక్కడ వున్న వాళ్లు లోగొంతుకలో మాట్లాడేరు. సెర్యోషకి ఘోరమనిపించింది. మరి, దీనికి ప్రాణంవచ్చి, తటాలున లేచికూచుంటే — ఆయ్ బాబోయ్, ఇహ మరీ ఘోరంగా వుంటుందే! అనిపించింది. ఈమె, మాటవరుసకి, 'కుర్' అని గుర్రుపెట్టిందంటే... మరీ ఘోరంగా వుంటుందే, అబ్బో, బాబోయ్! — అనుకున్నాడు సెర్యోష. అలా అనుకుని కెవ్వున ఒక్క కేకవేశాడు.

సెర్యోష కేకవేశాడేమో, ఆ కేకకు జవాబు చెప్పినట్టు, ఎగువనుండి కాస్తూన్న ఎండలోనుండి, చేరువగానూ సరదాగానూ సజీవంగానూ కీచుగానూ ధ్వనించిన మోటార్ హారన్ శబ్దం వినబడింది.... తల్లి సెర్యోషను ఎత్తుకుని బేసుమెంటులోనుంచి బయటకు తీసుకెళ్లిపోయింది. తలుపు దగ్గర లారీ నిలబడి వుంది — లారీ పక్కబల్ల కిందకి వాల్చేసివుంది. లారీలోనుంచి ముసలితాతలు దిగి, పొగతాగుతున్నారు. లారీ లోపల డ్రైవరుసీటులో తోస్య అత్త — ''యాస్ని బేరెగ్''లో పనిచేస్తూ, అప్పుడు కొరొొస్తెల్యోవ్ సామాను తీసుకొచ్చి, అప్పుడప్పుడు కొరొొస్తెల్యోవ్‌ను కారులో ఎక్కించుకుని తీసుకెళ్తూండేదే ఆ తోస్య అత్త — కూర్చుంది. తల్లి సెర్యోషను తోస్య అత్త పక్క కూర్చోపెట్టి: ''నువ్విక్కడ కూర్చోరా!'' అని, లారీ తలుపు వేసేసి, తను వెళ్లిపోయింది. తోస్య అత్త సెర్యోషను అడిగింది:

''ముత్తవ్వను సాగనంపడానికి వచ్చావా యేమిటి? ముత్తవ్వ అంటే నీకంత ఇష్టమా?''

''లేదు'' అని మనసులో మాట చెప్పేశాడు సెర్యోష. ''ఆమె అంటే నా కిష్టంలేదు'' అన్నాడు.

''మరైతే ఎందుకొచ్చావు?'' అని అడిగింది తోస్య అత్త. ''ఆమె అంటే నీ కిష్టంలేనప్పుడు నువ్వు రానవసరంలేదే'' అంది.

ఎంతో ఘోరమని తనకు ఇందాకట్లా అనిపించి, తనకు కల్గిన హడలంతా

ఈ వెలుగులోనూ, మనుషుల గొంతుకలు వినడంవల్లనూ ఇప్పుడు వదలి పోయింది, కాని తన మనసుమీద పడిన ముద్రల ప్రభావంనుండి మాత్రం ఇంత చప్పునే బయటపడలేకపోయాడు సెర్యోష; గాభరాగా ఇటూ అటూ చూస్తూ ఇటూ అటూ కదుల్తూ, ఏమేమిటో ఆలోచిస్తూ:

''భగవంతుడి ఎదుట నిలబడ్డం అంటే ఏమిటి?'' అని అడిగాడు తోస్య అత్తని.

తోస్య అత్త వ్యంగ్యంగా నవ్వి

''ఏమీ లేదూ, వాళ్ల పూరికేనే అలా అంటారు'' అంది.

''అలా ఎందుకంటారు?''

''ముసలాళ్ల అలా అంటారు. వాళ్ల మాట వినకు. వుత్త పిచ్చి మాటలు!''

ఇద్దరూ నిశ్శబ్దంగా వున్నారు. తోస్య అత్త కళ్ల చికిరించి, గూఢంగా అంది:

''మనమందరం వెళ్తామక్కడికి!''

''అక్కడికి అంటే ఎక్కడికి చెప్మా?'' అని సెర్యోష ఆలోచించాడు. అదేమిటో కచ్చితంగా అడగడం తనకు ఇష్టం లేకపోయింది. అందుచేత తను తోస్య అత్తను అడగలేదు. శవపేటికను బేసుమెంటునుండి తీసుకురావడం చూసి, సెర్యోష తన ముఖం వెనక్కి తిప్పేసుకున్నాడు. శవపేటిక మూత వేసివుండడం నయమే. అయినా శవపేటికను లారీలో వెనుక ఎక్కించడం తనకేమాత్రమూ ఇష్టంగా లేదు.

లారీ శ్మశానవాటిక చేరగానే, శవపేటికను లారీమీదనుంచి దింపుకుని, లోపలికి తీసుకెళ్లిపోయారు. సెర్యోష, తోస్య అత్త – ఇద్దరూ లారీలోనుంచి దిగలేదు, లారీలోనే కూచుని, తలుపు మూసేసుకున్నారు. చుట్టూ శిలువలూ, చెక్క గోపురాలూనూ – చెక్క గోపురాలమీద ఎర్ర నక్షత్రాలు. దగ్గరగా వున్న గోరీ దిబ్బ ఎండిపోయి బీటలువారింది, ఆ బీటల్లోనుండి ఎర్ర

చీమలు పైకి పాకుతున్నాయి. మరొక గోరీ దిబ్బమీద కలుపు మొక్కలు మొలుస్తున్నాయి... '''మనమందరం వెళ్తామక్కడికి!' అందే తోస్య అత్త ఇందాకల – 'అక్కడ' అంటే ఈ శ్మశానవాటికే అవుతుందా ఏమిటి?'' అనుకున్నాడు సెర్యోష. వచ్చినవాళ్లందరూ శవపేటికను తీసుకురాకుండానే తిరిగి వచ్చేశారు. లారీ బయల్దేరిపోయింది.

''మట్టిలో పూడ్చేశారా?'' అని అడిగాడు సెర్యోష తోస్య అత్తని.

''పూడ్చేశారు, అబ్బాయి, పూడ్చేశారు'' అంది తోస్య అత్త.

ఇంటికి వచ్చేసరికి పాష అత్తయ్య లేదు; ఆ ముసలమ్మలతోపాటు ఆవిడె శ్మశానవాటికలో వుండిపోయినట్టే వుంది.

''పాష తన శాఖవాళ్లతో కలిసి ఏవో అంత్యక్రియలు జరుపుతూంది – అందుకోసమనే వుండిపోయింది. కష్టపడి అన్నం వండింది, కాదా మరి....'' అన్నాడు లుక్యానిచ్ మామయ్య.

నాస్త్య అవ్వ తను కప్పుకున్న శాలువ తీసివేసి, రేగిపోయిన తల సవరించుకుని:

''వాళ్లనేమీ అనకండి. అదిచేయక తప్పదని వాళ్లు అనుకుంటే చెయ్యనీయండి'' అంది.

ఇప్పుడు అందరూ మళ్లీ బిగ్గరగా మాట్లాడ్డం మొదలెట్టారు, అంతే కాదు నవ్వారు కూడానూ.

''మా పాష అత్తయ్యకి బోలెడన్ని నమ్మకాలున్నాయి'' అంది అమ్మ.

అందరూ భోజనానికి కూచున్నారు. సెర్యోషకి తిన బుద్ధిపుట్టలేదు. భోజనం వూసే గిట్టలేదు. మెల్లగా పెద్దవాళ్లందరి ముఖాలూ పరికించాడు. జ్ఞాపకం తెచ్చుకోకుండా వుండాలని ఎంత ప్రయత్నించినా, పొడుగ్గా, హడలెత్తించుతూ, చల్లదనంలో, మట్టివాసనలో వుండిపోయిన <u>అదే</u> జ్ఞాపకం వస్తూ ఉందేది.

''మనమందరం వెళ్తామక్కడికి అని ఆమె ఎందుకంది?'' అని అడిగాడు సెర్యోష.

పెద్దవాళ్లందరూ ఏమీ మాట్లాడకుండా సెర్యోషకేసి చూశారు.

''నీతో ఎవరలా అన్నారు?'' అని అడిగాడు కొరొాస్తెల్యోవ్.

''తోస్య అత్త.''

''తోస్య అత్త చెప్పే మాటలు వినకు. అందరి మాటలూ వింటానంటావు నువ్వు'' అన్నాడు కొరొాస్తెల్యోవ్.

''మనం అందరం చచ్చిపోతామా?''

సెర్యోష ఏదో అశ్లీలపు ప్రశ్న వేసినట్టుగా అందరూ తబ్బిబ్బుపడ్డారు. సెర్యోష అందరికేసీ చూస్తూ, తన ప్రశ్నకు జవాబుకోసం నిరీక్షించాడు.

కొరొాస్తెల్యోవ్ జవాబుచెప్పాడు:

''అబ్బే మనం చచ్చిపోం. తోస్య అత్త ఇష్టం తోస్య అత్తది, మనం మాత్రం చచ్చిపోం, అందులోనూ — నువ్వు చనిపోవని నేను నీకు హామీయిస్తాను!''

''నేను ఎన్నటికీ చచ్చిపోనా?'' అని అడిగాడు సెర్యోష.

''ఎన్నటికీ!'' అని దృఢంగా, గంభీరంగా వాగ్దానంచేశాడు కొరొాస్తెల్యోవ్.

ఆ మాట వినీవినడంతో సెర్యోష మనసు కుదుటపడి, తనకెంతో హాయనిపించింది. ఆనందంతో ముఖం జేవురించింది — ఎర్రని ఎరుపొచ్చింది — ముఖానికి నవ్వు వచ్చింది. తటాలున దాహం వేసింది, భరించరాని దాహం వేసింది: ఇలాగే తనకెప్పుడో మహచెడ్డ దాహం వేసింది — ఎక్కడ చెప్మా అనుకున్నాడు; కాని జ్ఞాపకం వచ్చిందికాదు — అప్పడే మరచిపోయాడు. ఎన్నో మంచినీళ్లు తాగాడు — తాగడమూ 'హమ్మయ్య!' అనుకోవడమూ. కొరొాస్తెల్యోవ్ చెప్పినది సత్యమే అని సెర్యోష పూర్తిగా విశ్వసించాడు — రవంతైనా సందేహించలేదు: చచ్చిపోతాడని తెలిస్తే, మీదటికి బతగ్గలడా? మరి, అందుచేత: ''నువ్వు చనిపోవు!'' అని చెబితే తప్పకుండా నమ్ముతాడు.

కొరొాస్తెల్యోవ్ ప్రాభవం

భూమిలో గొయ్యి తీశారు, స్తంభం పాతారు, తీగె లాగారు. తీగె సెర్యోష ఇంటివరకూ వచ్చింది. ఇంటి గోడకి కన్నంచేశారు, కన్నంలోనుంచి ఆ తీగె ఇంట్లోకొచ్చింది. భోజనాల గదిలోవున్న బల్లమీద సిగ్నల్ పక్కను వుంది — నల్లని టెలిఫోను. వాళ్ల వీధిలోకెల్లా వున్న ఒకేఒక టెలిఫోనూ — ఇది కొరొాస్తెల్యోవ్‌ది. కొరొాస్తెల్యోవ్ కోసమే భూమి తవ్వారు, స్తంభం పాతారు, తీగె లాగారు. ఎందుకంటారా? ఇతరులకి టెలిఫోను అవసరంలేదు, వాళ్లకి టెలిఫోను లేకపోయినా గడచిపోతుంది, కొరొాస్తెల్యోవ్‌కి మాత్రం అలా కాదే.

టెలిఫోను రిసీవరు తీసి, చెవిదగ్గర పెట్టుకుని వినేసరికి ఎవరో కంటికి అగబడని స్త్రీ అంటుంది: ''టెలిఫోను స్టేషను'' అని. కొరొాస్తెల్యోవ్ ఆజ్ఞ జారీచేస్తున్నట్టుగా అంటాడు: ''యాస్ని బేరెగ్!''; లేదాంటే: ''జిల్లా పార్టీ కమిటీ!'' అంటాడు. లేదాంటే ''రాష్ట్ర సమిష్టిక్షేత్ర కార్యాలయం!'' అంటాడు. కుర్చీలో కూచుని, కాళ్లాడించుకుంటూ, రిసీవరు గొట్టంలో మాట్లాడుతాడు. అతనలా మాట్లాడుతూాన్నంత సేపూ, ఎవ్వరైనా సరే, అమ్మ అయినా సరే, మరతనికి ఏ అంతరాయమూ కల్గించకూడదు.

టెలిఫోను గంట మోగుతుంది, వెండి గంట మోగించినట్టే — మంచి సరదాగా, సెర్యోష పరుగెత్తుతాడు, పరుగెత్తి వెళ్లి, రిసీవరు తీసి, అందులో అంటాడు గట్టిగా ''హల్లో!'' అని.

రిసీవరులోనుంచి అంటుంది ఓ గొంతుక, కొరొాస్తెల్యోవ్‌ని పిలవండని. కొరొాస్తెల్యోవ్‌తో ఎందరెందరికి మాట్లాడ్డం అవసరమో మరి! లుక్యానిచ్ మామయ్యనీ, అమ్మనీ టెలిఫోనులో ఎప్పుడో కాని పిలవరు. ఇహ సెర్యోషనూ, పాష అత్తయ్యనూ అసలు ఎన్నడూ ఎవ్వరూ పిలవనే పిలవరు.

తెల్లవారుతూనే వెళ్లిపోతాడు కొరొొస్తెల్యోవ్ ''యాస్ని బేరెగ్''కి. పగలు ఎప్పుడైనా తోస్య అత్త అతనిని మధ్యాహ్నంపూట భోజనానికి కారుమీద ఇంటికి తీసుకొస్తుంది. అదైనా అరుదుగా – మామూలుగా తీసుకురానే తీసుకు రాదు. అప్పుడు ''యాస్ని బేరెగ్''కి అమ్మ మాత్రం టెలిఫోను చేస్తూ వుంటుంది. అప్పుడు – కొరొొస్తెల్యోవ్ ఫారమ్‌కి వెళ్లాడనీ, ఇంత వేగం రాడనీ ఖబురుచెబుతారు.

''యాస్ని బేరెగ్'' ఎంతో పెద్ద క్షేత్రం – అయ్ బాబోయ్, బ్రహ్మాండ మైన క్షేత్రం! ఇంత పెద్దక్షేత్రమని సెర్యోష ఎన్నడూ అనుకోలేదు – ఒకనాడు కొరొొస్తెల్యోవ్ కోసమని తోస్య అత్త కారు తీసుకొచ్చింది; కొరొొస్తెల్యోవ్‌తో కూడా అక్కడికెళ్లాడు సెర్యోష. అప్పుడు తెలిసింది సెర్యోషకి, అది ఎంత పెద్ద క్షేత్రమో. కారుమీద వెళ్లారు, వెళ్లారు – ఎంతో దూరం వెళ్తూనే వుంది కారు; అదంతా ఆ క్షేత్రమే! కారు వెళ్తూన్న రోడ్డుకి ఇటూ అటూ, లేత ఊదావన్నె పొగమబ్బులున్న దిగ్మండలాన్ని చేరుకుంటూన్నట్టి శరత్కాలపు పచ్చికబయళ్లు, వాటిలో ఎంతో ఎంతో ఎత్తుగా వున్న గడ్డి వాములు, పసుప్పచ్చని దుబ్బులు, నల్లని ముఖమల్లు లాంటి సేద్యపు భూమి, భూమిమీద రూళ్లగీసినట్టు వరుసలు తరువాత వరుసలుగా తలలెత్తుతూన్న కారుపసరు మొలకలు! నిలువుగానూ అడ్డుగానూ అల్లిన కచికవన్నె రిబ్బన్లులా రోడ్లు ఇటూ అటూ అంతులేకుండా విస్త రించి వున్నాయి; ఈ రోడ్లవెంట పరుగులు తీస్తున్నాయి లారీలు, నలు చదరపు కనవు మేట్లున్న ట్రైలర్లను ఈడుస్తున్నాయి ట్రాక్టర్లు.

''మరి ఇప్పుడు – ఇదేమిటి?'' అని అడిగాడు సెర్యోష.

''ఇదంతా 'యాస్ని బేరెగ్' క్షేత్రమే!'' అని జవాబుచెప్పారు అందరూనూ.

ఎక్కడో విసిరేస్తే, ఏ దూరప్రదేశాల్లో ఏదో ఒక మూల పడి, వాటిని గురించి పూర్తిగా మరుపున పడిపోయినట్టుగా వున్న పశువుల ఫారమ్‌లు మూడు – ఒకదానివెంట ఒకటి – అగపడ్డాయి: ఇంటిమీద ఇల్లూ, ఇంటిమీద

ఇల్లూ కట్టినట్టుగా కానవచ్చిన మూడు ఇళ్ల దొంతర్లు — ఒక ఫారమ్‌లో కోట బురుజులాంటి లావుపాటి స్టైల్లో వుంది; రెండోదాంట్లో కార్లూ యంత్రాలూ వున్న షెడ్డులుంటాయి. వర్కుషాపులోనుంచి గుర్రుమంటూ తిరుగుతూం టాయి డ్రిల్లులు, బుస్సుమంటూంటాయి వెల్డింగ్ జ్వాలలు. గాఢాంధకారంలో వున్న కమ్మరసాలనుండి అగ్గిరవ్వలు సురసుర ఎగురుతూంటాయి, టక్కు టక్కుమంటూంటాయి సుత్తులు.... ఇహ అన్ని వైపులనుంచీ మనుషులు వచ్చి, కొరొస్తెల్యోవ్‌ను పలుకరిస్తారు; అతడు అన్నిటినీ పరీక్షిస్తాడు, అన్నిటి గురించీ ప్రశ్నిస్తాడు, అన్నిటిగురించీ ఆదేశాలిస్తాడు; తరువాత మళ్లీ కారు ఎక్కి, ఇంకా దూరం వెళ్తాడు. ''యాస్ని బేరెగ్''కి వెళ్లేందుకు అతడు అస్తమానం ఎందుకలా తొందరపడుతూ వుంటాడో ఇప్పుడు అర్థమవు తుంది — అతను అక్కడకు వెళ్లి, పనులు బెస్తాయించకపోతే వీళ్లకి ఏం తెలుస్తుంది, వీళ్లు ఏం చెయ్యగల్గుతారు, ఏం చెందగల్గుతారు?

ఫారమ్‌లలో ఎన్నో ఎన్నో జీవాలున్నాయి: పందులు, గొర్రెలు, కోళ్లు, బాతులు; వీటన్నిటికీ మించి వున్నాయి — ఆవులు. ఇంతకుముందు నెలల్లో ఇంకా వేడిగా వుండేది కాబట్టి, ఆవులు పచ్చికబయళ్లలో స్వేచ్ఛగా తిరిగేవి, అక్కడే పాకలు వుండేవి, వాతావరణం బాగుండకపోతే ఆ పాకల్లోనే అవి రాత్రిళ్లు పడుకునేవి. ఇప్పుడవి పశువుల సాలల్లోనే వుంటున్నాయి. ఆ సాలల్లో అవి ప్రశాంతంగా ఒకదాని ప్రక్కను ఒకటి వుంటాయి. కొమ్ములకి గొలుసులు కట్టేసి వుంటాయి, గొలుసుల రెండో కొనలు చెక్కదూలానికి తగిలించేస్తారు; పొడుగ్గా వున్న తొట్టెల్లోనుంచి అవి మేత తింటూ, తోకలు ఆడిస్తూ వుంటాయి. మానమూ మర్యాద లేకుండా ప్రవర్తిస్తాయి. అవి వేసే పేడ ఎప్పటికప్పుడు అలా తీసేస్తూనే వుంటారు. ఆవులు అంత సిగ్గుబిడియాలు లేకుండా ప్రవర్తించడం చూసి సెర్యోషకి సిగ్గే వేసింది. తడితడిగా వున్న బల్లచెక్కమీదనుంచి పశువులసాలల్లో నడిచినంత సేపూ సెర్యోష కొరొస్తెల్యోవ్ చేయిపట్టుకుని, కళ్లు పైకెత్తకుండా

ముఖం దించేసుకునే నడిచాడు. వాటి అసభ్య ప్రవర్తన పట్టించుకోకుండానే, కొరొాస్తెల్యోవ్ వాటి మచ్చమచ్చల వీపులమీద తట్టుతూ, అక్కడ వున్న వాళ్లకి ఆదేశాలిస్తూ, నడిచాడు.

ఒకామె కొరొాస్తెల్యోవ్‌తో దేనిగురించో మరి, వాదం వేసుకుంది; ఆ వాదాన్ని అతడు అక్కడికక్కడే తుంచేసి,

''సరే, సరే – నే చెప్పినట్టే చెయ్యండి'' అన్నాడు.

ఆమె మరి మాటాడకుండా, అతడిచ్చిన ఆదేశాల ప్రకారం చేయడానికే వెళ్లిపోయింది.

మరొకామె వుందక్కడ – అమ్మ పెట్టుకునే కుచ్చుటోపీలాంటిదే పెట్టుకుంది ఈమె కూడా. ఈమెమీద కూాకలేశాడు కొరొాస్తెల్యోవ్:

''ఇంతకీ దీనికెవరు బాధ్యులు? ఈ చిన్నచిన్న పనులకి నేను బాధ్యత వహించడమా?''

అతని ఎదుట ఆమె వ్యసనపడుతూ నుంచుని, మళ్లీ మరొక తడవ, ''దానిగురించి ఆలోచించడం నేనెలా మర్చిపోగల్గానో నాకే అర్థంకాకుండా వుంది!'' అంది.

ఎక్కడనుండో వచ్చి ప్రత్యక్షమయాడు లుక్యానిచ్ మామయ్య, కాగితం ఒకటి పట్టుకుని. కొరొాస్తెల్యోవ్‌కి ఫౌంటెన్‌పెన్ అందిచ్చి, ''సంతకం పెట్టండి!'' అన్నాడు. కొరొాస్తెల్యోవ్ ఆ అమ్మాయిని చీవాట్లుపెట్టడం మానివేసి, లుక్యానిచ్ మామయ్యతో, ''సరే, తరువాత పెడతాలెండి'' అన్నాడు.

''తరువాత అంటే ఏలాగు? మీ సంతకం లేనిదే నాకివ్వరాయె, మరేమో మనుషులకి జీతాలివ్వాలాయె'' అన్నాడు అందుపైన లుక్యానిచ్ మామయ్య.

అదీ సంగతి. కొరొాస్తెల్యోవ్ కాగితంపైన సంతకం పెట్టకపోతే ఎవ్వరికీ జీతాలు ముట్టవు!

పేడ మడుగులను తప్పుకుంటూ సెర్యోష, కొరొాస్తెల్యోవ్‌లు వారికోసం

ఆగివున్న కారు దగ్గరకు వెళ్తూండేసరికల్లా, వాళ్ల దారికి అడ్డుగా ఒక వ్యక్తి — పొట్టి రబ్బరుబూట్లూ, తళతళ మెరుస్తూన్న బొత్తాముల తోలు జాకెట్టూ తొడుక్కుని డాబుగా దుస్తులు వేసుకున్న యువకుడు — నిలబడ్డాడు.

''దీమిత్రి కొర్నేయెవిచ్! నేనిప్పుడేం చేసేది చెప్పండి?'' అన్నాడా యువకుడు, ''నాకు వుండడానికి బస ఇవ్వడంలేదు వాళ్లు!''

''నీకు ఓ కుటీరం ఇస్తారనుకున్నావు కదూ నువ్వు?'' అన్నాడు కొరొస్తెల్యోవ్ తటాలున.

''నా బతుకిలా తగలడింది'' అన్నాడా అబ్బి. ''దీమిత్రి కొర్నేయెవిచ్, మీ ఆర్డరు ఎలాగేనా రద్దుచేయండి!''

''ఇదంతా ముందే ఆలోచించుకుని వుండాల్సింది నువ్వు'' అన్నాడు కొరొస్తెల్యోవ్ మరింత కఠినంగా, ''అప్పుడు బుర్ర ఎక్కడికి పోయిందో? బుర్ర ఉపయోగించాలి, బుర్ర ఉపయోగించకపోతే — ఇంతే!''

''దీమిత్రి కొర్నేయెవిచ్! మిమ్మల్ని బతిమాలుకుంటున్నాను! నన్నర్థం చేసుకోవాలి మీరు. నాకు అనుభవం లేకపోయింది. దీనిలో వున్న లింకులన్నిటి గురించీ నేను లోతుగా ఆలోచించలేదు.''

''కాని ఇతర్రతా పైపనిచేసి డబ్బు సంపాదించడం గురించి మాత్రం ఆలోచించుకున్నావు, కదూ?'' అన్నాడు కొరొస్తెల్యోవ్, కోపంతో ముఖం ఎర్రబడి. ''నీకు ఒప్పజెప్పిన పని చెయ్యక, లోపాయకారీ పనులు చేయడానికి మాత్రం వుందికదూ — అనుభవం?...''

కొరొస్తెల్యోవ్ ముందుకు నడువబోయాడు.

''దీమిత్రి కొర్నేయెవిచ్!'' అంటూ ఆ అబ్బి దారి ఇచ్చాడుకాదు. ''దీమిత్రి కొర్నేయెవిచ్! కాస్త దయ చూపించండి. తప్పు దిద్దుకుందుకు అవకాశం ఇప్పించండి! చేసిన తప్పు ఒప్పుకుంటున్నాను! పనిలో వుంచండి, దీమిత్రి కొర్నేయెవిచ్!''

''ఇప్పుడే చెబుతున్నా, జాగ్రత్త! మరోసారి చేస్తివా!...'' అంటూ కొరొొస్తె ల్యోవ్ ఆ అబ్బికేసి తిరిగి, గుడ్లెర్రజేశాడు.

''వాళ్లంటే నాకేమంత ఇష్టం వుండికాదు. వాళ్లు హాస్టల్లో స్థలం ఇస్తామన్నారు. – అదేనా ఇప్పుడు కాదుట, మీదటికెప్పుడోనట – బహుశా... థూ, దొంగవెధవలండీ వాళ్లు, దీమ్త్రి కొర్నేయెవిచ్!''

''నీకంటె కుక్క నయం, ఇంత స్వార్థమూ, ఇంత పొంకెత్తుతనమూనా! ఛీ, పంది, పంది! ఇదే ఆఖరుసారి నిన్ను క్షమించడం – పనిలోకి పో, తెలిసిందా? వెధవపన్లు చేస్తూ, వెధవలని!''

''అలాగే, పనిలోకి పోతా!'' అని ఆ అబ్బి వెంటనే జవాబుచెప్పి, తలకు రుమాలు కట్టుకుని కాస్త దూరంగా నిలబడి వున్న అమ్మాయిని కన్నుగీటి, అక్కడనుంచి వెళ్లిపోయేందుకు సిద్ధమయాడు.

''ఇదిగో, నా ఆర్డరు రద్దుచేశానూ అంటే నిన్ను చూసి కాదు, తాన్యను చూసి! ఆమెకు చెప్పకోవాలి నువ్వు ధన్యవాదాలు, నిన్ను అంతలా ఆమె ప్రేమించుతూన్నందుకు!'' అని కొరొొస్తెల్యోవ్ గట్టిగా చీవాట్లుపెట్టి, తను కూడా ఆమెను కన్నుగీటి, ఇక కారుకేసి వెళ్లిపోయాడు. ఆ అమ్మాయి, ఆ అబ్బీ చెట్టాపట్టాలు వేసుకుని, పళ్లిగిలిస్తూ కొరొొస్తెల్యోవ్‌కేసి చూస్తూ నుంచున్నారు....

అటువంటి మనిషి కొరొొస్తెల్యోవ్: తను తల్చుకుంటే వాళ్లు ఎన్ని పాట్లేనా పడివుండాల్సిందే.

ఐనా అతడు వాళ్లమీద తన శక్తి చూపించలేదు, ఎందుకంటే అతడి చేతిలో గొప్ప ప్రాభవం వుండడమే కాకుండా, అతడు మంచివాడు కూడానూ. వాళ్లు సంతోషంగా వుండాలనీ, ఆనందంతో నవ్వుతూ వుండాలని అతడలా చేశాడు.

అటువంటి కొరొొస్తెల్యోవ్ తనచెంత వున్నాడని సెర్యోష ఎంతో అంత గర్వపడ్డాడు, గర్వపడడా మరి?

వీళ్లందరిపైనా కొరొస్తెల్యోవ్‌ను పెద్దగా చేశారూ అంటే, దీని అర్థం, అతను వీళ్లందరికంటే తెలివైనవాడూ మంచివాడూ అనే కదా!

ఆకాశంలోనూ భూమిమీదా

ఎండకాలంలో నక్షత్రాలు అగపడవు. పెర్యోష పడుకునేప్పుడూ, నిద్ర నుంచి లేచినప్పుడూ — బయట వెలుగ్గా వుంటుంది. పొగమబ్బుగానూ వానగానూ వున్నప్పటికీ కూడా వెలుగ్గానే వుంటుంది. ఏమంటే, మబ్బు వెనకాలే వుంటాడు సూర్యుడు. ఆకాశం నిర్మలంగా వున్నప్పుడు కూడా ఒక్కొక్కప్పుడు సూర్యుడే కాకుండా, అద్దంముక్కలా తేటగా పారదర్శకంగా వున్న మచ్చ ఒకటి ఆకాశంలో అగపడుతుంది. ఇది చంద్రుడు — పగటిపూట, అనవసరంగా అలా ఆకాశంలో వేల్లాడుతూ, సూర్యరశ్మి చాటున దాగుంటూ, ఓ సారి అగపడుతూ, ఓ సారి మాయమైపోతూ వుంటాడు, ఇప్పుడే కరిగిపోయాడు; సూర్యుడు ఒక్కడే బ్రహ్మాండమైన నీలాకాశంలో రాజ్యంచేస్తూ వుంటాడు.

చలికాలంలో పొద్దు ఎంతోసేపు వుండదు; ఇట్టే చీకటిపడిపోతుంది; రాత్రిభోజనానికి ఇంకా ఎంతో ముందుగానే మంచుపడి నిశ్శబ్దంగా వున్న తోటలూ తెల్లని ఇంటికప్పులూ వున్న దాల్నయ వీధిని నక్షత్రాలు కప్పేస్తాయి. అవి వెయ్యి వుంటాయి, బహుశ లక్ష కూడా వుండొచ్చు. వాటిలో పెద్దవీ వున్నాయి, చిన్నవీ వున్నాయి. మరి, అన్నిటికంటే చిన్న నక్షత్రాలు ఇసుక నలుసులంతే వుంటాయి, ఇవి ఒకదానితో ఒకటి పాల చుక్కల్లా కలిసిపోయి, తెల్లగా మెరుస్తూ వుంటాయి. పెద్ద నక్షత్రాలు నీలం, తెలుపు, పసుపు మంటలతో మినుకు మినుకుమని తళ్కులొత్తుతూ వుంటాయి; సిరియస్ నక్షత్రానికి రెప్పవెంద్రుకల్లాంటి కిరణాలున్నాయి; మరి — ఆకాశంమధ్య వున్న నక్షత్రాల్లో చిన్నవీ, పెద్దవీ ఇసుక నలుసులంతవీ వున్నాయి; మంచులా

తళతళ మెరుస్తూ గట్టిపడిపోయిన పొగమబ్బులా అవి గజిబిజిగా ఏకమై పోయాయి, ఎక్కడ్నుంచో తీసుకొచ్చి రోడ్డుమీద పరచి ముడుతలుపడినట్టి అద్భుతమైన పట్టీ మోస్తరుగా అగపడుతూన్న వంతెనలా. ఈ వంతెనను పాలపుంత అంటారు.

మొదట్లో సెర్యోష నక్షత్రాల గురించి అంతగా పట్టించుకో లేదు, ఎందుచేతంటే వాటికి పేర్లున్నాయని సెర్యోషకి తెలియనే తెలియదు. అప్పుడు అమ్మే చూపెట్టింది – ఇది పాలపుంత అనీ, ఇది సిరియస్ అనీ, ఇది సప్తర్షి అనీ, ఎర్రగా వున్న ఈ నక్షత్రం అంగారకుడు అనీ. ప్రతి నక్షత్రానికీ ఓ పేరుందనీ, ఇసుక నలుసులంతే వున్న వాటికి సహితం పేర్లున్నాయనీ అమ్మే చెప్పింది. అవునట, మన కంటికవి చిన్న నలుసుల్లానే కనబడినప్పటికీ, అవి ఎంతో పెద్దవనే అమ్మ చెప్పింది. అంగారక నక్షత్రంమీద బహుశ మనుషులు కూడా వుండొచ్చునట.

నక్షత్రాలన్నిటి పేర్లు తెలుసుకోవాలని అనుకున్నాడు సెర్యోష; కాని అమ్మకి అన్నిటి పేర్లూ జ్ఞాపకం లేవట; అమ్మకి తెలుసును, కాని మరచి పోయిందట. ఐతే ఏం? – చంద్రమండలంమీద వున్న పర్వతాలను చూపించింది అమ్మ.

ఇంచుమించు ప్రతీ రోజూ మంచు కురుస్తూంది. కురిసిన మంచును రోడ్లమీదనుంచి మనుషులు ఊడ్చేసి, రోడ్లను శుభ్రంగా వుంచుతూంటారు; మంచుని కాళ్లతో మట్టేస్తూ వుంటారు, తొక్కేస్తూ వుంటారు, మళ్లీ కురుస్తూంటుంది మంచు; అదంతా పడి, ఎత్తుగా వున్న హంసతూలికా తల్పమవుతుంది. కంచెగోడల పొడుగు గుంజలపైన మంచు పడి, వాటికి కాగితపు కుళ్లాయిలు తగిలించినట్టే వుంటుంది. చెట్ల కొమ్మలమీద పడిన మంచు తెల్లని లావుపాటి గొంగళీపురుగుల్లా అవుపడుతుంది. కొమ్మల పంగట్లో గుండ్రని మంచుముద్దలు పోగవుతాయి.

సెర్యోష మంచులో ఆడుకుంటాడు, కోటలూ ఇళ్లూ కడతాడు,

యుద్ధం ఆట ఆడతాడు, స్లెయ్‌మీద కూచుని జారతాడు. కర్రల డిపోకేసి పొద్దు నెమ్మదిగా దిగిపోతుంది. సాయంకాలమైపోతుంది. తాడు పట్టుకుని స్లెయ్‌ని ఈడ్చుకుంటూ సెర్యోష ఇంటికెళ్లిపోతాడు. తోవలో ఆగి, మెడ వెనక్కి వంచి, తనకు తెలిసిన నక్షత్రాలకేసి సంతృప్తితో చూస్తాడు.

''ఈ అంగారకలోకం బహుశ మనుషులు జీవించగల్గేంతటి బ్రహ్మాండమైనదే గనుక అయివుంటే, నాలాంటి పిల్లడే ఒకడు బహుశ ఇప్పుడక్కడ వుండి, నాకున్న స్లెయ్‌లాంటిదే వాడికి వుండి, వాడి పేరు కూడా బహుశ సెర్యోషయే అయివుండొచ్చేమో....'' అని సెర్యోష ఆలోచించుకున్నాడు. ఆ ఆలోచన తట్టగానే సెర్యోష ఆశ్చర్యపడి, ఈ సంగతి ఎవరితోనైనా చెబుతే బాగుణ్ణనుకున్నాడు – కాని దీన్ని ప్రతివాడితోనూ చెప్పేందుకు వీల్లేదే – మంచివాడితో చెప్పాలి. అటువంటి వాడెవ్వడూ తనకి అగపడడం లేదు; పెద్దవాళ్లు తరుచుగా అర్థంచేసుకోరు, ఏదో వేళాకోళం చేస్తారు; ఇలాంటి విషయాల్లో తనను వేళాకోళం చేయడమంటే సెర్యోషకు మహా కష్టమనిపిస్తుంది, అవమానమనిపిస్తుంది. దగ్గర ఎవ్వరూ లేని సమయం ఎంచి, అప్పుడు తనకు తట్టిన ఆలోచన సంగతి కొరొస్తెల్యోవ్‌తో చెప్పాడు. కొరొస్తెల్యోవ్ వేళాకోళం చేయనేలేదు. ఈ సారి నవ్వకుండా, కాస్సేపు ఆలోచించి:

''అవుతే కావచ్చు సుమా'' అన్నాడు.

అలా అని, మరెందుకనో ఏమిటో, అతడు సెర్యోష బుజంమీద చెయ్యి వేసి, సెర్యోష కళ్లలోకి తదేకంగా చూశాడు.

....చాలాసేపు ఆడుకుని, చలివేసినట్టు అనిపించడంచేత సాయంకాలం ఇంటికొస్తాడు సెర్యోష. ఇంటికొచ్చేసి, వేడిగా వున్న స్టౌపొయ్యి దగ్గర కూచునే సరికి, హాయిగా వెచ్చగా వుంటుంది. ముక్కు చీదుకుని, చక్కగా చలికాచుకుంటూ అక్కడే కూచుంటాడు – సెర్యోష కట్టివిడిచిన

తడి పంట్లామును పాష అత్తయ్య బెంచిమీద పరుస్తుంది, చెమ్మగా వున్న ఫెల్ట్ బూట్సును స్టౌదగ్గర వుంచుతుంది. తరువాత అందరితోనూ కలిసి భోజనాల బల్లదగ్గర కూర్చుని, వేడివేడి పాలు తాగి, వాళ్ళు చెప్పకుంటూన్న కబుర్లు వింటూ, ఈ రోజు మంచులో కట్టిన కోటను తన స్నేహితులూ తనూ మరునాడు ఎలా ముట్టడించబోతారో, ఆ సంగతి గురించి ఆలోచించు కుంటూంటాడు.... చలికాలం ఎంతో హాయిగా చక్కగా వుంటుంది.

చలికాలం మంచిది, కాని అబ్బ! ఎన్నో రోజులుంటుంది: బరువైన బట్టలు వేసుకోవడమంటే విసుగెత్తుతుంది, చలిగాలితో చికాకెత్తిపోతుంది; ఎప్పుడు హాయిగా నిక్కరు తొడుక్కుని, సాండల్సు వేసుకుని ఎప్పుడు బైటకు వెళ్దామా ఎప్పుడు ఏట్లో ఈతకొట్టుదామా, ఎప్పుడు పచ్చికబయలుమీద గడ్డిలో దొర్లుదామా, ఎప్పుడు ఏట్లో చేపలు పట్టుదామా అనిపించిపోతుంది. చేపలు గాలానికి చిక్కకపోయినా, ఏ బాధా వుండదు కదా — కుర్రాళ్లను కలుసుకుని వాళ్లతో హాయిగా కాలం గడపొచ్చు, నేలలో గోతులు తీసి వానపాములను పట్టొచ్చు; ఏట్లో చేపలగెడ వేసి, గెడపట్టుకుని వొడ్డున కూచుని, ''ఏయ్, షూర! నీ ఎర కొరికిందేమోరా!'' అని కేకేయ్యొచ్చు. ఇదంతా ఎంతో సరదాగా వుంటుంది!

అరె, మంచుతుపాను మళ్లీ మొదలెట్టిందే! నిన్నను అప్పడే మంచు కరిగిపోయిందాయె. ఈ చలికాలం విసుగెత్తించేస్తూంది.

...కిటికీ అద్దంమీద పడిన నీరు అష్టవంకర్లుగా, అద్దంమీదనుండి కన్నీటిబొట్లులా ప్రవహించుతూంది. వీధిలో పడివున్న మంచు కరిగి, చిక్కటి కారు రొంపిలా తయారై, దానిపైన సన్నని బాటలు ఏర్పడుతు న్నాయి: వసంతకాలం వచ్చేసింది! ఏటిపైనున్న మంచుపొర కరిగి, ఏరు పారడం మొదలెట్టింది. మంచు పెళ్లలు ఏట్లో ఎలా పరుగులు తీస్తున్నాయో చూడ్డానికని నేస్తులతో కలిసి సెర్యోష ఏటి ఒడ్డుకు వెళ్లాడు. మొదట పెద్ద పెద్ద బురద ముద్దల్ని ఎత్తుకుపోయింది ఏరు. అటు తర్వాత అదేదో

బూడిదరంగు మంచు అంబలిలాంటిది ఏట్లో పారింది. తరువాత ఏరు పొంగడం మొదలెట్టింది. అవతలి ఒడ్డున వున్న విల్లో చెట్ల బోదెలకు సగం ఎత్తువరకూ నీళ్లొచ్చేశాయి. అంతా ఏకనీలం — నీరూ, ఆకాశమూ నూ; కచికరంగులో మిళితమైన తెలుపువన్నె మేఘాలు ఆకాశంలోనూ నీట్లోనూ పరుగులు తీస్తున్నాయి.

...దాల్నాయ వీధి అవలి తట్టున — మంచి ఏపుగానూ, చౌరశక్యం కాకుండానూ పైరు ఎదగడం సెర్యోష గమనించనే లేదు. అరె ఈ తొలకరి రై పైరు ఎప్పుడు కోటాకేసింది, ఎప్పుడు పూవు పూసింది, ఎప్పుడు పువ్వు రాలింది, అరె? — అని విస్తుపోయాడు.... తన దైనందినపు గొడవలో పడిపోయి దీన్నింతనీ సెర్యోష గమనించనే లేదు. ఇహ అప్పుడే పైరు పాలు పోసుకుని గింజ ముదురుతూంది. రోడ్డుమీద నడుస్తూన్నప్పుడు నెత్తిమీదనుంచి హుస్ అంటూ హాయిగా చప్పుడు చేస్తూంటుంది. తల్లి పక్షులు పిల్లపక్షులను సాకుతున్నాయి. గడ్డికోత యంత్రాలు పచ్చికబయళ్లలోకి వెళ్తాయి. పువ్వులను కోసిపారేస్తారు — ఆ పువ్వులు మొలుస్తూంటే, అవతలి గట్టు రత్నకంబళిలా అగపడేది. స్కూలుపిల్లలకి సెలవలిచ్చేశారు. ఎండలు ముదిరాయి. మంచు గురించీ నక్షత్రాల గురించీ ఆలోచించడమే మర్చిపోయాడు సెర్యోష....

సెర్యోషను కొరొస్తెల్యోవ్ తన దగ్గరకు పిలిచి, తన మోకాళ్ల మధ్య నిలబెట్టుకుంటాడు.

''ఇదిగో — మనం ఓ సంగతి ఆలోచించాలి. ఓ పాపని తెచ్చుకోవాలనుకో— అప్పుడు నీకు ఎవరు కావాలి — అబ్బాయా, అమ్మాయా?'' అన్నాడు.

''అబ్బాయే!'' అన్నాడు సెర్యోష వెంటనే.

''ఇప్పుడు ఒక విషయం: మనకి ఒక అబ్బాయికంటె ఇద్దరు అబ్బాయిలుండడం మరీ మంచిది — అందుకేమీ సందేహంలేదు. అయినా, అటు మరో

విషయం కూడా వుంది: మనింట్లో అప్పుడే ఓ అబ్బాయి వుండనే వున్నాడు, అందుచేత ఈ సారి అమ్మాయి వుంటే బాగుంటుందేమో?''

''సరే, ఐతే — నీ యిష్టమే కానీ'' అన్నాడు సెర్యోష. ఏమంత ఇష్టం చూపకుండా. ''అమ్మాయి ఐనా సరేలే. అబ్బాయి అవుతే — వాడితో ఆడు కుందుకి నాకు బాగుంటుంది.''

''అమ్మాయిని నువ్వు ఆడించాలి, దాన్ని ఎవ్వరూ ఏమీ చెయ్యకుండా నువ్వు జాగ్రత్తగా చూస్తూవుండాలి — నువ్వు పెద్దవాడివి కదా మరి, అందు కని అన్నయ్యలా చూసుకోవాలి. అబ్బాయిలెవ్వరూ దాని జుట్టు పట్టుకుని పీకకుండా నువ్వు చూస్తూ వుండాలి.''

''అమ్మాయిలు కూడా అబ్బాయిలు జుట్టుపట్టుకుని పీకుతారే. అమ్మో, ఎలాగనుకున్నావేమిటి!'' అని తనను లీద ఎలా జుట్టుపట్టుకుని పీకిందో చెప్పాలనుకున్నాడు, కాని సెర్యోషకి కొండేలు చెప్పడమంటే ఇష్టంలేదు. ''ఎలా పీకి గుంజుతారంటే, అబ్బాయిలు మొర్రోమని ఏడుస్తారు'' అన్నాడు.

''మనమ్మాయి బుల్లిగా వుంటుంది. అది అలా జుట్టు పట్టుకుని పీకదు'' అన్నాడు కొరోస్తెల్యోవ్.

''అవును, అలా పీకదు — ఐనా అబ్బాయే నాకిష్టం'' అన్నాడు సెర్యోష ఆలోచిస్తూనూ. ''అబ్బాయే నయం.''

''ఏం కదా?''

''అబ్బాయిలు సాధింపులు సాధించరు. అమ్మాయిలకి తెలిసింది అదొక్కటే — ఊరకే సాధింపులు సాధించడం.''

''అలా అంటావా? ....ఊ. ఇది ఆలోచించాల్సిన విషయమే సుమా! దీని గురించి మనం ఇంకా మాట్లాడుకోవాలి, ఏం అంతేనా?''

''అలాగే, మాట్లాడుకుందాం!''

ఈ సంభాషణ అమ్మ వింటూంది — విని చిరునవ్వు నవ్వింది. ఆమె అక్కడ కూచుని, ఏదో కుట్టుకుంటూంది. వదులుగా వెడల్పుగా వున్న

డ్రెస్సింగ్ గౌను కుట్టుకుంది. అంత వదలుగా ఎందుకు కుట్టుకుందా అని సెర్యోష ఆశ్చర్యపడ్డాడు. ఐనా అమ్మ మరీ లావై పోతూంది. ఇప్పుడేమో ఆమె చేతిలో అదేదో బుచ్చిబుచ్చిది వుంది. దాని అంచుకి లేసు కుట్టు తూంది.

''ఏమిటే అమ్మా, నువ్వు కుట్టుతూన్నది?'' అని అడిగాడు సెర్యోష.

''బుల్లి టోపీ. బుల్లాడికో, బుల్లెమ్మకో – మీరు ఎవరిని తీసుకురావ డానికి నిశ్చయిస్తారో, మరి?'' అంది తల్లి.

''ఆ పాపకి ఇంత బుల్లి తలకాయే వుంటుందా?'' అని అడిగాడు సెర్యోష, ఆటవస్తువులా వున్న ఆ బుల్లిటోపీకేసి కఠినంగా చూస్తూ. (ఇదిగో, ఇంత పిసరు తలకాయే గనక వుంటే, దాని జుట్టు పీకేసరికి తలకాయే వూడొచ్చేస్తుందేమో!)

''మొదట్లో అంత పిసరే వుంటుంది. తరువాత ఎదుగుతుంది. నువ్వే చూస్తున్నావుగా – వీక్తోర్ ఎలా ఎదుగుతున్నాడో, నీమటుకు నువ్వూ అలాగే ఎదుగుతున్నావు! పాప కూడా అలా ఎదుగుతుంది'' అంది అమ్మ.

ఆ బుల్లిటోపీని తల్లి తన చేతికి పెట్టుకుని దానికేసి చూసింది; ఆమె ముఖం సంతోషంతో వెలిగిపోతూ వుంది. కొరొస్తెల్యోవ్ ఆమెను జాగ్రత్తగా నుదిటిమీద – మృదువుగా తళ్కొత్తుతూన్న ఆమె ముంగురులు ఎక్కడైతే మొదలవుతున్నాయో సరిగ్గా అక్కడ – ముద్దుపెట్టుకున్నాడు...

అబ్బాయి కోసమో, మరి అమ్మాయి కోసమో – వాళ్లు నిజంగా అన్నీ సిద్ధం చేశారు: చిన్న తొట్టెమంచమూ, రజాయీ కొన్నారు. మరి ఆ వచ్చేది అబ్బాయో అమ్మాయో – ఆ పాపని సెర్యోష కోసం కొన్న తొట్టెలోనే స్నానం చేయిస్తారుట. ఆ తొట్టె తనకిప్పుడేలాగూ చిన్నదైపోయి ఇరకాటంగానే వుంది. తనకందులో కూచోడమే కష్టమైపోతూంది. కాళ్లు చాపుకుందుకే చోటులేదందులో; కాని ఈ పిసరు టోపీకి సరిపడే ఈ బుల్లి తలకాయ మనిషికి ఆ తొట్టె సరిగ్గా అమరుతుంది.

పాపలు ఎక్కడ్నుంచి వస్తారో అందరికీ తెలుసును: ఆస్పత్రినుండి కొనుక్కుని తెచ్చుకుంటారు. ఆస్పత్రులు అమ్ముతాయి పాపల్ని. ఒకావిడె ఏకంగా ఇద్దరు పాపల్ని కొని తెచ్చుకుంది. ఇద్దర్ని కొని తెచ్చుకోవడం బాగానే వుంది — ఇద్దరి పాపలకీ ఒక్కటే పోలిక, ఇద్దర్నీ ఒకరినుండి ఒకర్ని పుట్టుమచ్చను బట్టి పోల్చుకుంటుందట ఆమె — ఒక పాపకి మెడమీద పుట్టుమచ్చ వుంది, ఒక పాపకి పుట్టుమచ్చ లేదు; కాని అచ్చుగుద్దినట్టు అచ్చంగా ఒక్కలా వున్నవాళ్లని ఎందుకు తెచ్చుకుందో మరి — అర్థంకావడం లేదు. కొనుక్కొనేటప్పుడు వేర్వేరు రకాలవి కొనుక్కుంటే బాగుంటుంది.

కొరొస్తెల్యోవూ అమ్మా పాపని కొనడానికే నిశ్చయించుకున్నారు — కాని వెంటనే వెళ్లి కొనుక్కురాకుండా ఎందుకిలా తాత్సారం చేస్తున్నారో మరి? అసలు ఎంతో ఆత్రంతో మొదలైందీ వ్యవహారం: మంచం కొన్నారు, మంచం వచ్చి అక్కడుంది, కాని అబ్బాయో, అమ్మాయో — ఎవ్వరూ లేరు.

''ఎవరినో ఒకరిని మీరింకా కొనుక్కురారేమీ?'' అని అడిగాడు సెర్యోష అమ్మని.

అమ్మ నవ్వింది — ఎందుకోసమని తను ఇలా లావెక్కిపోతూందో మరి, పాపం!

''సరిగ్గా ఇప్పుడే వాళ్లెవరినీ అమ్మడంలేదురా. మరో నాల్గు రోజులు ఆగాలి మనం. అప్పుడు కొనుక్కుందాం'' అంది అమ్మ.

అవును, ఒక్కొక్కప్పుడు ఇలాగే అవుతుంది: మనకి కావాల్సివచ్చి మనం కొనుక్కుందామనుకున్నప్పుడే సరుకు దొరకదు. మరి అలాంటప్పుడు కొన్నాళ్ళు ఆగాలి. నాల్గు రోజులు ఆగితే ఏంపోయింది? ఎలాగూ కొనుక్కుంటాం కదా, తనకేమీ తొందర్లేదు — అనుకున్నాడు సెర్యోష.

చిన్నపిల్లలు త్వరగా ఎదుగుతారంటుంది అమ్మ, కాని వాళ్ళు మెల్లగా ఎదుగుతారు, ఎందుచేతనో మరి — వీక్తొర్ వున్నాడు, వాణ్ణి చూస్తున్నాంగా. వీక్తొర్‌కి అప్పుడే ఏడాదిమీద ఆర్నెల్లు. పెద్దపిల్లలతో కలిసి

వాడు ఆడుకోగల్గేందుకు — అబ్బో, ఇంకా ఎన్నాళ్లో పోవాలి! అలాంటిది — కొత్త అమ్మాయో, కొత్త అబ్బాయో అవుతే — తనతో, సెర్యోషతో, ఆడుకోగల్గాలంటే — ముందుముందు ఎంతకాలమో పోవాలి, నిజంగా చెప్పాలంటే ఎంతకాలమో ఊహించుకోనేలేమన్న మాట! ఐనా ఆ కాలం వచ్చేవరకూ తను ఆ అబ్బాయినో ఆ అమ్మాయినో ఆడించుతూ, కడమ పిల్లలు ఏమీ చెయ్యకుండా జాగ్రత్తగా చూస్తూవుండాలి. ఇది ఎంతైనా గొప్ప పనే, ఎంత గొప్ప పనో సెర్యోష అర్థంచేసుకున్నాడు; కాని కొరొస్తెల్యోవ్ సూచించినంతటి సరదా అయిన పనేమీ కాదు. వీక్తొర్‌ని లీద ఎంతో కష్టంతో పెంచుతూంది: అవును ఒక్కొక్కప్పుడు వాణ్ణి చెయ్యిపట్టుకుని ఈడ్చేస్తుంది, వాణ్ణి వెక్కిరిస్తుంది, కొడుతుంది కూడానూ. ఈమధ్య వాళ్ల అమ్మా నాన్నా ఎవరింటికో పెళ్లికెళ్లారు, పాపం లీద ఇంట్లో వుండిపోయి ఏడుస్తూ కూచుంది. వీక్తొర్ గనుక లేకపోయుంటే, వాళ్లు లీదని కూడా పెళ్లికి తీసుకెళ్లి వుందురు. అస్తమానూ వాణ్ణి కనిపెట్టుకుని వుంటూ బతకడమంటే, జైల్లో పెట్టినట్టే వుంది తనకి — అంది లీద.

సరే దానికేమిటి గాని: అమ్మకీ కొరొస్తెల్యోవ్‌కీ సాయంచేస్తానని ఒప్పుకున్నాడు సెర్యోష. మరే బెంగలేకుండా వాళ్లని వాళ్ల పనుల్లోకి వెళ్లిపొమ్మనండి, పాష అత్తయ్యని ఇంట్లో వంటా వార్పూ చూసుకోమనండి. తను, సెర్యోష, వున్నాడుగా, మరేమీ ఫర్వాలేదు, పాపం బేబీ బొమ్మ తలకాయంత తలకాయే వున్న నిరాధారమైన ఆ పసికందువును తను చూస్తూవుంటాడు లెండి. తను చూడకపోతే ఆ పాపకి ఏమవుతుందో ఏమిటో — ఏమైనా కావచ్చు! పాపకి తను బువ్వ పెడతాడు, పక్కమీద పడుకోబెడతాడు. లీద, తనూ — ఇద్దరూ కలిసి ఒకరికొకరు సాయంచేసుకుంటూ, పిల్లల్నిద్దరినీ అక్కడకీ ఇక్కడకీ తీసుకెళ్లి ఆడిస్తూ వుంటారు: ఇద్దరూ కలిసి పిల్లల్ని చూసుకుంటే, పని సులువుగా వుంటుంది — వాళ్లు నిద్దరోతున్నప్పుడు తామిద్దరూ కలిసి ఆడుకోవచ్చు.

ఒకనాడు పొద్దున్న సెర్యోష నిద్రనుండి లేచాడు — అప్పుడు సెర్యోషతో చెప్పారు, పాపను తీసుకురావడానికని అమ్మ ఆస్పత్రికి వెళ్లిందని.

సెర్యోష ఇందుకు సిద్ధంగానే వున్నప్పటికీ, తీరా ఈ సంగతి వినేసరికి గుండె ఒక్క క్షణం ఆగిపోయినట్టయింది తనకి — ఎంతో అంత ముఖ్యమైన సంగతి కదా మరి....

అమ్మ ఎప్పుడు వస్తుందా అని సెర్యోష గంటల తరబడి కనిపెట్టు క్కూచున్నాడు; గేటుదగ్గరకెళ్లి చూస్తూ నుంచున్నాడు — అబ్బాయినో అమ్మా యినో ఎత్తుకుని అమ్మ వీధి మొగిని ఎప్పుడు అగపడుతుందా. అగపడీ అగపడడంతో రైంయ్‌మని తను దూసుకుపోయి అమ్మని కలుసుకుందామని.... ఇంతట్లో పాష అత్తయ్య "కొరొస్తెల్యోవ్ నిన్ను టెలిఫోనులో పిలుస్తు న్నాడ్రా!" అని కేకేసింది.

సెర్యోష ఇంట్లోకి పరుగెత్తి వెళ్లి, బల్లమీద వున్న నల్లని రిసీవరు తీసి చెవిదగ్గర పెట్టుకున్నాడు.

"ఆఁ, వింటున్నాను!" అని బిగ్గరగా అరచాడు రిసీవరులోకి. కొరొస్తె ల్యోవ్ బదులు చెప్పాడు. — అతని గొంతుక మంచి ఉత్సాహంగానూ సంతోషంగానూ వుంది:

"సెర్యోష! నీకు తమ్ముడొచ్చాడు! వింటున్నావా? తమ్ముడు! నీలంగా వుంటాయి కళ్లు! నాలుగు కిలోలున్నాడు బరువు. భేషుగ్గా వుందికదూ, ఏం? నీకు సంతోషంగా వుంది కదా?" అని అడిగాడు కొరొస్తెల్యోవ్.

"ఆఁ! ఆఁ!" అని సెర్యోష, తబ్బిబ్బుపడుతూ తాపీగా కేకేశాడు. రిసీ వరు వూరుకుంది. గౌను ముందు కట్టుకున్న గుడ్డ అంచుతో పాష అత్తయ్య కళ్లు తుడుచుకుని "నీలం కళ్లు అంటే — వాడి నాన్న పోలిక అన్నమాట. భగవంతుడు కటాక్షించాలి! శుభమస్తు!" అంది.

"వాళ్లు వేగమే ఇంటికొచ్చేస్తారా?" అని అడిగాడు సెర్యోష. వాళ్లు ఇంటికొచ్చేసరికి వారంరోజులే అవుతుందో, ఇంకా పైనే అవుతుందో, అని

పాష అత్తయ్య జవాబుచెప్పింది. ఆ జవాబు చెవినిబడేసరికి, అంత ఆలస్యం ఎందుకవుతుందా అని ఆశ్చర్యంతోనూ విచారంతోనూ సెర్యోష ఆమెను అడగ్గా — పిల్లాడికి అమ్మదగ్గర అలవాటు అవద్దామరి, అలవాటు అవడం ఎలాగో ఆస్పత్రివాళ్లు వాడికి నేర్పుతారు, అని ఆమె చెప్పగా, ఆలస్యమవడానికి ఇదీ కారణమని తెలుసుకున్నాడు సెర్యోష.

కొరొస్తెల్యోవ్ రోజూ ఆస్పత్రికి వెళ్లేవాడు. అతణ్ణి అమ్మదగ్గరకి వెళ్లనిచ్చేవారుకారట, కాని అమ్మ అతనిపేర చీటీలు రాసి వాళ్లకి ఇస్తే, వాటిని వాళ్లు కొరొస్తెల్యోవ్‌కి అందజేసేవాళ్లట. మన బుల్లాడు మంచి చక్కగా వుంటాడనీ, వాడిది అసాధారణమైన తెలివనీ, ఎంతో ఆలోచించి ఆలోచించి, వాడికి అలెక్సేయ్ అని పేరు పెట్టేందుకు నిశ్చయించాననీ వాణ్ణి పిలవడం మాత్రం ల్యోన్య అని పిలుద్దామనీ, అక్కడ ఆస్పత్రిలో తనకు మతిపోయేటంత విసుగ్గా వుందనీ, ఇంటికోసం బెంగపెట్టుకున్నాననీ మరి — అందరినీ అడిగినట్టూ ముద్దుపెట్టుకున్నట్టూ, ముఖ్యంగా సెర్యోషను కౌగిలించుకుని ముద్దుపెట్టుకున్నట్టూ చెప్పవల్సిందనీ రాసింది.

...వారం రోజులూ, ఇంకా అంతకుపైగా మరికొన్ని రోజులు కూడా గడచిపోయాయి. ఓనాడు కొరొస్తెల్యోవ్ ఇంట్లోనుంచి బయటికొచ్చి ''నే వచ్చేదాకా నాకోసం వుండు, అమ్మనీ ల్యోన్యనీ ఇంటికి తీసుకురావడానికి మనమిద్దరం వెళ్దాం'' అన్నాడు సెర్యోషతో.

ఆనాడు కొరొస్తెల్యోవ్ పూలగుత్తి ఒకటి తీసుకొని తోస్య అత్త కారుమీద ఇంటికొచ్చాడు. సెర్యోషని కారులో ఎక్కించుకుని, ఆస్పత్రికి — ముత్తవ్వ చనిపోయిందే సరిగ్గా ఆ ఆస్పత్రికే — వెళ్లారు. గేటు దాటిన తర్వాత ఆస్పత్రిలో వున్న మొదటి గుమ్మందగ్గరకు వెళ్లేసరికల్లా ''ద్మిత్రి! సెర్యోష!'' అని అమ్మ కేకేయడం వినబడింది.

తెరచివున్న కిటికీలోనుంచి అమ్మ చూస్తూవుందేమో, అమ్మ కిటికీలోనుంచి చెయ్యి వూపింది. సెర్యోష: ''అమ్మా!'' అని కేకేశాడు. అమ్మ

మళ్లీ మరొకసారి చెయ్యి వూపి, కిటికీ దగ్గరనుంచి లోపలికెళ్లిపోయింది. మరో గడియకల్లా వచ్చేస్తుందిలే అన్నాడు కొరొస్తెల్యోవ్. కాని ఎంతో సేపైంది, అమ్మ ఇంకా రాలేదు — తోటలో వున్న కాలిబాటమీద తిరిగారు కిర్రుకిర్రుమని చప్పుడుచేస్తూ వోరగా తెరుచుకున్న స్ప్రింగు తలుపు తీసి చూస్తూ ఇంచుమించు నీడ ప్రసరించకుండా పారదర్శకంగావున్న లేతచెట్టు కింద అమర్చిన బెంచీమీద కూచున్నారు వాళ్లు. కొరొస్తెల్యోవ్ కాస్త గాభరాపడ్డాడు: ఆమె వచ్చేలోపల పువ్వులు కాస్తా వాడిపోతాయే ఏమిటో అని. తోస్య అత్త కారును గేటుదగ్గర ఆపి, వాళ్లిద్దరి దగ్గరకూ వచ్చి, వాళ్లతో కలిసి బెంచీమీద కూచుని, ఆస్పత్రిలో ఎప్పుడూ ఇలాగే ఆలస్యం అవుతూ వుంటుందని కొరొస్తెల్యోవ్‌తో అంది.

చిట్టచివరకి, కిర్రుమంటూ తలుపు తెరుచుకుని, చుట్టగా చుట్టిన నీలంరంగు మూట ఒకదాన్ని రెండు చేతుల్లోనూ పెట్టుకుని అమ్మ గుమ్మం లోనుంచి బయటకొచ్చింది. వాళ్లు చప్పున అమ్మదగ్గరకి దూసుకుని వెళ్లే సరికి:

''జాగ్రత్త, జాగ్రత్త!'' అంది అమ్మ.

కొరొస్తెల్యోవ్ పూలగుత్తిని అమ్మకిచ్చి, ఆమె చేతుల్లోవున్న మూటను తను తీసుకుని, తలని కప్పిన లేసు గుడ్డని తీసి మొహం చూసి, గంభీరంగా, కారుయెరుపుగా వున్న ఆ చిట్టిముఖాన్ని సెర్యోషకి చూపించి: ''వీడే నీ తమ్ముడు ల్యోన్య'' అని చెప్పాడు.... ఓ కన్ను కొద్దిగా, అదేదో మసమసగ్గా, నీలంగా సన్నని బీటలా కనబడుతూ తెరచి వుంది, చిట్టి మొగం వంకరగా పెట్టేశాడు. కొరొస్తెల్యోవ్ గాద్గదికంగా: ''వోరి — వోరి — వోరి...'' అని వాణ్ణి ముద్దుపెట్టుకున్నాడు.

''ద్మిత్రి! ఏమిటి చేస్తున్నావ్?'' అంది అమ్మ కొంచెం కఠినంగా.

''ఏం, వాణ్ణి ఒక్కమాటు ముద్దుపెట్టుకోకూడదా?'' అని అడిగాడు కొరొస్తెల్యోవ్.

''వాడికేదేనా ఇన్‌ఫెక్షన్ సోకుతుంది'' అంది అమ్మ. ''వాడి దగ్గరికి వెళ్లే వాళ్లందరికీ మస్లినుగాజ్ వేస్తారు. నా మాట విను, వొద్దు, దీమ్త్రి!''

''పోన్లే, మరి, ముద్దుపెట్టుకోన్లే!'' అన్నాడు కొరొస్తెల్యోవ్.

ఇంటికొచ్చాక, వాడికి చుట్టబెట్టిన గుడ్డలు విప్పేసి, వాణ్ణి అమ్మ తన మంచంమీద పడుకోబెట్టింది. వాడలా పడుకుని వుండగా, వాణ్ణి చూశాడు సెర్యోష. ఇదేమిటి — చక్కగా వున్నాడని అందే అమ్మ? పొట్ట తుంబలా వుంది; ఇవి మనిషి కాళ్లూ చేతులూ అంటే, నమ్మేందుకు వీల్లేదు — పొట్టిగా పిసరంతేసి వున్నాయి కాళ్లూ చేతులూనూ; ఏ ఆలోచనా సాలోచనా లేకుండా ఒళ్లు కదుపుతున్నాడు. మెడ అంటూ అసలు లేనేలేదు కదా. మరి, వాడి తెలివి ఎందులో వుందో ఏమీ అంతు చిక్కలేదు. ఖాళీగా వున్న బోసి నోరు తెరచి, జాలి పుట్టించేటట్టు అదేమిటో అదో మోస్తరుగా కెవ్వు కెవ్వుమంటూ నీరసంగా, బతిమాలుకుంటూన్నట్టుగా విసుగు పుట్టించేటట్టు ఏకరీతిగా అలుపులేకుండా ఏడుస్తాడు.

''వొంవిరా, చిట్టితండ్రీ? వొంవిరా?'' అంటూ అమ్మ వాణ్ణి వూరుకోబెడుతుంది. ''చిట్టితండ్రికి ఆకలేస్తూందా? అవున్రా, వేళైందిరా పాలకి! చిట్టి నాయనకి పాలవేళైంది! ఒక్క క్షణంరా, బాబూ! ఒక్క క్షణమే!''

అమ్మ బిగ్గరగా అని అటుపక్క తిరిగింది — అమ్మ ఇప్పుడు లావుగా లేనేలేదు — బాగా తీసిపోయింది. అమ్మ ఆదేశాలివ్వడమే తడవుగా కొరొస్తెల్యోవూ, పాష అత్తయ్యా అతిశ్రద్ధగా అమ్మకి సాయంచేశారు.

ల్యోన్యని చుట్టబెట్టిన గుడ్డలు తడిసిపోయాయి. అమ్మ ఆ గుడ్డలు తీసేసి, వాడికి పొడిగుడ్డలు చుట్టబెట్టి, వాణ్ణి పక్కను బెట్టుకుని కుర్చీలో కూచుని, తన బాడీసు గుండీలు విప్పుకుని, రొమ్ము పైకి తీసి, ల్యోన్య నోట్లో పెట్టింది. ల్యోన్య మరొక్కసారి ఏడ్చి, పెదవులతో రొమ్ము పట్టుకొని, వాడికి బాగా దాహం వేసిందేమో, పాలు పీల్చడం మొదలెట్టాడు.

''అబ్బ, ఏం పిల్లాడు బాబూ!'' అనుకున్నాడు సెర్యోష.

సెర్యోష మనసులో మెదలుతూన్న ఆలోచనను కొరొస్తైల్యోవ్ పోల్చుకుని, సెర్యోషతో మెల్లగా:

''వాడు పుట్టి ఈవేళకి తొమ్మిది రోజులే అయింది; అర్థమైందిగా నీకు? అసలీవేళ తొమ్మిదో రోజు; పాపం, వాణ్ణి ఏమీ అనలేం, ఏం?''

''అవును'' అని కంగారుపడుతూ ఒప్పుకున్నాడు సెర్యోష.

''తరువాత, మరి నాల్గు రోజులుపోయాక, వాడిక్కావల్సిందేదో వాడే అడుగుతాడు, నువ్వే చూస్తావుగా!'' అన్నాడు కొరొస్తైల్యోవ్.

సెర్యోష ఆలోచించుకున్నాడు: ఇందుకు ఎన్నాళ్లు పడుతుందో కదా! అంతవరకూ వాడివెంట వుంటూ వాణ్ణి చూస్తూ వుండాలి – చేత్తోపట్టు కుందుకు వీల్లేకుండా పితపితగా జావలా వుంటాడు, వాణ్ణి అమ్మ సహితం అతి జాగ్రత్తగా తీస్తుంది.

ల్యోన్య కడుపునిండా పాలు తాగేసి, అమ్మ మంచంమీద పడుకుని నిద్ర పోయాడు. పెద్దవాళ్లు భోజనాల గదిలో కూచుని, వాడి గురించి కబుర్లు చెప్పుకుంటున్నారు.

''వాడికి ఆయా వుండాలి'' అంది పాష అత్తయ్య, ''నేనొక్కర్తెనే వాణ్ణి చూడలేనేమో?''

''ఆయా అక్కర్లేదు, ఎవరూ అక్కర్లేదు'' అంది అమ్మ. ''సెలవలిచ్చే వరకూ వాణ్ణి నేనే చూసుకుంటూ వుంటాను; తరువాత వాణ్ణి నర్సరీలో వుంచేస్తాం, అక్కడ మంచి నర్సులుంటారు. మంచి సంరక్షణ జరుగుతుంది.''

''అవును, ఇదీ మంచిదే, నర్సరీలో వుంచితే సరి'' అనుకున్నాడు సెర్యోష; అలా అనుకునేసరికి సెర్యోష మనసు కుదుటపడింది. వీక్తార్‌ని నర్సరీలో వుంచేస్తామని లీద ఎప్పుడూ కలగంటూనే వుంటుంది.... తల్లి పడుకునే మంచంమీదకెక్కి సెర్యోష ల్యోన్య పక్కనే కూచుని, వాణ్ణి చూస్తున్నాడు – వాడు కైంయ్‌మని ఏడవకుండా వున్నప్పుడూ, మొగం ఇట్టే పెట్టకుండా వున్నప్పుడూ వాడెలా వుంటాడో చూద్దామని. ల్యోన్య కను

రెప్పలకి కూడా వెంట్రుకలున్నాయన్న మాట, కాని అవి చాలా చిన్నవి. మొగం పైన కారు ఎరుపు చర్మం మెత్తగా ముఖమల్లులా వుంది; వాణ్ణి ముట్టుకుని చూద్దామని సెర్యోష తన చెయ్యి మెల్లగా చాపాడు....

''ఏమిటి చేస్తున్నావురోయ్?'' అని అమ్మ కేకవేస్తూ అక్కడకొచ్చింది.

సెర్యోష అదాటుగా తుళ్లిపడి, గబుక్కున చెయ్యి వెనక్కి లాగేసుకున్నాడు....

''మంచం దిగు నువ్వు; దిగు వెంటనే! కుళ్లు చేతులతో వాణ్ణి అలా ముట్టుకోకూడదు!''

''నా చేతులు శుభ్రమైనవేనే!'' అన్నాడు సెర్యోష, హడలిపోయి, మంచం మీదనుండి దిగిపోతూనూ.

''ఇదిగో, నేనొక్కటే చెబుతున్నా – వాడింకా పసిగుడ్డుగా వున్నంత కాలమూ నువ్వు వాడికి కాస్త దూరంగానే వుండాలి. వాడిమీద నువ్వు అనుకోకుండా పడిపోవచ్చు – అంతేకాదు, మరొకటి కూడానూ – మీ నేస్తుల లెవ్వరినీ వాడిదగ్గరకు తీసుకురాకు, వాడికి ఏ జబ్బే సోకునో ఏమో.... మనం ఇక్కడ్నుంచి వెళ్లిపోవడం మంచిది. దా, వెళ్లిపోదాం!'' అని అమ్మ ముద్దుగానూ, మళ్లీ ఆజ్ఞాపిస్తూన్నట్టూనూ తన మాటలు పూర్తిచేసింది.

సెర్యోష వినయ విధేయతలతో గదిలోనుంచి వెళ్లిపోయాడు. సెర్యోష మెదడులో ఆలోచనలు మెదలాయి. ఇదంతా తను అనుకున్నట్టూ జరగడమే లేదు.... గదిలోకి కిటికీలోనుంచి వెల్తురు వస్తే ల్యోన్య నిద్రకు ఎక్కడ భంగంకల్గుతుందో అని చెప్పి, తల్లి కిటికీని శాలువతో కప్పేసి, సెర్యోష వెంట తాను కూడా గదిలోనుంచి వచ్చేసి, మెల్లగా తలుపు జేరేసింది....

వాస్య, వాడి మామయ్య

వాస్యకి మామయ్య వున్నాడు. వాడికి మామయ్యా లేడు, గీమయ్యా లేడు, అదంతా సర్వాబద్ధం అని లీద సహజంగానే చెప్పివుండేది; కాని లీద

నోరు మూసుకోవాల్సే వుంటుంది: వాస్యకి నిజంగానే మామయ్య వున్నాడు. అదిగో ఆయన ఫోటో – ఆ పుస్తకాల అలమారుపైన – ఎర్రకాగితపు గసగసాల పువ్వులున్న రెండు వాజుల మధ్యనూ వుంది. తాటిచెట్టుకింద నిలబడి ఫోటో తీయించుకున్నాడు ఆయన; ఆయన దుస్తులన్నీ తెల్లనివే – ఆపాదమస్తకమూ తెలుపే. సూర్యుడు ఎంత తీక్ష్ణంగా వున్నాడంటే, కళ్లు పొడుచుకుపోయి, ముఖమూ సూటూ – ఏదీ స్పష్టంగా కనబడ్డంలేదు. ఫోటోలో బాగా కనిపిస్తున్నవి తాటిచెట్టుకింద రెండు పొట్టి నీడలు మాత్రమే – ఒకటి మామయ్యదీ, ఒకటి తాటిచెట్టుదీ.

ముఖం కనబడకపోయినా ఫర్వాలేదు – కాని మామయ్య ఏమి దుస్తులు వేసుకున్నాడో దురదృష్టవశాత్తూ సరిగ్గా కనబడ్డంలేదు. ఫోటోలోవున్న ఆయన వాస్య మామయ్య మాత్రమే కాదు, ఆయన మహాసముద్ర నౌకాయానంలో కెప్టెను కూడానూ. మహాసముద్ర నౌకాదళంలో కెప్టెన్లు వేసుకునే దుస్తులు ఎలా వుంటాయో? ఈ ఫోటో ఒవాహూ ద్వీపంలో హానొలూలూ అనే పట్నంలో తీసినదని వాస్య చెప్పాడు. మామయ్య అప్పుడప్పుడు ఏవైనా వస్తువులను పార్సిలుచేసి పంపిస్తూంటాడట. వాస్య తల్లి గొప్పగా చెబుతూంటుంది:

''మళ్లీ పంపించాడు కోస్త్య రెండు కత్తిరింపులు!''

ఒక గౌనుకి సరిపడ్డ చీటిగుడ్డను ఆమె కత్తిరింపు అంటుంది. ఒక్కొక్కప్పుడు ఆ పార్సిళ్లలో ఎంతో విలువైన వస్తువులుంటాయి –ఉదాహరణకి: ఓ మాటు ఓ సీసా వచ్చింది; ఆ సీసాలో స్పిరిట్ వుంది, ఆ స్పిరిట్‌లో చిన్న చేపలాగానే అవుపడుతూన్న చిన్న మొసలిపిల్ల వుంది. అచ్చమైన మొసలిపిల్ల సుమండీ! అది నూరేళ్లయినా అలా స్పిరిట్‌లో వుంటుంది, ఏమీ పాడైపోకుండానూ. అవును మరి, వాస్య మిడిసిపడుతున్నాడంటే, ఊరికేనా మరి: కడమ కుర్రాళ్ల దగ్గరా వున్నాయి, ఎందుకూ – మొసలిపిల్ల ముందు, అవన్నీ – థూ, ఎందుకూ పనికిరావు!

మరో ఉదాహరణ, ఓమాటు అందిన పార్శిల్లో పెద్ద శంఖం: పైన బూడిదెవర్ణం, అడుగునేమో రోజారంగు — సగంసగం తెరచుకున్నట్టున్నాయి ఆ రోజారంగు ముడతలు పెదవుల్లాగా మరి, ఆ శంఖాన్ని చెవిదగ్గర పెట్టుకుంటే, ఎక్కడో దూరంనుంచి హోరుమని వినబడుతూన్నట్టే వుంటుంది శబ్దం. వాస్య మంచి కళలో వున్నప్పుడు ఆ శంఖాన్నిస్తాడు సెర్యోషకి, చెవిదగ్గర పెట్టుకుని వినమని. దాన్ని సెర్యోష చెవిదగ్గర పెట్టుకుని, కదలకుండా మెదలకుండా కళ్లు పారతెరచుకుని వింటాడు — శంఖం లోలోపల నుండి వస్తూన్న ఆ మొదలూ కొసలేని హోరు అలా వినబడుతూనే వుంటుంది. ఏమిటా హోరు? ఎక్కడనుంచి వస్తూందది? దాన్ని వింటూంటే గుండె ఎందుకలా ఝల్లుమంటుంది? — ఝల్లుమన్నా అలా వినాలనే వుంటుం దెందుకో?...

ఈ మామయ్య మామూలు మామయ్య కాదు, చాలా గొప్పవాడు. ఈయన హానొలూలూ, ఇంకా వేర్వేరు ద్వీపాలన్నీ తిరిగి తిరిగి వాస్యని చూడ్డానికి వస్తున్నాడు! వాస్య వీధిలోకొచ్చి, ఈ సంగతి చెప్పాడు. వాడు చెప్పడంలో కూడా, అదొక మహా విశేషమేమీ కానట్టూ, మామూలు పిచ్చాపాటీ చెప్పుకుంటున్నట్టూ, సిగరెట్టును పెదవుల సందున ఒక మూల ఇరికించి, పొగకి కళ్లు చీకిరించుకుని చెప్పాడు. మరి షూర కాస్సేపు వూరకుని, మంద్ర స్వరంతో: "ఏ మామయ్యరా? కెప్టెన్ మామయ్యే?" అని అడిగే సరికి "ఆయన కాకపోతే మరే మామయ్యరా? ఆయన తప్ప నాకు మామయ్యలు ఎవ్వరూ లేరే" అన్నాడు వాస్య.

వాడు "నాకు" అని చెప్పడంలో ముఖం ఎలా పెట్టాడంటే: మీకు కెప్టెన్లు కానటువంటి మామయ్యలు వుంటే వుండొచ్చుగాని, నాకున్న మామయ్య మాత్రం కెప్టెను కాకుండా వుండేందుకు అసలు వీల్లేదు — అన్నట్టుగా పెట్టాడు. ఇంతకీ ఆ మాటకొస్తే, అది కూడా నిజమే కదా, అని అందరూ మనసులో ఒప్పుకున్నారు.

''త్వరలోనే వస్తున్నాడా?'' అని అడిగాడు సెర్యోష.

''వారమూ, రెండువారాల్లో రావచ్చు'' అని వాస్య జవాబుచెప్పి, ''మరి – నేను బజారుకెళ్లి సున్నం కొనుక్కురావాల్రా!'' అన్నాడు.

''సున్నం ఎందుకురా నీకు?'' అని అడిగాడు సెర్యోష.

''సరంబీకి అమ్మ వెల్లవేస్తుంది.''

అవును మరి, ఇలాంటి మామయ్య వస్తూన్నప్పుడు, సరంబీకి వెల్ల వేసుకోవద్దా!

''వాడివన్నీ అబద్ధాలే!'' అంది లీద ఇహ పట్టలేక. ''వాళ్లింటికి ఎవ్వరూ రావడంలేదు.''

అలా అనేసి, లీద వెనక్కి జారుకుంది, లెంపకాయ ఎక్కడ తగుల్తుందో అని. ఈసారి వాస్య ఆమెకు లెంపకాయ తినిపించలేదు. ''వాజమ్మ!'' అని కూడా అనలేదు – సున్నంకోసం తెచ్చుకున్న సంచిని తన చేతనున్న బుట్టలో వుంచి, ఆ బుట్టను విసురుగా ఆడించుకుంటూ అలా వెళ్లిపోయాడు, అంతే. లీద అవమానపడిపోయినట్టు ఎక్కడున్న మనిషి అక్కడే అలా నిలబడిపోయింది.

...సరంబీకి వెల్లవేశారు, ఇంట్లో గోడలకి కొత్త గోడకాగితాలు అంటించారు. వాస్య కాగితాలకి జిగురు రాసి, తల్లికి అందిస్తే, ఆమె వాటిని గోడలకి అంటించింది. కుర్రకారందరూ వసారాలో నిలబడి ఇదంతా చూస్తున్నారు, వీళ్లని గదిలోకి రానివ్వలేదు వాస్య.

''మీరందరూ వచ్చి అన్నిటినీ తీన్‌తేరాగా చేసేసారు'' అన్నాడు వాస్య.

తరువాత, వాస్య తల్లి నేల కడిగి శుభ్రంచేసింది. గచ్చుమీద తివాచీ పట్టీలు పరచింది. గచ్చు మురికి చేయకుండా వుండేందుకని వాళ్లిద్దరూ వాటి మీదే నడిచారు.

''నావికులు శుభ్రమంటే పడిచస్తారు'' అంది వాస్య తల్లి.

మామయ్యకి పడక వెనకగదిలో ఏర్పాటుచేసిందామె. అందుకని అలారం టైంపీసును తీసుకెళ్లి ఆ గదిలో వుంచింది:

''నావికులు వాళ్ల పనులన్నీ సరిగ్గా వేళప్రకారం చేసుకుంటారు'' అంది వాస్య తల్లి.

మామయ్య ఎప్పుడు వస్తాడా అని అందరూ ఆత్రంతో ఎదురుచూశారు. దాల్నియ వీధిలోకి ఏదైనా కారు మళ్లిందనే సరికల్లా మామయ్య వస్తున్నాడేమో అని అందరూ గుప్‌చుప్‌గా నిలబడిపోయేవారు. కార్లు మళ్లేయి, కార్లు వెళ్లిపోయాయేగాని, మామయ్య మాత్రం రాలేదు. లీదకి ఇది మంచి సంతోషంగా వుంది. ఆమెకెందుకంత సంతోషంగా వుందో కడమవాళ్లకి అర్థంకాలేదు.

వాస్య తల్లి సాయంకాలం పనినుంచి ఇంటికొచ్చి, ఇల్లు చక్కబెట్టుకుని, ఇంటి గేటుదగ్గరకెళ్లి, ఇరుగుపొరుగు అమ్మలక్కలతో తన తమ్ముడు కెప్టెను గురించి బడాయిలు కొట్టడం మొదలెట్టింది. కుర్రాళ్లు పక్కను నిలబడి వింటున్నారు.

''వాడిప్పుడు శానిటోరియమ్‌లో వున్నాడు'' అంటూ వాస్య తల్లి చెప్పుకుపోయింది. ''ఒళ్లు బాగుచేసుకుంటున్నాడు. గుండె జబ్బు వుంది వాడికి. శానిటోరియమ్‌లో చికిత్సపొందేందుకని అన్నిటికంటె మంచి శానిటోరియమ్‌కి వాడిని పంపించారు. అక్కడ మందుపుచ్చుకోవడం అయిపోయాక, మా యింటికొస్తాడు.''

''వెనకటి రోజుల్లో వాడు ఎంత బాగా పాడేవాడనుకున్నారు!'' అంటూ ఆమె ఇంకా చెప్పుకుపోయింది. ''వాళ్ల క్లబ్బులో ఏదైనా చేస్తే: 'ఎటు పోయితిరో మీరు' అనే గీతం పాడేవాడుకదా, కొజ్‌లోవ్‌స్కీ* కంటె ఎంతో బాగా పాడేవాడన్నమాట! ఇహ ఇప్పుడు వాడికి ఊబవొళ్లు వచ్చేసింది — మరి,

---

* కొజ్‌లోవ్‌స్కీ — సుప్రసిద్ధ సోవియట్ ఒపెరా గాయకుడు — సం.

ఇంట్లో కూడా, దానమ్మ కడుపు కాలా, గృహచ్ఛిద్రాలొచ్చాయి. అలాంటి పరిస్థితులో వాడేంపాడతాడిహ? పొడ్డమేలేదిప్పుడు పాపం!''

ఆమె గొంతు దించేసి, కుర్రాళ్లు వినగూడని రహస్యం ఏదో చెబుతూన్నట్టు:

''అంతా ఆడపిల్లలే'' అంది. ''పెద్దదాని జుట్టు తెలుపు, రెండో దానిది కాస్త చామనచాయ, మూడోదానిది బాగా కావిరంగు. పెద్దదాని కొక్కుర్తికే కోస్త్య పోలిక వచ్చింది. వాడేమో స్టీమరుమీద తిరుగుతూ, వాడి పాట్లు వాడు పడుతూంటాడు. ఆడపిల్లల్ని కన్న తల్లి అదృష్టవంతురాలు! పదిమంది ఆడపిల్లలున్నా ఫర్వాలేదు, వాళ్లందర్నీ పెంచడంకంటె మొగపిల్లాడు ఒక్కణ్ణి పెంచడం ఎంతో కష్టం!''

పొరుగు అమ్మలక్కలు వాస్యకేసి చూశారు.

''సరే, తమ్ముడు కదా వాడు, వాడేమి సలహా చెబుతాడో చూస్తాను'' అంటూ ఆవిడె ఇంకా తన ధోరణి కానిచ్చింది. ''మొగాడు కదా, వాడేదో నిశ్చయించి చెబుతాడు. వాడు చెప్పినట్టూ చేస్తాను. నాకేమిటో మతి పోయినట్టే వుంది — ఏమీ పాలుపోవడంలేదు.''

''మొగపిల్లల్తో ఎంతైనా భరించాలమ్మా!'' అని నిట్టూర్చింది జేన్య పెత్తల్లి, ''వాళ్లని పెద్దవాళ్లని చేసి వాళ్లకి ఓ ఆధరువు చూబెట్టేవరకూనూ!''

''పిల్లణ్ణి బట్టి వుంటుంది లెండి'' అంది పాష అత్తయ్య, ''మాటకి, మావాడే వున్నాడు, వాడు మరీ సుకుమారంగా వున్నాడు.''

''మీవాడింకా చంటివాడేనమ్మా!'' అంది వాస్య తల్లి. ''చంటిపిల్లాళ్లందరూ సుకుమారంగానే వుంటారు, మరి. ఇహ వాళ్లు పెద్దాళ్లయితే — అప్పుడు వాళ్ల గుణాలు బయటపడడం మొదలవుతుంది.''

కెప్టెను మామయ్య వచ్చేసరికి రాత్రి అయింది. ఉదయానికల్లా వాస్య తోటలో చేరారు కుర్రాళ్లందరూ. తోటలో పుంతమీద నిలబడ్డాడాయన —

మల్లెపువ్వులాంటి తెల్లని సూటులో, సరిగ్గా ఫోటోలో వున్నట్టే తెల్లని జుబ్బా, మంచి క్రీజుమీద వున్న తెల్లని పంట్లాం, తెల్లని జోళ్లు, జుబ్బా మీద బంగారపు జరీ పట్టీలు. చేతులు వెనక్కి పెట్టుకుని నుంచున్నాడు. కొంచెం ముక్కుతో మాట్లాడుతున్నాడు, రొజుకుంటూ రొజుకుంటూనూ:

''అహో, ఇదంతా ఎంత దివ్యంగా వుంది! అచ్చంగా స్వర్గంలా వుంది! వేడి దేశాల్లో ఎండ అనుభవించిన తరువాత, ఇక్కడ మనసుకి హాయిగా విశ్రాంతిగా వుంటుంది. ఇంత అద్భుతమైన చోట జీవిస్తున్నావంటే, పోల్యా నువ్వు ఎంత అదృష్టవంతురాలవో కదా!'' అన్నాడాయన.

వాస్య తల్లి అంది: ''అవును, ఇక్కడ బాగానే వుంది.''

''అహాహ్, స్టార్లింగ్ పక్షిగృహం!'' అన్నాడాయన గాద్గదికంగా. ''బర్చ్ చెట్లమీద స్టార్లింగ్ పక్షిగృహాలు! పోల్యా మనం చిన్నప్పుడు చదవుకున్న వాచకంలో సరిగ్గా ఇలాంటి బొమ్మే వుండింది – నీకు జ్ఞాపకం వుందా? – బర్చ్ చెట్లూ, వాటిమీద స్టార్లింగ్ పక్షిగృహాలూనూ!''

''ఆ పక్షిగృహాన్ని వాస్యయే చెట్లమీద పెట్టాడు'' అంది వాస్య తల్లి.

''ఆరె! ఎంత తెలివైన కుర్రాడో!'' అన్నాడు మామయ్య.

వాస్య మే దినోత్సవంనాడు ముస్తాబైనట్టు, వొళ్లూ ముఖమూ కడుక్కొని, తల దువ్వుకొని, టోపీలేకుండా బిడియపడుతూ అక్కడే కూర్చున్నాడు.

''ఫలహారం చేద్దాం'' అంది వాస్య తల్లి.

''తొందరేమొచ్చె, ఈ గాలి ఇంకా పీల్చాలనే వుంది నాకు!'' అన్నాడు మామయ్య. కాని వాస్య తల్లి ఆయన్ని లోపలికి తీసుకుపోయింది. బంగారంతో మలామా చేసిన కోటబురుజులా బ్రహ్మాండంగా అగపడ్డాడాయన. పోర్చిలోకెళ్లి, ఇంట్లోకి అదృశ్యమైపోయాడు. ఆయన స్థూలకాయుడు, రూపసి, ముఖంలో దయ కనబడుతూంది, రెండు ముడుతలు పడిన లావుపాటి గడ్డం. ఎండకు నలుపెక్కిన ముఖం, నుదురు మాత్రం తెల్లగానే

వుంది; యెప్పుడూ టోపీ పెట్టుకునే వుండడం వల్ల. దిగువన మాత్రం యెండకి నల్లబడింది. టోపీ ఆనవాలు తెలుస్తూ వుంది. కంచె గోడ గుంజలకు ముఖాలను అణచిపెట్టుకుని, వాటి సందుల్లోనుండి చూస్తూన్న సెర్యోష, షూరల దగ్గరకు వాస్య వచ్చి "ఏమిటి కావాలా, అబ్బాయిలూ?" అని అనుగ్రహంతో అన్నాడు.

వాళ్లేమీ జవాబుచెప్పకుండా రొజుకుంటూ నుంచున్నారు.

"మామయ్య నాకోసం వాచీ తీసుకొచ్చాడు" అన్నాడు వాస్య. అవును, వాడి ఎడమచేతికి రిస్టువాచీ వుంది, తోలుపట్టీతో వున్న అసలైన రిస్టు వాచీయే — నిజంగానే! వాస్య తన చేయి పైకెత్తి, వాచీని చెవిదగ్గర పెట్టుకుని, అది ఎలా టిక్ టిక్ అంటూందో విని, దానికి కీ ఇచ్చాడు....

"మీ ఇంట్లోకి రావచ్చునా మేం?" అని అడిగాడు సెర్యోష.

"సరే, రండి" అని అనుమతించాడు వాస్య, "కాని గుప్‌చుప్‌గా మాత్రం వుండండి, తెలిసిందా?" అన్నాడు. "ఆయన విశ్రాంతికోసం పడుకున్నప్పుడూ, మా బంధువులు మా యింటికి వచ్చేటప్పుడూ మాత్రం మీరు మాటాడకుండా ఇంట్లోనుంచి వెళ్లిపోవాలి. మా యింట్లో ఈవేళ కుటుంబ సమావేశం జరుగుతుంది."

"కుటుంబ సమావేశం అంటే?" అని అడిగాడు సెర్యోష.

"నా భవిష్యత్తు గురించి చర్చ" అని వివరించాడు వాస్య.

వాస్య ఇంట్లోపలికి వెళ్లిపోయాడు, కుర్రాళ్లు కూడా కిక్కురుమనకుండా ఇంట్లోకి వెళ్లి, గుమ్మం దగ్గర నిలబడ్డారు.

కెప్టెను మామయ్య బ్రెడ్డు స్లైస్ ఒకటి తీసి, దానికి వెన్న రాశాడు. ఉడికించిన కోడిగుడ్డును వైన్‌గ్లాసులో వుంచి, కోడిగుడ్డు గుల్ల పైభాగాన్ని చెమ్చాతో చితుకగొట్టి, ఆ భాగాన్ని జాగ్రత్తగా వొలిచి, ఉప్పు చల్లుకున్నాడు అందులో. ఆ చల్లుకోవడంలో, టేబిలుమీద చిన్నగిన్నెలో వుంచిన ఉప్పును రవంత తన కత్తిమొనతో తీసి, గుడ్డులోకి చిలకరించుకున్నాడు.

ఆయనకేదో కావల్సివచ్చి, ముందూ వెనుకా ఇటూ అటూ చూశాడు. తెల్లని కనుబొమల్లో బాధ కనబడింది. చివరికి మృదుకంఠంతో నాజూకుగా అడిగా డాయన:

''పోల్య, దయచేసి, చూడమ్మా, చిన్నతువ్వాలు లాంటిది ఏదైనా వుందా?''

వాస్య తల్లి లేచి, ఆదరా బాదరా ఇక్కడా అక్కడా తిరిగి శుభ్రమైన తువాలు అందుకుని ఆయనకిచ్చింది. తువాలు అందుకుని, ఆయన ధన్య వాదాలు చెప్పి, దానిని తన మోకాళ్లమీద పరచుకుని ఫలహారం ఆరంభించాడు. ఆయన బ్రెడ్డు ముక్కలు చిన్నచిన్నవే కొరికాడు, మరి వాటిని నమలడమూ మింగడమూ పైవాళ్లకి ఇంచుమించు కనబడలేదన్నమాటే – అలా తిన్నాడు. వాస్య ముఖం చిట్లించుకున్నాడు; వాడి ముఖంలో రకరకాల భావాలు కన బడ్డాయి: వాళ్ల యింట్లో చిన్నతువాళ్లు లేకపోవడం వాడికేమీ నచ్చలేదు; మళ్లీ అదే సమయంలో – చిన్నతువాళ్లు లేకుండా ఫలహారం చేసేందుకు ఇష్టపడనంతటి సంస్కృతి గల్గిన మామయ్యని చూసి గర్వపడ్డాడు.

వాస్య తల్లి ఎన్నో భక్ష్యాలను బల్లమీద అమర్చిపెట్టింది. మామయ్య అన్నిటినీ కొద్దికొద్దిగా తిన్నాడు; కాని మొత్తంమీద ఆయన ఏమీ తిన్నట్టే కనబడలేదు. వాస్య తల్లి మూల్గింది:

''నువ్వేమీ తినడమే లేదు! నీకేదీ సహించడం లేదు కాబోలు!''

''నయం ఇంకా! అన్నీ ఎంతో రుచిగా వున్నాయి. కాని, నేను పథ్యంగా తినాలి, నువ్వేమీ కోప్పడకు మరి, పోల్య!'' అన్నాడు.

ఆయన వోద్క పుచ్చుకోనంటూ ''నేను పుచ్చుకోకూడదు. రోజుకు ఒక్క వైన్‌గ్లాసు కోన్యాక్ – అంతే!'' అని, ఆ వైన్‌గ్లాసు ఎంత చిన్నదిగా వుంటుందో తన బొటనవేలితోనూ చూపుడువేలితోనూ ఎంతో నాజూకుగా కొల చూపించాడు. ''మధ్యాహ్నపు భోజనానికి ముందు తీసుకుంటే రక్తనాళాలను విస్తరింపజేస్తుంది. అంత మాత్రమే అంతకంటె నేను తీసుకోలేను'' అన్నా డాయన.

ఫలహారం అయాక, కాస్త అలా నడిచివెళ్దామని ఆయన వాస్యతో అని, టోపీ పెట్టుకున్నాడు – టోపీ కూడా తెల్లగానే వుంది, దానికి కూడా బంగారు జరీ వుంది.

''మీరు ఇళ్లకి పొండ్రా!'' అన్నాడు వాస్య, సెర్యోషతోనూ షూరతోనూ.

''అయ్యో, వాళ్లని కూడా రానీ, కలిసి వెళ్దాం!'' అన్నాడాయన, ముక్కుతో మాటాడుతూనూ, ''మంచి భేషుగ్గా వున్నారు కుర్రాళ్లిద్దరూ! చక్కగా వున్నారు అన్నదమ్ములిద్దరూ!''

''మేం అన్నదమ్ములంకాం!'' అన్నాడు షూర.

''వాళ్లిద్దరూ అన్నదమ్ములుకారు'' అన్నాడు వాస్య కూడా.

''అలాగా?'' అని ఆయన ఆశ్చర్యపడ్డాడు. ''అన్నదమ్ములే అనుకున్నాను సుమా! ఏదో పోలిక మాత్రం వుంది: వీడు తెలుపూ, వాడు నలుపూనూ... అన్నదమ్ములు కారేం? పోన్లే – దానికేం! రండి, కలిసి వెళ్దాం షికారు!''

వీళ్లందరూ వీధిలోనుంచి వెళ్లడం లీద చూసింది. వీళ్లందరినీ దాటి పోవాలనే ఉద్దేశ్యంతో తను పరుగెత్తడం మొదలెట్టింది. కాని వాస్య వెనక్కి తిరిగి చూశాడు; అది చూసి లీద గిరుక్కున తిరిగి, అవతలి పక్కకు గంతేసి పరుగున పారిపోయింది.

చిట్టడవిలోకి షికారెళ్లారు – చెట్లను చూసి మామయ్య ముగ్ధుడయాడు. పొలాల్లోకెళ్లారు – రై కంకులు చూసి మామయ్య ముగ్ధుడయాడు. నిజం చెప్పాలంటే, ఆయన ఉత్సాహం విసుగెత్తించింది. సముద్రమూ ద్వీపాలూ ఎలాగుంటాయో ఆయన చెప్పివుంటే ఎంతో బాగుణ్ణనిపించింది. అయితేనేం – ఆయన్ని చూస్తేనే సరదావేసింది – ఆయన కోటుకున్న జరీ పట్టీలు ఎండలో తళ్ళుక్కులొత్తడం చూస్తూవుంటే వాళ్ల కళ్లు జిగేలుమనిపోయి నొప్పిపెట్టాయి. ఆయనా వాస్యా కలిసి నడుస్తున్నారు. అప్పుడప్పుడు సెర్యోష షూరలిద్దరూ కొద్దిగా వెనకబడిపోతున్నారు. ఆయనను ఎదుటినుండి చూస్తూవుండేందుకని వీళ్లు ఆయన ముందు పరుగెత్తేవారు. ఏటి దరికి వచ్చారు. మామయ్య

వాచీ చూసుకుని, ఏట్లో స్నానంచేస్తే బాగుంటుందన్నాడు. వాస్య కూడా తన వాచీ చూసుకుని, స్నానం చెయ్యొచ్చన్నాడు. వెచ్చగా శుభ్రంగా వున్న ఇసుకమీద నుంచుని వాళ్ళిద్దరూ బట్టలు విడిచేయసాగారు.

మామయ్య తను తొడుక్కున్న కోటుకింద చారల బనియను తొడుక్కో కుండా, మామూలు తెల్ల షర్టు తొడుక్కున్నాడే అని సెర్యోష షూర లిద్దరూ చాలా ఆశాభంగం పొందారు. ఆయన చేతులెత్తి షర్టును నెత్తిమీద నుంచి పైకి లాగి తీసేశాడు – ఇంకేముంది: వాళ్ళు శిలావిగ్రహాల్లా అలా నిలబడిపోయారు....

మామయ్య వొళ్లంతా – ఎండకి నల్లబడిన ఆ బ్రహ్మాండమైన స్థూల కాయంనిండా – మెడ మొదలుకొని నడుంవరకూ యావత్తు శరీరమూ – దట్టమైన నీలంరంగు అలంకరణలతో నిండిపోయింది. మామయ్య నిటారుగా నిలువెత్తున నిలబడ్డాడు. అవి అలంకరణలు కావనీ, అవి బొమ్మలూ అక్షరాలూ అనీ అప్పుడు చూశారు కుర్రాళ్లు. ఆయన ఛాతిపైన సముద్ర కన్యక చిత్రం వుంది. ఆ కన్యకి చేపతోక వుంది, జుట్టు పొడుగ్గా వుంది. ఆయన ఎడమ బుజంమీద ఆ కన్య దిశగా ఒక ఎనిమిది తోకల దయ్యం పాకుతూంది. ఆ దయ్యం కళ్లు భయంకరంగా మనిషికళ్లల్లా వున్నాయి. అది తన తోకలు మెలితిప్పుకుంటూంది; సముద్రకన్యక తన ముఖం ఒక పక్కకు తిప్పి, చేతులు రెండూ ఆ దయ్యంవైపు చాచింది, తనను పట్టుకోవద్దని దానిని ప్రార్థించుతూంది. సజీవంగావున్న ఆ బొమ్మకేసి చూడ్డానికే హడలు పుట్టుతూంది! కుడి బుజంపైన ఏదో పొడుగ్గా రాసివుంది, ఎన్నో పంక్తులున్నాయి; మరి – ఆయన కుడి చేతిమీద కూడా అంతే – ఆయన శరీరం కుడి వైపు అంతా పూర్తిగా అక్షరాలతో నిండిపోయింది. ఎడమ మోచేతిపైన పావురాలు రెండు ఒకదాన్నొకటి వాటిముక్కులతో ముద్దు పెట్టుకుంటున్నాయి, వీటి ఎగువను పూలమాల ఒకటీ, కిరీటం ఒకటీ వున్నాయి.

మోచేతిమీదనే – ఒక బీట్ గడ్డను దూసుకున్న బాణం, వీటికి దిగువగా పెద్ద అక్షరాలతో ''మూస్య'' అనే అమ్మాయి పేరు వుంది.

''బ్రహ్మాండంగా వుంది!'' అన్నాడు షూర సెర్యోషతో.

''బ్రహ్మాండంగా వుంది!'' అన్నాడు సెర్యోష నోరెళ్లబెట్టుకుని రొజుకుంటూనూ.

మామయ్య ఏట్లోకెళ్లి, నీట్లో మునిగాడు. మునిగి తడిసిన తలతోనూ సంతోషం ఉట్టిపడుతూన్న ముఖంతోనూ పైకి తేలేదు, బుర్‌మని బుస కొడుతూ ఏటికి ఎదురీత మొదలెట్టాడు. మంత్రముగ్ధులైన కుర్రాళ్లు ఆయనవెంట నీటిలోకి పరుగెత్తారు.

మామయ్య ఎంతో బాగా ఈదాడు! నీటిలో ఆట ఆడుతూన్నట్టే ఆయన కాళ్లూ చేతులూ సునాయాసంగా కదిపాడు, నీటిలో ఆట ఆడుతూన్నట్టే ఆయన బ్రహ్మాండకాయం సునాయాసంగా కదిలింది. వారధివరకూ ఆయన ఈతకొట్టుతూ వెళ్లి, మళ్లీ వెనక్కి తిరిగి, నీటిలో వెల్లకిలా పడుకుని కాళ్ల కొనలు కదిపినట్టు అగపడకుండానే ఈదాడు. ఆయన ఛాతిమీద వున్న సముద్రకన్యక సజీవంగా వున్నట్టే నీటిలో కదలింది.

తరువాత మామయ్య ఒడ్డుకు వచ్చేసి, ఒడ్డున ఇసుకమీద బొజ్జతో బోర్లా పడుకుని, కళ్లు మూసుకుని, పరమానందంతో చిరునవ్వు నవ్వాడు. కుర్రాళ్లు ముగ్గురూ ఆయన వీపుమీద వున్న బొమ్మల్ని – ట్రాన్స్‌ఫార్మరు షెడ్డుమీద చిత్రించి వున్నట్టుగానే: పుర్రె, ఎముకలు; ఇవే కాకుండా చంద్రుడూ, నక్షత్రాలూ, పొడుగు గౌను తొడుక్కుని కాళ్లు ఎడంగా చాపుకొని కూచుని, మిడిగుడ్లతో మేఘాలకేసి చూస్తూన్న స్త్రీ బొమ్మ – చుస్తూ నిలబడ్డారు. షూర ధైర్యం చిక్కబట్టి:

''మామయ్యగారూ, మీ వీపుమీద వున్నది ఏమిటండీ?'' అని అడిగాడు.

ఆయన నవ్వి, లేచి నిలబడి, వొంటిమీద వున్న ఇసుక దులిపేసుకున్నాడు.

''ఇది నా కుర్రతనానికీ, అనాగరికతకు స్మారక చిహ్నం. చూశారా,

అబ్బాయిలూ, అప్పుడు వొంటినిండా అర్థంలేని వెర్రిమొర్రి బొమ్మల్ని రాయిం చుకునేటంతవరకూ దిగజారిపోయింది నా అనాగరికత — దురదృష్టంకొద్దీ ఆ పిచ్చితనంవల్ల శాశ్వతంగా వొంటిమీద వుండిపోతుంది'' అన్నాడాయన.

''మరి — ఆ అక్షరాలేమిటండీ?'' అని అడిగాడు షూర.

''ఏవో అర్థం పర్థంలేని మాటలు — తెలివిమాలినవాడెవడో నా ఒంటిమీద రాశాడు. మనిషి భావాలూ — అతడి క్రియలూ — ఇవీ ముఖ్యమైనవి. ఏం, వాస్య, ఏమంటావు నువ్వు?'' అని అడిగాడాయన.

''నిజమే'' అన్నాడు వాస్య.

''మరి — సముద్రం వుందే, సముద్రం ఎలా వుంటుందండీ?'' అని అడిగాడు సెర్యోష.

''సముద్రమా?'' అన్నాడాయన, ''సముద్రమా? — ఏమని చెప్పేది? సముద్రం సముద్రమే. సముద్రంకంటె చక్కనైనది మరేదీ లేదనుకో. దాన్ని నిజంగా ఎవరి కళ్లతో వారు చూడాల్సిందే!''

''మరి తుఫాను పట్టినప్పుడో? అప్పుడు భయంవెయ్యదండీ?'' అని అడిగాడు షూర.

''తుఫానా? తుఫాను ఎంతో చక్కగా వుంటుంది'' అన్నాడాయన. ''సముద్రంమీద వున్నది సర్వమూ చక్కగా వుంటుంది.'' అలా అని, ఆయన ఏదో సాలోచనగా తలకాయ వూపుతూ పద్యం చదివాడు:

> '''ఏడనైతేనేమి' అని పల్కెనాతడు, ఒక్కటే కాదె?
> కొండతడ వీడనే నీటిలో తేలిపోతే హాయి కాదె''

ఇహ, ఆయన పంట్లాం తొడుక్కున్నాడు.

షికారు వెళ్లివచ్చిన తరువాత ఆయన కొంతసేపు విశ్రాంతి తీసుకున్నాడు. అప్పుడు కుర్రాళ్లు వాస్య సందులో చేరి, మామయ్య ఒంటిమీద వున్న పచ్చబొట్లు గురించి తర్జనభర్జన చేశారు.

''ఒక గుండ కావాల్రా దీనికి'' అన్నాడు కలీనిన్ వీధి కుర్రాడొకడు. ''మొదట – బొమ్మను ఒంటిమీద పొడుస్తారు, తరువాత దానిమీద గుండ రుద్దుతారు. ఇలా చేస్తారని నేను చదివాను.''

''గుండ ఎక్కడ దొరుకుతుందిరా నీకు?'' అని అడిగాడు మరొకడు.

''ఎక్కడా? షాపులోను!''

''నీకు అమ్మనే అమ్మరు. పదహారేళ్లలోపు కుర్రాళ్లకి సిగరెట్లే అమ్మరు కదా, అటువంటిది – గుండ అమ్ముతార్రా నీకు? అబ్బే, అమ్మర్రా!...''

''వేటగాళ్ల దగ్గర దొరుకుతుందిరా.''

''వాళ్లివ్వర్రా నీకు!''

''వాళ్లిస్తార్రా!''

''వాళ్లివ్వర్రా!''

మూడో కుర్రాడన్నాడు కదా:

''పాతకాలంలో గుండ పూసేవారు. ఇప్పుడేమో ఇండియన్ ఇంక్ పూస్తారు, లేకపోతే నల్లసిరాగుండ పూస్తారు.''

''నల్లసిరాగుండతో పుండుపడుతుందో పడదో?'' అన్నాడు ఎవడో ఒక కుర్రాడు.

''బ్రహ్మాండంగా పుండుపడి తీరుతుంది.''

''ఇండియన్ ఇంక్ మంచిదిరా. దాంతో మంచి పుండుపడుతుంది.''

''నల్లసిరాగుండతోనూ మంచి పుండుపడుతుందిరా!''

సెర్యోష ఇదంతా విని, తాటిచెట్లు పెరుగుతూ, కళ్లు పొడిచేటట్టు ఎండకాస్తూన్న ఒవాహూ ద్వీపమూ హొనొలూలూ పట్నమూ తళతళ మెరసి పోతూన్నట్టి జరీ పట్టీలున్న తెల్లని దుస్తులు తొడుక్కున్న కెప్టెన్లు తాటిచెట్లకింద నిలబడి వాళ్లలో వాళ్లు స్నాప్‌షాట్ ఫోటోలు తీస్తూండడమూ ఊహించేసుకున్నాడు. ''నేను కూడా ఇలాగే ఫోటో తీయించుకుంటాను'' అనుకున్నాడు సెర్యోష తన మనసులో. గుండ గురించీ సిరా

గురించీ చర్చించుకుంటూన్న ఈ కుర్రాళ్లందరిలాగానే జీవితంలో జరుగుతూన్నదంతా తనకి కూడా భవిష్యత్తులో రాసివుందనీ, దీనితోపాటు తను కూడా హోనొలూలూలో ఒక కెప్టెనుగా వుండడం కూడా తప్పకుండా జరిగి తీరుతుందనీ సెర్యోష ఒక్క క్షణమైనా తటపటాయించకుండా నమ్మాడు. చావు అనేది తనకు వుండదని సెర్యోష ఎంత గట్టిగా నమ్మాడో, దీన్ని కూడా అంత గట్టిగానూ నమ్మాడు. ఈ అంతులేని తన జీవితంలో తను ఊహించుకునేది అంతా చేసేందుకు తను ప్రయత్నించుతాడనీ, తను ఊహించుకునేది అంతా తను అనుభవించుతాడనీ సెర్యోష దృఢంగా నమ్మాడు.

సాయంకాలం పడిందేమో, వాస్య మామయ్యని మళ్లీ చూసేవరకూ సెర్యోష అతి ఆత్రపడిపోయాడు. ఆయన విశ్రాంతి తీసుకున్నాడు, అలా విశ్రాంతి తీసుకుంటూనే వున్నాడు — క్రితం రాత్రి ప్రయాణంలో ఆయన నిద్ర పోలేదట. వాస్య తల్లి హై హీల్ జోళ్లు వేసుకుని, వీధిలో పరుగెత్తుతూ, గేటుదగ్గర ఆగి, తను కోన్యాక్ మద్యం కొనడానికని షాపుకు పరుగెత్తుతున్నాననీ, తమ్ముడు కోన్యాక్ తప్ప మరే మద్యమూ పుచ్చుకోడనీ పాష అత్తయ్యతో గొప్పగా చెప్పింది. సూర్యుడు అస్తమించాడు. బంధువులందరూ ఆ యింటికొచ్చారు. ఇంట్లో ఎలెక్ట్రిక్ దీపాలు వెలిగాయి. కిటికీ తెరలు వేసివుండడంచేతనూ, జిరేనియమ్ పువ్వులమొక్కలు అక్కడ వుండడం చేతనూ ఆ యింట్లో ఏమి జరుగుతూందో వీధిలోనుండి కనిపించడంలేదు. అప్పుడు సెర్యోష దగ్గరకు షూర వచ్చి, తను లిండెన్ చెట్టుమీదకెక్కి చూశాననీ, తనకు అంతా బాగా కనబడిందనీ, అందుచేత సెర్యోష కూడా చెట్టుమీదకెక్కి తన దగ్గర కూర్చోవడం మంచిదనీ అన్నాడు. సెర్యోష సరే అన్నాడు.

''ఆయన నిద్రనుంచి లేచి, కసరత్తు చేశాడ్రా!'' అని షూర, గబగబ విశేషాలు చెప్పాడు సెర్యోషతో. ''క్షవరం చేసుకోగానే, గొట్టంతో ఉడుకులాం చిమ్ముకున్నాడ్రా. వాళ్లందరూ అప్పుడే రాత్రిభోజనానికి కూచు

న్నారు.... మనం ఆ సందులోనుంచి వెళ్లామంటే లీద ప్రత్యక్షమై మన నిహా వదల్డు.''

ఆ ముసలి లిండెన్‌చెట్టు తిమోహిన్ పెరటితోటకీ వాస్య తోటకీ హద్దుగా వున్న కంచెగోడకు దగ్గరగా వుంది. వాస్య ఇల్లు ఈ కంచెగోడకి తగిలే వుంది. కాని ఆ గోడమీద ఎక్కేందుకు వీల్లేదు – గుంజలతో పెట్టిన కంచె అది, దానిమీద ఎక్కితే అది కూలిపోతుంది.... లిండెన్‌చెట్టుకి తొర్ర వుంది, ఆ తొర్రలో ఒక వేసవిలో కూకుడుగువ్వలు వుండేవి. ఇప్పుడేమో, షూర తనకి దొరికిన వస్తువుల్ని – తూటా పెట్టెలూ, చెక్కలతో పెట్టిన గోడలమీదనూ తోట్లో బెంచీలమీదనూ అక్షరాలు వాతవేసేందుకు ఉపయోగ పడే భూతద్దమూ – పెద్దవాళ్ల చేతుల్లో పడకపోవడమే మంచిదని, వాటిని ఈ తొర్రలో దాచేస్తూ వుంటాడు.

గరుకుగా వున్న చెట్టు పట్టను రాసుకుని కాళ్లు గీసుకుపోతున్నా, లిండెన్‌చెట్టుమీదకి ఎక్కి, కణుపులతోనూ నరదలతోనూ గుబురు రెమ్మల తోనూ వున్న ఒక కొమ్మమీద – చెట్టు బోదెను పట్టుకుని షూర, షూరను పట్టుకుని సెర్యోష – కూర్చున్నారు.

పట్టుబట్టలా ఫెళఫెళ శబ్దంచేస్తూ, సుకుమారంగా గిలిగింతలు పెడుతూ, లేతగా చేదుగా వాసనవేస్తున్న ఆకులు పందిరిలా విస్తరించి వున్నాయి. అస్తమిస్తూన్న సూర్యుడు ఆ పందిరిమీద ఎత్తుగా తన పసిడి కాంతులు విరజల్లుతున్నాడు. పందిరి కిందను మునిచీకటి అంతకంతకు మరింతగా దట్టమై నలుపెక్కుతూంది. సెర్యోష ఎదుట వున్న నల్లని రెమ్మ రెపరెపలాడుతుంది. వాస్య ఇంటిలోపలి దృశ్యాన్ని చూచేందుకు సెర్యోషకు అది అడ్డురావడంలేదు. ఆ ఇంట్లో ఎలెక్ట్రిక్ దీపాలు వెలుగుతున్నాయి, కెప్టెను మామయ్య బంధువుల మధ్య కూచున్నాడు. సెర్యోషకి వాళ్ల మాటలన్నీ వినబడుతున్నాయి.

వాస్య తల్లి చేతులు వూపుతూ అంటూంది ''వీధిలో రౌడీపనులు చేసిన

నేరానికిగాను విధించిన జరిమానా ఇరవైయ్యైయిదు రూబుళ్లూ పి. పి. చుమచేంకొ అనే నేను చెల్లించి రసీదు పొందాను.''

బంధువులలో ఒకామె నవ్వింది.

''నా అభిప్రాయంలో ఇది నవ్వవలసిన విషయమేమీ కాదు'' అంది వాస్య తల్లి. ''ఇది జరిగి ఇంకా రెణ్ణెల్లు తిరగకముందే, మిలీషియా స్టేషనుకి నన్ను రమ్మనమని కబురుచేస్తే, నేను వెళ్లేసరికి వాళ్లు ఓ కాగితం నాకు చూపెట్టగా, సినిమా థియేటరులో అద్దం కిటికీ పగలకొట్టినందుకు పరిహారంకింద ఏభై రూబుళ్లు చెల్లించుకుని పత్రంపైన చేవ్రాలుచేశాను.''

''తనకంటె పెద్దకుర్రాళ్లతో వాడు పోట్లాడుతున్నాడని కూడా చెప్పు. సిగరెట్టు కాలుస్తూ, ఆ సిగరెట్టుతో రజాయికి కన్నం చేశాడనీ, ఇల్లు కాలిపోవల్సిందేగాని రవంతలో తప్పిపోయిందన్న సంగతీ చెప్పు మరి'' అని ఒక బంధువురాలంది.

''సిగరెట్లకి డబ్బు వాడికెలా వచ్చింది?'' అని అడిగాడు కెప్టెను మామయ్య.

మోకాలిమీద మోచేయి పెట్టుకుని, అరచేతిలో దవడ ఆనించుకుని సిగ్గుపడిపోయి, దువ్వుకున్న తలంతా రేగిపోయి కూచున్నాడు వాస్య.

''వోరి దుర్మార్గుడా!'' అన్నాడు మామయ్య, తన మృదుకంఠంతో. ''నేనడుగుతున్నా: నీకెక్కడ్నుంచి వచ్చిందిరా డబ్బు?''

''అమ్మ ఇచ్చింది'' అన్నాడు వాస్య, కనుబొమలు ముడిపెట్టి.

''నాకిదేమీ అర్థంకావడంలేదు'' అన్నాడాయన.

వాస్య తల్లి ఏడవడం మొదలెట్టింది.

''నీ మార్కుల రిజిస్టరు ఇలా చూపించు!'' అని మామయ్య వాస్యని ఆజ్ఞాపించాడు.

వాస్య లేచి వెళ్లి, తన మార్కుల రిజిస్టరు పట్టుకొచ్చి ఆయనికిచ్చాడు. మామయ్య కళ్లు చికిరించి, పేజీలు తిరగేసి, మెల్లగా అన్నాడు:

''దుష్టుడు! పశువు!''

రిజిస్టర్ని ఆయన బల్లమీద విసరికొట్టి, జేబులోనుంచి చేతిరుమాలు తీసి, విసురుకుంటూ, లేచి నిలబడ్డాడు.

''ఊఁ'' అన్నాడాయన ''వీడి సంగతి ఏమీ బాగులేదు. వీడు గనుక నిజంగా బాగుపడాలనే నీకుంటే, వీణ్ణి కఠినమైన ఖాయిదాలో వుంచక త—ప్ప—దు. నా భార్య నీన వుంది. చక్కగా పెంచింది కూతుళ్లను. వాళ్లను మంచి శిక్షణలో వుంచింది! వాళ్లకి పియానో నేర్పింది.... ఎందు కని? వాళ్లు ఖాయిదాలో వుంటేనే గాని చెప్పినట్టు వినరని.''

''ఆడపిల్లల్తో సులువే లెండి!'' అన్నారు బంధువులందరూ ఒక్క గొంతుకతో. ''ఆడపిల్లలూ మొగపిల్లలూ ఒకటేనా మరి!''

''ఇదిగో కోస్త్య!'' అని, రజాయిని సిగరెట్టుతో ముట్టించాడని చాడీ చెప్పినామె, అంది: ''వాడి తల్లి డబ్బివ్వకపోతే అడగా పెట్టాకుండా వాడే ఆమె సంచీలోనుండి డబ్బు తీసుకుంటాడు.''

వాస్య తల్లి వెనుకటికంటె మరీ జోరుగా ఏడ్చింది.

''మా అమ్మ దగ్గిరనుంచి కాకపోతే మరెవరిదగ్గిరనుంచి తీసుకుంటా న్నేను? పరాయివాళ్ల దగ్గిరనుంచి తీసుకోమంటారారా ఏమిటి?'' అని అడిగాడు వాస్య.

''ఫో, ఇక్కడ్నుంచి!'' అని ముక్కుతో మాట్లాడుతూ మామయ్య లేచి నిలబడ్డాడు....

''వాణ్ణి కొడతార్రా'' అని షూర గుసగుస గొంతుకతో అన్నాడు సెర్యోషతో....

ఫెళ్లుమని విరిగింది వీళ్లిద్దరూ కూచున్న కొమ్మ. గలగలమంటూ ఆ విరిగిన కొమ్మ చప్పున కిందకి పడిపోయింది; ఆ కొమ్మతో సహా కింద పడ్డాడు షూర, కిందకి పడిపోతూన్న షూర తనతో కూడా సెర్యోషను కిందకి ఈడ్చేశాడు.

''ఒరేయ్, నువ్వు ఏడవకూడదు సుమా!'' అన్నాడు షూర కిందపడి.

కిందపడిన వాళ్లిద్దరూ వొంటికి దెబ్బతగిలినచోట చేత్తో రాసుకుంటూ లేచి నిలబడ్డారు. వాస్య కంచెగోడ దగ్గరకొచ్చి, కంచె సందులోనుంచి తొంగిచూసి, ఏమిటి జరిగిందో గ్రహించాడు.

''గూఢచారి పనులు చేస్తున్నార్రా మీరు? చూదురుగాని మీకెలా ఇచ్చు కుంటానో ఖర్చుకి!'' అన్నాడు వాస్య.

వాస్య వెనుక పసిడి తళ్ళుకులు మెరపిస్తూన్నట్టి తెల్లని దుస్తులు వేసు కున్న విగ్రహం ఒకటి కిటికీలోనుంచి వస్తూన్న దీపాలవెల్తురులో కనబడి, మెత్తని గొంతుకతో అంది:

''ఆ సిగరెట్లని ఇలా ఇయ్యరా, రౌడీ!''

సెర్యోష, షూరలు కుంటుకుంటూ కుంటుకుంటూ పెరటివెంట నడిచి వెళ్తూ ఎందుటింట్లోకి చూసేసరికి, వాస్య సిగరెట్టు పెట్టెను మామ య్యకు ఇవ్వడమూ, దాన్ని ఆయన అక్కడికక్కడే చించి, సిగరెట్లను ముక్కముక్కలకింద విరిచేసి, గుండగుండ చేసేసి, తరువాత ఆయన వాస్యని షర్టు మెడపట్టుకుని ఇంట్లోకి తీసుకుపోవడమూ — వాళ్లకి కనబడింది.

పొద్దున్న చూసేసరికి వాస్య ఇంటికి తాళంవేసి వుంది. వాళ్లందరూ చీకటితోనే బయల్దేరి బంధువులింటికి — చ్కాలొవ్ సమిష్టి క్షేత్రానికి వెళ్లా రని లీద చెప్పింది. ఆ రోజంతా వాళ్లు ఇంటికి రాలేదు. మర్నాడు పొద్దున్న వాస్య తల్లి ఏడుస్తూ ఇంటికి తాళం వేసుకుని, కంట తడిపెట్టుకుంటూనే పనిలోకి వెళ్లిపోయింది: క్రితం రాత్రి మామయ్యతో కూడా వాస్య వెళ్లి పోయాడు. వాస్య మళ్లీ మరి తిరిగిరాలేదు; వాడికి బుద్ధినేర్పి, వాణ్ణి నౌకా దళ పాఠశాలలో చేర్పించేందుకని వాణ్ణి మామయ్య తనతో తీసుకుపోయాడు. తల్లికి తెలియకుండా ఆమె సంచీలోనుండి డబ్బులు తీసుకోవడం మూలాన్నీ, సినిమా థియేటర్‌లో అద్దం పగలగొట్టడం మూలాన్నీ వాస్యకి ఎంత అదృష్టం పట్టిందోకదా!

''ఇదంతా బంధువులు చేసినదే'' అంటూ చెప్పుకుపోయింది వాస్య తల్లి పాష అత్తయ్యతో. ''వాళ్లందరూ కలిసి తమ్ముడితో వాస్య గురించి, వాడ ప్పుడే ఇహ ఎందుకూ పనికిరాని గజదొంగ అయిపోయినట్టే వాడిమీద చాడీలు చెప్పారు. వాడు నిజంగా చెడ్డపిల్లాడేనా? చెడ్డపిల్లాడే గనక అయితే, ఒక పెద్ద వంటచెరకు దూలాన్ని పేళ్లకింద చీరి, పేర్చి పేర్చుతాడా చెప్పండి, మీకు జ్ఞాపకం వుందిగా? మరి, గదికి గోడకాగితాలు వాడే అంటించాడు కదా! ఇహ, పాపం, నన్ను వదిలిపెట్టి ఎలా వుంటున్నాడో ఏమిటో....''

ఆమె ఏడుపు మొదలుపెట్టింది.

''వాళ్లకేం పట్టింది?'' అని ఏడ్చిందావిడ. ''వాళ్ల పిల్లడుకాదు కదా. వీడికేమో శరత్తులో గగ్గలు దిగుతాయి, వీణ్ణక్కడ చూసేవాళ్లెవరు, వీడి గురించి పట్టించుకునేవాళ్లెవరు?''

టోపీ చూరు వెనక్కి పెట్టుకున్న ఏ కుర్రాణ్ణయినాసరే ఆమె చూడ గానే బొళ్లున ఏడవడం మొదలెట్టేది. సెర్యోషనూ షూరనూ ఆవిడ తన దగ్గరకు పిలిచి, వాస్య చిన్నప్పుడెలా వుండేవాడో కబుర్లు చెప్పి, తన తమ్ముడు తనకు పంపిన ఫోటోగ్రాఫులను చూపిస్తూండేది. ఈ ఫోటోల్లో – రేవుపట్ట ణాలు, అరటి తోటలు, పురాతన భవనాలు, స్టీమరు డెక్కులమీద నావికులు, ఏనుగులమీద స్వారిచేస్తూన్న మనుషులు, కెరటాల పైన పరిగెత్తే పడవ, కాళ్లకి కడియాలు వున్న నల్లని ఆటకత్తె, ఉంగరాల జుట్టూ లావుపాటి పెదవులూ వున్న నల్లని కుర్రాళ్లు – అన్నీ తెలియనివే, ఇదేమిటి అదేమిటి, దీన్ని ఏమంటారు, దాన్ని ఏమంటారు అని అన్నిటి గురించి అడిగి తెల్సుకో వాల్సినవే. ఇహ ఇంచుమించు ప్రతి ఫోటోగ్రాఫులోనూ సముద్రమే కదా: అవతల ఒడ్డు కానరాకుండా ఎంతో దూరంవరకూ అలా సాగిపోతూ, ఆకా శంతో ఏకమైపోతూన్న సముద్రం, ప్రాణంతో తొణికిసలాడుతూ అలలతో అల్లల్లాడిపోతూన్న నీరు, తళ్ళుకులీనుతూ పొగమంచులాంటి నురగ – ఈ

అపరిచిత ప్రపంచం గూఢంగానూ, ఆకర్షణీయంగానూ, చెవిదగ్గర పెట్టు కునేసరికల్లా వినబడే ఆ రోజారంగు శంఖంలా, హోరుమంటూనూ పాడుతూంది....

మరిప్పుడు వాస్య తోట ఖాళీగా నిశ్శబ్దంగా వుంది. అదొక పబ్లిక్కు జాగాలా అయిపోయింది: అక్కడికెళ్ళి రోజంతా ఆడుకోవచ్చు — హాట్ హూట్ అని కూకలేసేవాళ్ళూ అడ్డుపెట్టేవాళ్ళూ ఎవ్వరూ లేరు... సంగీతంతోనూ రోజారంగుతోనూ నిండిన ఆ ప్రపంచానికి వెళ్ళిపోయాడు ఆ తోట యజమాని — అక్కడికి సెర్యోష కూడా ఎప్పుడో ఒకప్పుడు వెళ్తాడు.

ఈ పరిచయ ఫలితాలు

కలీనిన్ వీథికీ దాల్నాయ వీథికీ మధ్య రహస్య సంప్రతింపులు సాగుతున్నాయి. రాయబారాలు నడుస్తున్నాయి. షూర ఆ వీథికీ ఈ వీథికీ పరుగెత్తుతున్నాడు, హడావుడి పడుతున్నాడు, సెర్యోషకి కబుర్లు అందిస్తున్నాడు. బొద్దుగావున్న కాళ్లతో ఆత్రుతగా అడుగులేసుకుంటూ ఆదరాబాదరా నడుస్తాడు, నలుపుకళ్ల చూపులు ఇటూ అటూ బాణాల్లా దూసుకుపోతూ వుంటాయి. వాడి మోస్తరే అది: ఏదైనా కొత్త ఆలోచన షూర బుర్రలో మెదలిందంటే సరి, వాడు చూపులు ఇటూ అటూ చరచరా సారిస్తాడు, ఇక వాణ్ణి చూసిన ప్రతివారికీ కనబడిపోతుంది — షూర బుర్రలో ఏదో కొత్త ఆలోచన మెదల్తూన్నట్టు. వాడి తల్లి గాభరా పడుతుంది, వాడి తండ్రి, డ్రైవరు తిమోహిన్, ఆదికి ముందుగానే వాణ్ణి బెల్టుతో జడిపిస్తాడు. ఎందుకంటే — షూరకి తట్టే ఆలోచనలలో ఎప్పుడూ ఏదో ఒక పెంకెతనం వుంటూనే వుంటుంది. వాడి తల్లితండ్రులకి ఎప్పుడూ ఒకటే ఆలోచన, వాళ్లకి ఎప్పుడూ ఒకటే కోరిక — వాళ్ల అబ్బాయి బతికి బాగుండాలనీ, కాళ్ళూ చేతులూ విరుచుకోకుండా వుండాలనీ.

షూర బెల్టు దెబ్బలంటే అసలు లక్ష్యపెట్టడు — థూ అంటాడు. అందులోనూ, బెల్టు దెబ్బలంటే భయపడేది ఇప్పుడా — కలీనిన్ వీథి కుర్రాళ్ళు పచ్చబొట్లు పొడిపించుకుందుకు తయారవుతూండేటప్పుడా? అబ్బే! ఈ వ్యవహారం సాగించేందుకు వాళ్లందరూ కలిసి అన్ని ఏర్పాట్లూ చేసుకున్నారు. వెధవలు! వాస్య మామయ్య వొంటిమీద వున్న పచ్చబొట్లు ఆయన సరిగ్గా ఏ యే చోట్ల పొడిపించుకున్నాడో అన్ని వివరాలతోనూ వాళ్ళు షూరనీ, సెర్యోషనీ అడిగి తెలుసుకున్నారు. సెర్యోష, షూర ఇచ్చిన ఆదేశాల ప్రకారం వాళ్ళు డ్రాయింగులు తయారుచేశారు. ఇహ ఇప్పుడు వాళ్ళు తమ జట్టులో షూరనీ సెర్యోషనీ చేర్చుకోమనేస్తున్నారు: "మీరింకా బొడ్డూడని చంటి నాగమ్మలు" అనేస్తున్నారు. ఛీ, వెధవలు! ప్రపంచంలో ఎక్కడేనా న్యాయ మంటూ వుందా?

ఎవ్వరితో చెప్పకుందుకూ వీల్లేదుకదా — ప్రపంచం అంతటిలోనూ, అనగా దాల్నయ వీథిలో, ఎవ్వరితోనూ చెప్పకుందుకు వీల్లేదుకదా. దాల్నయ వీథిలో వుంది ఆ ప్రఖ్యాత చాడీకోరు — లీద. ఎవరి పనేనా సరే కేవలం పాడు చేద్దామనే బుద్ధితోనే చాడీలు చెబుతుంది — వుత్త పాడు బుద్ధి. ఈ సంగతి పైకి పొక్కిందంటే పెద్దవాళ్లు గాభరాపడతారు, గడబిడ అవుతుంది, స్కూలువాళ్లు కలిగించుకుంటారు, మేస్టర్ల కమిటీనీ తల్లితండ్రుల సమితినీ కలిసి బోలెడు గ్రంథం తయారుచేస్తాయి. గంభీరంగా జరగాల్సిన పని బదులు విసుగెత్తించే చాటభారతం ఒకటి తయారవుతుంది.

అందువల్ల కలీనిన్ వీథి తన ప్లాన్ను దాల్నయ వీథికి తెలియనీయకుండా దాచిపెట్టింది. కాని ఏలాంటి రహస్యమేనా సరే షూర ఎలాగో ఒకలాగ తెలుసుకుంటాడు. పైగా షూర ఆ బొమ్మల్ని అప్పటికే చూసేశాడు. డ్రాయింగు కాగితంమీద మంచి భేషైన బొమ్మలు!

"వాళ్లంతట వాళ్లే ఏదో కల్పించి వేశారు" అని షూర చెప్పాడు సెర్యోషతో. "ఏరోప్లేను, తిమింగిలం వీపునుండి ఎగజిమ్ముతూన్న నీటి ధార,

కొన్ని నినాదాలు — వీటిని చిత్రించారు.... ఉల్లిపొర కాగితంమీద బొమ్మ గీసి, దాని ప్రకారం వొంటిమీద నకలు తీద్దాం; బొట్లు పొడుద్దాం గుండు సూదితో. మంచి భేషుగ్గా వస్తుంది!''

సెర్యోషకి మతిపోయింది. గుండుసూదితో పొడిపించుకోవడమే? బాబోయ్!''

ఐనప్పటికీ — షూర గనుక ఈ విధంగా చేద్దామని చెప్పినట్టయితే, సెర్యోష అందుకు సరే అంటాడు.

''అవును!'' అన్నాడు సెర్యోష, తనకేమీ భయంలేనట్టు నటిస్తూ. ''భేషుగ్గా వస్తుంది'' అన్నాడు.

కలీనిన్ వీధి కుర్రాళ్లు ఒప్పుకోలేదు — తిమింగిలం బొమ్మ కాదుకదా, చిన్న పిసరంత నినాదాన్ని కూడా ఒప్పుకోలేదు — షూరకీ, సెర్యోషకీ అసలు పచ్చబొట్లంటూ పొడవడానికే వాళ్లొప్పుకోలేదు. షూర ఇంటింటికీ వెళ్లి అడిగాడు, వాళ్లని ఒప్పించేందుకు ప్రయత్నించాడు, బతిమాలుకున్నాడు. ఏం ప్రయోజనం లేకపోయింది.

''మమ్మల్ని అల్లరిపెట్టకండి మీరు. తమాషాలా ఏమిటి? ఫో, నువ్వు, ఫో!'' అనేశారు వాళ్లు.

వీణ్ణి తోలేశారు వాళ్లు. వ్యవహారం అడ్డం తిరిగింది. సరిగ్గా ఈ సమయంలో అర్సేంతియ్‌ని షూర తన పక్షం తిప్పుకోగల్గాడు.

అర్సేంతియ్‌మీద పెద్దవాళ్లందరికీ వెర్రిప్రేమ. వాడు మంచి తెలివైన కుర్రాడు, అన్నిట్లోనూ ఫస్టే. పుస్తకాల పురుగు, నీటైన మనిషి. వాడి మాటంటే అందరికీ అతి గౌరవం. అన్నిటికంటే ముఖ్యమైనది — వాడిలో నిజాయితీ వుంది. వాడు ఎన్నో హాస్యాలాడిన తరువాత ''వీళ్లు మనకి చేసిన సేవకి మనం కృతజ్ఞత చూపించాలి. ఒక్క అక్షరంతో చేసేద్దాంరా. పేరు మొదటి అక్షరం. అందుకు ఒప్పుకుంటావా?'' అని అడిగాడు షూరని.

''ఒప్పుకోన్నా!'' అన్నాడు షూర. ''పొడి అక్షరం ఒక్కటే అవుతే మేం ఒప్పుకోం.''

''అయితే, పాండ్రా!'' అనేశాడు వస్తాదు వలేరియ్ — ఐదో క్లాసు కుర్రాడు. ''మరి మీ పని అయినట్టే లెండి!''

షూర అక్కడనుండి వచ్చేశాడు. కాని గత్యంతరంలేక — మళ్లీ వాళ్ల దగ్గరకి వెళ్లి: సరే లెండి — తనకి ''ష'' అనీ, సెర్యోషకి ''స'' అనీ — పొడి అక్షరాలకి మేం ఒప్పుకుంటాం, అన్నాడు. అయితే ఒకటి — పని మాత్రం నీటుగా వుండాలి — ఆషామాషీగా వుండకూడదు, అన్నాడు షూర. మర్నాటికి అంతా సిద్ధంగా వుండాలి. అందరూ వలేరియ్ ఇంట్లో కలుసుకోవాలనీ నిర్ణయమైంది. వాళ్ల తల్లి ఆఫీసు పనిమీద వూరెళ్లింది.

అనుకున్న వేళకల్లా షూర, సెర్యోషలిద్దరూ వలేరియ్ ఇంటికి వెళ్లారు. ఇంటి పోర్చిలో లరీసా — వలేరియ్ అక్క — కేన్వాసు గుడ్డమీద క్రాస్‌స్టిచ్‌తో ఏదో నమూనా కుడుతూ కూర్చుంది. ఎవరైనా పైవాళ్లు గనుక ఇంటికొచ్చి నట్టాయెనా ఇంట్లో ఎవ్వరూ లేరని చెప్పి, వాళ్లని పంపించి వేయడానికని ఆమెను వూరకే అక్కడ వలేరియ్ అలా కూర్చోబెట్టాడు. కుర్రాళ్లందరూ పెరట్లో స్నానాలగది దగ్గర చేరారు: ఐదవ క్లాసూ ఆరవ క్లాసూలో వున్న మగపిల్లలందరూ, మరి ఒకే ఒక ఆడపిల్ల — బొద్దుగా వుంటుంది, పాలిపోయిన ముఖం, గంభీరమైన వైఖరి, వాలిపోయిన కిందపెదవి; పెదవి ఇలా వాలిపోయి వుండడంవల్లనే ఆమె ముఖానికి గంభీరతా ఠీవీ వచ్చాయని పించింది, ఆ పెదవి మామూలుగానే వుండివుంటే, ఆ అమ్మాయిలో గంభీరతా ఠీవీ వుండేవేకావు.... ఈ అమ్మాయి పేరు కాపా. ఆమె బేండేజీలు కత్తిరించి, ముక్కాలిపీటమీద వుంచుతూంది. కాపా స్కూల్లో శాని టరీ దళం సభ్యురాలు. ఆమె ముక్కాలిపీటమీద శుభ్రమైన గుడ్డ పరచింది.

ఆ పొగచూరిన స్నానాలగది ఇరుగ్గా వుంది; స్నానాలగది పైకప్పుకి మస మసగ్గా వున్న చిన్న అద్దపు కిటికీ వుంది. గుమ్మంలో పొట్టిగా వున్న చెక్కదిమ్మ ఒకటుంది. గదిలో వున్న బెంచీమీద బొమ్మలు గీసిన కాగి తాలున్నాయి. బొమ్మలు గీసిన ఆ కాగితాలు లుంగలుగా పడివున్నాయి. కుర్రాళ్ల

వచ్చి ఆ కాగితాలను చూసి, వాటిని గురించి చర్చించారు, గొప్పగా సరదా పడ్డారు, సంతోషంతో వేళాకోళాలాడుకున్నారు, యెవడికి నచ్చిన బొమ్మలు వాడు తీసుకున్నాడు, దెబ్బలాట అన్నది అసలు జరగలేదు, ఎందుచేతంటే ఒక్క బొమ్మే ఎందరికైనా ఉపయోగపడుతుంది. షూర, సెర్యోషలు బొమ్మల్ని వాటి కళానైపుణ్యాన్ని మెచ్చుకున్నారు, కానీ బెంచీ దగ్గరకెళ్లి, అధికారం చలాయించడానికి నిశ్చయించుకోలేకపోయారు: చాలామంది కుర్రాళ్లు ఉన్నారక్కడ, ఒక్కొక్కడూ గుండులా వున్నాడు, ఎవడి మానాన వాడు స్వతంత్రంగా తిరుగుతున్నాడు. ప్రతివాడూ మంచి హుషారుగా వున్నాడు.

అర్సేంతియ్ చేతిలో తోలుసంచి పట్టుకుని, ఆరో పీరియడు అయిపోయిన వెంటనే సరాసరి వచ్చేశాడు స్నానాలగదిలోకి. తనకు హోమ్‌వర్కు చాలా వుందనీ, కాంపోజిషను రాయాలనీ, భూగోళశాస్త్రంలో చదువుకోవలసినది బోలెడుందనీ, అందుచేత తనకు క్యూలో మొదటి స్థలం ఇవ్వమనీ అందరినీ కోరాడు. వాడు కష్టపడి చదువుతాడని చెప్పి, గౌరవపురస్సరంగా వాడికి మొదటి స్థలం ఇచ్చారు. వాడు తన సంచిని జాగ్రత్తగా బెంచీమీద వుంచి, నవ్వుతూ తన షర్టు తీసివేసి, దాన్ని బెంచిమీద పడేసి, నడుము వరకూ వొంటిమీద గుడ్డలేకుండా, గుమ్మంకేసి వీపు తిప్పుకుని చెక్కదిమ్మమీద కూచున్నాడు.

వాడిచుట్టూ బోలెడుమంది కుర్రాళ్లు చేరారు. సెర్యోష, షూర లోపలికి తోసుకురాలేక గుమ్మం అవతలే వుండిపోయారు. వాళ్లు ఎంత పైకి ఎగిరినా వాళ్ల కేమీ కనబడలేదు. కుర్రాళ్ల సంభాషణ ఆగిపోయింది, లోపల అలికిడి చప్పుడూ కాగితాల ఫెళఫెళ శబ్దమూ వినబడింది; మరో క్షణానికల్లా వలేరియ్ గొంతుక వినబడింది:

''కాపా! లరీసా దగ్గిరకెళ్లి, తువాలు ఒకటి ఇమ్మన్నానని చెప్పి పట్టుకురా!''

కాపా గంభీరంగా ముఖంపెట్టుకుని పరుగెత్తి వెళ్లి తువాలు తీసుకొచ్చి, కుర్రాళ్ల తలకాయల సందులోనుంచి తువాలు వలేరియ్‌కి అందించింది.

''తువాలెందుకురా? షూర! తువాలెందుకురా?'' అని అడిగాడు సెర్యోష, ఏమైన కనబడుతుందేమో చూద్దామనే ఆశతో పైకెగిరి.

''ఒకవేళ రక్తం కారుతూందేమోగ్రా!'' అన్నాడు షూర ఉద్రేకంతో, కుర్రాళ్ల గుంపు మధ్య వున్న సందుగుండా తన తలకాయ దూర్చి ఏమి జరుగుతూందో చూసేందుకు ప్రయత్నిస్తూనూ. పొడుగ్గా వున్న కుర్రాడొకడు కోరచూపులతో షూరవైపు తిరిగి, దబాయిస్తూ మెల్లగా అన్నాడు:

''ఏమిటిది? నీ అగడాలేవీ పనికిరా విక్కడ!''

అంతా నిశ్శబ్దంగా వుంది. షూర, సెర్యోషలకి ఏమీ తెలియకపోవడం చేత చెప్పలేనంత చిత్రహింస అనుభవించారు. ఈలోపుగా సెర్యోషకి విసుగెత్తు కొచ్చింది, అలసట వచ్చేసింది. తూరీగలను పట్టుకున్నాడు, ముంగిట ఇటూ అటూ తిరిగాడు, పోర్చిలో కూచున్న లరీసాను చూస్తూ నుంచు న్నాడు.... చిట్టచివరకి సంభాషణ ప్రారంభమైంది, మూక విడింది, మూక లోనుంచి అర్సేంతియ్ బయటికొచ్చాడు. అయ్ బాబోయ్! వాణ్ణి పోల్చుకోవడమే కష్టమైపోయింది. ఘోరంగా అవుపడ్డాడు, మెడనుంచి నడుము వరకూ ఊదారంగు. తెల్లని ఛాతీ ఎక్కడా అవుపడదే? తెల్లని వీపు ఏది? ఎక్కడా అవుపడదే? నడుముకు చుట్టుకున్న తువాలునిండా రక్తమూ సిరా మరక లూనూ! ముఖాన రక్తంలేదు – ముఖం పాలిపోయింది; వాడు మాత్రం నవ్వుతున్నాడు, వీరుడు అర్సేంతియ్! భారంగా అడుగులు వేస్తూ కాపా దగ్గ రకెళ్లి, వొంటిమీద వున్న తువాలు తీసివేసి:

''బేండేజీ చుట్టేసెయ్!'' అన్నాడు.

''పిల్లకాయల్ని రమ్మనండి మొదటే!'' అన్నారెవరో, ''లేకుంటే వాళ్లు భయపడిపోతారు. పిల్లకాయల్ని మొదట రానిద్దాం!''

''పిల్లకాయలూ! ఎక్కడున్నార్రా మీరు?'' అని వలేరియ్ ఊదారంగు చేతు

లతో స్నానాలగదిలోనుంచి బయటికి వచ్చి కేకేశాడు. ''మనసు మార్చుకోలేదా, మీరు?... ఐతే, సరే, రండి మరి, చప్పున!''

వొంటినిండా రక్తంతోనూ. సిరాతోనూ అర్సేంతియ్ అక్కడ నవ్వుతూ నిలబడి వుండగా — ''మనసు మార్చుకున్నాం'' అని ఎలా అనడం? మరి, మనసు చిక్కబట్టుకోవడం ఎలా?...

''ఒక్క పొడి అక్షరమే — వేగమే అయిపోతుంది!'' అనుకున్నాడు సెర్యోష మనసులో.

షూర స్నానాలగదిలోకి వెళ్లాడు. వాడి వెనువెంటే సెర్యోష వెళ్లాడు. లోపల యెక్కువమంది లేరు. అర్సేంతియ్ వొంటికి కాపా ఎలా బేండేజీ చుట్టుతూందో పెద్ద కుర్రాళ్ల చూస్తున్నారు. వలేరియ్ చెక్కదిమ్మమీద కూచుని:

''ఏ అక్షరాలు కావాలా మీకు?'' అని అడిగాడు.

''నాకు 'ష' '' అన్నాడు షూర. ''మరి నాకు తువాలు అక్కర్లేదా?''

''అక్కర్లేదులే. వొంటినిండా మాత్రం చేసుకోకు మరి, ఏం? చెయ్యి ఇలా ఇయ్యి, చేతిమీద వేస్తాను.'' అన్నాడు వలేరియ్.

వలేరియ్ షూర చెయ్యి పట్టుకుని, గుండుసూదితో చిటుక్కున పొడిచాడు.

షూర గుప్పున పైకి ఎగిరాడు. ''ఓయ్!...'' అని కేకేశాడు.

''ఓయ్, ఇక ఇంటికి పో!'' అన్నాడు వలేరియ్, మరొక్క పోటు పొడిచి. ''నీకు ముల్లు విరిగితే తీస్తున్నానని ఊహించుకోరా! అలాగనుకుంటే సరి, మరి నీకు నొప్పెట్టదు.''

షూర వొళ్లు బిగబట్టాడు, మరిక అట్టే అరవలేదు, ఈ కాలు ఎత్తి, ఆ కాలు ఎత్తి, కొద్దిగా పైకెగిరాడు, చేతిమీద 'ఉఫ్' అని వూరుకున్నాడు, చేతిమీద వున్న ఎర్రని చుక్కల్లోనుండి ఒకటి తరువాత ఒకటి, నెత్తురు బొట్లు రాలాయి. చుక్కలమధ్య వున్న చర్మాన్ని వలేరియ్ సూదితో పెట్లగొట్టాడు — షూర చెంగున ఎగిరాడు, కాలి మడమతో నేలను

కొట్టాడు, తన శక్తి అంతటితోనూ 'ఉఫ్' మని వూదాడు చేతిమీద. రక్తం జలజల కారింది....

'''ష' చిక్కైన అక్షరం – నున్న దానికి కొమ్ము, కొమ్ముకి నిలువు గీత, పైన తలకట్టు – పాపం, షూర దురదృష్టవంతుడు. 'సె' సులువైన అక్షరమే. షూర భలే మనిషి, వాడు కిక్కురుమనలేదు. 'ఓయ్ – ఓయ్ – ఓయ్' అని నేనూ కేకెయ్యను. ఇప్పుడు గనక నేను పరుగెత్తి పారిపోయానంటే, అందరూ లేవిడికొడతారు, షూరాయే అంటాడు నన్ను – పిరికిపంద అని....'' సెర్యోష కళ్లు పెద్దవి చేసుకుని, ఇటూ అటూ కదపకుండా రక్తంకేసే చూస్తూ అనుకున్నాడు.

వలేరియ్ బెంచిమీద వున్న సిరాబుడ్డిని తీసి సిరాను కుంచెతో షూర చేతిమీద రుద్దాడు – సరాసరి రక్తంలోకే....

''అయిపోయింది!'' అన్నాడు వలేరియ్. ''ఇహ తరువాత మనిషి!'' అని పిలిచాడు.

సెర్యోష ముందుకు అడుగులువేసి, చెయ్యి చాపాడు....

తన ఎడమచేతితో కుడిచేతిని ఎత్తి పట్టుకుని, వలేరియ్ స్నానాలగదిలో నుండి సెర్యోష బయటి వచ్చేటప్పటికల్లా ఇహ జబ్బు మొదలెట్టింది. చెయ్యి వాచిపోయి, మండిపోతూంది. చెయ్యి అంతా సిరా. స్నానాలగదిలోనుంచి బయటికి వచ్చాడు. కళ్లు చీకట్లు కమ్మేశాయి, గుండ్రంగా వెలుగుతూన్న చక్రాలు కళ్ల ఎదుట నృత్యం చేస్తున్నాయి, సిగరెట్టు పొగ వాసన కొడుతూంది కడుపులో తిప్పేస్తూంది.... గడ్డిలో పడుకున్నాడు, బేండేజీ కింద చెయ్యి సలిపేస్తూంది, మంటపెట్టేస్తూంది. షూర, ఇంకా మరొక అబ్బాయీ కలిసి సెర్యోషని ఇంటిదగ్గర దిగబెట్టేశారు. పాష అత్తయ్య ఏమంతగా పట్టించుకుని వాడికేసి చూడలేదు – ఎందుకంటే వాడు పొడుగు చేతుల షర్టు తొడుక్కున్నాడు. అందుకని చెయ్యి సరిగ్గా కనబడలేదు మరి. తను ఇంట్లోకి సరాసరి వెళ్లి మంచంమీద పడుకున్నాడు.

కాస్సేపటికి వాంతులు మొదలయాయి, జ్వరం వచ్చేసింది. పాష అత్తయ్యకి కాళ్ళూ చేతులూ ఆడలేదు. స్కూల్లో వున్న తల్లికి వెంటనే టెలిఫోను చేసింది. తల్లి పరుగెత్తుకుంటూ వచ్చింది, డాక్టరు వచ్చాడు. సెర్యోష వేసుకున్న బట్టలు విప్పించేశారు, చేతికున్న కట్టు విప్పారు – అయ్యో, అయ్యో అనుకున్నారు! ఏమిటి జరిగిందిరా అని వాణ్ణి అడిగారు. తనేమీ జవాబుచెప్పలేదు – తను అప్పుడే స్వప్నలోకంలో వున్నాడు. ఘోరమైన, అసహ్యమైన కలలు: ఎర్రని బనియను తొడుక్కున్న ఎవడో రాక్షసుడు కాబోలు, వుత్త చేతులు, ఊదాగా వున్నాయి. ఆ రాక్షసినుండి సిరాకంపు వస్తూంది, చెక్కదిమ్మమీద వున్న మాంసాన్ని కసాయివాడు గొడ్డలితో చీరుతున్నాడు. నెత్తురు వోడుతూన్న కుర్రాళ్లు వెటకారాలాడుతున్నారు.... తన కంటికి కనబడుతూన్న కల గురించి సెర్యోష కలవరించేస్తున్నాడు. తను ఏమిటి చెబుతూన్నాడో తనకే తెలియడంలేదు, వొంటిమీద తెలివిలేదు. ఈ విధంగా అసలు జరిగినదంతా పెద్దవాళ్లకి తెలిసిపోయింది. సెర్యోష కలవరింతలో గొడుగుకామ, పాము అని పదేపదే అంటున్నాడు. అలా ఎందుకంటున్నాడో వాళ్లకి చాలాసేపటి వరకూ తెలియలేదు. కాని ఎప్పుడైతే చేతిమీద గాయానికి మందువేయాలని గాయాన్ని కడిగారో, అప్పుడు శాశ్వతంగా చేతిమీద గొడుగుకామ, పాము ముద్రపడి వున్న లేత నీలరంగు "సె" అక్షరం వుండడం పోల్చుకున్నారు.

వాళ్లు సెర్యోషకి అతి ఆపేక్షతోనూ ముద్దుగానూ సంరక్షణచేశారు. సెర్యోషను వలేరియ్ పెట్టిన బాధకంటె తక్కువ బాధ ఏమీ పెట్టలేదు వాళ్లు. ముఖ్యంగా డాక్టరు పెన్సిలిన్ ఇంజెక్షన్లు పొడిచి అమానుషంగా బాధపెట్టాడు. మరి సెర్యోషకి నొప్పివల్ల ఏడుపురాలేదు కాని, వాళ్లందరి ఎదుట తనకు తలవంపులు అయిపోయిందనీ, తలవంపులు తట్టుకుందుకు తనకు శక్తి లేకపోయిందనీ, నలుగురిలోనూ సిగ్గుపడవలసి వచ్చిందికదా అనే అవమానానికీ ఏడ్చేశాడు.... డాక్టరు పెట్టిన బాధ చాలనట్టు, అతడు

కబురుచేస్తే తెల్లని అంగరకా వేసుకున్న స్టాఫ్‌నర్సు వచ్చింది. ఈ కఠినా త్ముఁరాలు ఒక ప్రత్యేకమైన యంత్రంతో సెర్యోష వేలుమీద గంటుపెట్టి, వేలులోనుంచి రక్తం పిండింది. ఈ చిత్రహింస తరువాత, సెర్యోషతో డాక్టరు హాస్యాలాడి నవ్వించి, సెర్యోష తలకాయను నిమిరాడు, ఏది ఏమైనా ఇది సెర్యోషకి వెక్కిరింపుగా వుండింది.

...అదంతా వేసవి చివరి రోజుల్లో జరిగింది. అప్పటికి స్కూలు కొద్ది రోజులకిందే ఆరంభమైంది. రోజులు వెచ్చగా నిద్రమత్తుగా పసిడివన్నెలా వుండేవి. మరి ఇప్పుడు శరత్తు రానేవచ్చేసింది. కిటికీల్లోనుంచి ఆకాశం మసమసగ్గా కనబడుతూంది. వెలుపలి కిటికీ లోపలి కిటికీలమధ్య బెత్తెడు ఎత్తువరకూ దూది వొత్తుగా పరచి, ఉప్పుతో నింపిన గ్లాసులను దూది పైన వుంచి, కిటికీలు మూసి, లోపలి కిటికీ అంచులచుట్టూ పాష అత్తయ్య కాగితపు పట్టీలు అంటించింది....

సెర్యోష మంచంమీద పడుకున్నాడు. మంచం దగ్గర రెండు కుర్చీలు న్నాయి: ఒక కుర్చీలో బొమ్మలు చిందరవందరగా కుప్పగా పడి వున్నాయి. ఆ బొమ్మల్లో కొన్నింటిని రెండో కుర్చీలో పెట్టుకుని వాటితో సెర్యోష ఆడుకుంటున్నాడు. కుర్చీలో బొమ్మలు పెట్టుకుని ఆడుకుందుకు ఏమీ వాటంగాలేదు. టాంకులు గిరున తిరిగేందుకు వీల్లేదాయె. మాటవరుసకి ఒకవేళ శత్రువుని తిరిగి వెంట తరమాల్సినప్పుడు, ఇహ ఎటు తరమడానికీ అసలు జాగా లేనేలేదు — వెనక్కి తరమాలంటే కుర్చీ వీపు అడ్డుతుంది; ఇహ దానితో సరి; దీన్ని ఎవరేనా యుద్ధమంటారా?

సెర్యోష కుర్చీమీద వున్న బొమ్మలతో ఆడుకుని అలసిపోయి, ఇక మంచంమీదనే అలా పడుకున్నాడు. అలా పడుకుని, ఈ బాధంతా తను ఎందుకు భరించాల్సి వచ్చిందో ఆలోచించుకున్నాడు. తన దురదృష్టానికి మొదటి కారణం ఏమిటో తెలుసుకుందామని ప్రయత్నించాడు.

''నేను పచ్చబొట్లు పొడిపించుకోకుండా వుండినట్టయితే యిలా జబ్బు

పడి వుండేవాణ్ణికాను. మరి వాస్య కెప్టెను మామయ్యగారితో పరిచయం చేసుకోకుండా వుండినట్టయితే పచ్చబొట్లు పొడిపించుకుని వుండేవాణ్ణి కాను. వాస్య ఇంటికి ఆయన రాకుండా వుంటే, ఆయనతో పరిచయం అయివుం డేది కాదు. అవును, ఆయన వచ్చేందుకు ఇష్టపడకపోయుంటే ఏమీ జర గకపోను, నేను జబ్బుపడకుండా వుండేవాణ్ణి'' అనుకున్నాడు సెర్యోష.

ఐనా, వాస్య మామయ్యమీద సెర్యోషకి ఏమీ శత్రుభావం కల్గలేదు. మరేమిటో గాని, చూడబోతే, ప్రపంచంలో అకారణంగానే ఒకదానితో ఒకటి ముడిపడిపోయి, ఒకదాని కారణంగా ఒకటి జరిగిపోతుంది. ఎక్కడనుంచి కష్టంవచ్చి మీదపడుతుందో మనం ముందుగా పోల్చుకోనేలేం.

తనకు సరదాగా వుండాలని అందరూ ప్రయత్నిస్తున్నారు. తనకి ఒక చిన్న ఆక్వేరియమ్ కానుకగా ఇచ్చింది అమ్మ. ఆ గాజు తొట్టెలో నీళ్ళున్నాయి, నీళ్లలో ఎర్రని చేపలున్నాయి. ఆ ఆక్వేరియమ్‌లో నాచూ నీటిచెట్లూ మొలుస్తున్నాయి. చేపలకు తిండి కావాలికదా మరి. అందుకని బుట్టలో వున్న గుండను నీటిలో వెయ్యాలి.

''వాడికి జంతువులంటే ఎంతో ఇష్టం సుమండీ! వీటితో వాడికి బాగా వూసుపోతుంది'' అంది అమ్మ ఎవరితోనో.

నిజమే, తనకి జంతువులంటే సరదాయే. ఇంట్లోవున్న పెంపుడు పిల్లి అంటే సరదా, మచ్చికచేసిన జెముడుకాకి అంటే సరదా. కాని చేపలు జంతు వులు కావే.

ఇంట్లో పిల్లి జూలుజూలుగా వుంటుంది, వెచ్చగా వుంటుంది; దానితో చక్కగా ఆడుకోవచ్చు—ఇప్పుడది ముసల్ది అయిపోయి, చిరచిరలాడుతూ కోపంగా వుంటుంది. ఆ జెముడుకాకి మంచి సరదాగా వుండేది, దాన్ని చూస్తేనే నవ్వొచ్చేది. గదుల్లో ఎగిరేది; బల్లమీదున్న చెమ్చాల్ని ఎత్తుకు పోయేది. సెర్యోష దాన్ని పిలిచేసరికల్లా కావ్‌కావ్ అని అరిచేది. చేపలతో ఏమి సరదా వేస్తుంది గనక? అవి వూరకే ఆ గాజుతొట్టెలో అలా తేల్తూ

ఈదుతూ వుంటాయి, వాటికి ఏ ఆటా చేతకాదుకదా, వూరకే తోక ఆడిం చడం తప్ప.... అమ్మకి ఇదేమీ అర్థంకాదు.

సెర్యోషకి కుర్రాళ్లుండాలి, వాళ్లతో ఆడుకుంటాడు, వాళ్లతో కబుర్లు చెప్పుకుంటాడు. కుర్రాళ్లందరిలోనూ షూర అంటే సెర్యోషకి మరీ ఇష్టం. కిటికీలకి కాగితపు పట్టీలు అంటించకముందు, అవి తెరచివుండినప్పుడు షూర కిటికీకిందకి దారిచేసుకుని వచ్చి:

''సెర్యోష! ఎలా వున్నావురా?'' అని అడిగేవాడు.

''ఇలా రారా!'' అని సెర్యోష, మంచంమీదనే మోకాళ్లపైన చప్పున లేచి కేకవేసేవాడు.

''నన్ను రానివ్వర్రా, నీదగ్గిరకి'' అన్నాడు షూర (వాడి తలకాయమీదున్న జుట్టు మాత్రమే అగపడేది సెర్యోషకి). ''వేగం బాగైపో, అప్పుడు కలిసి తిరుగుదాం.''

''ఏం చేస్తున్నావురా ఇప్పుడు?'' అని అడిగాడు సెర్యోష ఉద్రేకంతో.

''నాన్న నాకు తోలుసంచి కొని ఇచ్చార్డా, పుస్తకాలు పెట్టుకుందుకు. నేను బడిలో చేరుతున్నానుగా. అప్పుడే నా పుట్టినతేదీ కాగితం ఇచ్చేశారు. మరేమో, అర్సేంతియ్‌కి కూడా జబ్బుచేసింది. అయినా మరెవ్వరికీ జబ్బు చేయలేదు. మరి, నాకూ జబ్బుచేయలేదురా. వలేరియ్‌ని మాత్రం మరో స్కూలికి మార్చేశారు, వాడిప్పుడు ఎంతో దూరం నడిచిపోవాలి స్కూలుకి'' అన్నాడు షూర.

ఒక్కమాటు ఎన్ని విశేషాలో!

''నే వెళ్తా్ర్నా! నువ్వు వేగం వచ్చేయ్‌రా!'' అని వెళ్లిపోయాడు వాడు. వాడి గొంతుక అప్పుడే ఎంతో దూరంనుండి వినబడింది. ముంగిట పాష అత్తయ్య కంటబడి వుండాలి.

అయ్యో, తను కూడా ముంగిట వుండగల్గితే ఎంత బాగుండిపోను! షూర వెంట! వీధిలో! ఈ జబ్బుపడకముందు ఎంత సరదాగా, ఎంత

షోగ్గా వుండేది! తను ఎంత బాధపడ్డాడో, ఎన్ని సరదాలు తనకి లేకుండా పోయాయో!

అవగాహనకు అందని విషయాలు

చిట్టచివరకి సెర్యోషను మంచంమీదనుండి లేవనిచ్చారు. తరువాత మరి కొద్దిరోజులకే షికారు వెళ్ళనిచ్చారు. ఇంటినుండి దూరంగా నడిచివెళ్ళడానికీ, ఇరుగుపొరుగు ఇళ్ళకి వెళ్ళడానికీ వీల్లేదన్నారు: మళ్ళీ వీడు ఏం తెచ్చుకుంటాడో ఏమిటో అని భయపడ్డారు.

మధ్యాహ్నం భోజనం వరకే సెర్యోషను వీధిలో వుండనిచ్చేవారు, అంత వరకూ వాడి నేస్తులందరూ స్కూల్లోనే వుంటారాయె. షూరకి ఏడేళ్ళు నిండకపోయినప్పటికీ, వాడు అప్పటికే స్కూలుకి వెళ్తున్నాడు. పచ్చబొట్ల కథ జరిగిన తరువాత, వాణ్ణి స్కూల్లో పడేస్తేనే మంచిది, అక్కడ వాడి మీద ఒక కన్నువేసి వుంచుతారు, వాడికి ఏదో కొంత పనీ పాటూ అంటూ కూడా వుంటుంది — అని స్కూల్లో జేర్పించారు.... చంటిపిల్లలంటే సెర్యోషకు సరదా లేదు.

ఒకనాడు సెర్యోష ముంగిట్లో వెళ్లి ఇటూ అటూ చూస్తూండేసరికి షెడ్డు దగ్గర వున్న దుంగలమీద ఎవరో ఓ పరాయి మనిషి కూచుని వుండడం చూశాడు. ఆ మనిషి పెట్టుకున్న ఫర్‌టోపీకి బొచ్చు అంతా రాలిపోయి బోడిగా నున్నగా వుంది. గడ్డం బాగా మాసిపోయి, ఏకంగా ఓ బ్రష్‌లా తయారయింది. వొంటిమీద బట్టలు చిరిగిపోయున్నాయి. అక్కడ కూచుని, సొంతంగా చుట్టుకున్న చిన్న సిగరెట్టు పీకె కాలుస్తున్నాడు — ఆ పీకె పిసరంతే వుంది — ఎంత పిసరంటే, పచ్చబడి నలుపెక్కిపోయిన వేళ్ళ రెండింటితోనూ అదిమిపట్టుకున్న ఆ పీకె కంటికి కనబడ్డమే లేదు. పైకివస్తూన్న పొగ సరాసరి వేళ్ళలోనుంచి వస్తూన్నట్టే అవుపడింది. ఆ

మనిషి గాయపడ్డాడేమో అనిపించింది గాని, గాయాలేవీ లేకపోవడం చూసి సెర్యోష ఆశ్చర్యపడ్డాడు.... రెండో చేతికి మురికి గుడ్డతో కట్టిన బేండేజీ వుంది. బూట్లకి లేసులు బదులు తాళ్లు కట్టుకున్నాడు. సెర్యోష ఇదంతా చూసి:

''కొరొస్తెల్యోవ్ కోసం వచ్చారా?'' అని ఆ మనిషిని అడిగాడు.

''ఎవరా కొరొస్తెల్యోవ్?'' అని అడిగామనిషి. ''కొరొస్తెల్యోవ్ ఎవరో నాకు తెలీదు'' అన్నాడు.

''ఐతే మీరు లుక్యానిచ్ మామయ్య కోసం వచ్చారా?''

''లుక్యానిచ్ ఎవరో నాకు తెలీదు.''

''వాళ్లెవరూ లేరు ఇంట్లో, ఒక్క పాష అత్తయ్యే వుంది, నేనున్నాను. మీకేం బాధగా వుందా ఏమిటి?'' అన్నాడు సెర్యోష.

''నాకు బాధేమొచ్చె?''

''వేళ్లు కాల్తున్నాయిగా!''

''ఆఁ!''

సిగరెట్టు పీకెను కడపటి సారి పీల్చి, మిగిలిపోయిన పిసరుని నేలమీద పడేసి, దాన్ని కాలితో నలిపేశాడు.

''రెండో చెయ్యి ఇదివరకే కాలిపోయిందా ఏమిటి?'' అని అడిగాడు సెర్యోష.

ఆ మనిషి జవాబుచెప్పకుండా తీవ్ర ఆందోళనతో సెర్యోషకేసి చూశాడు. ''ఎందుకలా చూస్తున్నాడు చెప్మా?'' అనుకున్నాడు సెర్యోష. ఆ మనిషి అడిగాడు:

''మీకు ఇంట్లో అంతా బాగానే వెళ్లిపోతూందా?''

''బాగానే వెళ్లిపోతూందండి'' అన్నాడు సెర్యోష.

''మీ ఇంట్లో అన్నీ వున్నాయా?''

''ఏమిటి అన్నీ?''

''మీకు ఏమి ఏమిటున్నాయి?''

''నాకు సైకిలుంది. ఆడుకుందుకు బొమ్మలున్నాయి. అన్ని రకాలవీ వున్నాయి.. మామూలువేకాదు, కీ ఇస్తే తిరిగేవి కూడానూ. ల్యోన్యకి అట్టే లేవు, వాడికి గిలకలే వున్నాయి'' అన్నాడు సెర్యోష.

''కత్తిరింపులు ఏవేనా వున్నాయా?'' అని అడిగాడామనిషి. సెర్యోషకి ఆ మాట అర్థం బహుశ తెలియకపోవచ్చునేమో అని అనుకుని, అతడు వివరించి చెప్పాడు: ''గుడ్డ – సూట్లూ, ఓవర్‌కోట్లూ కుట్టించుకుందుకు గుడ్డ – వుందా మీ ఇంట్లో?''

''అలాంటి గుడ్డలు మా ఇంట్లో లేవే'' అన్నాడు సెర్యోష. ''వాస్య తల్లి దగ్గిరున్నాయి.''

''ఆవిడ ఇల్లు ఎక్కడుంది – వాస్య తల్లి ఇల్లు?''

సంభాషణ ఇహ మీదకి ఎలా మళ్లించాలో ఎవరికీ తెలీలేదు – సరిగ్గా ఆ క్షణానికి గేటు గడియ చప్పుడైంది; లుక్యానిచ్ మామయ్య ముంగిట ప్రత్యక్షమయాడు.

''ఎవరయ్యా నువ్వు? ఎందుకొచ్చావయ్యా?'' అని లుక్యానిచ్ మామయ్య అడిగాడు.

ఆ మనిషి, కూచున్న దుంగమీదనుంచి లేచి, వినయంగానూ జాలి పుట్టించేటట్టూ నిలబడ్డాడు.

''పనికోసం చూస్తున్నానండి, అయ్యా!'' అన్నాడా మనిషి.

''పనికోసమే అయితే ముంగిట్లోకి రావడమెందుకయ్యా?'' అని అడిగాడు లుక్యానిచ్ మామయ్య. ''ఎక్కడ కాపురం?''

''ప్రస్తుతం ఎక్కడా లేదండయ్యా.''

''మరైతే ఇదివరకు ఎక్కడయ్యా కాపురం?''

''కాపురం ఎత్తేసి చాలాకాలమైందండయ్యా.''

''జైల్లోపడి వచ్చావా ఏమిటి?''

''నెలరోజులైందయ్యా విడుదలై.''

''ఎందుకు పడ్డావయ్యా జైల్లో?''

ఆ మనిషి తటపటాయిస్తూ బదులుచెప్పాడు:

''పరాయివాళ్ల ఆస్తితో కాస్త అజాగ్రత్త అయిందండయ్యా వుత్త పుణ్యానికే నాకు శిక్షపడిందండి. మేస్త్రీటుగారు పొరపాటు పడ్డారండి.''

''మరైతే – జైలునుండి వచ్చినవాడివి, ఇంటికి పోకపొయ్యావా, గాలి గుడ్డులా దేశాలంట తిరక్కపోతేనూ?''

''ఇంటికే పోయానండి. ఆడది ఇంట్లో అడుగుపెట్టనిచ్చిందికాదండి. మరొకణ్ణి ఇంటో చేరదీసిందండి: షాపులో అటెండరు అండీ వాడు! నేనావూళ్లో రిజిస్టరు కాలేదండి, అందుచేత అక్కడ వుండేందుకు వీల్లేక.... ఇప్పుడు తల్లి దగ్గరకు పోతున్నానండి – చీతా పట్నానికి, బాబయ్యా – మా తల్లి చీతాలో వుందండి'' అన్నాడా మనిషి.

సెర్యోష నోరు తెరచుకుని విన్నాడు. ఈ మనిషి జైల్లో పడ్డాడా! బొమ్మల పుస్తకాల్లో వున్నట్టు, గండ్రగొడ్డళ్లతోనూ పట్టాకత్తులతోనూ నఖశిఖపర్యంతమూ సాయుధులైన గెడ్డాల వార్డర్లమధ్య జైల్లో ఇనుప గజాల తలుపుల వెనుక వున్నాడా – ఈ మనిషి? మరి, అమ్మ పాపం అదేదో చీతా పట్నంలో వుందా? పాపం! కొడుక్కోసం ఏడుస్తూంది కామోసు – పాపం! ఏడవదా, మరి? ... కొడుకు ఎలాగో ఒకలాగు అష్టకష్టాలూ పడి మళ్లీ తన దగ్గిరకి చేరుకోగానే అమ్మ ఎంతో సంతోషిస్తుంది. కొత్త సూటూ, కొత్త ఓవర్‌కోటూ కుట్టిస్తుంది – బూట్లకి తాళ్ల బదులు లేసులు కొని ఇస్తుంది....

''చీతా – చాల దూరం అన్నమాటే!...'' అన్నాడు లుక్యానిచ్ మామయ్య. ''ఏమిటయ్యా ఆ కబుర్లూ నువ్వూనూ? దొరికితే పని – లేకుంటే మళ్లీ అదే పని, ఇహేముంది – పరాయి సొత్తు అంటేయడం, అంతే కదయ్యా?...''

ఆ మనిషి కనుబొమలు ముడిపెట్టి, ''మీ సెలవైతే దుంగలు కోస్తానండి, రంపంతో'' అన్నాడు.

''సరేలే, దుంగలు కొయ్యి'' అన్నాడు లుక్యానిచ్ మామయ్య. అలా అని షెడ్డులోకెళ్లి, రంపం పట్టుకొచ్చి ఇచ్చాడా మనిషికి.

గుమ్మంలో గొంతుకల చప్పుడు చెవినిబడి, పాష అత్తయ్య ఇంట్లోనుంచి వచ్చి, వసారాలో నిలబడి, సంభాషణ వింది. ఎందుకనో మరి, ఆమె కోళ్లకి ఏదో ఎర చూపి, వాటిని మెల్లగా షెడ్డులోకి తోలి, వాటికింకా పడుకునే వేళకు ఎంతో ముందుగానే వాటిని షెడ్డులో పెట్టి, షెడ్డుకి తాళంవేసేసి, తాళంచెవి తన జేబులో పెట్టేసుకుంది. పెట్టేసుకుని, సెర్యోషతో చెవిలో చెప్పింది:

''ఒరేయ్, సెర్యోష! నువ్వు ఇటూ అటూ షికారు తిరుగుతూ, ఆ మనిషిమీద ఓ కన్నువేసి వుంచు — ఆ రంపం పట్టుకుపోకుండాను!''

సెర్యోష ఆ మనిషి చుట్టూ తచ్చాడుతూ, అతడికేసి జిజ్ఞాసతోనూ, సందేహంతోనూ, జాలితోనూ, మళ్లీ కొంత భయంతోనూ చూశాడు. ప్రత్యేకమూ, గూఢమూ అయిన అతడి గతి తల్చుకుని, అతడితో మాట్లాడాలని సెర్యోష సాహసించలేదు. అతడు మాటా మంతీ లేకుండా శ్రద్ధగా దుంగలు కోస్తున్నాడు. సిగరెట్టు చుట్టుకుని సిగరెట్టు కాల్చుకుందుకు మాత్రం అప్పుడప్పుడు కూచునేవాడు.

సెర్యోషను భోజనానికి రమ్మని పిల్చారు. తల్లీ కొరొస్తెల్యోవూ ఇంట్లో లేరు. వీళ్లు ముగ్గురూ కలిసి భోంచేశారు. పులుసు తాగిన తరువాత పాష అత్తయ్యతో ''ఆ దొంగవెధవకి నా పాత ఫెల్ట్‌బూడ్సు ఇచ్చేయ్'' అన్నాడు లుక్యానిచ్ మామయ్య.

''వాటిని నువ్వింకా కొంత కాలం తొడుక్కోవచ్చు'' అంది పాష అత్తయ్య. ''అతగాడి బూడ్సులు బాగానే వున్నాయి.''

''ఆ బూడ్సులతో చీతా వరకూ ఎల్లా పోతాడు? ఎక్కడో వుంది చీతా!'' అన్నాడు లుక్యానిచ్ మామయ్య.

''ఆ మనిషికి భోజనం పెడతా. నిన్నటి పులుసు బోలెడంత వుండి పోయింది'' అంది పాష అత్తయ్య.

లుక్యానిచ్ మామయ్య తన భోజనం అయాక, విశ్రాంతి తీసుకుందుకని, గదిలోకి వెళ్లిపోయాడు. పాష అత్తయ్య టేబిలుమీద వున్న గుడ్డ తీసేసి దాన్ని మడతపెట్టి, బీరువాలో పెట్టేసింది.

''టేబిలుగుడ్డ తీసేశావేమీ?'' అని అడిగాడు సెర్యోష.

''టేబిలుగుడ్డ లేకపోతేనే బాగుంటుంది'' అంది పాష అత్తయ్య. ''అతను కుళ్లోడుతూ వున్నాడు.''

పాష అత్తయ్య పులుసు వెచ్చబెట్టి, బ్రెడ్డు కోసి ''లోపలికొచ్చి, భోంచేయండి'' అని జాలిగా పిలిచింది ఆ మనిషిని.

ఆ మనిషి ఇంట్లోకి వచ్చి, గుమ్మందగ్గర వున్న గుడ్డమీద తన బూడ్సులను ఎంతోసేపు దులుపుకొని, ఇంట్లోపలికి వచ్చాడు. పాష అత్తయ్య దొప్పగరిటెతో అతని చేతులమీద నీళ్లు పోస్తే, అతడు చేతులు కడుక్కున్నాడు. అక్కడ అలమారమీద రెండు సబ్బుబిళ్లలున్నాయి — ఒకటి రోజా రంగుది, ఇంకొకటి మామూలు పసుప్పచ్చనిది. మరి — చేతులు కడుక్కుందుకు రోజారంగు సబ్బుబిళ్లే వాడాలనే సంగతి అతడికి తెలీదో, లేకపోతే టేబిలు గుడ్డ, ఈవేళ కాచిన తాజా పులుసులాగానే, రోజారంగు సబ్బుబిళ్ల కూడా తనలాంటి వాడికి తగదని తెలుసుకునో మరి — మామూలు పసుప్పచ్చ బిళ్లే తీసి చేతులు రుద్దుకున్నాడు. మొత్తంమీద ఆ మనిషి కొంత జంకుతూ గొంకుతూ, తను నడిస్తేనే ఆ గది ఎక్కడ నేల కూలిపోతుందో అన్నట్టుగా భయపడుతూ అడుగులు వేస్తూ అనుమానపడుతూ జాగ్రత్తగా వంటింట్లో మసిలాడు. పాష అత్తయ్య అతణ్ణి జాగ్రత్తగా కనిపెడుతూంది. అతడు బల్లదగ్గర కూచుని, తన వొంటిపైన శిలువ చిహ్నం గీసుకున్నాడు.

ఇది పాష అత్తయ్యకి నచ్చిందన్న సంగతి సెర్యోష కనిపెట్టాడు. పళ్లెం నిండా ఆమె పులుసు వడ్డించి ''సావకాశంగా తినండి!'' అంది ఆప్యాయంగా.

ఆ మనిషి మాటా మంతీ లేకుండా వెంటనే పులుసు తాగాడు — పెద్ద పెద్ద బ్రెడ్డు ముక్కలు మూడు నోట్లో వేసుకుని, దవడ ఆడించుకుని నమిలి తింటూ, పెద్ద చప్పుడుతో ముక్కు ఎగబీల్చుకుంటూనూ. ఇంకా మరింత పులుసు అతనికి వడ్డించి, పాష అత్తయ్య ఓ చిన్న గ్లాసులో వోద్కా తెచ్చి ఇచ్చింది.

''ఇహ ఇప్పుడు కాస్త పుచ్చుకోవచ్చు పరగడుపున మంచిది కాదు కాని'' అందామె.

ఆ మనిషి వోద్కా గ్లాసు ఎత్తి ''మీరు చల్లగా వుండాలి, అమ్మగారూ! దేవుడు మిమ్మల్ని చల్లగా చూడాలి!'' అన్నాడు.

అతడు తల వెనక్కి వంచి, నోరుతెరచి, గ్లాసులో వున్నదంతా గొంతుకలో పోసుకుని గుటుక్కున మింగేశాడు. సెర్యోష చూశాడు — అతడు బల్లమీద వుంచిన గ్లాసు ఖాళీగా వుంది.

''భేష్!'' అనుకున్నాడు సెర్యోష.

ఆ తరువాత అతడు ఇంకా మరికొంతసేపు భోంచేశాడు, కాని ఈసారి అంత తొందరగా కాకుండా సావకాశంగా తింటూ మాట్లాడాడు. తన పెళ్లాం దగ్గరకి వెళ్లడమూ, ఆమె అతణ్ణి ఇంట్లోకి రానివ్వకపోవడమూ — అంతా చెప్పాడు.

''ఏమీ ఇచ్చింది కాదండి. మా ఇంట్లో ఏ లోపమూ లేకుండా అన్నీ వుండేవి: కుట్టు మిషను, గ్రామఫోను, కప్పులూ సాసర్లు, తపేళాలు గిన్నెలు.... అన్నీ నిక్షేపంలా వుండేవండి. 'ఫో!' అంది, 'నాకెక్కడ దాపురించావో గాని, నా బతుకంతా పాడుచేశావు, ఫో!' అంది. 'పోనీ, ఆ గ్రామఫోనేనా ఇయ్యి,' అన్నాను. అది ఇద్దరం కలిసి కొనుక్కున్నాం, చూడండి మరి! ఆ

గ్రామఫోను ఇచ్చేందుకైనా దానికి మనసొప్పిందికాదు. ఆమాత్రం కనికరం కూడా లేకపోయింది దానికి. నా సూటు చించేసి, ఆ గుడ్డతో తను గౌను కుట్టుకుంది. నా ఓవర్‌కోటు తీసుకెళ్లి, సెకెండ్‌హాండ్ షాపులో అమ్మేసింది.''

''అంతకుముందు కాపురం బాగానే సాగిందా?'' అని అడిగింది పాష అత్తయ్య.

''ఎంతో బాగా సాగింది. అంతకంటె బాగా ఇహెవ్వరికీ సాగదనుకోండి. నేనంటే దానికి వెర్రివ్యామోహమే. ఇప్పుడా ఇంట్లో వున్నాడు – షాపులో అటెండరు. వాణ్ణి చూశాను: వాడి మొహంలో ఏమీ లేదు. నాకేమీ కనబడలేదు, మరి. దాని కళ్లు మరెందుకు జిగేలుమన్నాయో? ఎందుకేమిటి? – వాడు షాపులో అటెండరు అని, అంతే మరి – స్పష్టంగా కనబడుతూనేవుంది'' అన్నాడు.

తన తల్లి గురించి చెప్పాడు, ఆమెకు పెన్షను ముడుతూాండనీ, తనకు ఏదో ఒకటి పార్సిలుచేసి పంపుతూాండేదనీ. అతడంటే పాష అత్తయ్యకి మొత్తంమీద దయపుట్టింది: ఉడికించిన మాంసం తీసుకొచ్చి పెట్టింది, టీ కాచి ఇచ్చింది, సిగరెట్టు కూడా కాల్చుకోమంది.

''చూశారా, మరి, అమ్మ దగ్గిరకి వుత్తచేతుల్తో ఎలా వెళ్లను? పోనీ ఆ గ్రామఫోనైనా తీసికెళ్లి అమ్మకి ఇస్తే – అదేనా కాస్త నయంగా వుణ్ణు'' అన్నాడా మనిషి.

''అవును, మరి, నయంగా వుణ్ణు'' అనుకున్నాడు సెర్యోష తన మనసులో. ''రికార్డులు పెడితే అది పాడుతుంది.''

''ఎక్కడేనా పని సంపాదించుకుంటే, మీదటికి మరేమీ ఫర్వావుండదు – గడిచిపోతుంది'' అంది పాష అత్తయ్య.

''నాలాంటి మనుషులకి పనివ్వడం వాళ్లకి ఇష్టం వుండదండీ'' అన్నాడతడు; అది విని, పని దొరకనందుకు ఇతడితోనూ, పని ఇవ్వనందుకు

వాళ్లతోనూ తనకు సానుభూతి వున్నట్టుగా, పాష అత్తయ్య నిట్టూర్చి తల వూపింది.

''అవును'' అన్నాడతడు, ఓ నిమిషం వూరుకుని, ''షాపులో అటెండరుగా మాత్రమే కాదు — మరే పనైనా సరే, ఏదైతే ఏమిటి, అంతకంటె పెద్ద ఉద్యోగమే చేయగల్గేవాణ్ణేమో. కాని బతుకంతా పాడుచేసుకున్నాను.''

''ఎందుకు పాడుచేసుకున్నారు? అప్పుడు పాడుచేసుకోకపోయుంటే, ఎంతో మెరుగ్గా వుండేదే!'' అని పాష అత్తయ్య జాలిపడుతున్నట్టు అంది.

''అంతా అయిపోనే అయిపోయింది, ఇప్పుడు ఏం అనుకుంటే ఏం ప్రయోజనంలెండి — ఇప్పుడు ఎన్ని అనుకున్నా అంతే. ధన్యవాదాలు, తల్లీ! కర్రలు కోస్తాను, పోయి'' అన్నాడు ఆ మనిషి.

ముంగిట్లోకి వెళ్లిపోయాడా మనిషి. పాష అత్తయ్య సెర్యోషని షికారు వెళ్లనివ్వలేదు, ఎందుకంటే, చిన్న తుంపర ఆరంభించింది.

''అతడు అలా వున్నాడేమి?'' అని అడిగాడు సెర్యోష.

''జైల్లో పడ్డాడుగా, మరి! అతడు చెప్పింది విన్నావుకదా'' అంది పాష అత్తయ్యా.

''మరి — జైల్లో ఎందుకు పడ్డాడు?''

''తిన్నగా వుండక; తిన్నగా వుండక జైల్లో పడ్డాడు. తిన్నగా వుంటే జైల్లో పడకపోను!''

లుక్యానిచ్ మామయ్య భోజనంచేసిన తరువాత విశ్రాంతి తీసుకుని లేచి, తన ఆఫీసుకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నాడు. అతణ్ణి అడిగాడు సెర్యోష:

''తిన్నగా వుండకపోతే జైల్లో పెడతారా?''

''చూశావుగా'' అన్నాడు లుక్యానిచ్ మామయ్య, ''అతగాడు పరాయివాళ్ల వస్తువులు కాజేశాడు, మరి. నేనే వున్నాను, పనీ పాటూ చేసుకుంటు న్నాను, చేసుకుంటూ సంపాదించుకుంటున్నాను. మాటకు చెబుతున్నాను, ఇతగాడొచ్చి, నా డబ్బు అంటేస్తాడు: అది మంచి పనేనా?''

''కాదు.''

''అదే మరి – అది చెడ్డపని.''

''అతడు చెడ్డవాడా?''

''మరి, చెడ్డవాడే!''

''ఐతే, మరి – అతనికి నువ్వు ఫెల్ట్‌బూడ్సు ఎందుకిచ్చావు?''

''అతగాణ్ణి చూస్తే నాకు జాలేసింది.''

''చెడ్డవాళ్లని చూస్తే నీకు జాలేస్తుందన్నమాట?''

''ఇదిగో చూడు'' అన్నాడు లుక్యానిచ్ మామయ్య. ''అతగాడు చెడ్డవాడని నాకు జాలెయ్యలేదు, అతగాడు ఇంచుమించు వుత్తకాళ్లతో నడుస్తున్నాడు కదా అని నాకు జాలేసింది. అసలుందే, మొత్తంమీద.... ఎవరేనాసరే తిన్నగా వుండకపోతే – అది మంచిదికాదు.... అతగాడు తిన్ననైనవాడే అయి వుంటే, నేను ఎంతో సంతోషంగా అతగాడికి బూడ్సు ఇచ్చివుండేవాణ్ణి.... నేను వెళ్లాలిహ!'' అంటూ తొందరగా వెళ్లిపోయాడు లుక్యానిచ్ మామయ్య.

''తమాషాగా వుందే!'' అనుకున్నాడు సెర్యోష, ''అతడి మాటలు పిసరంతైనా అర్థంకావడంలేదే నాకు!''

సన్నగా పడుతూన్న బూడిదెవన్నె చినుకులను సెర్యోష కిటికీలోనుంచి చూస్తూ, లుక్యానిచ్ మామయ్య చెప్పిన మాటల్లోని చిక్కు విడదీయడానికి ప్రయత్నించాడు. అరిగిపోయి నున్నబడిపోయిన ఫర్‌టోపీ పెట్టుకుని, ఫెల్ట్ బూడ్సును – వాటి అడుగు అట్ట ఒకటి ఇటువైపూ రెండో జోడు అట్ట అటువైపూ పొడుచుకొస్తూన్నట్టుగా, బూడ్సుల ఒక మోకాలును రెండో దాని మోకాలులో దోపి, చంకను పెట్టుకుని, ఆ మనిషి వీధిలోనుంచి వెళ్లిపోతున్నాడు. అమ్మ ఎర్రని రజాయి చుట్టబెట్టిన ల్యోన్యని నర్సరీనుండి ఇంటికి తీసుకువచ్చింది.

''అమ్మా! ఒకమాటు నువ్వు చెప్పావు: ఒ కుర్రాడు మరో కుర్రాడి

నోటుబుక్కు కాజేశాడని, నీకు జ్ఞాపకంవుందా? ఆ కుర్రాణ్ణి జైల్లో పెట్టారే?'' అని అడిగాడు సెర్యోష.

''బాగుందిరోయ్! అందుకు జైల్లో పెట్టరే!'' అంది తల్లి.

''ఎందుకు పెట్టరూ?''

''వాడు చిన్నపిల్లాడు. వాడికింకా ఎనిమిదేళ్లే!''

''చిన్నపిల్లలు చెయ్యొచ్చన్న మాట?''

''ఏమిటి చెయ్యొచ్చు?''

''దొంగతనం.''

''ఛీ! చిన్నపిల్లలు చెయ్యకూడదు'' అంది అమ్మ. ''నేనేమో ఆ కుర్రాడికి బోధపరచి చెప్పాను. ఇహ వాడెన్నటికీ దొంగతనం చెయ్యడు. కాని, ఈ ఘోషంతా నీకెందుకురా?''

జైల్లోపడిన ఆ పరాయి మనిషి గురించి సెర్యోష తల్లితో చెప్పాడు.

''దురదృష్టంకొద్దీ వుంటారు అటువంటివాళ్లు అప్పుడప్పుడు. నువ్వు పెద్దాడివి అవుతావు కదూ, అప్పుడు దీన్ని గురించి మనం మాట్లాడుకుందాం, ఏం? పాష అత్తయ్య దగ్గిరకి వెళ్లి, రవ్వతీసుకుందుకు గుండు అడిగి పట్టుకురా, బాబూ!'' అంది అమ్మ.

సెర్యోష వెళ్లి, రవ్వగుండు తీసుకొచ్చి, తల్లికిచ్చి:

''మరి, ఎందుకు దొంగతనం చేశాడా మనిషి?'' అని అడిగాడు.

''పని చెయ్యడానికి వొళ్లు వంగక దొంగతనం చేశాడు.''

''దొంగతనం చేస్తే జైల్లో పెడతారని అతనికి తెలుసా?''

''తెలియకేం? మా చక్కా తెలుసు!''

''మరి, అతనికి జైలంటే భయంవెయ్యలేదే? అమ్మా! ఒకవేళ అంత భయం వెయ్యదేమోనే – జైల్లో?''

''అబ్బా! చాల్లా, ఇహ, నీ యక్షప్రశ్నలూ నువ్వూనూ!'' అంది తల్లి చిరాకుపడి. ''నీతో చెప్పానా లేదా – ఇలాటివాటి గురించి ఇంత వేగమే

నువ్వు ఆలోచించకూడదని! మరి వేటిగురించైనా సరే ఆలోచించుకో! అసలు నీ నోటంట ఈ మాటలు వినడమే నా కిష్టంలేదు!''

తల్లి ముఖం ముడుచుకోవడం చూసి సెర్యోష మరి ప్రశ్నవెయ్యడం మానేశాడు. సెర్యోష వంటింట్లోకి వెళ్లి, తొట్టెలో వున్న మంచినీళ్లను దొప్పగరిటెతో గ్లాసునిండా పోసుకుని, గ్లాసు మంచినీళ్లూ ఒక్క గుటకలో తాగడానికి ప్రయత్నించాడు. మెడ బాగా వెనక్కి వంచి, నోరు తెరచుకుని మింగడానికి ప్రయత్నించేసరికి ఆ నీళ్లన్నీ గొంతుకలోకి పోవడం బదులు, ఇటూ అటూ తొణికిపోయి, కొంత మెడపక్కనుండి కారిపోయి, వీపు అంతా తడిసిపోయింది. తన షర్టు తడిసిపోయినప్పటికీ, ఆ సంగతి పెద్దవాళ్లకి తెలుస్తే, పెద్దవాళ్లు ఆ తడి షర్టు విప్పించి పొడి షర్టు తొడిగిస్తారనీ, షర్టు తడుపుకున్నందుకు తనకు చీవాట్లు తప్పవనీ తెలిసి, ఆ సంగతి చెప్పడం మానేశాడు. ఇక రాత్రి పడుకునేవేళ అయేసరికి షర్టు ఆరిపోయి పొడిగా అయిపోయింది.

...భోజనాల గదిలో కూచున్న పెద్దవాళ్లు తను పడుకుని నిద్రపోతున్నాడనే అనుకున్నారు. అలా అనుకుని, వాళ్లు బిగ్గరగా మాట్లాడుకోవడం మొదలుపెట్టారు.

''వాడు ఏదేనా తెలుసుకోవాలని అడిగినప్పుడు వాడికి 'అవును' అనో, 'కాదు' అనో చెప్పాలి మనం. అంతేగాని, ఇటూ కాకుండా అటూ కాకుండా మధ్యస్థంగా చెబితే వాడికి అర్థంకాదు'' అన్నాడు కొరొస్తెల్యోవ్.

''నేను తప్పించుకుని పారిపోయాను. ఎలా జవాబుచెప్పడమో తెలిసిందికాదు నాకు'' అన్నాడు లుక్యానిచ్ మామయ్య.

''ఏ వయసుకి తగిన సందేహాలు ఆ వయసుకి వుంటాయి. ఐతే ఒకటి, చిన్నపిల్లలు అడిగే ప్రతీ ప్రశ్నకీ జవాబుచెప్పడం అవసరంలేదు. వాడి అవగాహనకు అందని విషయాలను గురించి వాడితో చర్చించడం ఎందుకు? వాడికేమేనా లాభిస్తుంది గనకనా? వాడి మనసులు వూరికే క్షోభపెట్టడమూ,

వాడి మనసు యెదగని ఊహలను వాడి బుర్రలోకి తీసుకొచ్చిపెట్టడమూ — అంతకు తప్ప మరేమీ లేదు. ఆ మనిషి నేరం చేశాడనీ, అందుకు అతడికి శిక్ష పడిందనీ వాడికి అర్థమవుతే చాలు. మీకో నమస్కారం నేను — ఈ సంగతి మాత్రం వాడితో మరి ఎత్తకండి!'' అంది అమ్మ.

''మేమెప్పుడేనా ఎత్తుతామా వాడితో? వాడే ఎత్తితే ఎత్తుతాడు!'' అని లుక్యానిచ్ మామయ్య సమర్థించుకున్నాడు.

''కొరొస్తెల్యోవ్!'' అని సెర్యోష గొంతు చీకటిగదిలోనుంచి వినబడింది.

వినీవినబడ్డంలో సంభాషణ ఆపేశారు వాళ్లు....

''ఆఁ! ఏమీ?'' అని కొరొస్తెల్యోవ్ గదిలోకి వస్తూ అడిగాడు.

''షాపులో అలెండరు అంటే ఎవరు?''

''ఒరి — వోరి — వోరి! నువ్వు నిద్రపోడంలేదూ? నిద్రపో వెంటనే!'' అన్నాడు కొరొస్తెల్యోవ్. కాని సెర్యోష కళ్లు నిరీక్షణతో మెరుస్తున్నాయి, ఆ చీకట్లో, సమాధానంకోసం అపేక్షిస్తూ తెరుచుకుని వున్నాయి. తొందరగా, కొరొస్తెల్యోవ్ సెర్యోష అడిగిన ప్రశ్నకు (వాడి తల్లి వింటే ఆమె ఎక్కడ కోపపడుందో అని చెప్పి, ఆమెకు వినబడకుండా వుండేందుకు) సెర్యోష చెవిలో సమాధానం చెప్పాడు....

ఉబుసు పోకకి...

మళ్లీ జబ్బులు పట్టుకున్నాయి. ఈ సారి యే కారణం లేకుండానే గవదకాయలు నొప్పిచేశాయి. కాస్త నయంఅయి తేరుకునే లోపల డాక్టరు ''గగ్గలు దిగాయి'' అన్నాడు. అని అతడు ఆలోచించి కొత్త చిత్రహింసలు — కాడ్లివరాయిలూ, వేడికట్లూ ప్రయోగించాడు. ఇహ టెంపరేచరు చూస్తూండమన్నాడు.

కంపుకొట్టుతూన్న ముద్ద ఒకటి తీసుకొచ్చి గుడ్డమీద పరచి, ఆ గుడ్డ మెడకి చుట్టబెడతారు. ఆ గుడ్డమీద దళసరి కాగితం వేస్తారు. కాగితం అంచు చిటుకూ చిటుకూ గుచ్చుకుంటూ వుంటుంది. ఆ కాగితంమీద దూది వేస్తారు. మెడ అంతా చెవులవరకూ బేండేజీ చుట్టేస్తారు. తలకాయ ఒక్కటే పైకి వుంటుంది — చెక్కపలకమీద దిగ్గొట్టిన మేకులాగ — తల ఇటు తిప్పడానికీ వీలుండదు, అటు తిప్పడానికీ వీలుండదు. అలా బతకాలి.

బతుకు జీవుడా అని — ఇహ పడుకుని వుండడం అవసరంలేదట, బాబూ! మరి తనకి జ్వరం తగలకుండా వుండి, చినుకు పడకుండా వుండని రోజున తను వీధిలోకి షికారెళ్లొచ్చు. కాని ఈ రెండూ కలిసిరావడం అరుదే. ఇంచుమించు ప్రతీ రోజూ అంతే అవుతూంది — చినుకు పడనినాడు తనకి జ్వరం, జ్వరం తగలనినాడు చినుకు.

రేడియో పెడతారు. అందులోనుంచి మాట్లాడుతూన్నట్టూ ఆడుతూన్నట్టూ వినబడుతూన్న దానిలో ఏదో కొంత మాత్రమే పెర్యోషకి ఆసక్తిదాయకంగా వుంటుంది.

పెద్దవాళ్లు మహా బద్ధకస్తులు: ఏదైనా చదివి వినిపించండనో, ఏదైనా కథ చెప్పండనో అడుగుతామా, అడిగేసరికల్లా — ఏదో పని వుందని ఓ మిష చెబుతారు. పాష అత్తయ్య వంటలోనో వార్పులోనో వుంటుంది. ఆవిడ చేతులకి పని; నిజమే కాని, నోటికి పనిలేదుగా, మాటాడొచ్చుగా, ఏదైనా కథ చెప్పొచ్చునే, అందుకేదీ అడ్డులేదే. పోనీ అమ్మ వుంది: తను స్కూల్లోవున్నప్పుడూ, లేదంటే ఇంట్లో ల్యోన్యకి బట్టలు తొడుగుతూన్నప్పుడూ, మరిగంటే — ఎక్సర్‌సైజు బుక్కులు దిద్దుతూన్నప్పుడూ — అది వేరే సంగతి; కాని అద్దం ఎదుట నిలబడి తల దువ్వుకుంటూ, జడలు ఇలాగూ అలాగూ సవరించుకుంటూన్నప్పుడూ అలా సవరించుకుంటూ తనలో తను చిరునవ్వు నవ్వుకుంటూన్నప్పుడూ ఏం పని చక్కబెట్టుతూన్నట్టు?

"నాకేదేనా చదివి వినిపించవే, అమ్మా?" అని అడుగుతాడు పెర్యోష.

"ఓ నిమిషం వుండు, సెర్యోష. ఇప్పుడు పని చేసుకుంటున్నాను" అంటుంది అమ్మ.

"మళ్లీ జడలు విప్పేసుకున్నావెందుకూ?" అని అడుగుతాడు సెర్యోష.

"నచ్చలేదురా! మరో మోస్తరుగా చుట్టుకుంటా!"

"మరో మోస్తరుగా ఎందుకు?"

"నాకు ఇలా వుండాలి!"

"నీకిలా ఎందుకుండాలి?"

"ఇలా వుండాలి గనక...."

"మరి నవ్వుతావెందుకు?"

"ఊరకేనే...."

"ఊరకేనే ఎందుకు నవ్వుతున్నావు?"

"అబ్బ! ఓరే, సెర్యోష, నీ ప్రశ్నలతో నన్ను కొరుక్కుతినకురా నాయనా!"

సెర్యోష ఆలోచించుకున్నాడు: "నేనేమిటి కొరుక్కుతింటున్నాను?" అలా అనుకుని:

"పోన్లే కాని – ఏదైనా చదివి వినిపిద్దూ!" అంటాడు.

"సాయంకాలం తప్పకుండా చదివి వినిపిస్తాన్రా!" అంటుంది అమ్మ.

మరి, అమ్మ సాయంకాలం స్కూలునుండి వస్తుంది. వచ్చి ల్యోన్యకి పాలిస్తుంది. తరువాత, వాడికి నీళ్లుపోస్తుంది. తరువాత కొరొస్తెల్యోవ్‌తో కబుర్లు చెబుతుంది. ఆ తరువాత ఎక్సర్‌సైజు బుక్కులు దిద్దుతుంది. చదివి వినిపించకుండా ఇలాగే మళ్లీ దాటవేస్తుంది.

పాష అత్తయ్య పని అంతా చేసుకుని, విశ్రాంతి తీసుకుందుకని తన గదిలో సోఫామీద కూర్చుంటుంది. ఆమె చేతులు మోకాళ్లమీద పెట్టుకుని, కదలకుండా మెదలకుండా నెమ్మదిగా కూర్చునుంటుంది. ఇంట్లో ఎవ్వరూ

వుండరు — అప్పుడు సెర్యోష ఆవిడదగ్గరకు వెళ్తాడు. ఇహ ఆవిడకి తప్పించుకుందుకు వీలుండదు.

సెర్యోష రేడియో ఆపుచేసి, ఆవిడపక్కను కూచుని, ''ఇప్పుడు నాకు కథ చెప్పు, మరి'' అంటాడు.

''అరె, భగవంతుడా!'' అని ఆవిడ అలసిపోయిన గొంతుకతో అంటుంది. ''చెబుతాలే, మరి, నీకు అన్ని కథలూ కంఠతా వచ్చునాయెరి!''

''అయితే ఏం లే! ఏదో ఒకటి చెబుదూ!''

ఏం బద్ధకంరా, బాబూ!

''ఐతే విను మరి — అనగా అనగా ఓ రాజూ, రాణీ వుండేవారు'' అంటూ ఆమె నిట్టూర్చుతూ మొదలెట్టుతుంది. ''వాళ్లకి ఓ కూతురు. ఇలా వుండగా ఓనాడు....''

''రాజకుమార్తె మంచి అందకత్తేనా?'' అంటూ సెర్యోష ఆమె మాటలకు అడ్డుపడి ప్రశ్నవేస్తాడు.

సెర్యోషకి తెలుసు రాజకుమార్తె అందగత్తె అని; అంతేకాదు, సెర్యోషకి కథ అంతా తెలుసు; ఐనప్పటికీ పాష అత్తయ్య ఆ మాటచెప్పడం మానేస్తాందెందుకూ? కథ చెబుతూన్నప్పుడు అన్ని సంగతులూ చెప్పాలి, మరి — ఒక్క సంగతైనా మానేయకూడదు.

''మంచి అందకత్తె, మాంచి అందకత్తె. ఎంత అందకత్తె అంటే అంత అందకత్తె అన్నమాట.... ఓనాడు రాజకుమార్తె తను పెళ్లిచేసుకుంటానని తల్లిదండ్రులతో చెప్పింది. రాజకుమారులందరూ స్వయంవరానికి వచ్చారు....''

కథ పద్ధతి ప్రకారం నడిచిపోతుంది — రెండు గట్ల మధ్య పారుతూన్న ఏరులా. సెర్యోష కళ్ల పెద్దవి చేసుకుని, ఆ మునిచీకట్లో చూస్తూ శ్రద్ధగా వింటాడు. పాష అత్తయ్య నోటినుంచి సరిగ్గా ఏ మాటలు వస్తాయో సెర్యోషకి ముందుగానే తెలుసును, అయితే ఇందువల్ల కథ సారస్యానికి ఏమాత్రమూ భంగంరాదు. మీదుమిక్కిలి అటుంచి ఇటూ.

ఆ కథలో వచ్చిన 'పెళ్లికొడుకులు', 'స్వయవరం' అనే మాటలను తను ఎలా అర్థంచేసుకున్నాడో సెర్యోష సరిగ్గా చెప్పలేకపోయినా – సెర్యోషకి ఆ మాటలు తన ఊహ ప్రకారం అర్థమయ్యాయి. అన్ని సంగతులూ అర్థమై పోయాయి. మాటకు: ''గుర్రం నేలకు అంటుకుపోయింది'', తరువాత నాలుగు కాళ్లూ ఎగరేసింది – అంటే, దాని అర్థం: నేలకు అంటుకున్న గుర్రాన్ని మళ్లీ విడదీసేశారన్నమాట.

మునిచీకటి చిమ్మచీకటైపోతూంది. కిటికీలకు కచికవన్నె వస్తూంది, కిటికీ చట్రాలు నల్లబడుతున్నాయి. రాజకుమార్తెను పెళ్లిచేసుకుందామని వచ్చిన పెళ్లికొడుకులకు దాపురించిన కడగండ్ల గురించి చెబుతూన్న పాష అత్తయ్య గొంతుక తప్ప మరేమీ వినబడ్డంలేదు. దాల్నయ వీథిలోవున్న ఆ చిన్న ఇంట్లో, సర్వమూ నిశ్శబ్దంగా వుంది.

సెర్యోషకి నిశ్శబ్దం అంటే విసుగెత్తింది. కథ ఇక త్వరలోనే కంచె కెళ్లిపోతుంది. తను ఎంత బతిమాలుకున్నా ఎంత కోపం తెచ్చుకున్నా పాష అత్తయ్య మరి రెండో కథ ససేమిరా చెప్పనుగాక చెప్పననేస్తుంది. ఆమె చిరాకుపడుతూ ఆవలిస్తూ వంటింట్లోకి వెళ్లిపోతుంది. తనేమో ఒంటరి గాడైపోయాడు. ఏమిటి చేయడం? జబ్బుతో పడుకున్నన్నాళ్లూ ఆటవస్తువులతో ఆడుకుని ఆడుకుని, ఇహ ఇప్పుడు ఆటవస్తువులంటే విసుగొస్తూంది. బొమ్మలు గీయడమంటే విసుగొస్తూంది. గదిలో సైకిలు తొక్కేందుకు వీల్లేదు – స్థలంలేదు.

అబ్బా! జబ్బు అయినా భరించొచ్చు గాని, ఈ విసుగుదల భరించ లేకుండా వున్నాడు సెర్యోష, ఎటూ కదలనివ్వదు కదా, ఆలోచనలను అణ చేస్తుంది కదా! ఏది చూసినా విసుగ్గానే వుంది.

లుక్యానిచ్ మామయ్య ఏదో వస్తువు కొని తీసుకొచ్చాడు. బూడిదె రంగు బుట్ట, దానికి తాడు కట్టివుంది. లుక్యానిచ్ మామయ్య ఆ తాడు ఎప్పుడు విప్పునా అని సెర్యోష జిజ్ఞాసతో దహించుకుపోతున్నాడు. దాన్ని కత్తెరతో

కత్తిరించేస్తే తీరిపోతుంది. అలా చెయ్యకుండా, లుక్యానిచ్ మామయ్య రొప్పు కుంటూ రోజుకుంటూ, గట్టిగా బిగిసిపోయిన ముడి విప్పుతూ కూచున్నాడు — తాడు ఎందుకైనా పనికొస్తుందట, అందుకని కత్తిరించేయకుండానే సాంతమూ దాన్ని దాచివుంచాలంటాడు.

సెర్యోష మునివేళ్లమీద నుంచుని, గుడ్లు పైకి పెట్టుకుని చూస్తూన్నాడు.... వింత వస్తువేదైనా వుంటే వుండవచ్చుకదా అనుకున్నాడు. కాని ఆ బూడిదెరంగు బుట్టలోనుంచి ఒక జత రబ్బరు అంచులున్న పెద్ద నలుపు ఫెల్ట్‌బూడ్సు పైకొచ్చాయి.

సెర్యోషకి ఇలాంటివే క్లిప్పులున్న బూడ్సులు వున్నాయి, ఐతే అవి ఫెల్ట్‌వి కావు, మామూలు రబ్బరువి. అవంటే సెర్యోషకి అసహ్యం. అందుచేత వీటిని చూసేందుకు తనకు పిసరంతైనా సరదా పుట్టలేదు.

''ఏమిటివి?'' అని, కుంగిపోయిన మనసుతోనూ, చిరాకు అలముకున్న ముఖంతోనూ అడిగాడు సెర్యోష.

''బూడ్సులు'' అని బదులుచెప్పాడు లుక్యానిచ్ మామయ్య, కూచుని వాటిని తొడుక్కుంటూ. ''వీటిని 'యౌవనానికి వీడ్కోలు' అంటారు.''

''ఎందుకని?''

''పడుచువాళ్లు వీటిని తొడుక్కోరని.''

''మరైతే నువ్వు ముసలాడివా?''

''వీటిని వేసుకుంటున్నాను గనక ముసలాణ్ణవుతున్నానన్న మాట!'' అని లుక్యానిచ్ మామయ్య బూడ్సు తొడుక్కుని ఇటూ అటూ నడిచి:

''దివ్యంగా వున్నాయి!'' అన్నాడు.

పాషా అత్తయ్యకి చూపించడానికని అతడాఖాళంగా వంటింట్లోకెళ్లాడు.

సెర్యోష భోజనాలగదిలో వున్న కుర్చీ ఒకదానిమీద ఎక్కి, దీపానికి స్విచ్‌వేశాడు. అక్వేరియమ్‌లో చేపలు మిడిగుడ్లతో పిచ్చిగా చూస్తూ ఈదు

తున్నాయి. సెర్యోష నీడ వాటిమీద పడుతుంది — అవి నోరు తెరచుకుని నీటిమీదకి వస్తాయి, మేత కోసమని.

''ఇదేదో తెలుసుకోవాలి!'' అనుకుంటాడు సెర్యోష. ''వాటి నూనె అవి తాగుతాయో తాగవో?''

సెర్యోష కాడ్లివరాయిలు సీసా కార్కు తీసి, అందులో వున్న కాడ్లివ రాయిలు కొద్దిగా అక్వేరియమ్‌లో పోసాడు. చేపలు తోకలాడించుకుంటూ నోరు బారుగా తెరచుకుని గుటకవెయ్యకుండానే నీటిలోకి వెళ్లిపోయాయి....

''తాగవు'' అని నోరు చప్పరించి అనుకున్నాడు.

విసువుగా వుంది, ఎంతో విసువుగా వుంది, బాబూ! ఆ విసుగు ఎలాంటి కిరాతకాలూ విచక్షణారహితాలైన పనులనైనా సరే సెర్యోషచేత చేయించు తుంది. తలుపు చెక్కకు వేసిన రంగు ఎక్కడైతే ఉబ్బిందో సరిగ్గా ఆ చోట వున్న రంగును సెర్యోష ఒక కత్తి పుచ్చుకుని గీకడం మొదలెట్టాడు. ఇలా చేయడంవల్ల తనకి తృప్తికలుగుతుందని కాదు — ఏదో ఒక పని చేస్తేనేగాని వుండబట్టక చెయ్యడం, అంతకుతప్ప మరేమీ లేదు. పాష అత్తయ్య తన సొంతానికని వూలుతో కబ్బా అల్లుకుంటోంది. ఆ వూలు వుండ తీసి, దాన్ని కొట్టకొసవరకూ విప్పేశాడు — ఎందుకా అంటే: ఎందుకూ లేదు — మళ్లీ దాన్ని వుండ చుట్టడానికి పని అంటూ వుంటుందని (కాని, దాన్ని వుండ చుట్టడం తనకి చేతకాలేదు). ఈ పనే తానిదివరకు చేసిన ప్రతీ పర్యాయమూ — ఇది పాడుపని అనీ, చేయకూడని పని అనీ, ఇది చేసినందు వల్ల పాష అత్తయ్యచేత తనకి చీవాట్లు తప్పవనీ, తను చీవాట్లు తిని ఏడుస్తాననీ — తనకు తెలుసును, తెలిసివుండే ప్రతీ పర్యాయమూ చేశాడు, ఇప్పుడూ చేశాడు. ఆమె ఇప్పుడు చీవాట్లు పెట్టనూ పెడుతుంది, తను ఏడవనూ ఏడుస్తాడు; కాని తన మనసులోలోపల తనకు తృప్తిగానే వుంది: చీవాట్లు తినడమూ, ఏడవడమూ — ఐతే ఏమొచ్చె? ఏ ఘటనలు లేకుండా కాలం గడవదు కదా.

ల్యోన్యని ఎత్తుకుని అమ్మ ఇంటికి వచ్చేసినప్పుడు మళ్లీ సరదాగా వుంటుంది. ఇల్లంతా కళకళ్లాడుతూ వుండడం మొదలవుతుంది: ల్యోన్య ఏడుస్తూ గోలచేస్తాడు, వాడికి అమ్మ పాలిచ్చి, వాడి గుడ్డలు విప్పి, వాడికి నీళ్లుపోస్తుంది. పుట్టినప్పటికంటె వాడికిప్పుడు కాస్త మనిషి రూపు వచ్చింది. కాని ఇంకా దుడ్డుగానే వున్నాడు. ఇప్పుడు చేత్తో గిలక పట్టుకోగల్గుతు న్నాడు, పని ఏమీ చేయలేదు. సెర్యోషనుండి వేరుపడిపోయి, వాడు రోజంతా నర్సరీలో వుండిపోతాడు. అక్కడ వాడి బతుకేమిటో, వాడి లోకమేమిటో సెర్యోషకి తెలియనే తెలియదు.

కొరొస్తెల్యోవ్ ఇంటికి ఆలస్యంగా వస్తాడు, ఇహ రాగానే అందరూ అతణ్ణి పట్టుకుంటారు. అతడు సెర్యోషతో మాట్లాడ్డానికి ప్రారంభించే సరికో, లేదా ఏదైనా పుస్తకం పట్టుకుని అతడు సెర్యోషకి చదివి వినిపిం చేందుకు ఒప్పుకునేసరికో ఆ టెలిఫోను మోగుతుంది, లేదాంటే అమ్మ అతణ్ణి ఇందుకనీ అందుకనీ పిలుస్తుంది, అలా విధివిరామం లేకుండా అతనితో ఏదో మాట్లాడుతూనే వుంటుంది, కడమవాళ్ల పని పూర్తిఅయే వరకైనా తను కాస్త ఓపికపట్టి వుండొచ్చుకదా అని అనుకోదు అమ్మ. ల్యోన్య రాత్రి తను నిద్రపోవడానికని, ఇహ చీకటిపడే ముందునుండీ ఏడుపు మొదలెట్టి, ఎంతోసేపు ఏడుస్తాడు. అమ్మ కొరొస్తెల్యోవ్‌ని పిలుస్తుంది, కొరొస్తెల్యోవ్ లేకపోతే అమ్మకి ఒక్క నిమిషం తీరదు కదా. కొరొస్తెల్యోవ్ ల్యోన్యని చేతుల్లో పెట్టుకుని, గదిలో ఇటూ అటూ నడుస్తూ 'హుష్' అంటూ వాణ్ణి వూరుకోబెట్టుతూంటాడు. ఇంతట్లో సెర్యోషకి నిద్ర వచ్చేస్తుంది – కొరొస్తెల్యోవ్‌తో మాటాడ్డానికీ చెందడానికీ తన కున్న సమయం కాస్తా తను అనుకున్న దానికంటే ముందుగానే అయిపోయి కూచుం టుంది.

ఐనప్పటికీ, అరుదుగానే అయినా మంచి సరదాగా గడిపిన సాయంకాలాలు వుంటూనే వున్నాయి. ల్యోన్య అంతకు ముందుగానే పడుకుని నిద్రపోతూ

న్నప్పుడూ, అమ్మ ఎక్సర్‌సైజు బుక్కులు దిద్దుతూన్నప్పుడూ, సెర్యోష పడుకోబోయేముందు తను బట్టలు మార్చుకుందుకు తనకు కొరొస్తెల్యోవ్ సాయంచేస్తున్నప్పుడూ, తనకి అతను కథలు చెబుతూ వుంటాడు. మొదట్లో కొరొస్తెల్యోవ్ కథలు బాగా చెప్పలేకపోయేవాడు – చెప్పడం ఎలాగో అసలు తెలిసేదే కాదతనికి; ఐతే ఏం అతడికి సెర్యోష సాయంచేసేవాడు, కథలు చెప్పడం ఎలాగో సెర్యోష అతనికి నేర్పాడు. ఇప్పుడు ఫరవా లేదు, మంచి రక్తిగానే చెబుతున్నాడు ''అనగా అనగా ఓ రాజూ రాణీ. వాళ్లకి ఓ మంచి చక్కని కూతురు, రాజకుమార్తె...''

సెర్యోష కథ వింటూ, పొరపాట్లు ఏవి దొర్లినా దిద్దుతూ అలా నిద్ర పోతాడు.

చీమనడకతో పొద్దు నడిచిన ఆ రోజుల్లో, తనకు పనీ పాటూ ఏదీ లేకుండా వుండడంవల్ల సెర్యోష నీరసపడ్డాడు. మంకు బుద్ధులు పుట్టేవి. సరిగ్గా ఆ రోజుల్లోనే తేటగా ఆరోగ్యంగావున్న కొరొస్తెల్యోవ్ ముఖమూ, కొరొస్తెల్యోవ్ బలమైన చేతులూ, ధైర్య స్థైర్యాలతో తొణికిసలాడుతూన్న కొరొస్తెల్యోవ్ గొంతూ సెర్యోషకి మరింత ప్రియతమమయాయి.... కొరొస్తెల్యోవ్‌నుండి మొత్తం అమ్మకీ ల్యోన్యకే చెందకుండా, తనకి కూడా ఏదో కొంత దక్కుతూ వుంది కదా అని సెర్యోష సంతృప్తిచెంది, ఆ సంతృప్తితో నిద్రపోయేవాడు.

హాల్మొగోరి

హాల్మొగోరి! ఈ పదం కొరొస్తెల్యోవూ అమ్మ మాట్లాడుకుంటూన్నప్పుడు అంతకంతకు మరింత తరుచుగా సెర్యోష చెవినిబడుతూండేది.

''హాల్మొగోరికి వుత్తరం రాశావా?''

‘‘ఇక్కడ వున్నంత తలమునక పని హోల్మోగోరిలో వుండదేమోలే — అర్థ శాస్త్రంలో పరీక్ష ఇచ్చేందుకు వీలుండొచ్చు.’’

‘‘హోల్మోగోరినుండి నాకు వుత్తరం వచ్చింది. స్కూల్లో పనిచేయమంటున్నారు.’’

‘‘సిబ్బంది శాఖవాళ్లు టెలిఫోను చేశారు. హోల్మోగోరిగురించి చివరికి నిశ్చయం అయింది.’’

‘‘హోల్మోగోరికి దీన్నెందుకు తీసుకుపోవడం? దీన్ని పురుగు బాగా తొల్చేసి తినేసింది అప్పుడే.’’ (సొరుగుల బీరువా గురించి ఈ మాటలు.)

అస్తమానూ హోల్మోగోరి, హోల్మోగోరి! ఇది ఏదో ఎత్తుగా వుండాలి. మిట్టలు, కొండలు*. బొమ్మల్లో ఇలాగే వుంది. మనుషులు ఓ కొండమీద నుంచి ఓ కొండమీదకి ఎక్కుతారు. కొండమీద వుంటాయి స్కూళ్లు. కుర్రాళ్లు స్లెయ్‌లమీద కూచుని కొండలమీదనుంచి జారతారు.

సెర్యోష ఎర్రపెన్సులు పుచ్చుకుని, దానితో కాగితంపైన ఇదంతా బొమ్మ గీస్తాడు, గీసి, ‘‘హోల్మోగోరి, హోల్మోగోరి’’ అని ఆ మాటనే ఒక పాటలా మెల్లగా కూనిరాగం తీస్తూ పాడాడు.

సొరుగుల బీరువా గురించి ఎప్పుడైతే ప్రస్తావన వచ్చిందో అప్పుడు, ప్రయాణం వుంటుందనీ, అందరం కలిసి అక్కడకు వెళ్తాంకదా అనీ అనుకున్నాడు సెర్యోష.

ఇంకేం, భేష్! ఇంతకంటె దివ్యమైనది ఇంకేమి కావాలి! జేన్య వెళ్లిపోయాడాయె, వాస్య వెళ్లిపోయాడాయె, ఇక మేమూ వెళ్లిపోతాం. ఏదో ఒక్క చోటుకే అంటిపెట్టుకుని కూచోకుండా, ఎక్కడకో మరొక చోటుకి వెళ్లిపోతున్నామనే సరికి, మా ప్రాముఖ్యత మరింత అధికమవుతుంది.

‘‘హోల్మోగోరి — దూరమా?’’ అని సెర్యోష పాష అత్తయ్యని అడిగాడు.

---

* ‘హోల్మ్’ అంటే మిట్టలు, ‘గోరి’ అంటే కొండలు. — అను.

''దూరమే'' అంది పాష అత్తయ్య, ''అబ్బో! ఎంతో దూరం!''

''మేం అక్కడికి వెళ్తామా?''

''ఏమోరా, అబ్బాయీ! మీ వ్యవహారాలు నాకేం తెలుస్తాయిరా?...''

''అక్కడికి ప్రయాణం రైలుమీదనా?''

''రైలుమీదే.''

''మనం హొల్మోగోరి వెళ్తామా?'' అని అడిగాడు సెర్యోష కొరొస్తె ల్యోవ్‌నీ, అమ్మనీ. వాళ్ళు తనతో ఇదివరకే చెబుదామని అనుకుని వుండాలి, కాని మర్చిపోయుంటారు అనుకున్నాడు సెర్యోష.

సెర్యోష అడిగిన ప్రశ్న విని, వాళ్ళు ముఖాలు చూచుకున్నారు, తరువాత దిక్కులు చూశారు. వాళ్ళ ముఖాలను సరాసరి చూద్దామని సెర్యోష ఎంత ప్రయత్నించినా కార్యంలేకపోయింది.

''మనం వెళ్తున్నామా? మనం నిజంగానే వెళ్తున్నామా?'' అని మళ్ళీ రెట్టించి అడిగాడు సెర్యోష. వాళ్ళు జవాబు చెప్పరేమి? — అని తికమక పడ్డాడు.

గొంతుక సవరించుకుని అమ్మ బహు జాగ్రత్తగా అంది:

''నాన్నని అక్కడకి బదిలీ చేశారు.''

''ఐతే — అతనితో మనం కలిసి వెళ్తామా?''

సెర్యోష సూటి ప్రశ్న అడిగాడు, సూటి జవాబు వస్తుంది కదా అనుకున్నాడు. కాని — అమ్మ ఎప్పటిలాగానే తన మామూలు ధోరణిలో, ఏదేదో ఆ సంగతి గురించీ ఈ సంగతి గురించీ మాట్లాడ్డం మొదలెట్టింది:

''పాపం, ఒక్కణ్ణీ పంపించేయలేమే! తను ఒక్కడూ వుండడమంటే ఎంతో ఇబ్బంది: రోజంతా పనిచేసుకుని పనిచేసుకుని ఇంటికొస్తాడు.... ఇంట్లో ఎవరూ వుండరు.... అంతా తీన్‌తేరాగా వుంటుంది... వంట చేసిపెట్టేందుకు ఎవరైనా వుంటేకద? పాపం. నాన్న ఎంతో చిక్కుపడిపోతాడు....''

ఇహ అప్పుడు చెప్పింది జవాబు:

"నే వెళ్తాను అతనితో."

"మరి — నేనో?"

కొరొొస్తెల్యోవ్ లోకప్పుకేసి చూస్తాడెందుకు? అమ్మ జవాబుచెప్పకుండా వూరుకుని తనను అంతలా బుజ్జగిస్తూందెందుకు?

"మరి — నేనో?" అని మళ్లీ అడిగాడు సెర్యోష భయపడి చిందులు తొక్కుతూనూ.

"ఇదిగో, మొట్టమొదట ఆ చిందులు తొక్కడం మాను!" అంది అమ్మ, సెర్యోషను లాలించడం మానేసి. "ఇదేమిటి? ఇదేమేనా చిందులు తొక్కే విషయమనుకున్నావా యేమిటి?! ఇది మళ్లీ నా కంటబడితే ఒప్పుకునేది లేదు! ఇహ, రెండోది — మనం ఆలోచించుకుందాం: నువ్విప్పుడు ప్రయాణంచేసే స్థితిలో వున్నావా? ఇప్పుడే మంచంమీదనుంచి లేచావాయె. జబ్బు ఇంకా వదలనేలేదు. జ్వరం వస్తూనే వుంది — ఈవేళా టెంపరేచరు వుందాయె. ఏమి ఏర్పాట్లు చేసుకోవడమో ఏమిటో, మాకే ఇంకా తెలియడం లేదాయెరి. మరి, అక్కడ — ఆ గాలి నీకు పడదు కూడానూ. నువ్వక్కడికి వెళ్లితే, జబ్బు నీ వొంటిని బట్టిపోయి, ఇహ ఎన్నటికీ నీకు నయంకాదు. జబ్బువాడివి నిన్నక్కడ ఎవరికని ఒప్పజెప్పేది నేను? ఇక్కడ్నుంచి నిన్ను ఎంత మాత్రం కదలించకూడదన్నాడు డాక్టరు."

తల్లి తన మాటలనింకా పూర్తిచేయనే లేదు, సెర్యోష కళ్లవెంట నీళ్లు ధారలు కారిపోతూ అప్పుడే రాగాలు మొదలుపెట్టాడు. తనను తీసి కెళ్లరట! తనను వుంచేసి — వాళ్లు వెళ్లిపోతారట! రాగాలు తీస్తూ, ఆ రాగాల మధ్య విన్నాడు తల్లి చెబుతూన్న మాటలు:

"పాష అత్తయ్యా, లుక్యానిచ్ మామయ్యా నిన్ను చూస్తూ వుంటారు. వాళ్ల దగ్గిర వుంటావు — ఎప్పట్లాగానూ."

"ఎప్పట్లాగానూ నేనుండను! నేను కొరొొస్తెల్యోవ్‌తోనూ అమ్మతోనూ

వుంటాను!'' అనుకున్నాడు సెర్యోష. అలా అనుకుంటూ ''నాకు రావాల నుంది — హొల్మొగోరికి!'' అంటూ ఏడుపు సాగించాడు.

''నా నాయనవి కాదూ, నా బాబువి కాదూ! ఏడవకు!'' అంది తల్లి. ''ఆ హొల్మొగోరిలో ఏముందని అలా ఏడుస్తావు? ఏముందక్కడ — విశేషాలా, వింతలా? ఏమీ లేవక్కడ!...''

''అన్నీ అబద్ధాలే!''

''అమ్మని అలా అనొచ్చా? తప్పుకాదూ? అమ్మ ఎప్పుడూ అబద్ధాలాడదు — అమ్మ ఎప్పుడూ నిజం చెబుతుంది.... నువ్వు ఎల్లకాలం ఇక్కడే వుండి పోతావా? ఓరి వెర్రినాగమ్మా, చిట్టి తండ్రీ! ఎంత పిచ్చివాడివిరా నువ్వు! ఇక చాలు, ఇక ఏడవకు మరి... చలికాలం అయిపోయే వరకూ ఇక్కడుం టావు — మరి, వసంతకాలంలోనో, బహుశా ఎండకాలంలోనో, నువ్వు ఎంత త్వరగా కోలుకుంటే అంత త్వరగా, నాన్నో నేనో నీ దగ్గిరకొచ్చి, నిన్ను తీసుకెళ్తాం. ఇహప్పుడు అందరం మళ్ళీ కలిసివుంటాం. నువ్వే ఆలోచించుకో మరి. నిన్ను వదిలిపెట్టి మేం వుండగలమా?''

సరే, గాని — ఎండకాలం వచ్చేసరికి తనకింకా జబ్బు నయంకాకపోతే అప్పుడెలా మరి? చలికాలం అంత తేలిగ్గా గడుస్తుందా? చలికాలం అంతా అనుభవించాలంటే మాటలా? చలికాలం ఎన్నాళ్ళో అలా అంతులేకుండా సాగుతుంది, మనసులో ఎంతో బెంగగా వుంటుంది.... వాళ్ళు వెళ్ళిపోయి, తనను ఇక్కడే వుంచేయడమంటే తను ఎలా భరించగలడు? తను లేకుండా వాళ్ళు అక్కడుంటారు. ఎంతో ఎంతో దూరంలో వుంటారు. మరి — వాళ్ళకేంపోయింది? వాళ్ళకంతా ఒక్కటే — తను వున్నా లేకపోయినా వాళ్ళ కంతా ఒక్కటే! వాళ్ళు చక్కా రైలుమీద వెళ్ళిపోతారు. వాళ్ళే హాయిగా రైలుప్రయాణం చేస్తారు. తను కూడా రైలుమీద వెళ్ళి వుండును, కాని తనను తీసుకెళ్ళనే తీసుకెళ్ళరు! ఇదంతా తనకి ఎంతో ఘోరమైన అన్యాయం —

ఎంతో ఘోరమైన బాధ. తన బాధ అంతనీ మూడు ముక్కల్లో వెళ్లగక్కే శాడు — మూడే ముక్కలు — అంతే:

''నాకు రావాలనుంది — హోల్మొగోరి! నాకు రావాలనుంది — హోల్మొగోరి!''

''ద్మీత్రి! కొంచెం వాడికి మంచినీళ్లియ్యి'' అంది తల్లి. ''మంచినీళ్లు తాగురా, బాబూ, సెర్యోష! నువ్వు ఎంత ఏడ్చినా సరేన్రా, ఏమీ కార్యం లేదురా. ఎప్పుడైతే డాక్టరు వీల్లేదని చెప్పాడో — దాని అర్థం, ఇహ వీల్లేదనే. ఇహ, వూరుకో, మరి....ఒరే, నాయన, సెర్యోష, నేను చదువు కుంటూన్నప్పుడు నిన్ను ఎన్నిసార్లు వదిలిపెట్టి వెళ్లిపోలేదు? — అప్పుడే మర్చి పోయావా? వెళ్లిపోయేదాన్ని మళ్లీ వచ్చేదాన్ని కాదూ, ఏం నిజమేనా? నేను లేకపోయినా, నువ్వు బంగారంలా ఒక్కడివీ వుండేవాడివి! నేను వెళ్లిపోయేట ప్పుడు ఒక్కసారేనా ఏడవలేదు. ఎందుకేడవలేదంటే నేను లేకుండా వుంటేనే నీకు హాయిగా వుండేది. జ్ఞాపకం తెచ్చుకో, మరి. అలాంటిది, ఇప్పుడే మిటి — ఈ సివాలూ, వొళ్లెరగని ఏడుపులూనూ? ఇదివరకు నీ అంతట నువ్వు వుండగల్గినవాడివి, నీ మంచికోసమే మిమ్మల్ని వొదిలేసి ఇప్పుడెందుకు వుండలేవురా?''

అమ్మకి ఎలా బోధపరచి చెప్పడం? అప్పుడంటే — అప్పుడు వేరు. అప్పుడు తను ఇంకా చిన్నపిల్లడే, తనకే జ్ఞాపకమూ వుండేదికాదు. అప్పుడు అమ్మ వెళ్లిపోయేది — అమ్మ మళ్లీ వచ్చేలోపల, అమ్మను వదిలిపెట్టి వుండ డానికి తను అలవాటుపడిపోయేవాడు. అప్పుడు ఒక్కర్తే వెళ్లిపోయేది. మరి ఇప్పుడు అమ్మ వెళ్లిపోవడమే కాకుండా, కొరొస్తెల్యోవ్‌ని కూడా తన దగ్గరనుండి తీసుకుపోతూంది....కొత్త ఆలోచన ఒకటి తోస్తూంది — దానితో కొత్త బాధొకటి బాధిస్తూంది: ల్యోన్యని కూడా తీసుకుపోతుంది కామోసు? సరే — ఈ సంగతి కూడా తెలుసుకుందాం అనుకుని, మనసులో కుంగి పోయి, మూతి సాగదీసుకుని అడిగాడు:

''మరి, ల్యోన్య?''

''వాడింకా: నా దగ్గిర పాలు తాగుతున్నాడు కాద(టా!'' అంది అమ్మ మందలిస్తూ, ముఖం జేవురించుకుని. ''నేను లేకపోతే వాడుండలేడు, నీకు తెలీదా ఏమిటి? నేను లేకపోతే వాడు క్షణం బతకలేడు! ఇంతకీ వాడు నిక్షేపంలా వున్నాడు, వాడికి జబ్బులేదు, వాడికి టెంపరేచరు లేదు, వాడికి గగ్గలు దిగలేదు!''

సెర్యోష ముఖం వేలేసి, మళ్లీ ఏడుపు మొదలెట్టాడు, కాని ఈ సారి మెల్లగానూ నిరాశతోనూ ఏడ్చాడు.

ల్యోన్యను కూడా వుంచేసి వుంటే సెర్యోష ఏదో ఒక విధంగా సమాధాన పడివుండేవాడు. ఇప్పుడేమో — వాణ్ణి కూడా తీసికెళ్లిపోతున్నారు, తనను ఒక్కణ్ణే వుంచేస్తున్నారు! వాళ్లకి అక్కర్లేనివాడల్లా తను ఒక్కడే!

''ఖర్మానికి వదలిపెట్టేయడం'' అని 'లొడితెడుగాడు — చిట్టివాడు' కథ లోని మాటలు జ్ఞాపకం తెచ్చుకుని, సెర్యోష మథనపడిపోయాడు.

సెర్యోష తల్లిమీద కోపం తెచ్చుకున్నాడు — తను ఎన్నాళ్లు బతికినా సరే, ఈ గాయపు మచ్చ తన మనసులో అలా శాశ్వతంగా వుండిపోతుం దనుకున్నాడు — తల్లిమీద వచ్చిన కోపంతో, తనమీద తనకే వచ్చిన కోపం కలిసిపోయింది: తనదే తప్పు, తనదే తప్పు! అవును, నిజమే తనకంటె ల్యోన్యయే నయం, తను మంచివాడు కాడు, తనకు గగ్గలు దిగాయి. వాడికి దిగలేదు, వాణ్ణి తీసుకెళ్తున్నారు, తనని తీసుకెళ్లడంలేదు!

''అయ్యో'' అని కొరొస్తెల్యోవ్ నిట్టూర్చి, గదిలోనుండి బయటికి వెళ్లిపోయాడు.... వెళ్లిపోయినవాడల్లా మళ్లీ వెంటనే వచ్చేసి ''సెర్యోష! దా! మనమిద్దరం షికారెళ్లొద్దాం — చిట్టడవిలోకి'' అన్నాడు.

''ఇదేమిటి? ఈ చెమ్మలోనా షికారు! వాడు మళ్లీ మంచాన పడతాడు!'' అంది అమ్మ. కొరొస్తెల్యోవ్ చెయ్యిదులిపి ''వాడు అలా పడుకునే వున్నాడు పాపం. సెర్యోష, రా!'' అన్నాడు కొరొస్తెల్యోవ్.

సెర్యోష ఏడుస్తూ వెళ్లాడు కొరొస్తెల్యోవ్ దగ్గరకి. వాడికి కొరొ

స్తెల్యోవ్ బట్టలు తొడిగాడు, మెడకి మఫ్లరు చుట్టమని మాత్రమే అమ్మని అడిగాడు. ఒకరి చేయి ఒకరు పట్టుకుని వెళ్ళిపోయారు ఇద్దరూ, చిట్ట డవిలోకి షికారు.

''సెర్యోష! తెలిసింది కదూ, 'తీరాలి' అనే మాట ఒకటుంది'' అని కొరొస్తెల్యోవ్ చెప్పడం మొదలుపెట్టాడు. ''ఒక్క నిమిషం ఆలోచించుకో నువ్వే. హొల్మొగోరి వెళ్లాలని నాకుందా? పోనీ – అమ్మకుందా? ఎంత మాత్రమూ లేదు. ఆ మాటకొస్తే – ఇటుంచి అటు. మా ప్లాన్లు అన్నీ, మా జీవితం అంతా తలకిందులైపోయింది. కాని, వెళ్లి తీరాలి, అంచేత వెళ్తున్నాం. ఇలాంటి చిక్కులు నామట్టుకు నేను ఎన్నో అనుభవించాను.''

''ఎందుచేత?''

''చూశావా, మరి, జీవితం అంటే అదే!'' అన్నాడు కొరొస్తెల్యోవ్.

కొరొస్తెల్యోవ్ గంభీరంగానూ, విచారంగానూ మాట్లాడాడు. మరి, అత నికి కూడా ఏమంత సరదాగా లేదని తెలియగానే సెర్యోషకి తన మనసు ఒక్కరవ్వ కుదుటపడినట్లు అనిపించింది.

''ఇహ నేను అమ్మతో వెళ్తాను. ఇలా వుంది సంగతి... ఈ కొత్త వ్యవహారం గురించి ఏర్పాట్లు చేసుకుని తీరాలి. మరేమో ల్యోన్య గురించి కూడా ఏర్పాటు చేసుకోక తప్పదు. అక్కడ వీడికి వెంటనే నర్సరీ గురించి చూసు కోవాలి. మరి, అక్కడ నర్సరీ దూరమో ఏమిటో? అలాగైతే – ఆయా కోసం వెతకాలి. అదొక గట్టి చిక్కే అవుతుంది. ఇహ, నా పరీక్షలు వున్నాయి. ఏమైనా సరే, తలకిందుల తపస్సు చేసైనా సరే పరీక్షలు ప్యాసై తీరాలి. ఎటు తిరిగినా 'తీరాలి', 'తీరాలి' అనే మాటే ఎదురవుతూంది. మరి – నువ్వు చెయ్యాల్సినదీ, చేసితీరాల్సినదీ ఇది: కొన్ని రోజులవరకూ నువ్విక్కడ వుండాలి. నిన్ను మేం అక్కడికి తీసుకెళ్లి, మా కష్టాలన్నిటితోనూ నిన్ను కూడా బాధపెట్టడమెందుకు? నీ జబ్బు మరింత ముదిరిపోవడమెందుకు?...''

అవసరం లేదు. ఆ బాధలు పడడానికే సెర్యోష ఒప్పుకుంటున్నాడు,

ఆ బాధలు భరించడానికే తను సిద్ధంగా వున్నాడు, అందుకు నిరీక్షిస్తున్నాడు. వాళ్లు బాధలు పడతారా? — పోనీ, ఆ బాధలేవో తనూ పడతాడు, వాళ్లతో పాటు. కొరొస్తెల్యోవ్ గొంతుక తన కెంత నమ్మకం తోపించినప్పటికీ, తమతో తనను తీసికెళ్లకుండా వుంచేయడానికి, తనను అక్కడికి తీసుకెళ్లే పక్షంలో తన జబ్బు ముదిరిపోతుందనేది కారణం కాకపోగా, తన జబ్బు స్థితివల్ల తాము అక్కడ ఏమి ఇబ్బందులు పడవలసి వస్తుందో అనేదే అసలు కారణమనే అభిప్రాయాన్ని తన మనసులోనుంచి తొలగించలేకపోయింది. ప్రేమపాత్రమైనది ఏదీ కూడా బాధకు కారణం కాజాలదనే సంగతిని తన హృదయం అప్పటికప్పుడే గ్రహించింది. తన పట్ల వీళ్లకి నిజంగా ప్రేమ వుందా? — అనే సందేహం, గ్రహణశక్తిని సంపాదించేందుకు యెదుగుతూ వున్న తన హృదయానికి ములుకుల్లా గుచ్చుకుని వేధిస్తూంది.

చిట్టడవిలోకి వచ్చారు. అక్కడ అంతా ఖాళీగా బావురుమంటూంది. ఆకులన్నీ అప్పుడే రాలిపోయి, కిందనుండి చూసేసరికి బోసిగా వున్న చెట్లమీది పక్షిగూళ్లు అడ్డదిడ్డగా చుట్టబెట్టిన నల్లని పూలు వుండల్లా అవుపడు తున్నాయి. కొరొస్తెల్యోవ్ చేయి పట్టుకుని, నేలపైన పరుపు పరిచినట్టుగా పడివున్నట్టి చెమ్మగిలిన గోధుమరంగు ఆకులమీద తన బూడ్సులతో తుప్పు తుప్పుమని అడుగులు వేసుకుని చెట్లకిందను నడుస్తూ సెర్యోష తనలోతను ఆలోచించుకుంటున్నాడు. ఏ వొడుదుకులేని గొంతుకతో తటాలున అన్నాడు సెర్యోష:

''ఏమైనా సరే.''

''ఏమిటి ఏమైనా సరే?'' అని అడిగాడు కొరొస్తెల్యోవ్, సెర్యోషకేసి తలదించి.

సెర్యోష జవాబు చెప్పలేదు.

''ఎండకాలం వరకూ నెమ్మదిగా కాలక్షేపం చేయి, చూశావా, మరి!'' అన్నాడు కొరొస్తెల్యోవ్ తబ్బిబ్బుపడుతూ, కొంతసేపు వూరకుని.

సెర్యోషకు తన మనసులో ఇలా జవాబుచెప్పాలని అనిపించింది: ఎంత ఆలోచించినా సరే, ఎంత ఏడ్చినా సరే, ఏమీ ప్రయోజనంలేదు, మీరు పెద్దవాళ్లు, మీరు అన్నీ చేయగలరు. ఇది చెయ్యవచ్చనీ, అది చెయ్యకూడదనీ మీరే అన్నీ శాసిస్తారు; కానుకలిచ్చేవారూ మీరే, దండించేవారూ మీరే; మరి, నన్ను ఉంచేస్తామని మీరు అన్నారూ అంటే, నేను ఉండిపోవాల్సిందే, నేను ఏమన్నా ఏం చేసినా కార్యం వుండదు. తన మనసులో వున్నది తను చెప్పగల్గే సామర్థ్యం వుండివుంటే ఇలా అని సెర్యోష జవాబుచెప్పి వుండేవాడు. పెద్దవాళ్లకున్న బ్రహ్మాండమూ అపరిమితమూ అయిన శక్తి ఎదుట తాను కేవలం నిస్సహాయుడననే భావంతో సెర్యోష మనస్సు పూర్తిగా నిండిపోయింది....

ఆ రోజునుండి సెర్యోష చాలా నెమ్మదిగా వున్నాడు. ''ఎందుకు?'' ''ఏమిటి?'' అని ఒక్క ప్రశ్న అయినా వేశాడో లేదో. తను పాష అత్తయ్య గదిలోకి వెళ్లిపోయి, అక్కడున్న సోఫామీద, మోకాళ్లు వెనక్కి ముడుచుకుని ఒక్కడూ ఒంటరిగా కూచుని, తనలో తనే ఏదో గొణుక్కొంటున్నాడు. ఇంతవరకూ తనను ఎప్పుడోకాని షికారు వెళ్లనివ్వలేదు. శరత్కాలం ఎప్పటికీ అంతం కాకుండా వుంది ఏది చూసినా బూడిదరంగే, ఎక్కడ చూసినా బాడీ చెమ్మానూ. మరి శరత్కాలంలో జబ్బుచేసిందంటే ఒకంతట వదల్దు.

తన దగ్గరకి కొరొస్తెల్యోవ్ ఇంచుమించు రావడమే లేదు. పొద్దున్న లేచి పనిలోకి వెళ్లిపోతాడు (''అవేర్కియెవ్‌కి చార్జి ఒప్పజెప్పడానికి వెళ్తాను'' అంటాడు). ఐనప్పటికీ అతను సెర్యోషను జ్ఞాపకం వుంచుకునేవాడు: ఒకనాడు పొద్దున్న సెర్యోష నిద్రనుంచి లేచి చూసుకునే సరికి, తన మంచం దగ్గర ఒక కొత్త పెట్టె బిల్డింగ్ క్యూబ్స్ వుంది. మరోనాడు నల్లని కోతిపిల్ల బొమ్మ ఒకటుంది. సెర్యోషకి ఆ కోతిపిల్ల బొమ్మ అంటే మహా యిష్టం. దాన్ని చూపించి, ఇది నా కూతురు అనేవాడు. అది ఎంతో అందంగా వుందని తనకనిపించింది – కథలో రాజకుమార్తెలా.

''చూశావా, మరి'' అనేవాడు దానితో. తను హాలొమ్మోగోరి వెళ్తున్నాననీ దాన్ని కూడా తనతో తీసుకెళ్తాననీ అనేవాడు దానితో. దాని చెవిలో కబుర్లు చెబుతూ, జిల్లుమంటూ చల్లగా వున్న ఆ ప్లాస్టిక్ బొమ్మ మూతిని ముద్దుపెట్టుకుని, దాన్ని పడుకోబెట్టి నిద్రబెట్టేవాడు.

బయలుదేరడానికి ముందు రోజు

ఎవరో కొత్త మనుషులు ఇంటికి వచ్చి, అమ్మగదిలో ఫర్నీచరునీ, భోజనాలగదిలో ఫర్నీచరునీ ఇటూ అటూ కదిపి, నారచాపల్ని వాటికి చుట్టబెట్టి తాళ్లతో కట్టారు. కిటికీలకున్న తెరల్నీ, దీపాలకున్న షేడ్లనీ, గోడలకున్న పటాలనీ అమ్మ తీసేసింది. గదులన్నీ వికృతంగానూ దిక్కులేనట్టూ, వున్నాయి: గదుల్లో నేలమీద తాడుముక్కలూ, మోకుముక్కలూ పడివున్నాయి; వెలవెలబోతూన్న గోడకాగితాలపైన, ఇదివరకల్లా పటాలు వేలాడుతూండిన చోట్ల ఇప్పుడు ముదురు రంగు నలుచదరాలు అవుపడుతున్నాయి. పాష అత్తయ్యగదీ, వంటిల్లూ – ఈరెండూ మాత్రం భోరుమంటూన్న ఈ అంద వికారం అంతటి మధ్యనూ పచ్చని ద్వీపాల్లా వున్నాయి. బోసిగా వున్న ఎలెక్ట్రిక్ దీపాలు వెలుగుతూ, బోసిగా వున్న గోడలమీదనూ బోసిగా వున్న కిటికీలమీదనూ, గోధుమరంగు నారచాపలమీదనూ కాంతులు ప్రసరిస్తున్నాయి. కుర్చీలను ఒకదానిపైన రెండవది తలకిందులుగా వుంచారు. బరుకులు పడిన వాటి కాళ్లు సరంబీ వేపు యెత్తుతున్నాయి.

కడమ రోజుల్లో అయివుంటే, చిందరవందరగా వున్న ఫర్నీచరు మధ్యను దాగుంటూ ఆడుకుందుకు ఎంతో సరదాగా వుండేది. కాని ఈ సమయం లోనా, అబ్బే....

ఆ కొత్త మనుషులు బాగా పొద్దుపోయి వెళ్లిపోయారు. ఇంట్లో వాళ్లందరూ అలసిపోయి, పడుకున్నారు. ల్యోన్య మాత్రం తను రాత్రి నిద్ర

పోయేందుకు తనకు సాయంకాలం అవసరమయే ఏడుపు ఏడ్చేసి నిద్రపోయాడు. పాష అత్తయ్య, లుక్యానిచ్ మామయ్య మంచంమీద పడుకుని, చాలాసేపు అలా గుసగుసలాడారు, ముక్కులు చీదుకున్నారు. కొసకి ఎలాగైతేనేం అంతా నిశ్శబ్దమైపోయింది. ఆ తరువాత లుక్యానిచ్ మామయ్య గుర్రు వినబడింది; ముక్కులోనుంచి సన్నగా నిద్రమత్తుతో వస్తూన్నట్టుగా ఈల, పాష అత్తయ్య గుర్రు, వినబడింది.

కొరొవాస్తెల్యోవ్ ఒక్కడూ మాత్రం భోజనాలగదిలో, బోసిగా వున్న ఎలెక్ట్రిక్ దీపంకింద కూర్చుని, నారచాపలు అగపడకుండా బల్లపైన బాగా వంగి ఏదో రాసుకుంటున్నాడు. తన వెనుక ఎవరో ఊపిరితీయడం వినబడింది. వెనక్కి తిరిగి చూసేసరికి – పొడుగు అంగరఖా తొడుక్కొని, మెడ చుట్టూ బేండేజీ చుట్టుకుని, వుత్తకాళ్లతో తన పక్క నుంచునున్నాడు సెర్యోష.

''ఎందుకిలా వచ్చావు?'' అని కొరొవాస్తెల్యోవ్ గుసగుసగా అడిగి, లేచి నుంచున్నాడు.

''కొరొవాస్తెల్యోవ్! నువ్వు మంచివాడివి, నీకు పుణ్యముండేను, నిన్ను బతిమాలుకుంటున్నాను, మీతో నన్ను కూడా తీసుకెళ్లూ బాబూ!'' అన్నాడు సెర్యోష.

అలా అని, పడుకుని నిద్రపోతూన్నవాళ్లకి ఎక్కడ నిద్రాభంగమవుతుందో అని ఏడుపు ఆపుకొందుకు ప్రయత్నించుతూ సెర్యోష ఎంతో బాధపడుతూ ఏడవడం ఆరంభించాడు.

''అయ్యయ్యో! ఇదేమిటి?'' అని కొరొవాస్తెల్యోవ్ సెర్యోషను ఎత్తుకుని అడిగాడు. ''వుత్తకాళ్లతో, చల్లగా జిల్లుమంటూన్న వుత్తనేలమీద నడిచి రాకూడదే నువ్వు.... రాకూడదని నీకు తెలుసుగా.... మనమిద్దరం ఒక ఒక మాట అనుకున్నాం కదా, మరి ఇప్పుడిదేమిటి?...''

''నాకు రావాలనుంది హొల్మొగోరికి!'' అని ఏడుస్తూ అన్నాడు సెర్యోష.

''ఇదిగో చూడు, నీ కాళ్లు అప్పుడే చల్లగా కరుడుకట్టిపోయాయి'' అన్నాడు కొరొస్తెల్యోవ్. సెర్యోష తొడుక్కున్న అంగరఖా అంచును సెర్యోష కాళ్లకిందకు కూడదీసి పాదాలను కప్పాడు. జబ్బుతో చిక్కిపోయి, ఏడుపుతో గజగజ వణకిపోతూన్న సెర్యోష శరీరాన్ని కొరొస్తెల్యోవ్ కౌగిలించుకున్నాడు. ''అసలే చిక్కుపడిపోయున్న ఈ వ్యవహారం మరింత చిక్కుపడిపోతూంది. నీకు తెలుసును కదా, మరి. నువ్వు జబ్బుపడితే...''

''ఇహనుండి నేను జబ్బుపడనే పడను!''

''నీకు నిమ్మళంగా వున్న మరుక్షణం నేను వచ్చి నిన్ను తీసుకెళ్తానుగా!''

''నువ్వు అబద్ధం ఆడడంలేదుకద?'' అని సెర్యోష విచారంతో కుంగిపోయి అన్నాడు. అలా అని, సెర్యోష తన రెండు చేతులతోనూ కొరొస్తెల్యోవ్ మెడను పెనవేసుకున్నాడు.

''చూశావా మరి, నేనింతవరకూ నీతో ఎన్నడూ అబద్ధమాడలేదు!'' అన్నాడు కొరొస్తెల్యోవ్.

''నిజమే, ఎన్నడూ అబద్ధమాడలేదు'' అనుకున్నాడు సెర్యోష తన మనసులో. ''ఐనా, అసలు ఎప్పుడో ఒక్కమారైనా అబద్ధమాడకుండా వుంటాడా? వాళ్లందరూ అబద్ధాలాడతారే.... ఇప్పుడితను అబద్ధమే ఆడుతేనో?''

దృఢంగా బలంగా గడ్డంకింద ముళ్లల్లా వెంట్రుకలున్న అతని మెడను సెర్యోష, అదే తన చిట్టచివరి కోటబురుజు అయినట్టు గట్టిగా కౌగిలించుకున్నాడు. తన ప్రధాన ఆశలూ, తన రక్షణ, తన ప్రేమ ఈ మనిషిలోనే వున్నాయనుకున్నాడు సెర్యోష. కొరొస్తెల్యోవ్ సెర్యోషను ఎత్తుకుని, భోజనాల గదిలో అటూ ఇటూ తీసుకెళ్లుతూ సెర్యోష చెవిలో చెప్పాడు – ఆ రాత్రి జరిగిన సంభాషణ అంతా గుసగుసల్లోనే జరిగింది:

''....నేను నీ దగ్గరికి వస్తాను. ఇద్దరం కలిసి రైలుమీద వెళ్దాం.... రైలు రైంయ్ రైంయ్‌మని వెళ్లిపోతూంటుంది.... రైలు కంపార్టుమెంటులో

జనం కిక్కిరిసి వుంటారు....మనం అనుకోకుండానే అమ్మ వున్న వూరికి వచ్చేస్తాం.... రైలు కుంయ్‌మని కూస్తుంది....''

''నన్ను తీసుకెళ్లేందుకు వీల్లేదన్నమాట'' అని సెర్యోష అనుకున్నాడు, మహా బాధపడిపోతూ ''మరి, అమ్మకి కూడా నన్ను తీసుకెళ్లేందుకు వీలు పడదన్నమాట. రోజూ ఎందరెందరో అతనికోసం వస్తూంటారు, టెలిఫోనులో పిలుస్తూంటారు. వాళ్లిద్దరూ వాళ్ల పనులమీద వెళ్తూంటారు, లేదంటే పరీక్షలకు చదువుకుంటూంటారు, లేదంటే ల్యోన్యకి సంరక్షణ చేస్తూంటారు. మరి, నేనేమో ఇక్కడ వాళ్లకోసం అలా పడిగాపులు పడుంటాను ఎల్ల కాలం....'' అనుకున్నాడు.

''...మనం, వుంటామే, అక్కడ వుంటుంది అడవి – అసలైన అడవి, మన చిట్టడవిలాంటిది కానేకాదు.... పుట్టకొక్కులూ, అడవిపళ్లూ....''

''తోడేళ్లు?''

''ఇప్పుడు చెప్పలేను – తోడేళ్ల గురించి వివరంగా తెలుసుకుని ప్రత్యేకంగా నీకు వుత్తరం రాస్తాను....మరి, అక్కడ ఏరుంది. మనమిద్దరం ఏటికెళ్లి, ఏట్లో స్నానంచేద్దాం.... బార ఈత ఎలాగో నీకు నేర్పుతా....''

అనుమానాలతో విసిగిపోయిన సెర్యోషకి మెరుపులాంటి ఆశారేఖ ఒకటి తట్టగా, ''ఇలా జరుగుతుందేమో! బహుశా ఇదంతా జరగొచ్చు'' అనుకు న్నాడు.

''చేపలకోలలు తయారుచేసుకుని ఏటిలో చేపలు పడదాం... ఇదిగో చూడు! మంచు పడుతూంది!'' అన్నాడు కొరొస్తెల్యోవ్.

కొరొస్తెల్యోవ్ సెర్యోషను కిటికీ దగ్గరకు తీసుకెళ్లాడు. పెద్దపెద్ద తెల్లటి మంచు తొరకలు కిటికీ దగ్గరకు ఎగురుతూ వచ్చి, క్షణంలో కిటికీ అద్దాలకు బల్లపరపుగా అంటుకున్నాయి.

సెర్యోష వాటికేసి చూస్తున్నాడు. బాగా అలసిపోయాడేమో సెర్యోష, పొంగి చెమ్మగిలిన తన బుగ్గలను కొరొస్తెల్యోవ్ ముఖానికి అదిమిపెట్టుకుని, స్తిమితపడ్డాడు. కొరొస్తెల్యోవ్ అన్నాడు:

''ఇదిగో వచ్చేసింది చలికాలం! ఇహ మళ్లీ జోరుగా షికార్లు తిరగొచ్చు, స్లెయ్‌మీద జారొచ్చు – అనుకోకుండానే ఇట్టే పరుగెత్తుతుంది కాలం....''

''ఇదిగో'' అన్నాడు సెర్యోష మనసులో ఎంతో బాధపడుతూ, ''నా స్లెయ్ తాడు ఏమీ బాగులేదు. దానికి ఓ కొత్త తాడు తెచ్చి కట్టాలి నువ్వు!''

''తప్పకుండా కడతాను. మరి, నువ్వుందే, చూశావా మరి, నువ్వు నీ మాట ఇవ్వాలి నాకు: ఇక ఏడవనని. ఏం అలాగేనా? ఏడిస్తే నీకు బాధగా వుంటుంది, అమ్మ బెంగపెట్టుకుంటుంది; అసలు ఇంతకీ, మొగాళ్లు ఏడ వరు. అసలు, ఏడుపు వినబడ్డమంటే నాకు గిట్టదు.... ఏడవనని నువ్వు ఖరారు చెయ్యాలి.''

''ఆహా'' అన్నాడు సెర్యోష.

''ఖరారుచేసినట్టేనా? గట్టిగానేనా?''

''ఆహా....''

''ఇదిగో, చూడుమరి, ఇచ్చినమాట పౌరుషంతో నిలబెట్టుకోవాలి సుమా!''

అలసిపోయి ఒళ్లు భారంగా వున్న సెర్యోషను కొరొస్తెల్యోవ్ ఎత్తుకుని పాష అత్తయ్య గదిలోకి తీసుకెళ్లి, వాడి మంచంమీద పడుకోబెట్టి, రజాయి కప్పాడు. సెర్యోష వుండివుండి దీర్ఘంగా నిట్టూర్చి, వెంటనే నిద్రపోయాడు. సెర్యోషకేసి అలా చూస్తూ నుంచున్నాడు కొరొస్తెల్యోవ్. భోజనాలగదిలో వెలుగుతూన్న దీపపు వెల్తురులో సెర్యోష ముఖం చిన్నదిగానూ పసుప్పచ్చ గానూ కానవచ్చింది.... కొరొస్తెల్యోవ్ వెనక్కి తిరిగిపోయి ఆ గదిలోనుంచి మునివేళ్లమీద నడచి వెళ్లిపోయాడు.

బయలుదేరే రోజు

బయల్దేరే రోజు వచ్చింది.

ఆవేళ సూర్యుడూ లేడు, మంచూ పడలేదు – మసమసగ్గా వుంది. నేల పైన వున్న మంచు రాత్రి కరిగిపోయింది. ఇంటికప్పులమీద వున్న మంచు

మాత్రం పలుచని పొరలా వుండిపోయింది. బూడిదెవన్నె ఆకాశం, నేలమీద నీటి మడుగులు. స్లెయ్ వూసే ఎత్తక్కర్లేదు: ముంగిట కాలు పెట్టేందుకే అసహ్యంవేస్తూంది.

ఇలాటి రోజున అంతా నిరాశగానే వుంటుంది. మంచిది ఏదీ జరిగే టట్టు అవుపడదు.

ఐనప్పటికీ, కొరొస్తెల్యోవ్ కొత్త తాడు తీసుకొచ్చి స్లెయ్‌కి కట్టాడు — సెర్యోష వెళ్లి స్లెయ్‌ని చూసేసరికి: అప్పటికప్పుడే కొత్త తాడు కట్టేవుంది.

కొరొస్తెల్యోవ్ మాత్రం ఎక్కడకో వెళ్లాడు.

అమ్మ కూచుని ల్యోన్యకి పాలిస్తూంది. ఎప్పుడు చూసినా అమ్మ వాడికి పాలిస్తూనో, మరేదేనా తినిపిస్తూనో వుంటుంది కదా....అమ్మ చిరునవ్వు నవ్వుతూ సెర్యోషతో ''చూడ్రా, వొరేయ్! వాడి ముక్కెలా వుందో, నవ్వొస్తూనూ!''

సెర్యోష చూశాడు. ముక్కు ముక్కులా వుంది. ''అవును, మరి, వాడి ముక్కు చూసి, అమ్మ మురిసిపోతూంది అమ్మకి వాడిమీద ఆపేక్ష అందు చేతనే మరి, అలా మురిసిపోతూంది. ఇంతకుముందు నామీదనూ ఆపేక్ష పడేది, ఇప్పుడేమో వాడిమీద ఆపేక్ష'' అనుకున్నాడు.

అలా అనుకుని, పాష అత్తయ్య దగ్గరకి వెళ్లిపోయాడు సెర్యోష. ఆవిడకి లక్షా తొంభై చాదస్తాలు వుంటే వుండుగాక, ఆవిడ తన దగ్గర వుంటుంది, తనంటే ఆవిడ ఆపేక్షపడుంది.

''ఏమిటి చేస్తున్నావు?'' అని సెర్యోష విసుపు గొంతుకతో అడిగాడు.

''కనబడ్డం లేదూ నీకు?'' అంది పాష అత్తయ్య న్యాయంగానే, ''కళ్లెట్లు చేస్తున్నానుగా!''

''ఇన్నెందుకూ?''

వంటింట్లో వున్న బల్లలన్నిటిమీదనూ వున్నాయి — బ్రెడ్డుపాడి మెత్తిన కళ్లెట్లు.

''ఎందుకా? ఈవేళ మనకందరికీ భోజనానికీ, మరి వాళ్లు కూడా తీసికెళ్లి ప్రయాణంలో తినడానికీని.''

''వాళ్లు త్వరగా బయల్దేరతారా?'' అని అడిగాడు సెర్యోష.

''ఇంత త్వరగా బయల్దేరరే. సాయంకాలం వెళ్తారు.''

''ఇంకా ఎన్ని గంటలు పోవాలి?''

''ఎన్నో గంటలు పోవాలి. వాళ్లు బయల్దేరేసరికి పొద్దుపోతుంది. పొద్దు పోతేనేగాని వాళ్లు బయల్దేరరు.''

ఆవిడ అలా కట్లెట్లను బేక్‌చేస్తూనే వుంది, సెర్యోష అలా నిలబడి చూస్తూనే వున్నాడు. బల్ల అంచుకు తన నుదురు ఆనించి ఆలోచించు కుంటున్నాడు:

''లుక్యానిచ్ మామయ్యకి కూడా నేనంటే ఆపేక్షే. ఇంకా హెచ్చుగా ఆపేక్ష పడతాడు కూడానూ, మహా చెడ్డ ఆపేక్షపడతాడు. లుక్యానిచ్ మామయ్యతో నావలో వెళ్తాను, నావ మునిగిపోతుంది, నేనూ మునిగి పోతాను. అప్పుడు నన్ను భూమిలో పాతిపెట్టేస్తారు, ముత్తవ్వను పాతి పెట్టేసినట్టే. కొరొస్తెల్యోవ్‌కీ అమ్మకీ ఈ సంగతి తెలుస్తుంది, వాళ్లప్పుడు ఏడుస్తూ: అయ్యో, వాణ్ణి మాతో ఎందుకు తీసుకు వెళ్లాంకాం! వాడెంతో తెలివైన పిల్లాడు, ఎంతో బుద్ధిమంతుడు, ఎన్నడూ ఏడ్చి ఎరగడు, వాడి ముందర ల్యోన్య — థూ! ఎందుకూ పనికిరాడు — అనుకుంటారు. అబ్బ, వొద్దు, బాబూ, నన్ను భూమిలో పాతిపెట్టొద్దు, ఎంతో ఘోరంగా వుంటుంది: ఒక్కణ్ణే అక్కడ అలా పడుకుని వుండడం.... మేం హాయిగా బతికే వుంటాం, హాయిగా తింటూ తిరుగుతూ వుంటాం, లుక్యానిచ్ మామయ్య నాకోసం ఆపిల్సూ, చాకలేట్లూ అన్నీ తీసుకొచ్చి ఇస్తాడు. నేను వేగం పెద్దవాణ్ణి అయిపోయి — మహాసముద్ర నౌకాదళంలో కెప్టెను అయి పోతాను. మరి — కొరొస్తెల్యోవూ, అమ్మా — వాళ్లకి అంతా పాడుగా వుంటుంది. వాళ్లకి బతుకు వెళ్లడమే కనాకష్టంగా వుంటుంది. ఒక నాడు వాళ్లు

వచ్చి: 'మమ్మల్ని దుంగలు కోయనివ్వండి, బాబూ!' అని అడుగుతారు. అప్పుడు పాష అత్తయ్యతో నేనంటాను: 'నిన్నటి పులుసు ఇయ్యి వాళ్లకి' అని...''

ఇలా అనుకుంటూ, కొరొాస్తెల్యోవ్ పట్లా, అమ్మ పట్లా సెర్యోషకి ఎంత జాలివేసిందంటే, ఇక ఆ విచారం దుర్భరమైపోయి, కళ్లవెంట బొటబొట నీళ్లు కారిపోయాయి. పాష అత్తయ్య చూసి, ఏమి అనడానికీ తెలియక: ''అరె భగవంతుడా!'' అని నిట్టూర్చింది. అలా అనేసరికి సెర్యోషకి తను కొరొాస్తెల్యోవ్‌తో ఖరారుచేసిన విషయం జ్ఞాపకం వచ్చి, భయపడుతూ ''మరెప్పుడూ ఏడవను!'' అన్నాడు.

ఇంతట్లో నాస్త్య అవ్వ అక్కడికి వచ్చింది ఎప్పట్లా. ఆమె చేతిలో నల్లని చేతిసంచి వుంది. ఆమె వచ్చి:

''దీమ్రతి ఇంట్లో వున్నాడా?'' అని అడిగింది.

''కారుకోసం వెళ్లాడు'' అంది పాష అత్తయ్య. ''వాళ్ల క్షేత్రంలో వున్న కార్లన్నీ పనిలో వున్నాయట. ఒక్కటి కూడా ఇవ్వనన్నాట్ట అవేర్కియెవ్ — ఎంత నీచుడో మరి!''

''నీచుడంటారేమిటి? క్షేత్రంలో వున్న కారులన్నీ క్షేత్రంలో అవసరమే. అది మొదటి విషయం. ఇహ రెండోది: లారీ ఇచ్చాడుగా, సామాన్లు తీసుకెళ్లేందుకు — అదే నయం!'' అంది నాస్త్య అవ్వ.

''నిజమే, సామాన్లకి అదే నయం'' అంది పాష అత్తయ్య. ''కాని చంటిపిల్లణ్ణి తీసుకెళ్లేందుకు మరీయాకి కారైతేనే సదుపాయంగా వుంటుంది.''

''నాజూకుతనాలంటే ఇవేమరి — వాళ్లు పాడవడమూ పిల్లల్ని పాడుచేయడమూనూ'' అంది నాస్త్య అవ్వ. ''మా పిల్లల్ని కార్లెక్కించామా, లారెలెక్కించామా? అయినా మేమూ వాళ్లని పెంచాం, మేమూ వాళ్లని పెద్దవాళ్లనిచేశాం. చంటివాణ్ణి ఎత్తుకుని లారీలో డ్రైవరుపక్క కూచుంటే తీరిపోయె!''

సెర్యోష కళ్ళ మెల్లగా మిటకరిస్తూ, ఇదంతా విన్నాడు. తనను వది లేసి వాళ్ళు వెళ్లిపోవడం ఇహ నిశ్చయమే అనుకుని, వాళ్ళు వెళ్లిపోయే వేళకోసం కనిపెట్టుకుని గుటకలు మింగుతూ నుంచున్నాడు. తనను ఏదు ర్కోడానికి సిద్ధంగావున్న దుఃఖాన్ని తట్టుకుని నిలబడేందుకు తనలోవున్న శక్తులన్నీ ఏకమై బిగదీసుకునున్నాయి. లారీ అయేది, కారు అయేది, తనను వదిలిపెట్టేసి వాళ్ళు కాస్సేపట్లో వెళ్లిపోవడం తప్పదు మరి — వాళ్లంటే తనకి ఎంతో ప్రేమ.

''ఏడీ, దీమ్మిత్రి ఇలా రాడేం?'' అని అడిగింది నాస్త్య అవ్వ. ''వాడికి వీడ్కోలిచ్చి వెళ్దామనుకున్నానే నేను!''

''అదేమిటి? వాళ్లతో రైలుస్టేషనుకి వెళ్లరూ మీరు?'' అంది పాష అతయ్య.

''నాకు కాన్పరెన్సు వుంది, అందుచేత నాకు వీల్లేదు'' అని నాస్త్య అవ్వ అంటూ, అమ్మదగ్గరకి వెళ్లింది. అంతా నిశ్శబ్దమైపోయింది. బయట అప్పుడే ఆకాశానికి బూడిదెరంగు వచ్చేసింది, గాలి రేగడం మొదలెట్టింది. కిటికీ అద్దాలు గాలికి తుళ్లిపడి, టింగ్‌టింగుమంటున్నాయి. తెలుపు చారలు పడిన సన్నని మంచుపొర బురద మడుగులపై అలముకుంది. మళ్లీ మంచు కురవడం ఆరంభించింది, గాలికి మంచు తొరకలు సుడితిరుగుతున్నాయి.

''వాళ్ళు బయల్దేరడానికి ఇంకా ఎన్ని గంటలు పడుతుంది?'' అని అడిగాడు సెర్యోష.

''ఇహ ఎన్నో గంటలు పట్టదు. కాని ఇంకా చాలావేళే వుందిలే'' అంది పాష అత్తయ్య.

...కుప్పలు కుప్పలుగా పేర్చిన ఫర్నీచరుమధ్య నుంచుని నాస్త్య అవ్వ, అమ్మ మాట్లాడుకుంటున్నారు.

''ఏడీ వీడు? ఎక్కడికెళ్లాడేమిటి?'' అంది నాస్త్య అవ్వ. ''వాడికి

వీడ్కోలివ్వడానికి నాకు వీల్లేదో ఏమిటో? వాణ్ణి నేను మళ్లీ చూస్తానో చూడనో – ఎవరు చెప్పగలరు?''

''వీళ్లు వెళ్లిపోయి ఇహ మరి ఎన్నటికీ రానేరారని ఆవిడ కూడా భయ పడుతూంది'' అనుకున్నాడు సెర్యోష.

చీకటి పడిపోతూందని గమనించాడు సెర్యోష. మరి కాస్సేపట్లో దీపాలు పెట్టేవేళ అవుతుందికదా అనుకున్నాడు.

ల్యోన్య ఏడ్పు ఆరంభించాడు. వాడిదగ్గరకి తల్లి ఆదరా బాదరా పరు గున వెళ్లింది. తోవలో నుంచున్న సెర్యోషను ఆమె చూసుకోలేదేమో, వాడిమీద పడిపోవలిసిందే, పిసరులో తప్పిపోయింది కాని. అప్పుడు తల్లి సెర్యోషతో ''ఏంరా, బాబూ, నీమట్టుకు నువ్వు ఆడుకుంటున్నావురా, నాయనా, సెర్యోష?'' అని ముద్దుగా అంది.

సెర్యోషకి ఆడుకుంటే బాగుండు ననిపించింది. తను మనసార ప్రయ త్నించాడు కూడానూ ఆడుకుందుకి, మొట్టమొదట కోతిపిల్ల బొమ్మతోనూ, తరువాత బిల్డింగ్ బ్రిక్స్‌తోనూ. కాని ఏం కార్యం లేకపోయింది, వాటిమీద ఏమీ మనసు పోలేదు. పోన్లే, ఏది ఎలా అయినా తనకి అంతా ఒకటే అనిపించింది. వంటింటి తలుపు గభాలున తెరుచుకుంది, అడుగుల చప్పుడు వినబడింది. కొరొస్తెల్యోవ్ బిగ్గరగా మాట్లాడుతూండడం వినబడింది:

''ఇహ వడ్డించండి, భోంచెయ్యాలి. గంటలో వచ్చేస్తుంది మోటారు.''

''కారు దొరికిందా?'' అని అడిగింది నాస్త్య అవ్వ. కొరొస్తెల్యోవ్ జవాబు చెప్పాడు:

''అబ్బే! ఇవ్వడు. వాడి తస్సాదియ్యా! లారీమీద వెళ్లాలి.''

సెర్యోషకి మామూలుగా తన అలవాటు ప్రకారం, ఈ గొంతుక తన చెవినిబడగానే ఎంతో హాయి అనిపించేది, కాని ఇప్పుడు అనుకున్నాడు: ''మరి కాస్సేపటికి ఇదేమీ వుండదు కదా.'' అలా అనుకుని, నేలమీద కూచుని, పరధ్యానంగా తన బిల్డింగ్ క్యూబ్సుతో మళ్లీ ఆడుకోవడం ప్రారంభించాడు.

సెర్యోష ఆడుకుంటూండగా, కొరొస్తెల్యోవ్, మంచుకి ముఖం బాగా ఎఱ్ఱబడి, అక్కడకొచ్చాడు. వచ్చి, తను ఏదో తప్పుచేసినట్టుగా, సెర్యోషకేసి చూశాడు.

''ఏమిటి సెర్యోష?'' అన్నాడు.

....భోజనాలు తొందర తొందరగా కానిచ్చారు. నాస్త్య అవ్వ వెళ్లిపోయింది. బాగా చీకటిపడిపోయింది. కొరొస్తెల్యోవ్ టెలిఫోనులో ఎవరినో పిల్చి, వీడ్కోలు చెప్పాడు. సెర్యోష అతని మోకాళ్లకు ఆనుకుని ఇంచుమించు ఏ చలనమూ లేకుండా నుంచున్నాడు. కొరొస్తెల్యోవ్ టెలిఫోనులో మాట్లాడు తూనే, తన పొడుగాటి వేళ్లతో సెర్యోష తల నిమిరాడు....

డ్రైవరు తిమోహిన్ వచ్చి ''ఏం అంతా సిద్ధమేనా? పార ఇవ్వండి ఇలా, గేటులో వున్న మంచు తీసేస్తేనే గాని గేటుతలుపు తెరిచేందుకు వీలుపడకుండా వుంది'' అన్నాడు.

గేటు తెరిచేందుకని లుక్యానిచ్ మామయ్య అతనితో కూడా వెళ్లాడు. అమ్మ ల్యోన్యని ఎత్తుకుని నిలబడి, హడావుడి పడుతూ, వాడికి రజాయి చుట్టబెడుతూంది. కొరొస్తెల్యోవ్ అన్నాడు ''ఇంకా తొందర్లేదులే. వాడికి చెమటపోసేయగలదు. ఇంకా బోలెడు వేళుంది.''

ప్యాక్‌చేసిన సామాన్లను అతడు తిమోహినూ, లుక్యానిచ్ మామయ్యతో కలిసి మోశాడు. గది తలుపు అదేపనిగా తెరుచుకోవడమూ, మూసుకోవడమూ. చల్లదనం రైంయ్‌మని గదిలోకి చొరబడింది. అందరి బూట్లపైనా నిండుగా వుంది మంచు, గదిలోకి వచ్చేముందు ఎవ్వరూ బూట్లు దులుపుకోలేదు, మరి పాష అత్తయ్య కూడా ఏమీ అనలేదు. ఆవిడ కూడా అర్థంచేసుకుంది ఇప్పుడు బూట్లు దులుపుకోవడం ఎందుకేమిటని! గదిలో నీరు మడుగులు కట్టుతూంది, ఎక్కడ చూసినా బురదా చెమ్మానూ, మంచువాసన, నార చాపల వాసన, సిగరెట్టు కంపు. వీటితోపాటు, తిమోహిన్ వేసుకున్న బొచ్చుకోటు రొచ్చుకంపు. పాష అత్తయ్య గడబిడచేస్తూ ఇటూ అటూ

పరుగెత్తుతూ అందరికీ సలహాలిస్తూ్తంది. ల్యోన్యను చేతుల్లో పెట్టుకుని అమ్మ సెర్యోష దగ్గరకు వచ్చి, ఒక చేతితో సెర్యోష తలను తన దగ్గరకు మెల్లగా చేరదీసుకుంది. సెర్యోష అమ్మను పక్కకు నెట్టేశాడు: ''తనను వదిలిపెట్టేసి వెళ్లిపోతూ, తనను కౌగిలించుకోవడం ఎందుకేమిటి?'' – అనుకున్నాడు.

సామాన్లన్నీ వెళ్లిపోయాయి: ఫర్నీచరూ, పెట్టెలూ, ఫలహారాల సంచీ, ల్యోన్య నావ్‌కిన్సు మూట కూడానూ. గదులన్నీ ఖాళీ అయిపోయి, ఎంత చిన్నబోయినట్టున్నాయో! చిత్తుకాగితపు ముక్కలు మాత్రం నేలమీద దొర్లుతున్నాయి, ఒక మూల దుమ్ముపట్టిపోయిన ఖాళీ మందుసీసా వుంది. ఇల్లు పాతదైనట్టు ఇప్పుడు కనబడిపోతూంది – ఎక్కడైతే నైట్‌టేబిలూ, సొరుగుల బీరువా వుండేవో అక్కడ మాత్రమే నేల ఎరుపు ఇంకా మాయకుండా వుంది.

లుక్యానిచ్ మామయ్య పాష అత్తయ్యకి ఓవర్‌కోటు అందిస్తూ, ''నువ్వు ఇది వేసుకో, అవతల చల్లగా వుంది!'' అన్నాడు.

సెర్యోష ఇక మథనపడిపోయి వాళ్లమీద పడి ''నేను కూడా గేటు దగ్గిర కెళ్తాను! నేను కూడా గేటు దగ్గిరకెళ్తాను!'' అని కేకేశాడు.

''నువ్వు వెళ్లకుండానా? నువ్వు వెళ్దువుగాన్నా!'' అంది పాష అత్తయ్య. సెర్యోషని ఊరుకోబెట్టడానికని వాడికి బట్టలు తొడుగుతూ. తల్లీ, కొరొస్తెల్యోవూ బట్టలు వేసుకుంటున్నారు. కొరొస్తెల్యోవ్ సెర్యోషను పైకెత్తి, గట్టిగా ముద్దుపెట్టుకుని, దృఢంగా అన్నాడు:

''అబ్బాయ్, నే వెళ్లొస్తాను! నువ్వు త్వరగా నయంకావాలి. మనం అనుకున్న మాట మాత్రం మర్చిపోకేం!''

తల్లి సెర్యోషను ముద్దుపెట్టుకుని, కంట నీరు నింపుకొంది:

''సెర్యోష, ఒరేయ్, నాయన! అమ్మతో 'వెళ్లిరామ్మా!' అని చెప్పు, బాబూ!'' అంది.

''వెళ్లిరామ్మా! వెళ్లిరామ్మా!'' అని సెర్యోష ఉద్రేకపడుతూ తొందరగా నిట్టూర్చి, కొరొస్తెల్యోవ్‌కేసి చూశాడు. కొరొస్తెల్యోవ్ అన్నాడు ''నువ్వు భలేవాడవు, సెర్యోష!''

ఆ మాట విని, తనకెంతో గౌరవం లభించిందని సంతోషించాడు సెర్యోష.

అమ్మ కంట తడిపెట్టుకుని లుక్యానిచ్ మామయ్యతోనూ పాష అత్తయ్యతోనూ ''మీరు ఎంతో చేశారు. అన్నిటికీ ధన్యవాదాలు!'' అంది.

''అదేమిటమ్మాయీ, ఆ మాటలు!'' అంది పాష అత్తయ్య విచారంగా.

''సెర్యోషను కాస్త చూస్తూండండి!'' అంది అమ్మ.

''వాడి గురించి నీకు ఏ బెంగా అవసరంలేదు'' అని పాష అత్తయ్య మరింత విచారంగా అంది. మళ్లీ చప్పున ''అయ్యో, అయ్యో! మర్చేపోయాం – ఒక్క నిమిషం కూచోవాలి, ఒక్క నిమిషం కూచోవాలి! *'' అంది.

''ఎక్కడ కూచోమంటావు?'' అన్నాడు లుక్యానిచ్ మామయ్య, కళ్లు తుడుచుకుంటూనూ.

''ఆరె, భగవంతుడా! రండి, మా గదిలో కూచుందాం, రండి!'' అంది పాష అత్తయ్య.

అందరూ ఆ గదిలోకెళ్లారు – అక్కడా అక్కడా కూచున్నారు. మరెందుకో గాని ఓ నిమిషంపాటు నిశ్శబ్దంగా కూచున్నారు. అందరికంటే ముందుగా పాష అత్తయ్య లేచి, ''ఇహ, బయల్దేరొచ్చును. శుభం!'' అంది.

అందరూ గుమ్మంలో కెళ్లారు. మంచు కురిసింది – అంతా తెల్లగా వుంది. గేటు బారుగా తెరచి వుంది. షెడ్డుగోడమీద గుడ్డిదీపం వెలుగుతూంది. దీపపు వెల్తురులో మంచు తొరకలు ముసురుకుంటున్నాయి. లారీ సామాన్లు వేసుకుని నట్టనడనుంది. సామాన్లమీద తిమోహిన్ టార్పా

---

* రష్యన్ పాత ఆచారం ప్రకారం, ప్రయాణానికి బయల్దేరేముందు ఒక నిమిషం అందరూ మౌనంగా కూచోవాలి. – సం.

లిన్ పరచాడు. అతనికి షూర సాయంచేశాడు. కొరొొస్తెల్యోవ్‌కీ, అమ్మకీ వీడ్కోలు ఇచ్చేందుకు వచ్చినవాళ్లు: వాస్య తల్లి, లీద, ఇంకా మరికొందరూ, అందరూ లారీచుట్టూ చేరారు. వాళ్లంతా, ఇది సర్వమూ, తనకు సంబంధించనట్టుగానూ, అపూర్వంగానూ అనిపించింది సెర్యోషకి. ఆ గొంతుకలు తనకు పరిచితంకానివిగా ధ్వనించాయి. సెర్యోషకి గేటు కూడా పరాయిదానిలా అగపడింది.... ఆ షెడ్డు కూడా తను ఎన్నడూ చూడని షెడ్డులా కానొచ్చింది. ఈ కుర్రాళ్లు, తను వాళ్లతో కలిసి ఇదివరకెన్నడూ ఆడుకోనట్టుగానూ కొత్తగానూ అగపడ్డారు. ఈ తిమోహిన్ తన లారీలో తనను, సెర్యోషను, ఎన్నడూ ఎక్కించుకోనట్టూ, ఇతడెవడో కొత్త మనిషి అయినట్టూ, ఈ లారీనే తను ఎన్నడూ చూడనట్టూ అనిపించింది. వాళ్లతో తీసుకెళ్లకుండా వుంచేసిన తనకి, అసలు తన సొంతానిది ఏదీ కూడా ఎన్నడూ వుండనట్టూ, వుండేందుకు వీలే లేకుండినట్టూ అనిపించింది.

''రోడ్డు నానా ఛండాలంగానూ వుంటుంది బహుశా'' అన్నాడు తిమోహిన్, అదేమిటో కొత్త గొంతుకతో, ''జారుగా వుంటుంది.''

అమ్మనీ, ల్యోన్యనీ కొరొొస్తెల్యోవ్ లారీలోకి ఎక్కించి, డ్రైవరు పక్కను కూచోబెట్టి వాళ్లపైన శాలువ కప్పాడు: వాళ్లంటే అతనికి ఎంతో ప్రేమ, వాళ్లకి ఏ మాత్రం ఇబ్బందీ కలగకుండా హాయిగా వుండాలని ఎంతో జాగ్రత్త తీసుకున్నాడు... తను లారీ ఎక్కి, తను మాత్రం లారీ వెనుక భాగంలో నుంచున్నాడు. బ్రహ్మాండంగా, శిలావిగ్రహంలాగా కనబడాడ్డు.

''దీమ్మతి! టార్పాలిన్‌కింద కూర్చో! టార్పాలిన్ కింద!'' అని కేకేసింది పాష అత్తయ్య. ''మంచు కొట్టేస్తుంది సుమీ, గడ్డకట్టుకుపోగలవు!''

ఆవిడ మాటలు వినిపించుకోకుండానే అన్నాడు కొరొొస్తెల్యోవ్:

''సెర్యోష! పక్కకు తప్పుకో, లేకుంటే లారీ నిన్ను మట్టేస్తుంది సుమా!''

లారీ దడదడ చప్పుడు చేసింది. తిమోహిన్ కాబిన్‌లోకి ఎక్కాడు. లారీ

మరింత మరింత జోరుగా గర్జించింది, వున్నచోటనుండి కదిలేందుకు ప్రయత్నించింది.... కదిలింది. వెనక్కి వెళ్లింది, తరువాత ముందుకు వచ్చింది, మళ్లీ వెనక్కి వెళ్లింది. ఒక నిమిషంలో ఇహ ముందుకు కదిలి, వెళ్లిపోతుంది. తర్వాత గేటు మూసేస్తారు, లాంతర్లు ఆర్పేస్తారు. ఇహ, దాంతో ఆఖరు.

మంచు కురుస్తోంది, సెర్యోష మంచులోనే ఒక పక్క నుంచున్నాడు. తన శక్తి అంతటినీ పుంజుకుని, తను చేసిన ఖరారు గుర్తుకు తెచ్చుకున్నాడు. ఉండుండి మాత్రం నిరాశానిస్పృహలతో దీర్ఘంగా, ఇంచుమించు నిశ్శబ్దంగా వెక్కివెక్కి ఏడ్చాడు. ఒకేఒక కన్నీటిచుక్క, ఒక్కటి మాత్రమే కనురెప్ప వెంట్రుకల్లోనుండి వెలుపలికి జారింది. అది లాంతరు వెలుగులో తళుకుమంది. అది ఎంతో బాధతో రాలిన కన్నీటిబొట్టు, పాలపాప కంటినుండి రాలే అశ్రుబిందువు కాదది. పసిపాపడి కంటినుండి రాలే విషాదభరితమైన అశ్రుబిందువది. అగ్నికణంలా వాతబెట్టే అభిమానపూరితమైన అశ్రుబిందువది....

ఇక తన శక్తి చాలదని తెలుసుకుని కాబోలు, సెర్యోష వెనక్కి తిరిగి, దుఃఖభారంతో వీపు వంగిపోయి, ఇంటికేసి అంగలు వేశాడు.

''లారీ ఆపండి!'' అని కొరొస్తెల్యోవ్ గట్టిగా కేకేసి, తిమోహిన్ కూచున్న కేబిన్‌మీద దబదబ బాదడం మొదలెట్టాడు. ''సెర్యోష! త్వరగా! నీ సామాను సర్దుకో! నువ్వూ రా, మాతో!'' అని గట్టిగా కేక పెట్టాడు.

కేకవేసి, కొరొస్తెల్యోవ్ చప్పున లారీనుంచి గంతేశాడు.

''త్వరగా! సెర్యోష! నీ బట్టలూ, నీ బొమ్మలూ పట్టుకురా ఇలాగ! చప్పన! కానీ!'' అని అరచాడు.

''దిమ్మ్రితి! నీకేమైనా మతిపోయిందా ఏమిటి? దిమ్మ్రితి! కాస్త ఆలోచించుకో! నీకేమైనా బుర్రవుందా, లేదా? దిమ్మ్రితి!'' అని పాష అత్తయ్యా,

లారీ కేబిన్‌లోంచి తొంగిచూస్తూ అమ్మా గోలపెట్టారు. కొరొస్తెల్యోవ్ ఉద్రేకంతోనూ కోపంగానూ జవాబుచెప్పాడు:

''నా జోలికి రాకండి మీరు! ఆ మాత్రం అర్థంచేసుకోరేమి, మీరు? కాలో చెయ్యో కోసేసినట్టుంది నాకు. మీరేమన్నా అనండి – నేను మాత్రం భరించలేను. అంతే మరి!'' అన్నాడు.

''ఆరె, భగవంతుడా! అక్కడికెళ్తే వాడు – చచ్చిపోతాడు!'' అని పాష అత్తయ్య నెత్తిన నోరుపెట్టుకుని అరిచింది.

''మీరు వూరుకోండి!'' అన్నాడు కొరొస్తెల్యోవ్. ''వాడి ప్రాణానికి నా ప్రాణం అడ్డు. వాడి పూచీ నాదీ, సరేనా? తస్సాదియ్యా! వాడు చచ్చిపోవడమేమిటి? వాడు చచ్చిపోడు. మీ పిచ్చితనం కాకపోతే మరేమిటి? నువ్వు రా, సెర్యోష! నువ్విలా రా, సెర్యోష!''

అలా అంటూ కొరొస్తెల్యోవ్ ఇంట్లోకి పరుగెత్తాడు.

సెర్యోష ఇదంతా విని, ఉన్నపాళంగా మొదట స్తంభించిపోయాడు: తను దీన్ని నమ్మలేకపోయాడు, భయం ముంచుకొచ్చింది.... గుండె ఎలా దడదడ కొట్టుకుందంటే, ఆ దడదడ బుర్రలో మారుమోగింది....ఒక్క క్షణం తరువాత, సెర్యోష ఇంట్లోకి పరుగుతీశాడు, ఇటూ అటూ పరుగెత్తాడు, ఉక్కిరిబిక్కిరైపోయాడు, గదుల్లో పరుగులు తీస్తూనే అక్కడున్న కోతి పిల్ల బొమ్మను పట్టుకున్నాడు. ఏమో, పాష అత్తయ్యా అమ్మా కొరొస్తెల్యోవ్‌తో మాట్లాడే సరికి, అతను మనసు మార్చుకుంటాడేమో అనుకున్నాడు. ఐనా తను మళ్లీ వాళ్లదగ్గరకే పరుగెత్తాడు. కాని ఈలోపున కొరొస్తెల్యోవ్ పరుగున సెర్యోషకి ఎదురుగా వచ్చి: ''కానీ! చూస్తావేమిటి? కానీ!'' అని సెర్యోషను తొందరపెట్టాడు. ఇద్దరూ కలిసి తన బట్టలూ వస్తువులూ పోగుచేశారు, పాష అత్తయ్యా, లుక్యానిచ్ మామయ్యా సాయంచేశారు. లుక్యానిచ్ మామయ్య సెర్యోష మంచాన్ని విప్పదీసి, దాన్ని ప్యాక్‌చేస్తూ:

‘‘దీ్మ్ర్రతి! మంచిపని చేశావోయ్! భలేవాడవోయ్ నువ్వు!’’ అన్నాడు.

ఈ లోపున సెర్యోష తన వస్తువులలో ఇంకా మిగిలిపోయినవాటిని తహతహపడుతూ తీసుకొొచ్చి, పాష అత్తయ్య ఇచ్చిన పెట్టెలో వాటన్నిటినీ కుక్కేశాడు. త్వరగా! త్వరగా! ఏమో, వాళ్లు వెళ్లిపోతేనో? నిజంగా పెద్ద వాళ్లు ఏ నిమిషానికి ఏం చేస్తారో ఏమీ తెలుసుకోలేం కదా!... సెర్యోషకి గుండె అప్పుడే గొంతుకలో ఎక్కడో కొట్టాడుతూంది, ఊపిరి ఆడకుండా అడ్డేస్తుంది, సరిగ్గా వినబడకుండా చేస్తూంది.

సెర్యోష, తనకి పాష అత్తయ్య బట్టలు తొడుగుతూన్నంత సేపూ: ‘‘త్వరగా! త్వరగా!’’ అంటూ కేకేస్తున్నాడు. తనకింకా బట్టలు తొడుగు తూండగానే సెర్యోష పరుగెత్తి వెళ్లిపోవాలనుకుని కొరొాస్తెల్యోవ్‌కోసం చూశాడు. ఐతే లారీ ఇంకా అక్కడే వుంది. కొరొాస్తెల్యోవ్ మాత్రం లారీలో ఎక్కిపోకుండా, సెర్యోషతో అందరికీ వీడ్కోలు చెప్పమని ఆదేశించాడు.

ఇహ కొరొాస్తెల్యోవ్ సెర్యోషని లారీలోకి ఎక్కించేసి, వాణ్ణి తల్లి దగ్గర, ల్యోన్యదగ్గర కూచోబెట్టి, వాడిని శాలువతో కప్పాడు. లారీ కదిలింది. హమ్మయ్య! ఇప్పుడిహ మనసు కుదుటపరచుకోవచ్చు.

లారీ కేబినులో ఇరుగ్గా వుంది. ఒకటి, రెండు, మూడు, నాలుగు — నలుగురు మనుషులా! అబ్బా! గొ్రెబొొచ్చుకోటు వాసనేస్తూంది, బాబూ! తిమోహిన్ సిగరెట్టు కాలుస్తున్నాడు. సెర్యోషకి దగ్గొచ్చింది. తను అమ్మకీ తిమోహిన్‌కీ మధ్య ఎలాగో ఇరుక్కున్నాడు. అలా ఇరుక్కుని కూచోవడంలో టోపీ మొహమ్మీదకి జారిపోయి ఒక కంటిమీదికి దిగిపోయింది, మెడకి చుట్టుకున్న మఫ్లరు బుగ్గను అదుముతూంది, దీనికితోడు ఏమీ కన బడ్డం లేదు. కిటికీ ఒక్కటే కనబడుతూంది. కిటికీ అవతల, మంచు తొరకలు లారీ దీపాల వెలుగులో చకచకా పరుగులు తీస్తున్నాయి. కూచుం దుకు ఏమంత సదుపాయంగా లేదు, కాని మరేమీ ఫరవాలేదు. మేం వెళ్తున్నాం, అందునా అందరం కలిసి వెళ్తున్నాం. మా లారీలో మా

తిమోహిన్ డ్రైవుచేస్తున్నాడు. లారీలో మా వెనుక కొరొస్తెల్యోవ్ వున్నాడు, మేమంటే అతనికి ఎంతో ప్రేమ, మా గురించి పూచీ అంతా అతనిదే. అతని ముఖాన మంచు కొట్టేస్తూంది, మేమేమో హాయిగా కేబిన్‌లో కూచు న్నాం, అతను మమ్మల్ని హొల్మొగోరి తీసుకెళ్తున్నాడు. ఆరె, భగవంతుడా! మేం హొల్మొగోరి వెళ్తున్నాం, మాది ఎంత అదృష్టం! అక్కడ ఏమిటి వుందో తెలీదు; ఐతే మేం వెళ్తున్నాం కాబట్టి తప్పకుండా చక్కగానే వుంటుంది! తిమోహిన్ హారన్ బిగ్గరగా మోగుతూంది, పైకి ఎగురుతూన్న మంచు సరాసరి సెర్యోష ఎదుట వున్న కిటికీ పక్కనుండి రైంయ్ రైంయ్ మని పరుగెత్తుతూంది.

Blank Page

పాఠకులకు   మనవి

ఈ పుస్తకాన్ని గురించీ, దీని అనువాదాన్ని గురించీ మీ అభిప్రాయాలనూ, మీ సలహాలనూ మా భావిప్రచురణల సహాయార్థం మాకు పంపండి. మా చిరునామా:

Raduga Pablishers
17, Zubovsky Boulevard
Moscow, USSR

మా ప్రచురణలు దొరికే చోట్లు:

విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్
విజ్ఞాన్ భవన్, 4–1–435, బ్యాంక్ స్ట్రీట్
హైదరాబాదు – 500001

విశాలాంధ్ర బుక్ హౌస్
ఏలూరు రోడ్డు
విజయవాడ – 520002

విశాలాంధ్ర బుక్ హౌస్
సుల్తాన్ బజారు
హైదరాబాదు – 500001

విశాలాంధ్ర బుక్ హౌస్
కాలేజి రోడ్డు
అనంతపురం – 515004

విశాలాంధ్ర బుక్ హౌస్
11–1–37 గాంధీ రోడ్డు
తిరుపతి – 517501

విశాలాంధ్ర బుక్ హౌస్
సూపర్ బజారు ఎదుట
మెయిన్ రోడ్డు
విశాఖపట్నం – 530002

విశాలాంధ్ర బుక్ హౌస్
మెయిన్ రోడ్డు
హనుమకొండ
వరంగల్ – 506011

విశాలాంధ్ర బుక్ హౌస్
మెయిన్ రోడ్డు
అరండల్ పేట
గుంటూరు – 522002

Blank Page

సెర్యోషకి ఆరేళ్లొస్తాయి. నాన్న యుద్ధంలో మరణించాడు. అమ్మ వుంది, పాష అత్తయ్య వుంది, లుక్యానిచ్ మామయ్య వున్నాడు. మరి సెర్యోషకి తను చూసుకోవాల్సినవీ, తను అనుభవించాల్సినవీ ఎన్నో వున్నాయి — ఏమంటే తన జీవితంలో ప్రతీరోజూ ఏదో ఒక అద్భుతం జరుగుతూనే వుంటుంది.

మరి, ఇప్పుడేమో, తన జీవితంలోకెల్లా అతి ముఖ్యమైన విషయం జరిగింది — తనకి మారుతండ్రి వచ్చాడు. ఈ పిల్లడికీ వాడి రెండవ తండ్రికీ వున్న సంబంధాల గురించి ఈ పుస్తకం మనకి చెబుతుంది.

వేర పనోవ పేరు విదేశీయ పాఠకులకు సుపరిచితమే. ఆమెకు మూడు సార్లు ప్రభుత్వ బహుమానం లభించింది. వేర పనోవ నాలుగు పెద్ద నవలల్ని, ఐదు నాటకాల్ని, ఎన్నో నవలికల్ని రాసింది. అన్నీ ప్రజా దరణ పొందాయి. వీటిలో అనేకం వెండితెరపైన ప్రదర్శితమయాయి.

ఈ రచయిత్రి రాసిన అత్యంత కవితాత్మకాలైన కృతులలో ఒకటి — "పెద్ద ప్రపంచంలో చిన్న పిల్లడు."

ISBN 5—05—001448—4